# ప్రభాత్

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు) [పీపుల్స్‌వార్] దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ అధికార త్రైమాసిక పత్రిక

సంపుటి - 15 | సంచిక - 3 | జూలై - సెప్టెంబర్ 2002 | వెల - 10 రూపాయలు


**ఈ సంచికలో....**


- ❖ ఎత్తుగడల ఎదురుదాడి రిపోర్టులు ... 3
- ❖ అమరులకు శ్రద్ధాంజలి ... 8
- ❖ అమరుల వారం రిపోర్టులు ... 11
- ❖ డికెలో విద్యావైద్య సౌకర్యాల దుస్థితి... 15
- ❖ నాయకత్వ పద్ధతులకు సంబంధించి కొన్ని సమస్యలు — మావో... 19
- ❖ కుప్పకూలిన అర్జెంటైనా ఆర్థిక వ్యవస్థ ... 22
- ❖ కెయస్ మరణంపై ... 24
- ❖ హర్యానాలో రైతు ఉద్యమం ... 26


## దండకారణ్య ప్రజల ప్రియతమ నేత కామ్రేడ్ సుఖ్‌దేవ్‌కు విప్లవ జోహార్లు !

మే 23 మర్చిపోలేని దినం. ఇదే రోజున 1967లో చారిత్రాత్మక నక్సల్బరీ ఉద్యమం ప్రారంభమైంది. ఆ రోజున పీడిత ప్రజలు మొట్టమొదటి సారిగా ఒక దుష్టుడైన పోలీసు ఇన్స్‌పెక్టర్‌ను కొడవళ్లతో నరికి చంపారు. 2002లో ఈ చారిత్రాత్మక దినం నాడు దండకారణ్య ప్రజల ముద్దుబిడ్డ, పార్టీ స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు, ఉత్తర సబ్-జోనల్ కమాండ్ కమాండ్-ఇన్-చీఫ్ కామ్రేడ్ సుఖదేవ్ పోలీసు ముష్కరులతో సాహసోపేతంగా పోరాడుతూ వీర మరణం పొందాడు. ఆ రోజున పార్టీ ఉత్తర బస్తర్, మాడ్ డివిజనల్ కమిటీలు, నగర్నార్ స్టీలు ప్లాంటుకు వ్యతిరేకంగా పోరాడుతున్న ప్రజలకు మద్దతుగానూ గుజరాత్‌లో సంఘ్ పరివార్ నాయకత్వంలో సాగుతున్న ముస్లిం ప్రజల నరమేధానికి వ్యతిరేకంగానూ సంయుక్తంగా బంద్ పిలుపునిచ్చాయి. ఈ బంద్‌ను జయప్రదం చేయడానికి వందలాది ప్రజా సంఘాల కార్యకర్తలు రోడ్లకు అడ్డంగా చెట్లు పడవేసి వాహనాల రాకపోకల్ని నిరోధించారు. వీటిని తొలగించడానికి వస్తున్న ఒక పోలీసు బృందంపై నారాయణపూర్-కొండగాం రోడ్డుపై దేవ్‌గాం అనే గ్రామ సమీపంలో కా. సుఖ్‌దేవ్ నాయకత్వంలో ఒక పిజిఏ ప్లటూన్ దాడి చేసింది. ఈ దాడిలో గెరిల్లాలు ఒక గోపనీయ్ సైనిక్‌ను హతమార్చి .303 రైఫిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. మరి కొందరు పోలీసులు గాయపడ్డారు. ఇరుపక్షాల మధ్య కాల్పులు జరుగుతున్న సమయంలో తన రైఫిల్ మ్యాగ్జిన్ మార్చుకుంటున్న కా. సుఖ్‌దేవ్‌కు తూటా తగలడంతో అక్కడికక్కడే నేలకొరిగాడు. ఈ విధంగా ఆయన ఒక అసమాన యోధుడిగా తన పాత్రను వీరోచితంగా నిర్వహిస్తూనే యుద్ధభూమిలో వీరమరణం పొందాడు.



కా. సుఖ్‌దేవ్ ఉత్తర తెలంగాణాలోని వరంగల్ జిల్లా ధర్మసాగరం మండలానికి చెందిన టేకులగూడెం గ్రామంలో ఒక మధ్యతరగతి కుటుంబంలో పుట్టాడు. ఆయన తండ్రి వృత్తిరీత్యా ఉపాధ్యాయుడు కాగా, తల్లి సాధారణ గృహిణి. ఆ తల్లిదండ్రులు పెట్టిన పేరు విజయభాస్కర్. 1980 దశకంలో వరంగల్ జిల్లాలో సాగుతున్న భూస్వామ్య వ్యతిరేక పోరాటాలతో ఉత్తేజం చెందిన కా. విజయభాస్కర్ చదువును ఇంటర్ వద్దే ఆపేసి విప్లవాన్నే తన వృత్తిగా చేసుకున్నాడు. ఆయన అప్పటికి రాడికల్ విద్యార్థి ఉద్యమంలో క్రియాశీల కార్యకర్త. ఆ తర్వాత పార్టీ కేంద్ర ఆర్గనైజర్‌గా బాధ్యతల్ని స్వీకరించాడు. సారా సమస్యపై ప్రజా పోరాటానికి ఆయన నాయకత్వం వహించాడు. 1985 తర్వాత, పార్టీ అవసరాలకు అనుగుణంగా దండకారణ్య ప్రాంతంలో పనిచేయడానికి సంసిద్ధుడై ముందుగా దక్షిణ బస్తర్ డివిజన్‌లో అడుగుపెట్టాడు. అప్పటికి ఆయన వయస్సు కేవలం 18-19 సంవత్సరాలే.

ప్రారంభంలో కా. సుఖ్‌దేవ్ దక్షిణ బస్తర్‌లోని కుంట, బాసగూడెం దళాల్లో సభ్యుడిగా పనిచేశాడు. ఆ తర్వాత నేషనల్ పార్క్ ఏరియాకు బదిలీ అయ్యాడు. ఆ తర్వాత ఆయన అదే దళానికి కమాండర్‌గా బాధ్యతలు చేపట్టాడు. 1989లో పార్టీ దండకారణ్య ఉద్యమాన్ని ఉత్తర బస్తర్ ప్రాంతానికి విస్తరింపజేయాలని నిర్ణయించి కా. సుఖ్‌దేవ్‌కు ఆ కర్తవ్యాన్ని అప్పగించింది. ఉత్తర బస్తర్‌లోని కేస్కాల్ ఏరియాను ఆధారం చేసుకొని పని ప్రారంభించిన ఆ తొలి దళానికి కా. సుఖ్‌దేవ్ కమాండర్‌గా సమర్థవంతమైన నాయకత్వం అందించాడు. ఆ విధంగా, మాడ్ ప్రాంతం నుండి కేస్కాల్, కొండగాంల దాకా, మొత్తం ఉత్తర బస్తర్ అంతటా, ఇంకా ధమ్‌తరి జిల్లాలోని సిహావా దాకా ఆయన తన అడుగుజాడల్ని మిగిల్చిపోయాడు.

1992లో అతను ముందుగా ఉత్తర బస్తర్ సబ్-డివిజనల్ కమిటీ సభ్యుడిగా ఎన్నికయ్యాడు. తర్వాత 1994లో ఉత్తర బస్తర్ డివిజనల్ కమిటీ సభ్యుడిగా ఎన్నికయ్యాడు. ఆ తర్వాత ఆయన ఆ కమిటీకి కార్యదర్శిగా పనిచేశాడు. 1997లో జరిగిన దండకారణ్య ప్లీనం కా. సుఖ్‌దేవ్‌ను స్పెషల్ జోనల్ కమిటీకి ప్రత్యామ్నాయ సభ్యుడిగా ఎన్నుకుంది. 1998లో అతన్ని ఎస్‌జెడ్‌సిలోకి సభ్యుడిగా కో-ఆప్ట్ చేసుకున్నారు. 2000లో జరిగిన దండకారణ్య పార్టీ 3వ కాన్ఫరెన్స్ అతన్ని తిరిగి స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడిగా ఎన్నుకుంది. పిజిఏ ఏర్పాటు తర్వాత అతన్ని రాష్ట్ర మిలిటరీ కమిషన్ సభ్యుడిగా ఎన్నుకున్నారు. ఆ విధంగా అతను ఉత్తర కమాండ్‌కు కమాండ్-ఇన్-చీఫ్‌గా బాధ్యతలు చేపట్టాడు.

కా. సుఖ్‌దేవ్ ఉత్తర బస్తర్‌లో జరిగిన అనేక ప్రజా పోరాటాలకు నాయకత్వం వహించాడు. ఆదివాసీ ప్రజలపై అటవీశాఖ అధికార్లు చేసే దోపిడీదౌర్జన్యాలకు వ్యతిరేకంగా ఆయన ప్రజలను సమైక్యం చేశాడు. మాల్‌గుజార్లకు వ్యతిరేకంగా జరిగిన అనేక పోరాటాల్లో కా. సుఖ్‌దేవ్ ప్రజలకు నాయకత్వం వహించాడు. ప్రజలను కట్టు చేసి బస్తర్‌లో సామ్రాజ్యవాద

ప్రత్యేక బస్తర్ రాష్ట్రాన్ని డిమాండ్ చేస్తూ, నగర్నార్ స్టీల్‌ప్లాంటు నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ

**నవంబర్ 1న దండకారణ్య బంద్‌ను జయప్రదం చేయండి !**

## కామ్రేడ్ సుఖ్‌దేవ్ స్మృతిలో జూన్ 25న 'దండకారణ్య బంద్'

*కా. సుఖ్‌దేవ్ అమరత్వపు వార్త అందగానే దండకారణ్యం లోని పార్టీ శ్రేణుల్లోనూ, పిజిఎ బలగాల్లోనూ, పోరాటశీలురైన ప్రజల్లోనూ విషాద ఛాయలు కమ్ముకున్నాయి. దండకారణ్య ఉద్యమానికి ఇది పెద్ద నష్టం. వెంటనే పార్టీ స్పెషల్ జోనల్ కమిటీ పత్రికలకు విడుదల చేసిన ఒక ప్రకటనలో అమరవీరుడు సుఖ్‌దేవ్‌కు జోహార్లర్పిస్తూ, ఆయన ఉద్యమానికి చేసిన సేవలను ఘనంగా కొనియాడింది. కా. సుఖ్‌దేవ్ స్మృతిలో జూన్ 25న 'దండకారణ్య బంద్' పాటించాలని ప్రజలకు విజ్ఞప్తి చేసింది. ఈ పిలుపుకు దండకారణ్య ప్రజానీకం బాగా ప్రతిస్పందించింది. దండకారణ్యంలోని దాదాపు ప్రతి గ్రామంలోనూ, ప్రతి పట్టణంలోనూ బంద్‌ను పూర్తిగా పాటించారు. ప్రత్యేకించి, కా. సుఖ్‌దేవ్ 12 ఏళ్ల పాటు తన జీవితంలోని ప్రధాన భాగాన్ని గడిపి, తన నిండు యవ్వనాన్ని ధారపోసిన ఫలితంగా ఊపిర్లు పోసుకున్న ఉత్తర బస్తర్ డివిజన్‌లోని అనేక గ్రామాల్లో అప్పటికప్పుడే స్తూపాలు వెలిశాయి. బంద్ రోజున ప్రజలు అనేక చోట్ల ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేశారు. పోలీసులు ఈ బంద్‌తో ఎంతగా హడలిపోయారంటే కనీసం ఠానాల నుండి బైట అడుగు పెట్టడానికైనా సాహసించలేదు. గస్తీని పూర్తిగా ఆపుకున్నారు. ఈ సందర్భంగా అన్ని డివిజన్లలోనూ చాలా చోట్ల సుఖ్‌దేవ్ స్మృతిలో సభలు జరిగాయి. వీటిల్లో వందలాది ప్రజానీకం పాల్గొంది. వివిధ బలగాలకు చెందిన పిజిఎ యోధులు ఈ సభల్లో గాలిలోకి తుపాకులు పేల్చి అమర పిజిఎ కమాండర్‌కు ఘనంగా నివాళులర్పించారు. సుఖ్‌దేవ్ ఆశయాన్ని పరిపూర్తి చేస్తామనీ, సుఖ్‌దేవ్‌కు వందల, వేల వారసుల్ని సృష్టిస్తామనీ ప్రజలూ, పార్టీ శ్రేణులూ, పిజిఎ బలగాలూ ప్రతిన బూనాయి. కా. సుఖ్‌దేవ్ అమరత్వాన్ని గుర్తు చేసుకుంటూ ఊరూరా పోస్టర్లూ, బ్యానర్లూ కట్టారు. ఈ సందర్భంగా ఎస్‌జెడ్‌సి విడుదల చేసిన కరపత్రాలను విస్తృతంగా పంచారు.*

దోపిడీని అడ్డుకోవడానికి అనేక పోరాటాలు నిర్వహించాడు. రావ్‌ఘాట్, కువ్వెమారిలలో గనులు తెరిచి ఆదివాసీ ప్రజలను నిరాశ్రయుల్ని గావించి ఇక్కడి ఖనిజ సంపదల్ని కారుచౌకగా దోచుకోవాలని సామ్రాజ్యవాదులు వేసిన పథకాలను కా. సుఖ్‌దేవ్ ప్రజాబలంతో విఫలం చేశాడు. వన్‌ధన్ సమితులను తెరచి అటవీ ఉత్పత్తుల కొనుగోలును జాతీయాకరించాలని ప్రభుత్వం నిర్ణయించగా, కా. సుఖ్‌దేవ్ ప్రభుత్వ దివాళాకోరు విధానాల్ని ఎండగడ్తూ దీనికి వ్యతిరేకంగా వేలాది ప్రజలనూ, వందలాది చిన్న వ్యాపారులనూ ఏకం చేసి పోరాటంలోకి దించాడు. ఈ విధంగా ఉత్తర బస్తర్ ఉద్యమ చరిత్రలో అడుగడుగునా కా. సుఖ్‌దేవ్ నిర్వహించిన అవిస్మరణీయమైన పాత్ర కనిపిస్తుంది. ఉత్తర బస్తర్ ప్రజల హృదయాల్లో ఆయన స్థానం చిరస్థాయిగా నిలుస్తుంది.

కా. సుఖ్‌దేవ్‌లోని ఒక విశిష్టమైన లక్షణం ఏమిటంటే, ఆయనెక్కడున్నా అక్కడి ప్రజల భాషనూ, యాసనూ నేర్చుకొని ప్రజలలో కలగలిసి పోయేవాడు. ఆయన మరణవార్త విన్నప్పుడు ఉత్తర బస్తర్ డివిజన్‌లో వేలాది ప్రజలు కన్నీరు పెట్టారన్న ఒక్క విషయం చాలు ఆయన వాళ్లతో ఎంతగా పెనువేసుకపోయాడో అర్థం చేసుకోవడానికి. ఉత్తర బస్తర్ ఉద్యమ నిర్మాణంలో ఆయన నిర్వహించిన పాత్రకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. ఎందుకంటే శత్రువు ఉత్తర బస్తర్‌లో పార్టీని విస్తరించనివ్వకుండా తీవ్రంగా ప్రయత్నించాడు. శత్రువు చేసిన అనేక దాడులలో కా. సుఖ్‌దేవ్ ధైర్యంగా నిలబడి గెరిల్లాలకు సమర్థవంతంగా నాయకత్వం వహించాడు. శత్రువు చేసిన అనేక దాడుల్ని విఫలం చేసి ఉద్యమాన్ని బలోపేతం చేయడంలో తన పాత్రను గొప్పగా నిర్వహించాడు. శత్రువుకు వ్యతిరేకంగా ఈ ప్రాంతంలో చేసిన దాదాపు అన్ని ఆంబుష్‌లలోనూ, రెయిడ్లలోనూ అతని పాత్ర మరువరానిది. గెరిల్లాలకు ఆయన పక్కనుంటే చాలు, దానికదే ఒక పెద్ద ఆత్మవిశ్వాసంలా ఉండేదంటే అందులో ఆశ్చర్యమేమీ లేదు. కా. సుఖ్‌దేవ్ నమ్రత గలిగిన నాయకుడు, తన సహచరులతో బాగా కలగలిసి పోయేగలవాడు. అతన్ని పార్టీ శ్రేణులన్నీ అభిమానించేవి. శత్రు బలగాలకు ఆయన ఉనికే సవాలుగా ఉండేది. ఒక దశాబ్దానికి పైగా అతను ఉత్తర బస్తర్ డివిజన్‌లో శత్రువుకు కొరకరాని కొయ్యగా నిలిచాడు. పిజిఎ గర్వించదగ్గ సాహసిక కమాండర్ అతను.

కళా-సాహిత్య రంగాల్లో కూడా కా. సుఖ్‌దేవ్‌కు మంచి పట్టు ఉండేది. పాలకవర్గాలకు వ్యతిరేకంగా ఆయన తన గన్నునే కాదు, పెన్నును కూడా సమర్థవంతంగా ఎక్కుపెట్టాడు. పాట, కవిత, కథ వంటి రూపాల్లో ఆయన ఎంతో సాహిత్యాన్ని సృష్టించాడు. అతను గోండీ భాషలో పాటలు రాసి స్వయంగా పాడే వాడు. ప్రజలతో కలిసి నాట్యం చేసేవాడు. సాహిత్య సృజనలో ఆయనలోని విశిష్టత సమకాలీన ప్రాంతీయ, దేశీయ, అంతర్జాతీయ సమస్యలపై త్వరితంగా ప్రతిస్పందించడం. వైవిధ్యమూ, సమకాలీనతా రెండూ ఉండేవి కా. సుఖ్‌దేవ్ రచనల్లో. దండకారణ్య విప్లవ సాహిత్యోద్యమంలో ఆయన ప్రముఖ పాత్ర నిర్వహించాడు. ఆయన మరణంతో ఈరోజు విప్లవ సాహిత్యోద్యమం ఒక గొప్ప విప్లవకారుడైన రచయితను/కవిని కోల్పోయింది.

పార్టీ 9వ కాంగ్రెస్‌ను జయప్రదం చేయడానికి నిర్వహణా బాధ్యతల్లో కా. సుఖ్‌దేవ్ అవిశ్రాంతంగా కృషి చేశాడు. కాంగ్రెస్ సవ్యంగా జరగడం కోసం ఏర్పాటైన నిర్వహణ కమిటీలో ఆయన సభ్యుడుగా ఎన్నికయ్యాడు. తన సునిశితమైన పరిశీలన, చురుకుదనములతో అక్కడ జరిగే పనులన్నింటినీ పర్యవేక్షిస్తూ కాంగ్రెస్‌ను జయప్రదం చేసే బాధ్యతను ఆయన దృఢ సంకల్పంతో పూర్తి చేశాడు.

పార్టీ 9వ కాంగ్రెస్ పార్టీ ముందు అనేక కొత్త కర్తవ్యాలను ఉంచింది. దండకారణ్యాన్ని విముక్తి ప్రాంతంగా అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో పార్టీ కమిటీలన్నీ తమ కృషిని తీవ్రం చేశాయి. ఈ చారిత్రక మలుపులో కా. సుఖ్‌దేవ్ పిజిఎ బలగాలకు సమర్థవంతమైన నాయకుడిగా ఎదిగాడు. గెరిల్లాబేసులను నిర్మించే తక్షణ కర్తవ్యంతో సాగుతున్న దండకారణ్య విప్లవోద్యమంలో కా. సుఖ్‌దేవ్ తన వంతు బాధ్యతను అవిరామంగా నిర్వహించాడు. ప్రజాయుద్ధాన్ని పురోగమింపజేయడానికి శత్రు బలగాలకు వ్యతిరేకంగా పార్టీ నిర్వహించిన ఎత్తుగడల ఎదురుదాడి క్యాంపెయిన్లను విజయవంతం చేయడానికి అతను తన సర్వశక్తులను ఒడ్డి పోరాడాడు. పిజిఎ బలగాలను రాజకీయంగానూ, మిలిటరీపరంగానూ తీర్చిదిద్దడం కోసం ట్రెయినింగ్ క్యాంపులను నిర్వహించాడు. అతను ఒక మంచి టీచర్, చిన్న చిన్న ఉదాహరణలతో చాలా కఠిన విషయాలను కూడా తేలిగ్గా అర్థం చేయించేవాడు.

దండకారణ్యంలో ప్రజాయుద్ధం విముక్తి ప్రాంత లక్ష్యంతో వేగంగా పురోగమిస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ ఉద్యమాన్ని అణచివెయ్యడానికి దారుణమైన నిర్బంధ క్యాంపెయిన్‌లను నిర్వహిస్తున్నాయి. ప్రజల నూతన రాజ్యాధికారం ఊపిరి పోసుకుంటోంది. వందలాది నవ యువతీయువకులు పిజిఎలో చేరి సాయుధమవుతున్నారు. ప్రజలు క్రూరమైన శత్రువుకు వ్యతిరేకంగా వీరోచితంగా పోరాడుతున్నారు. దండకారణ్య విప్లవోద్యమంలో ఒక కీలకమైన మలుపు వంటి పరిస్థితిలో కా. సుఖ్‌దేవ్ లేకపోవడం పెద్ద లోటు.

కామ్రేడ్స్! కా. సుఖ్‌దేవ్ జీవితాన్ని మనం ఆదర్శంగా స్వీకరిద్దాం. ఆయన కన్న కలలను నిజం చేస్తామని శపథం చేద్దాం. ఈనాడు దండకారణ్యాన్ని విముక్తి ప్రాంతంగా మల్చడమే కా. సుఖ్‌దేవ్ సహా, సామ్రాజ్యవాద, భూస్వామ్య, దళారీ నిరంకుశ పెట్టుబడి కబంధ హస్తాల నుండి మన దేశాన్ని విముక్తం చేయడం కోసం తమ ప్రాణాల్ని తృణప్రాయంగా అర్పించిన వీరులందరి అమరత్వానికీ నిజమైన నివాళి.❒

# శత్రు నిర్బంధ క్యాంపెయిన్‌లను వమ్ము చేస్తూ
# జయప్రదంగా ముగిసిన ఎత్తుగడల ఎదురుదాడి క్యాంపెయిన్

దండకారణ్య విప్లవోద్యమాన్ని నిర్మూలించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్ద ఎత్తున సన్నాహాలు చేస్తున్నాయి. పోలీసులు వేర్వేరు పేర్లతో నిర్బంధ క్యాంపెయిన్‌లు కొనసాగిస్తూ ప్రజలను విప్లవోద్యమం నుండి దూరం చేయడానికై భీభత్సాన్ని సృష్టిస్తున్నారు. ఇటీవలి సంవత్సరాల్లో, ప్రత్యేకించి దక్షిణాసియాలో మావోయిస్టు పార్టీల నాయకత్వంలో విప్లవోద్యమాలు, ఇతర ప్రజాస్వామ్య ఉద్యమాలు చెలరేగుతున్న నేపథ్యంలో సామ్రాజ్యవాదం, ప్రత్యేకించి అమెరికన్ సామ్రాజ్యవాదం విప్లవోద్యమాన్ని అణచడానికి బాగా ముందుకొస్తున్నది. సామ్రాజ్యవాదుల 'లో ఇంటెన్సిటీ కాన్‌ఫ్లిక్ట్' (ఎల్‌ఐసి – తక్కువ స్థాయి ఘర్షణ) వ్యూహాన్ని అనుసరిస్తూ పాలక వర్గాలు బహుముఖ నిర్బంధాన్ని కొనసాగిస్తున్నాయి. పోలీసు బలగాల ఆధునికీకరణ, ప్రత్యేక బలగాల ఏర్పాటు, కూంబింగ్ ఆపరేషన్స్, అరెస్టులు వంటి చర్యలు చేపడుతూ విప్లవోద్యమాన్ని పూర్తిగా నిర్మూలించడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. మరోవైపు పాలక వర్గాలు ప్రజల అభివృద్ధి పట్ల లేని శ్రద్ధను కనబరుస్తూ బూటకపు సంస్కరణ కార్యక్రమాలను అమలు పరుస్తున్నాయి. 'పీపుల్స్‌వార్ పార్టీకి ప్రజల మద్దతు లేదు', 'ప్రజలు పార్టీని వ్యతిరేకిస్తున్నారు' వంటి ప్రకటనలు చేస్తూ ఉద్యమానికి వ్యతిరేకంగా విషపూరిత ప్రచారం చేస్తూ ప్రజలను పక్కదారి పట్టించే ప్రయత్నాలు కూడా తీవ్రంగా కొనసాగిస్తున్నారు.

| శత్రువు వైపు నష్టాలు | మన వైపు నష్టాలు |
|---|---|
| 8 మంది చనిపోయారు<br>12 మంది గాయపడ్డారు | కామ్రేడ్ సుఖ్‌దేవ్ అమరుడయ్యాడు<br>ఇద్దరికి గాయాలయ్యాయి. |
| 7 ఆయుధాలు స్వాధీనం<br>(ఒక AK-47, 3 SLRలు,<br>ఒక .303, ఒక DBL,<br>ఒక 3.8 రివాల్వర్,<br>రెండు గ్రెనేడ్స్) | ఒక 8ఎం.ఎం. రైఫిల్<br>పోగొట్టున్నాం |

శత్రువు తలపెట్టిన ఈ బహుముఖ దాడిని ఓడించడానికి పార్టీ పోయిన ఎండా కాలంలో (ఏప్రిల్ నుండి జూన్ వరకు) దండకారణ్యమంతటా 'ఎత్తుగడల ఎదురుదాడి క్యాంపెయిన్'ను నిర్వహించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా పిజిఏకు చెందిన మూడు బలగాలు -- మెయిన్ ఫోర్స్, సెకండరీ ఫోర్స్, బేస్ ఫోర్స్‌లకు చెందిన సైనికులు దండకారణ్యంలోని అన్ని డివిజన్లలోనూ శత్రు సాయుధ బలగాలపైనా, ఇన్‌ఫార్మర్లపైనా, ప్రజా వ్యతిరేకులపైనా వరుసగా దాడులు జరిపారు. ఈ దాడుల పరంపరతో శత్రువు ఉక్కిరిబిక్కిరయ్యాడు. పోలీసు బలగాలు పోరాట ప్రాంతాల్లోకి చొరబడాలంటే ప్రతి అడుగూ ఆచితూచి వెయ్యాల్సిన పరిస్థితి ఏర్పడింది. చాలా మంది ప్రజా వ్యతిరేకులపైనా, భూస్వాములపైనా దాడులు జరిగిన సమాచారం అందినప్పటికీ పోలీసులు అక్కడికి పోవడానికి సాహసించలేదు. ప్రజా మిలిషియాకు చెందిన వందలాది యువతీయువకులు ఎంతో ఉత్సాహంగా పాల్గొనడం ఈ 'ఎత్తుగడల ఎదురుదాడి క్యాంపెయిన్'లో ప్రత్యేకించి చెప్పుకోవల్సిన విషయం. వాళ్లు మెయిన్ ఫోర్సు, సెకండరీ ఫోర్సులతో కలిసి దాడులలో పాల్గొనడమే కాకుండా, స్వయంగా కూడా చొరవతో అనేక చర్యలు నిర్వహించారు. "ప్రజాయుద్ధం ప్రజల సంపూర్ణ యుద్ధం" అనే సత్యాన్ని నిరూపిస్తూ ప్రజలు ప్రజా వ్యతిరేకులపై చేసిన దాడుల్లోనూ, ప్రభుత్వ బూటకపు సంస్కరణల కార్యక్రమాలకు వ్యతిరేకంగా కదిలి, 'కామ్ కే బద్లే అనాజ్' (పనికి ఆహారం) పథకాన్ని తిప్పికొడ్తూ బియ్యం గుంజుకునే దాడుల్లోనూ వందల సంఖ్యలో పాల్గొన్నారు.

"పీపుల్స్‌వార్ ప్రజాపునాది తగ్గిపోయింది", "ఇది పిడికెడు మంది సాగిస్తున్న ఉద్యమం తప్ప విశాల ప్రజానీకానికి దీనితో ప్రమేయం లేదు" అంటూ ఇప్పటి దాకా పోలీసు అధికారులూ, ప్రభుత్వమూ చేస్తూ వస్తున్న ప్రకటనలు ఈ క్యాంపెయిన్ సాధించిన విజయంతో తుడిచిపెట్టుకుపోయాయి. ఈ క్యాంపెయిన్ పోలీసు బలగాలను ప్రధానంగా ఆత్మరక్షణా చర్యలకే పరిమితమయ్యేలా చేసింది. ఇది ప్రజలలో, తమ సంఘటిత శక్తితో ఎంత పెద్ద ప్రతిఘాతక శక్తినైనా ఓడించవచ్చునన్న ఆత్మవిశ్వాసాన్ని ఇనుమడింపజేసింది.

ఈ క్యాంపెయిన్‌ను ప్రారంభించే ముందర పార్టీ కమిటీలు, పిజిఏ కమాండ్లు అన్ని రకాల బలగాలనూ, ప్రజా సంఘాలనూ, పోరాట ప్రజలనూ రాజకీయంగానూ, మిలిటరీపరంగానూ సంసిద్ధం చేశాయి. ప్రజాయుద్ధాన్ని పురోగమింపజేయాలన్నా, దండకారణ్యాన్ని విముక్తి ప్రాంతంగా అభివృద్ధి చేయాలన్నా శత్రు బలగాలకు వ్యతిరేకంగా వీరోచితంగా పోరాడవల్సిన అవసరాన్ని వారిచే గుర్తింపజేశాయి. అనేక ట్రెయినింగ్ క్యాంపులు నిర్వహించి పిజిఏకు చెందిన మూడు బలగాల సైనికులకూ అవసరమైన శిక్షణనిచ్చాయి. దీని ఫలితంగానే ఈ క్యాంపెయిన్‌లో ప్రజలు తమ పాత్రను క్రియాశీలంగానూ, సృజనాత్మకంగానూ నిర్వహించగలిగారు.

ఈ ఎత్తుగడల ఎదురుదాడి క్యాంపెయిన్ రాజకీయంగా పూర్తిగా సఫలమైనప్పటికీ, సైనికంగా విజయాలతో పాటు కొన్ని అపజయాల్ని కూడా చవిచూడాల్సి వచ్చింది. ఈ క్యాంపెయిన్‌లో పిజిఏ ఉత్తర కమాండ్ కమాండ్-ఇన్-చీఫ్, దండకారణ్యంలోని సీనియర్ పార్టీ నాయకుడు కా. సుఖ్‌దేవ్‌ను కోల్పోవడం ఒక పెద్ద నష్టం. అయితే ప్రతి పోరాటం కొత్త త్యాగాల్ని కోరుతుంది. పార్టీ ఈ క్యాంపెయిన్‌ను కూలంకషంగా సమీక్షించింది. దీని నుండి అవసరమైన గుణపాఠాలు తీసుకుంది. వీటి వెలుగులో శత్రువుపై మరిన్ని దాడుల్ని విజయవంతంగా నిర్వహించడానికీ, ప్రజాయుద్ధాన్ని పురోగమింపజేయడానికీ పార్టీ శ్రేణులూ, పిజిఏ బలగాలూ ముందడుగు వేస్తున్నాయి.

ఈ క్యాంపెయిన్‌లో శత్రువుకు వ్యతిరేకంగా పిజిఏ బలగాలు నిర్వహించిన చర్యల సంక్షిప్త వివరాలు ఇవి :

- 3 ఆంబుష్‌లు చేయగా, వీటిలో ఒకటి పూర్తిగా సఫలం కాగా మరో రెండు పాక్షికంగా సఫలమైనాయి
- ఒక అపార్చునిటీ రెయిడ్ పాక్షికంగా సఫలమైంది
- 6గురు ఇన్‌ఫార్మర్లనూ, ఒక బిఆర్ఓ కాంట్రాక్టర్‌నూ అంతమొందించారు
- ప్రజా వ్యతిరేకుల, దుష్ట పెత్తందార్ల ఆస్తులు స్వాధీనం చేసకున్న చర్యలు మొత్తం 11 జరిగాయి
- ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసిన చర్యలు (పంచాయితీ భవనాలు, తునికాకు గోదాములు, 'కామ్ కే బద్లే అనాజ్' పంపకాలు మొదలైనవి) మొత్తం 14 జరిగాయి.
- పోలీసులను చికాకు పర్చడానికి పోలీసు స్టేషన్లపై కాల్పులు జరిపిన చర్యలు 5 జరిగాయి

*ఈ క్యాంపెయిన్‌కు సంబంధించిన వివిధ డివిజన్ల రిపోర్టులు దిగువన ఇస్తున్నాం.*

## <u>ఉత్తర బస్తర్ డివిజన్</u>

ఉత్తర బస్తర్ డివిజన్ లో పిజిఏ యోధులు ప్రధానంగా గోపనీయ సైనికులపై తమ దాడులను గురిపెట్టారు. ఈ డివిజన్‌లో ఉద్యమాన్ని అణచడానికి పోలీసులు అనేక 'నల్లదండు' ముఠాలను ఏర్పాటు చేశారు. నిరుద్యోగ యువకులనూ, లంపెన్ యువకులనూ పోగుచేసి, వాళ్లకు రకరకాల ఆశలు చూపి ఇన్‌ఫార్మర్లుగా మార్చుకుంటున్నారు. వీళ్లకు ఏకె-47 సహా ఆధునిక ఆయుధాలను ఉపయోగించడంలో శిక్షణనిస్తున్నారు. ఈ యువకులు గ్రామాల్లో రహస్యంగా తిరుగుతూ ప్రజా వ్యతిరేకులతో సంబంధాలేర్పర్చుకొని సమాచారం సేకరిస్తుంటారు. వీళ్లు ప్రత్యక్షంగా కూడా దాడులు చేస్తారు, పోలీసులతో కలిసి దాడులలో పాల్గొంటారు. ఈసారి పార్టీ నిర్వహించిన ఎత్తుగడల ఎదురుదాడి క్యాంపెయిన్‌లో ఇలాంటి చాలా మంది దుష్ట గోపనీయ సైనికుల పీడ విరగడ చేశారు. మొత్తం ఈ క్యాంపెయిన్‌లో పిజిఏ గెరిల్లాలు ప్రజల క్రియాశీల సహకారంతో ఆరుగురు గోపనీయ సైనికులనూ, ఇద్దరు ఇన్‌ఫార్మర్లనూ, ఇద్దరు సిఐడిలనూ వేర్వేరు చర్యల్లో అంతమొందించారు. వీటితో పాటు ఒక ఆంబుష్, ఒక అపార్చునిటీ రెయిడ్ కూడా చేశారు.

### బడ్‌గాం దాడిలో ఇద్దరు గోపనీయ సైనికులు ఖతం - ఏకె-47 రైఫిల్, రివాల్వర్ స్వాధీనం

కొండగాం ఏరియాలోని బడ్‌గాం గ్రామవాసులైన ఉత్తం, జల్లె అనే ఆవారా యువకులు గోపనీయ సైనికులుగా మారి విప్లవ ప్రతీఘాతుక కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. వీళ్లు ఇతరులను కూడా నయానా భయానా ఒప్పించి ఇన్‌ఫార్మర్లుగా మల్చుకునే కార్యక్రమం చేపట్టారు. పక్కనే ఉన్న మరో గ్రామం మైమగవాడికి చెందిన యోగేశ్, శ్యాంలాల్ అనే గోపనీయ సైనికులు కూడా వీరికి తోడయ్యారు. వీరందరూ కల్సి గెరిల్లా దళంపై దాడి చేసి వీలైనంత మందిని అంతమొందించాలని వీరి పథకం. అయితే మైమగవాడిలో ముందే జరిగిన వేరొక ఘటనలో పిజిఏ గెరిల్లాలూ, ప్రజలూ కలిసి రేశ్‌లాల్, శివప్రసాద్ అనే గోపనీయ సైనికులను హతమార్చడంతో వీరి పథకం తాత్కాలికంగా బెడిసికొట్టింది.

మే ఆఖరు వారంలో పిజిఏ బడ్‌గాంలోని గోపనీయ సైనికుల ఇళ్లపై దాడి జరిపి వాళ్ల ఆస్తులన్నింటినీ జప్తు చేసుకొని ఆర్థికంగా నష్టపర్చాలని నిర్ణయించింది. ఈ చర్యలో స్థానిక గెరిల్లా దళంతో పాటు ప్రజా మిలిషియాకు చెందిన పదుల మంది యువతీయువకులు, విప్లవ ప్రజానీకం పాల్గొన్నారు. అయితే పోలీసులు అప్పటికే తమ బంట్లయిన గోపనీయ సైనికులతో కల్సి ఇద్దరు గోపనీయ సైనికుల ఇళ్లలో ఆంబుష్‌కు కూర్చుని ఉన్నారు. ఈ విషయం పిజిఏ యోధులకు తెలువదు. అయినప్పటికీ చొరవను తమ చేతుల్లోకి తీసుకొంటూ పిజిఏ గెరిల్లాలు ఒక ఇంటిపై దాడి జరిపి ఇద్దరు గోపనీయ సైనికుల్ని నిష్క్రియులుగా చేసి వారి నుండి ఒక ఏకె-47 రైఫిల్, ఒక .38 రివాల్వర్, రెండు చేతి గ్రెనేడ్లు స్వాధీనం చేసుకున్నారు. శ్యాంలాల్ పారిపోవడానికి ప్రయత్నించగా గెరిల్లాలు వాడిని అక్కడికక్కడే కాల్చి చంపారు. మరో గోపనీయ సైనికుడైన యోగేశ్‌ను అరెస్ట్ చేసి ఇంటరాగేషన్ చేసి తర్వాత చంపేసారు.

మరో గోపనీయ సైనికుడు జల్లె ఇంటిపై మరో టీము దాడి జరపగా, అక్కడ పోలీసులు కాల్పులు ప్రారంభించారు. ఈ కాల్పుల్లో ఒక పిజిఏ సైనికుడు గాయపడ్డాడు. అక్కడి నుండి రిట్రీట్ అయి వస్తుండగా మరో చోట పొంచివున్న పోలీసులు జరిపిన కాల్పుల్లో ఝూర గ్రామానికి చెందిన డిఏకెఎంఎస్ కార్యకర్త కా. జోగ వంజామి కాలికి తూటా తగిలి అక్కడే పడిపోయాడు. ఆయన్ను పోలీసులు అరెస్టు చేసి విపరీతంగా చిత్రహింసలు పెట్టి అమానుషంగా కాల్చి చంపారు. ఆ తర్వాత పార్టీ డివిజనల్ కమిటీ సభ్యుడు కా. రామధర్‌ను చంపామని పోలీసులు పెద్దగా ప్రచారం చేసుకున్నారు.

### మే 23న దేవగాం వద్ద ఆంబుష్ కా. సుఖ్‌దేవ్ అమరత్వం - ఒక గోపనీయ సైనికుడు ఖతం, ముగ్గురికి గాయాలు

మే 23న పార్టీ ఉత్తర బస్తర్, మాడ్ డివిజనల్ కమిటీలు సంయుక్తంగా బంద్ పిలుపునిచ్చాయి. బంద్‌ను విఫలం చేయడానికి పోలీసులు తీవ్రంగా ప్రయత్నించారు. అయినా కానీ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని ఈ బంద్‌ను పూర్తిగా జయప్రదం చేశారు. ఈ సందర్భంగా నారాయణపూర్-కొండగాం రోడ్డుపై ప్రజలు నరికి పడవేసిన చెట్లను తొలగించడానికి వస్తున్న పోలీసులపై దేవగాం అనే ఊరి వద్ద పిజిఏ ప్లటూన్ ఒకటి ఆంబుష్ చేసింది. ఇందులో పిజిఏ యోధులు ఒక గోపనీయ సైనికుణ్ని హతమార్చి వాడి నుండి .303 రైఫిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. మరో ముగ్గురు పోలీసులు గాయపడ్డారు. మిగతావారంతా కొద్ది సేపు ప్రతిఘటించిన తర్వాత తోక ముడిచారు. ఈ దాడి పాక్షికంగా సఫలమైనప్పటికీ, పోలీసులు చేసిన ప్రతిఘటనలో పిజిఏ ఉత్తర కమాండ్ కమాండ్-ఇన్-చీఫ్ కా. సుఖ్‌దేవ్ అమరుడవడంతో మన వైపు పెద్ద నష్టమే జరిగింది. అప్పటికి పోలీసులను వెదికి వెదికి తరుముతున్న పిజిఏ యోధులు తమ దాడిని ఉపసంహరించుకున్నారు. తమ ప్రియతమ కమాండర్ మృతదేహాన్ని భుజాలపై మోసుకొచ్చి విప్లవ సాంప్రదాయాల ప్రకారం ఆయనకు అంత్యక్రియలు జరిపించారు.

### మైమగవాడిలో ఇద్దరు గోపనీయ సైనికులు హతం

ఏప్రిల్ 27న పిజిఏ నాయకత్వంలో 300 మంది ప్రజలు మైమగవాడి గ్రామంలోని ముగ్గురు గోపనీయ సైనికుల ఇళ్లపై దాడి చేశారు. ఈ గ్రామంలో పోలీసు ఇన్‌ఫార్మర్ల పకడ్బందీ యంత్రాంగం ఏర్పడింది. వీళ్లు గ్రామంలో రహస్యంగా ఉంటూ విప్లవకారుల కార్యకలాపాల గురించి సమాచారం ఎప్పటికప్పుడు పోలీసులకు తెలియజేస్తారు. పార్టీకి చెందిన స్థానిక ఎల్‌జిఎస్‌పై దాడి జరిపి వీలైనంత మందిని హతమార్చాలని వీరి పథకం. అయితే ప్రజలు వీరిపై కన్నేసి ఉంచారు. వీరి విప్లవ ప్రతీఘాతుక కార్యకలాపాలకు సంబంధించిన వివరాలన్నీ పిజిఏ గెరిల్లాలకు తెలియజేశారు. ఈ దాడిలో రేశ్‌లాల్, శివప్రసాద్ అనే ఇద్దరు గోపనీయ సైనికుల్ని చంపేశారు. యోగేష్ ఇంటిపై దాడి చేసి వీడి ఆస్తులన్నింటినీ స్వాధీనం చేసుకున్నారు. ఈ యోగేష్‌నే ఒక నెల తర్వాత జరిగిన బడ్‌గాం ఘటనలో పిజిఏ చంపేసింది. ఈ దుష్ట గోపనీయ సైనికులకు వ్యతిరేకంగా జరిగిన దాడులన్నింటిలోనూ ప్రజలు విస్తృతంగా పాల్గొనడం విశేషం.

### కడిమెలో పోలీసులపై దాడి - పోలీసుల దుష్ప్రచారం

మే 8న పిజిఏ గెరిల్లాలు పెద్ద ఎత్తున ప్రజలను కదిలించి పఖంజూర్-భానుప్రతాప్‌పూర్ రోడ్డుపైనున్న కాప్సి అనే గ్రామంలోని అటవీశాఖ కార్యాలయాలపై దాడి జరిపారు. ఇక్కడ అటవీశాఖకు చెందిన దాదాపు 30-40 మంది అధికార్లు, ఉద్యోగులు ఉంటారు. ప్రజల్ని దోచుకోవడంలోనూ, దౌర్జన్యాలకు పాల్పడడంలోనూ ఇక్కడి అధికార్లు పెద్ద మొనగాళ్లుగా నిలిచారు. ఇక్కడ ఉండే నేతాం అనే రేంజర్ వెదురు కూలీలకివ్వాల్సిన దాదాపు 10 లక్షల రూపాయలు దిగమింగాడు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు వీరి ఆగడాలతో, దోపిడీతో విసిగిపోయి ఉన్నారు. అందుకే పిజిఏ వీరికి తగిన బుద్ధి చెప్పాలని నిర్ణయించింది. ఈ దాడిలో గెరిల్లాలతో పాటు దాదాపు 100 మందికి పైగా సాయుధ ప్రజలు కూడా పాల్గొన్నారు. వీరి కార్యాలయాల సముదాయంపై దాడి జరిపి అటవీశాఖకు చెందిన 3

జీపులనూ, ఒక కారునూ, ఒక మోటార్‌సైకిల్‌నూ దగ్ధం చేశారు. వీరి నుండి ఒక వైర్‌లెస్ సెట్టు తదితర సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.

ఈ ఘటన తర్వాత దాదాపు 50 మంది పోలీసుల బృందం పెట్రోలింగ్ కోసం వచ్చి దగ్గరలోని కడిమె అనే గ్రామంలో ఆగింది. వీరు అత్యాధునిక రైఫిళ్లు, మోర్టార్లు, గ్రెనేడ్లు వంటి ఆయుధాలను పట్టుకొని ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడానికి ప్రయత్నించారు. అయితే ప్రజల నుండి ఈ సమాచారం అందగానే పిజిఏ సెకండరీ ఫోర్సుకు చెందిన 6గురు సైనికులు, బేస్ ఫోర్సుకు చెందిన డజను మంది సైనికులు దాడికి పథకం తయారు చేశారు. ప్రధానంగా దేశీయ భర్మార్ తుపాకులను కలిగిన ఈ ఎర్ర యోధులు రెండు జట్లుగా విడిపోయి అర్ధరాత్రి 12 గంటల తర్వాత పోలీసులు విడిది చేసిన స్కూలు భవనంపై రెండు వైపుల నుండి కాల్పులు ప్రారంభించారు. 10-12 రౌండ్లు కాల్పులు జరిపి, ఆ తర్వాత రిట్రీటయ్యారు. ఈ కాల్పుల్లో ఒక హెడ్ కానిస్టేబుల్ తీవ్రంగా గాయపడ్డాడు. మరి కొందరు పోలీసులకు కూడా గాయాలయ్యాయి. పోలీసులు ఈ దాడితో ఉక్కిరిబిక్కిరై, తేరుకోవడానికే చాలా సమయం పట్టింది. అప్పటికీ పిజిఏ సైనికులు సురక్షితంగా చాలా దూరం వెళ్లిపోయారు. తర్వాత భయంతో పిచ్చిగా అరుస్తూ పోలీసులు లక్ష్యరహితంగానూ, నిరర్థకంగానూ కాల్పులు జరిపారు. మోర్టార్ షెల్స్ కూడా పేల్చారు.

పిజిఏ చేతిలో పొందిన ఘోర పరాభవంతో పిచ్చెత్తిన పోలీసులు మరుసటి రోజు ఉదయం ఒక కోడిని కోసి అక్కడక్కడ దాని రక్తం వెదజల్లి, నక్సలైట్లు చనిపోవడమో, గాయపడడమో జరిగిందని ప్రజలను నమ్మించడానికి వెర్రి ప్రయత్నం చేశారు. ముందుగా పోలీసులు దాదాపు 10 మంది నక్సలైట్లు చనిపోవడమో, గాయపడడమో జరిగిందని ప్రచారం చేశారు. కానీ ఆ తర్వాత పార్టీ డివిజనల్ కమిటీ కార్యదర్శి కా. దస్రు పత్రికలకు విడుదల చేసిన ఒక ప్రకటనలో ఘటనకు సంబంధించిన వివరాలు తెలుపుతూ పోలీసుల ప్రచారాన్ని ఖండించాడు. అయినప్పటికీ పోలీసులు తమ దుష్ప్రచార క్యాంపెయిన్‌ను ఆపలేదు. దళం డిప్యూటీ కమాండర్ కా. నిర్మల చనిపోయిందంటూ పుకార్లు పుట్టించారు. ఆ తర్వాత స్థానిక పార్టీ కమిటీ దీన్ని ఖండించింది. పోలీసుల ప్రచారం మాటెలా ఉన్నా, స్థానిక ప్రజలకు మాత్రం వాస్తవమేమిటనేది స్పష్టంగా తెలుసు. నాటు రకం ఆయుధాలు కలిగిన ప్రజా సైన్యానికి చెందిన ఒక చిన్న బృందం అత్యాధునిక ఆయుధాలు కలిగిన ఒక పెద్ద పోలీసు దళంపై దాడి జరపడమే కాదు, పాక్షికంగా సఫలం కావడమే ఆ వాస్తవం. చొరవ, సమయస్ఫూర్తి, ధైర్యసాహసాలతో చేసే ఇలాంటి చర్యలతో ప్రజా సైన్యం అజేయమైందనీ, ప్రజల శక్తి అంతులేనిదనీ ప్రజల్లో విశ్వాసం బాగా పెరుగుతోంది.

## ఇన్‌ఫార్మర్లకు వ్యతిరేకంగా చర్యలు

ఉత్తర బస్తర్ డివిజన్‌లో ఎత్తుగడల ఎదురుదాడి క్యాంపెయిన్‌లో భాగంగా అనేక మంది ఇన్‌ఫార్మర్లనూ, గోపనీయ సైనికులనూ, హోంగార్డులనూ ప్రజలు శిక్షించారు. డౌల ఏరియాలోని మర్సుకోల గ్రామంలో రాజు, రాంసింగ్ అనే ఇద్దరు ఇన్‌ఫార్మర్లపై చర్య తీసుకున్నారు. వీరు గ్రామంలో పెత్తందార్లు కూడా. అనేక ప్రజా వ్యతిరేక కార్యకలాపాలలో వీరి పాత్ర ఉంది. వీరికి గోపనీయ సైనికులతో సంబంధాలున్నాయనీ, వారికి ఆశ్రయం కూడా కల్పిస్తారనీ ప్రజలు తెలిపారు. దానితో గెరిల్లాలు ప్రజల సమక్షంలో వీరిని విచారించి వీరి ప్రజా వ్యతిరేక కార్యకలాపాలకు గానూ గట్టిగా తన్నారు. ఆ తర్వాత పోలీసులతో సంబంధాలు తెంచుకోవాలనీ, ప్రజలతో కలిసిమెలసి ఉండాలనీ హెచ్చరికగా చెప్పి వదిలేసారు.

ఇదే ప్రాంతంలోని సులింగ గ్రామ సర్పంచ్ జుగుల్, అదే గ్రామానికి చెందిన జుగ్ను, బుధ్ని అనే మరో ఇద్దరు వ్యక్తులకు వ్యతిరేకంగా 4 గ్రామాలకు చెందిన 500 మంది ప్రజల సమక్షంలో ప్రజా పంచాయితీ జరిగింది. వీళ్లు పోలీసులు పంపిన సిఐడిలతో సహకరించారన్నది ప్రజల ఆరోపణ. ప్రజా పంచాయితీలో ఈ ఆరోపణ నిజమని తేలిన తర్వాత వీరిని తీవ్రంగా హెచ్చరించి వదిలేసారు. భవిష్యత్తులో ఇలాంటి చర్యలకు పాల్పడవద్దని ప్రజలు గట్టిగా చెప్పారు. వీరు ప్రజల ముందు తలవంచి క్షమాపణలు చెప్పారు.

వట్టెంహోడ్ గ్రామవాసి, పెత్తందారు కోప రత్తును కూడా ప్రజలు ప్రజాకోర్టులోకి ఈడ్చారు. రత్తు ఒక పోలీసు ఇన్‌పార్మర్‌కు చుట్టమవడమే కాకుండా ఆ అండతో ప్రజలను బెదిరించే వాడు. వీడు గతంలో ఓసారి తన సోదరుని భూమిని కాజేసినప్పుడు కూడా సంఘం జోక్యం చేసుకొని భూమిని వాపసు ఇప్పించింది. అయినా వీడిలో పెద్దగా మార్పేమీ రాలేదు. పైగా సంఘ కార్యకర్తలను కూడా బెదిరించసాగాడు. వీడి ప్రజా వ్యతిరేక చర్యలన్నింటినీ చర్చించిన ప్రజలు వీడిని గ్రామం నుండి వెళ్లగొట్టాలని నిర్ణయించారు.

బేసెమెట్ట గ్రామం వాడైన రైజు ఒకప్పుడు డిఎకెఎంఎస్ నాయకుడుగా పనిచేశాడు. ఆ తర్వాత తన వ్యక్తిగత కారణాలతో ఒక వ్యక్తిని హత్య చేసినందుకు సంఘం నుండి వీడిని తొలగించారు. ఇదే గ్రామానికి చెందిన లహర్ సింగ్ అనే మరో వ్యక్తి ఉత్తమ్ అనే గోపనీయ సైనికుడితో సంబంధాలు కలిగి ఉన్నాడు. వీరిరువురి ప్రజా వ్యతిరేక కార్యకలాపాలను చర్చించిన పిదప పిజిఏ సైనికులు ఇద్దరినీ తన్నారు. ముందుగా తమ తప్పుల్ని కప్పిపెట్టుకోవాలని ప్రయత్నించినప్పటికీ, ప్రజలు వీరి సంబంధాల గురించి స్పష్టంగా, ఆధారాలతో సహా చెబుతుంటే వీరు నిజం ఒప్పుకోక తప్పింది కాదు. ఆ తర్వాత ప్రజలు వీరు బాగుపడడానికి గాను ఒక్క అవకాశం ఇచ్చి చూద్దామని నిర్ణయం చేశారు.

బడ్‌గాంలో గోపనీయ సైనికులను అంతమొందించాక గ్రామంలోని దుష్ట పెత్తందార్లపైన పిజిఏ దాడి చేసింది. గ్రామ గాయిత రామధర్ కోర్రామి, పెరమ కొంద కోర్రామిలను ప్రజా కోర్టులో ప్రవేశపెట్టారు. వీరి ప్రజావ్యతిరేక కార్యకలాపాలన్నింటినీ ప్రజలు బాహాటంగా చర్చించారు. వీళ్లు గ్రామ ప్రజలను బాగా పీడిస్తారు. తమ పదవుల్ని దుర్వినియోగపరుస్తూ ప్రజల నుండి డబ్బులు వసూలు చేసి వాటిని కాజేస్తారు. ప్రజల మధ్య తలెత్తే చిన్న చిన్న గొడవలకు గాను జుర్మానాగా బాగా డబ్బు వసూలు చేస్తారు. ఈ అకృత్యాలన్నింటినీ చర్చించిన తర్వాత ప్రజలు వీరిరువురినీ తన్నాలని నిర్ణయించి అమలు చేశారు.

## 900 మంది ప్రజల సమక్షంలో పోలీసు ఇన్‌ఫార్మర్ల లొంగుబాటు

కొండగాం రేంజ్‌లోని బేరంగి అనే గ్రామానికి చెందిన కిద్రు, తుమ్మిరినార్ గ్రామానికి చెందిన మేఘనాథ్‌లు ఇద్దరూ కూడా గత రెండేళ్లుగా పోలీసులతో సంబంధాల్లో ఉంటూ ప్రజాసంఘాలకూ, గెరిల్లా దళాలకూ సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు పోలీసులకు చేరవేస్తూ ఉండేవారు. దేవగాం ఆంబుష్‌లో చచ్చిన గాగ్రూ అనే గోపనీయ సైనికుడు వీళ్లను ఇలా తయారు చేశాడు. ఇటీవల గోపనీయ సైనికులకూ, ఇన్‌ఫార్మర్లకూ వ్యతిరేకంగా వరుసగా చర్యలు జరుగుతుండడంతో వీళ్లలో పునరాలోచన మొదలైంది. పిజిఏ ముందు లొంగిపోతామని ప్రతిపాదన చేశారు. ఈ లొంగుబాటుకు ఆమోదం కోసం పిజిఏ ఏర్పాటు చేసిన సభలో 15 గ్రామాల నుండి 900 మంది ప్రజలు హాజరయ్యారు. ఈ సభలో వీరు పాల్పడిన ప్రజా వ్యతిరేక చర్యలన్నింటినీ చర్చించారు. ఆ తర్వాత ప్రజలు కొన్ని షరతులకు లోబడి ఉండేలా వీరి లొంగుబాటును ఆమోదించారు. వీరిద్దరూ తమ తప్పులన్నింటినీ ఒప్పుకొని, ఇకపై ప్రజలు విధించే షరతులకు లోబడి సాధారణ జీవితం గడుపుతామని హామీ ఇచ్చిన తర్వాత ప్రజలు క్షమించారు.

**మాడ్ డివిజన్**

## ప్రజా వ్యతిరేకి సోన్‌సాయ్ ఇంటిపై పిజిఏ దాడి

మాడ్ డివిజన్‌లోని ఓర్ఛకు సమీపంలో గల గుద్దాడి అనే గ్రామంలో 1994లో గెరిల్లా దళానికి చెందిన ఇద్దరు కామ్రేడ్స్ ఆశ్రయం తీసుకున్నారు. ఈ గ్రామంలో ఉండే సోన్‌సాయ్ అనే వ్యక్తి పోలీసులకు కబురందించి దాడి చేయించాడు. పోలీసులు గెరిల్లాలపై కాల్పులు జరిపారు. ఆ ఇద్దరు గెరిల్లాలలో ఒకరు తీవ్రమైన అనారోగ్యంతో ఉండె. ఎలాగోలా ఇద్దరూ ఆ దాడి నుండి క్షేమంగా బైటపడ్డారు. అయితే రెండు రైఫిళ్లు పోలీసుల వశమయ్యాయి. సోన్‌సాయ్ కుటుంబం గ్రామంలోని ధనిక కుటుంబాల్లో ఒకటి. ఈ ఘటన తర్వాత సోన్‌సాయ్ పోలీసుల్లో చేరాడు. అప్పటి నుండీ వాడు పోలీసుగానే పనిచేస్తున్నాడు. వీడి తమ్ముడు మాన్‌సింగ్ కూడా పోలీసులతో కమ్మక్కైయ్యాడు. ఇలా వీడి కుటుంబం అంతా కూడా పార్టీకి వ్యతిరేకంగా నిలిచింది. దానితో ఎత్తుగడల ఎదురుదాడి క్యాంపెయిన్‌లో భాగంగా పిజిఏ సైనికులు ఏప్రిల్ 25న వీడి ఇంటిపై దాడి చేసి 20 బస్తాల వడ్లనూ, ఇతర సామగ్రినీ స్వాధీనపర్చుకొని ఇంటిని కాలబెట్టారు. కుటుంబాన్ని గ్రామం నుండి పారదోలారు. ఈ చర్యలో దాదాపు 70 మంది మిలిషియా సభ్యులూ, ప్రజలూ పాల్గొన్నారు.

## సోన్‌పూర్ జమీందారు గాగ్రూకు గ్రామ బహిష్కారం - ఆస్తుల స్వాధీనం

మాడ్ డివిజన్‌లోని కోహ్కామెట్ట ఏరియాలోని రెవెన్యూ గ్రామమైన సోన్‌పూర్‌లో బైటి నుండి వచ్చి స్థిరపడ్డ కుటుంబాల సంఖ్యే ఎక్కువగా ఉంటుంది. వీరిలో గాగ్రూ అనే ఆదివాసీయేతరుని కుటుంబం ఒకటి. వీడు ఒక మామూలు రైతుగా ఈ గ్రామానికి వచ్చి చూస్తుండగానే పెద్ద భూస్వామిగా అవతారం ఎత్తాడు. ప్రజల శ్రమశక్తిని దోచుకుని బాగా భూములు సంపాదించాడు. చాలా మంది రైతుల నుండి వీడు జబర్దస్తీగా భూముల్ని లాక్కున్నాడు. పార్టీ నిర్ణయాన్ని ఖాతరు చేయకుండా అడవిని నరికి నైబెరడ్ ఒడ్డున చాలా భూముల్ని సంపాదించాడు. ఇక్కడ జరిగే సంతలో ఆదివాసీ ప్రజలు అటవీవుత్పత్తుల్ని సేకరించి తెచ్చి అమ్ముకుంటారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన సహకార సమితికి గాగ్రూ అధ్యక్షుడయ్యాడు. ప్రభుత్వ డబ్బును కాజేస్తూ, ప్రజల నుండి అటవీ ఉత్పత్తుల కొనుగోళ్లలో అవకతవకలు చేసి బాగా సంపాదించాడు. ప్రజా సంఘాలు వ్యతిరేకిస్తున్నప్పటికీ, వీడు సంతలో సారా వ్యాపారాన్ని ప్రోత్సహించాడు. ప్రజా సంఘాల నాయకత్వంలో చీపుర్లకు న్యాయమైన రేటు కోసం ప్రజలు పోరాడుతుంటే వీడు ప్రజలను సంఘాలకు వ్యతిరేకంగా రెచ్చగొట్టాడు. ఆ తర్వాత సంఘాల కార్యకర్తల పేర్లన్నీ సేకరించి పోలీసులకందించాడు.

వీడి ప్రజా వ్యతిరేక కార్యకలాపాలన్నింటినీ వివరంగా చర్చించి పార్టీ వీడి ఆస్తులన్నింటినీ జప్తు చేసుకొని వీడి కుటుంబాన్నంతా గ్రామం నుండి బహిష్కరించాలని నిర్ణయించింది. వీడిపై మే 24న పార్టీ నాయకత్వంలో దాదాపు 30 గ్రామాల నుండి వచ్చిన 800 స్త్రీపురుషులు దాడి చేసారు. వీడి ఇంటి నుండి దాదాపు 500 క్వింటాళ్ల ధాన్యం ప్రజలు స్వాధీనం చేసుకున్నారు. వీడికి కుటుంబానికి చెందిన దాదాపు 50 ఎకరాల భూముల్ని సంఘం తన స్వాధీనంలోకి తెచ్చుకుంది. దాదాపు 42 గొడ్లను కూడా ప్రజలు పంచుకున్నారు. ఆఖరుగా వీడి విశాలమైన ఇంటిని ప్రజలు దగ్ధం చేశారు. వీడి కుటుంబాన్ని గ్రామం నుండి పారదోలారు. దీనితో పాటే ఈ గ్రామంలో ఉన్న అటవీశాఖకు చెందిన రెస్ట్ హౌజ్‌నూ, ఇతర ప్రభుత్వ భవనాలనూ ప్రజలు ధ్వంసం చేశారు.

## ప్రజా శత్రువు, పోలీసు ఇన్‌ఫార్మర్ సైను గ్రామ బహిష్కరణ

మాడ్ డివిజన్‌లోని కోహ్కామెట్ట ఏరియాలోని జారవాయి గ్రామ సర్పంచ్ సైను గత ఏప్రిల్ లో గెరిల్లాల యాక్షన్ టీం చేతిలో కుక్కచావు చచ్చిన సుఖ్‌దేవ్ అనే గోపనీయ సైనికుడికి స్వయాన చిన్నాన్న. గ్రామంలో వీడిదే పెత్తనం. వీడు ప్రజలను అదిరించి బెదిరించి వెట్టి చాకిరీ చేయించుకుంటాడు. ప్రజలకు కూలీ ఏమీ ఇవ్వకుండానే తన పొలాల్లో పని చేయించుకుంటాడు. వీడికి పోలీసులతో మంచి సంబంధాలున్నాయి గనుక ప్రజలు వీడికి అణిగిమణిగి ఉంటారు. వీడు తన మొదటి భార్యను తన్ని తరిమేసి మరో వ్యక్తి భార్యను జబర్దస్తీగా తన ఇంటికి తెచ్చుకున్నాడు. వీడి అరాచకాలన్నింటినీ చర్చించిన తర్వాత వీడి ఆస్తులన్నింటినీ స్వాధీనం చేసుకుని గ్రామం నుండి వెళ్లగొట్టాలని ప్రజలు తీర్మానించారు. ఈ దాడిలో వందలాది మంది ప్రజలు పాల్గొన్నారు. సైను ఆస్తులన్నింటినీ జప్తు చేసుకొని గ్రామం నుండి బహిష్కరించారు. ఈ ఘటనతో ప్రజల్లో ఆత్మవిశ్వాసం వెల్లి వెరిసింది.

## గ్రామ పంచాయితీ భవనాలు ధ్వంసం

శత్రువుకు వ్యతిరేకంగా ప్రారంభించిన ఎత్తుగడల ఎదురుదాడి క్యాంపెయిన్‌లో భాగంగా మాడ్ డివిజన్ ప్రజలు గ్రామ పంచాయితీ భవనాలను కూలగొట్టి దోపిడీ రాజ్యాన్ని సవాలు చేశారు. "ఈ ప్రభుత్వం మాది కాదు, దోపిడీదొంగలది. మా ప్రభుత్వాన్ని మేమే నిర్మించుకుంటాం" -- అన్న చైతన్యంతో ప్రజా మిలిషియా నాయకత్వంలో ప్రజలు మొత్తం 5 చోట్ల గ్రామ పంచాయితీ భవనాలను కూలగొట్టారు. కోహ్కామెట్ట, గార్ప, జారవాయి, కుర్సనార్, ముర్నార్ గ్రామాల్లో గల పంచాయితీ భవనాలు ప్రజల క్రోధాగ్నిలో మాడి మసై పోయాయి. ఈ భవనాలను కూలగొట్టే ముందర ప్రజలతో మీటింగ్ చేసి ప్రజలకు ఈ దోపిడీ ప్రభుత్వం అసలు స్వరూపాన్ని గురించి అర్థం చేయించారు. ప్రజలు ఉత్సాహంగా తమ పలుగులూ, పారలతో సహా కదలి వచ్చి ఈ పంచాయితీ భవనాలను కూలగొట్టారు. ఈ విధంగా మాడ్ ప్రజలు దోపిడీ రాజ్యాన్ని నిర్ద్వంద్వంగా తిరస్కరించారు. 'మా రాజ్యాన్ని మేం పోరాడి నిర్మించుకుంటాం' అన్న స్ఫూర్తితో ప్రజలు ముందడుగు వేస్తున్నారు.




ప్రజా వెల్లువలో పంచాయితీ భవనాలు భూమట్టం

## పశ్చిమ బస్తర్ డివిజన్

### ఫర్సెగఢ్ సమీపంలో పోలీసులపై పిజిఏ ఆంబుష్ ఇద్దరు పోలీసులు ఖతం - 3 ఎస్ఎల్ఆర్లు స్వాధీనం

జూన్ 27న పిజిఏ మెయిన్ ఫోర్స్‌కు చెందిన ఎర్ర యోధులు పశ్చిమ బస్తర్ డివిజన్‌లోని నేషనల్ పార్క్ ఏరియాలో ఫర్సెగఢ్‌కు దగ్గరలో గల రానిన్‌బోదిల్ గ్రామ సమీపాన ఒక పోలీసు బృందంపై మాటుగాచి దాడి చేశారు. ఈ బృందం మోటార్‌సైకిళ్లపై పోతున్నది. పిజిఏ సైనికులు మార్గమధ్యంలో అమర్చిన మందుపాతర్లు పేల్చి పోలీసులకు చెందిన రెండు మోటారుసైకిళ్లను ధ్వంసం చేశారు. ఈ ఘటనలో ఇద్దరు పోలీసులు అక్కడికక్కడే చావగా ఒక ఠానేదార్ తీవ్రంగా గాయపడ్డాడు. ఆ తర్వాత పిజిఏ సైనికులు పోలీసులపైకి దూసుకుపోయి వారి నుండి 3 ఎస్ఎల్ఆర్లు స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన పోలీసులు ప్రాణాలరచేతిలో పెట్టుకొని కాలికి బుద్ధి చెప్పారు. కా. సుఖ్‌దేవ్ అమరుడైన తర్వాత బస్తర్ పోలీసు అధికారులు విర్రవీగుతున్న సమయంలో ఈ దాడి జరగడం విశేషం. ఈ దాడి తర్వాత ప్రజలు పిజిఏ సైనికులను ఎంతగానో అభినందించారు.

## గడ్చిరోలి డివిజన్

### బీనగుండ సమీపంలో పిజిఏ శక్తివంతమైన దాడి ఇద్దరు అధికార్లు ఖతం

ఏప్రిల్ ఆఖరు వారంలో పిజిఏకు చెందిన మూడు బలగాల యోధులు గడ్చిరోలి జిల్లాలోని భామ్రాగఢ్ తాలూకాలో బీనగుండ దగ్గరలో పోలీసులపై రెండు చోట్ల దాడి చేసి హడలెత్తించారు. బీనగుండ ప్రాంతం మాడ్ పర్వత శ్రేణుల్లో కలిసి ఉంటుంది. ప్రజలను వేధించడంలో మొనగాళ్లుగా పేరుగాంచిన గడ్చిరోలి కమెండోలు పిజిఏ వరుసగా పేల్చిన మందుపాతర దెబ్బలకు గడగడా  వణికిపోయి ప్రాణభయంతో పరుగులు పెట్టారు. పిజిఏ పథకం ప్రకారం వీళ్లను ఉచ్చులో పడవేసింది. మొత్తం 35 మంది కమెండో పోలీసులు బీనగుండ గ్రామం చేరుకోగానే పిజిఏ వీరిపై రెండు వైపుల నుండి దాడి చేయడానికి నిశ్చయించుకుంది. వీరు లాహిరి నుండి ట్రక్కులలో వచ్చి బీనగుండలో ఆగిన తర్వాత నేరుగా పోదెవాడ వైపు కాలినడకన ప్రయాణమైనారు. ఆ తోవలో మాటు వేసిన గెరిల్లాల ఒక చిన్న టీం మందుపాతరలతో, కాల్పులతో పోలీసులపై ఊపిరిసలపనివ్వని విధంగా దాడి చేసింది. ఈ దాడిలో ఒక ఠానేదార్ అక్కడికక్కడే చావగా మరో నలుగురు పోలీసులు తీవ్రంగా గాయపడ్డారు. కొద్ది సేపు దాడిని సాగించి పిజిఏ గెరిల్లాలు రిట్రీటయ్యారు. ఆ తర్వాత పోలీసులు వెనక్కి మళ్లి బీనగుండకు చేరుకున్నారు. అక్కడి నుండి హెడ్‌క్వార్టర్స్‌కు చేరుకోవడానికి పేపరుమిల్లు ట్రక్కులలో బలవంతంగా ఎక్కి బయలు దేరారు. కానీ అక్కడ కూడా పిజిఏ గెరిల్లాలు పొంచి ఉన్నారని ఊహించలేకపోయారు. పోలీసుల వాహనం నిర్ణీత స్థలం చేరగానే మరో మారు పిజిఏ పేల్చిన మందుపాతర దెబ్బలకు మాడ్ ప్రాంత పర్వతాలన్నీ మారుమోగాయి. ఇక్కడ కూడా మరో పోలీసు అధికారి చావగా మరి కొందరు పోలీసులు తీవ్రంగా గాయపడ్డారు. మొత్తంగా ఇద్దరు అధికార్లు చావగా దాదాపు డజను మంది పోలీసులు గాయపడ్డారు. అయితే దురదృష్టవశాత్తు ఈ ట్రక్కులో ప్రయాణిస్తున్న ఒక కార్మికుడు కూడా మరణించాడు. ఇంకా కొందరు కార్మికులకు స్వల్పంగా గాయాలయ్యాయి. కార్మికుడి మృతి పట్ల పిజిఏ తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేసింది.

### మురుంబూసి వద్ద అపార్చునిటీ ఆంబుష్ ఒక పోలీసుకు గాయాలు

జూన్ మొదటివారంలో కోఠి పోలీసు స్టేషన్ నుండి పోలీసులు పెట్రోలింగ్ పనిపై కాలినడకన బయలుదేరారని పిజిఏకు సమాచారం అందింది. దాంతో వెంటనే పిజిఏ దాడికి పథకం సిద్ధం చేసింది. ఆధునిక ఆయుధాలతో సాయుధమైన 18 మంది గల పోలీసు బృందం అనుకున్న ప్రాంతానికి చేరుకోగానే పిజిఏ గెరిల్లాలు ఉధృతంగా కాల్పులు సాగించారు. ఈ దాడిలో ఒక పోలీసు జవాను తీవ్రంగా గాయపడగా మిగతా పోలీసులు ఫైరింగ్ చేసుకుంటూ కాలికి బుద్ధి చెప్పారు. దాదాపు 10 నిమిషాల వరకు కాల్పులు సాగించిన పిజిఏ గెరిల్లాలు క్షేమంగా రిట్రీట్ అయ్యారు. ఈ దాడి తర్వాత పోలీసులు పెట్రోలింగ్ చేయడం తాత్కాలికంగా ఆపుకున్నారు. ఈ దాడితో బెంబేలెత్తిన కోఠి ఠానా పోలీసులు అక్కడి నుండి ట్రాన్స్‌ఫర్ చేయించుకోవాలని ప్రయత్నిస్తున్నట్టు కూడా వార్తలందాయి. ఈ దాడితో చుట్టుపక్కల గ్రామాల్లో ప్రజలు చాలా సంతోషించారు. ఎందుకంటే గత సంవత్సరం ఇదే ఠానా పోలీసులు పక్కనే ఉన్న మర్కనార్ గ్రామానికి చెందిన చిన్న మెట్టామి అనే అమాయక రైతును నిష్కారణంగా కాల్చి చంపారు. దానితో ప్రజల హృదయాల్లో పోలీసుల పట్ల తీవ్రమైన ద్వేషం గూడుకట్టుకొని ఉంది.

### పోలీసు ఇన్‌ఫార్మర్ల ఇండ్లు ధ్వంసం

గడ్చిరోలి డివిజన్‌లో సాగుతున్న విప్లవోద్యమాన్ని అణచడానికి మహారాష్ట్ర ప్రభుత్వం అనేక ఏళ్లుగా తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నది. అందులో భాగంగా స్థానిక ఆదివాసులను ఇన్‌ఫార్మర్లుగానూ, పోలీసులుగానూ చేర్చుకొని తమ వేలితో తమ కంటినే పొడుచుకునే హీనమైన ఎత్తుగడలను అమలు చేస్తున్నది. డబ్బుల ఆశతో చాలా గ్రామాల్లోని లంపెన్ యువకులు ఈ విధంగా ఇన్‌ఫార్మర్లుగా మారుతున్నారు. మరి కొందరు పోలీసుల్లో చేరిపోయి ప్రజలపై నిర్బంధాన్ని కొనసాగించడంలో ప్రభుత్వానికి సహకరిస్తున్నారు. పార్టీ పలు మార్లు వీరికి నచ్చజెప్పడం కోసం కరపత్రాలు వేసింది. అలాగే ఆయా కుటుంబాలను కలిసి వారిని వెనక్కి రప్పించేలా కూడా ప్రయత్నాలు చేసింది. ఈ ప్రయత్నాలతో కొందరు తమ తప్పును అర్థం చేసుకొని తమ తమ గ్రామాల్లో ప్రజల్లో ఒకరిగా సాధారణ జీవితం గడుపుతున్నారు. అయితే కొందరు మొండిఘటాలు మాత్రం మారకుండా తమ కుటుంబాల సహాయంతో పార్టీ దళాలకు సంబంధించిన సమాచారాన్ని సేకరించి పోలీసులకు అందిస్తూ పాలకవర్గాలకు పక్కా తొత్తులుగా పని చేస్తున్నారు. అలాంటి కొందరి కుటుంబాలపై ఇటీవల పిజిఏ గెరిల్లాలు చర్య తీసుకున్నారు.

జారవడ్డ గ్రామ కొత్వాలు కుటుంబానికి చెందిన ఒక వ్యక్తి పోలీసులలో పనిచేస్తున్నాడు. ఈ కుటుంబం దళానికి సంబంధించిన సమాచారాన్ని పోలీసులకు చేరవేస్తూ ఉంటుంది. పార్టీ కార్యకర్తలు వీరికి చాలా సార్లు నచ్చజెప్పాలని ప్రయత్నించినప్పటికీ వీరు పెడచెవిన పెట్టారు, తమ కుటుంబ సభ్యుణ్ని పోలీసుల నుండి వెనక్కి తేవడానికి నిరాకరించారు. అందుకే పార్టీ వీళ్ల ఇంటిని ధ్వంసం చేసి మొత్తం కుటుంబాన్ని ఊళ్లోంచి వెళ్లగొట్టాలని నిర్ణయించింది. పెరిమిలి ఏరియాలోని కచులేర్ అనే గ్రామానికి చెందిన దోర్గె గత 8 సంవత్సరాలుగా పోలీసు ఇన్‌ఫార్మర్‌గా పనిచేస్తున్నాడు. వీడు ప్రజలనూ, ప్రజా సంఘాల కార్యకర్తలనూ ఎన్నో బాధలకు గురిచేస్తున్నాడు. దానితో పార్టీ వీడి ఇంటిని కూల్చివేసి మొత్తం కుటుంబాన్ని ఊళ్లోంచి వెళ్లగొట్టాలని నిర్ణయించింది. ఈ విధంగా ప్రజా వ్యతిరేకులకు గెరిల్లాజోన్‌లోని గ్రామాల్లో స్థానం లేదని ప్రజలు నిర్ద్వంద్వంగా ప్రకటించారు. ❐

# ప్రజాయుద్ధ నాయకుల హత్యలకు బదులు తీర్చుకుందాం!

## కా. కృష్ణ (లింగమూర్తి), కా. దధీచి రాయ్, కా. పద్మ సహా అమరులందరికీ దండకారణ్య లాల్ సలాం !

ఏప్రిల్ 2002 నుండి ప్రజాయుద్ధం ఎందరో తన సాహస యోధుల్ని కోల్పోయింది. శత్రువు అమలు చేస్తున్న తెల్ల భీభత్సాన్ని ఎదిరిస్తూ ప్రజల ముద్దుబిడ్డలెందరో తమ రక్తార్పణతో విప్లవోద్యమ చరిత్రలో త్యాగాల కొత్త పుటల్ని చేరుస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ మైదానాల్లోనూ, ఉత్తర తెలంగాణా పంటపొలాల్లోనూ, బీహార్-ఝార్ఖండ్ అడవుల్లోనూ, ఆంధ్ర-ఒరిస్సా సరిహద్దు ప్రాంత పర్వతాల్లోనూ ప్రతిరోజూ ఎందరో వీరులు రక్తం చిందిస్తూనే ఉన్నారు. ఒకవైపు ఫాసిస్టు చంద్రబాబు, మతదురహంకారి అద్వానీ, వాళ్ల సామ్రాజ్యవాద ప్రభువులు ప్రజాయుద్ధ నేతల్ని హత్య గావించి పండుగలు చేసుకుంటుంటే, మరో పక్క పిజిఏ వీర యోధులు కన్నీటిని తుడ్చుకుంటూ అమరుల హత్యలకు బదులు తీర్చుకొని ప్రజాయుద్ధాన్ని మునుముందుకు తీసుకుపోవడానికి శత్రు బలగాలపైన నిరంతరాయంగా దాడులు చేస్తూనే ఉన్నారు.

చారిత్రాత్మక 9వ కాంగ్రెస్ కర్తవ్యాలను పరిపూర్తి చెయ్యడానికి మొత్తం పార్టీ అంతా దృఢంగా ముందడుగు వేసింది. ఈ క్రమంలో దేశవ్యాప్తంగా ప్రజాయుద్ధం అనేక విజయాల్ని సాధించింది. విముక్తి ప్రాంతాల స్థాపన లక్ష్యంగా అన్ని పార్టీ యూనిట్లూ, అన్ని పిజిఏ యూనిట్లూ కాంగ్రెస్ ఇచ్చిన ప్రేరణతో తమ కృషిని ద్విగుణీకృతం చేశాయి. అయితే ఈ క్రమంలో మనం చాలా మూల్యాన్నే చెల్లించాల్సి వచ్చింది. ఎందరో మన సహచరులు సాహసోపేతంగా పోరాడుతూ తమ ప్రాణాలర్పించారు. ఈ అమర యోధుల్లో రాష్ట్ర స్థాయికి చెందిన నలుగురు కామ్రేడ్స్ ఉండడం మన ఉద్యమానికి పెద్ద నష్టం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సెక్రెటేరియట్ సభ్యుడు కా. కృష్ణ (లింగమూర్తి), బీహార్-ఝార్ఖండ్ సంయుక్త రాష్ట్ర కమిటీ సభ్యుడు కా. దధీచి రాయ్, ఉత్తర తెలంగాణా స్పెషల్ జోనల్ కమిటీ సభ్యురాలు కా. పద్మ (రజిత), దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు కా. సుఖ్‌దేవ్ (విజయభాస్కర్)లతో పాటు ఇంకా చాలా మంది జిల్లా స్థాయి, ఏరియా స్థాయి నాయకులూ, సాధారణ సభ్యులూ, సానుభూతిపరులూ, సాధారణ ప్రజలూ పాలకవర్గాల పాశవిక హత్యాకాండకు బలయ్యారు. డికెఎస్‌జెడ్‌సి ఈ వీరయోధులందరికీ వినమ్రంగా జోహార్లర్పిస్తోంది. వారి ఆశయాలను తుదకంటా కొనసాగిస్తామనీ, వారు నెలకొల్పిన ఆదర్శాల నుండి నేర్చుకొని పురోగమిస్తామనీ శపథం చేస్తోంది. ఈ సందర్భంగా వీరిలో కొంత మంది కామ్రేడ్స్ జీవిత చరిత్రలను సంక్షిప్తంగా తెలుసుకుందాం.



కామ్రేడ్ కృష్ణ

## కా. కృష్ణ (లింగమూర్తి)

ఏప్రిల్ 27న ఆంధ్రప్రదేశ్‌లోని మహబూబ్‌నగర్ జిల్లాలో గెరిల్లాల డిటాచ్‌మెంట్ ఒకటి వంతుల వారీగా కృష్ణా నదిని దాటుతోంది. ఒక టీము చిన్న పుట్టిలో నది దాటుతుండగా అకస్మాత్తుగా పుట్టి మునిగిపోవడంతో అందులో ప్రయాణిస్తున్న పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు కా. కృష్ణ, మహబూబ్‌నగర్ జిల్లా కార్యదర్శి కా. ప్రభాకర్, విప్లవకర సాంస్కృతికోద్యమ నాయకుడు కా. భాస్కర్, కా. కృష్ణకు గార్డుగా ఉన్న కా. మధులు అమరులైనారు. వీరిలో కా. కృష్ణ, కా. ప్రభాకర్‌లు మంచి ఈతగాళ్లే అయినప్పటికీ ఈతరాని కా. భాస్కర్‌ను రక్షించే ప్రయత్నంలో అతనితో పాటు వాళ్లు కూడా మునిగిపోయారు. ఈ యోధులందరికీ జోహార్లు చెబుదాం.

కా. కృష్ణ పార్టీలోని సీనియర్ నాయకుల్లో ఒకరు. దాదాపు 25 ఏళ్లుగా విప్లవోద్యమంలో దృఢంగా నిలబడ్డ యోధుడాయన. పోరాటానికి మారుపేరైన కరీంనగర్ జిల్లాలోని అంబాల గ్రామంలో పుట్టాడాయన. వరంగల్ నగరంలోని కాకతీయ విశ్వవిద్యాలయంలో తెలుగు సాహిత్యంలో ఎం.ఏ. చదువుతూ 1978లో ఆయన రాడికల్ విద్యార్థి సంఘం (ఆర్ఎస్‌యు) సభ్యుడయ్యాడు. 1979లో జరిగిన ఆర్ఎస్‌యు 3వ రాష్ట్ర మహాసభలో ఆయనను జాయింట్ సెక్రెటరీగా ఎన్నుకున్నారు. ఆ తర్వాత, 1981లో ఆయన ఆర్ఎస్‌యు ఉపాధ్యక్షుడయ్యాడు. 1978-82 మధ్య ఆయన ఉత్తర తెలంగాణాలోని పట్టణాలూ, నగరాలూ తిరుగుతూ విద్యార్థులను సమీకరించేవాడు. ఆయన ఒక మంచి వక్త. ఆ రోజుల్లో ఆయన ఉపన్యాసం వినడానికి ప్రజలు చాలా దూరం నుండి కూడా వచ్చి సభల్లో పాల్గొనేవారు. ఆయన జనాకర్షణ కలిగిన విద్యార్థి నాయకుడు. త్వరలోనే జిల్లాలోని విద్యార్థియువజనుల్లోనూ, రైతాంగంలోనూ ఆయనకు మంచి గుర్తింపు వచ్చింది.

1983లో పార్టీ పిలుపు మేరకు ఆయన వరంగల్ నుండి కర్నూలు పట్టణానికి తరలి వెళ్లాడు. అక్కడ ఆయన జిల్లా ఆర్గనైజర్‌గా బాధ్యతలు స్వీకరించాడు. అనతి కాలంలోనే కా. కృష్ణ కర్నూలు జిల్లాలో విద్యార్థియువజన ఉద్యమాన్ని నిర్మించాడు. కార్మిక పోరాటాలు కూడా నిర్మించాడు. నల్లమల అడవుల్లో ఆదివాసులతో మమేకమై అక్కడ గెరిల్లా దళాలను ఏర్పాటు చేయడంలో ఆయన ప్రముఖ పాత్ర నిర్వహించాడు.

1985లో జరిగిన రాయలసీమ రీజనల్ కాన్ఫరెన్సులో కా. కృష్ణను రీజనల్ కమిటీ సభ్యుడిగా ఎన్నుకున్నారు. 1994లో కర్నూలు, ప్రకాశం జిల్లాలలో గెరిల్లా దళాలను కలుపుతూ నల్లమల డివిజన్‌ను ఏర్పాటు చేసినప్పుడు కా. కృష్ణను దాని తొలి కార్యదర్శిగా ఎన్నుకున్నారు. 1995లో జరిగిన ఆంధ్రప్రదేశ్ పార్టీ 14వ మహాసభలో ఆయన్ను రాష్ట్ర కమిటీ ప్రత్యామ్నాయ సభ్యుడిగా ఎన్నుకున్నారు. 1996లో జరిగిన రాష్ట్రకమిటీ సమావేశంలో ఆయనను రాష్ట్రకమిటీలోకి కో-ఆప్ట్ చేసుకున్నారు. 2000లో జరిగిన రాష్ట్ర 15 మహాసభలో కా. కృష్ణను తిరిగి రాష్ట్రకమిటీ సభ్యునిగా ఎన్నుకున్నారు. ఆ తర్వాత ఆయన రాష్ట్రకమిటీ సెక్రెటేరియట్ సభ్యుడయ్యాడు.

కామ్రేడ్ కృష్ణ ఒక సమర్థుడైన కార్యకర్త. ఆయన నల్లమల ప్రాంత ఉద్యమాన్నే కాకుండా, రాష్ట్రంలో నడుస్తున్న మహిళా, విద్యార్థి, సాహిత్య ఉద్యమాలను కూడా గైడ్ చేశాడు. పార్టీ ఇచ్చిన బాధ్యతల్ని పరిపూర్తి చెయ్యడంలో ఆయన ఏనాడూ వెనకాడలేదు. గత రెండు సంవత్సరాలుగా ఆయన దక్షిణ తెలంగాణా పైన, ప్రత్యేకించి మహబూబ్‌నగర్ జిల్లా ఉద్యమం పైన కేంద్రీకరించి దానికి జవజీవాలు సమకూర్చే కృషిలో నిమగ్నమయ్యాడు.

కామ్రేడ్ కృష్ణ రాజకీయ నిర్మాణ దక్షతలే కాకుండా ఆయన వ్యక్తిగత సుగుణాలు కూడా ప్రతి పార్టీ సభ్యునికీ ఆదర్శప్రాయం. వినమ్రతకూ, నిస్వార్థపరత్వానికీ, కఠిన శ్రమకూ, క్రమశిక్షణకూ, సహచరులతో స్నేహపూరిత ప్రవర్తనకూ ఆయన ఒక మంచి ఉదాహరణ. ప్రజలతో ఆయనకు ప్రగాఢమైన సంబంధాలుండేవి. నల్లమల అడవిలోని ఊరూరా, ఇళ్లిల్లూ ఆయనకు

సుపరిచితమే. తీవ్రమైన స్పాండిలైటిస్, కాళ్ల నొప్పులు వంటి సమస్యలున్నప్పటికీ ఆయన తన అనారోగ్యాన్ని ఎప్పుడూ కర్తవ్య నిర్వహణకు అడ్డంకిగా మారనివ్వలేదు. చివరి క్షణాల్లో కూడా తనకు సంభవించగల ప్రమాదాన్ని ఏ మాత్రం లెక్కచేయకుండా తన సహచరుణ్ని రక్షించడానికి ఆయన పడిన తాపత్రయం, ప్రయాస ఆయన తన సహచర కామ్రేడ్స్ పట్ల ఎంత బాధ్యతగా ఉండేవాడోనన్న దానికి నిదర్శనం. ఆంధ్రప్రదేశ్ మహిళా ఉద్యమ నాయకురాలు కా. పద్మతో కా. కృష్ణ తన జీవితాన్ని పంచుకున్నాడు. 1994లో కా. పద్మను మరో పార్టీ నాయకుడైన కా. సూర్యంతో కలిపి పోలీసులు దారుణంగా హత్య చేశారు.

కా. కృష్ణ మరణం ఒక్క ఆంధ్రప్రదేశ్‌కే కాకుండా దేశంలో సాగుతున్న విప్లవోద్యమానికి చాలా పెద్ద నష్టం. కా. కృష్ణకూ, ఆయనతో పాటే అమరులైన కా. ప్రభాకర్, కా. భాస్కర్, కా. మధులకు విప్లవజోహార్లు చెబుదాం! వాళ్ల కన్న కలల్ని నిజం చేద్దామని ప్రతిన బూనుదాం!

## కా. దధీచి రాయ్‌కు లాల్ సలాం !

*మే 26న బీహార్-ఝార్ఖండ్‌లోని బిశ్రాంపూర్ అనే గ్రామంలో ఉన్న గెరిల్లా దళంపై పోలీసులు హంతక దాడి చేశారు. ఈ దాడిలో ప్రజలు పటేల్ అని పిలిచే బీహార్-ఝార్ఖండ్ సంయుక్త రాష్ట్ర కమిటీ సభ్యుడు కా. దధీచి రాయ్ సహా మరి కొందరు కామ్రేడ్స్ అమరులైనారు. కా. దధీచిని కొద్ది నెలల కిందనే రాష్ట్ర కమిటీలోకి కో-ఆప్ట్ చేసుకున్నారు. ఆయన తన సుదీర్ఘ పార్టీ జీవితంలో ప్రజలకూ, పార్టీ శ్రేణులకూ సమర్థంగా నాయకత్వం వహించాడు. శత్రువుపై చేసిన అనేక దాడులకు ఆయన నాయకత్వం వహించాడు. ఆయన మరణంతో బిహార్-ఝార్ఖండ్ పీడిత జనావళి తమ ముద్దుబిడ్డను కోల్పోయింది. పార్టీ శ్రేణులూ, పిజిఏ బలగాలూ ఎప్పుడూ జీవత్వం ఉట్టిపడే ఒక సహచరుణ్ని కోల్పోయాయి.*

*బిశ్రాంపూర్ అమరులు చిందించిన రక్తాన్ని వృథా కానివ్వబోమని శపథం చేద్దాం. ఈ దోపిడీ వ్యవస్థను కూకటివేళ్లు సహా పెకిలించి వేసే దాకా పోరాటాన్ని కొనసాగించడమే అమరులకు నిజమైన నివాళి.*

## కామ్రేడ్ పద్మ (రజిత)

జూలై 2న కా. పద్మను హత్య చేసిన తర్వాత, ఆమె ఇప్పటి దాకా దాదాపు 15-16 దాడుల్లో నుండి బైట పడిందని స్వయంగా శత్రువే ప్రకటించాడు. ఆమె అంతిమయాత్రలో పాల్గొన్న వేలాది ప్రజలు "పీపుల్స్‌వార్‌కు ప్రజాకర్షణ తగ్గింద"నీ, "పీపుల్స్‌వార్ ప్రజాపునాది క్షీణించింద"నీ అప్పటి దాకా కారుకూతలు కూస్తున్న పాలక వర్గాల, వారి తొత్తులైన పోలీసు అధికార్ల మొఖంపై ఛళ్లున చరిచారు. కా. పద్మ గత 13-14 సంవత్సరాలుగా ఉత్తర తెలంగాణాలో పోలీసు బలగాలకూ, వాళ్ల యజమానులైన భూస్వాములకూ, దళారీ పెట్టుబడిదార్లకూ సింహస్వప్నంగా నిలిచిన వీరయోధ. ఆమె చనిపోయినందుకు రక్తం రుచి మరిగిన పోలీసు అధికారులు మిఠాయిలు పంచుకొని తింటే, తెలంగాణా పల్లెల్లోని చాలా ఇళ్లల్లో ఆరోజు పొయ్యిలోంచి పిల్లి లేవలేదు.



కామ్రేడ్ పద్మ

కా. పద్మ కరీంనగర్ జిల్లాలోని జమ్మికుంట పట్టణంలో ఒక్క మధ్యతరగతి కుటుంబంలో పుట్టింది. డిగ్రీ చదువుతూ ఉండగా జిల్లాలో ఉధృతంగా సాగుతున్న భూస్వామ్య వ్యతిరేక పోరాటాలు ఆమెను ఆకర్షించాయి. ఆమె కాలేజీలో ఆర్ఎస్‌యు నాయకురాలిగా విద్యార్థుల మన్ననలను పొందింది. విద్యార్థి సంఘ ఎన్నికల్లో ఆమె ఆర్ఎస్‌యు ప్రతినిధిగా గెల్చింది. కా. పద్మ తన మరొక స్నేహితురాలితో పాటు ఒకేసారి అజ్ఞాతవాసానికి వెళ్లి దళ సభ్యురాలిగా గెరిల్లా జీవితం ప్రారంభించింది. ఆ తర్వాత కరీంనగర్ జిల్లాలోని హుస్నాబాద్ దళానికి కమాండర్‌గా బాధ్యతలు స్వీకరించింది.

కరీంనగర్ జిల్లాలో పోలీసులు కొనసాగిస్తున్న తెల్ల భీభత్సం మధ్యనే కా. పద్మ ఉద్యమాన్ని బలోపేతం చేసే కర్తవ్యాన్ని తన భుజాలకెత్తుకుంది. ప్రతి రోజూ బూటకపు ఎన్‌కౌంటర్లలో సంఘ సభ్యులనూ, సాధారణ ప్రజలనూ కాల్చెయ్యడం, పార్టీ సానుభూతిపరుల ఇండ్లను కూలగొట్టడం, గెరిల్లాల స్థావరాలను చుట్టుముట్టి గుళ్లవర్షం కురిపించడం వంటి పద్ధతుల్లో పోలీసులు చాలా ఏళ్లుగా వరుసగా నిర్బంధకాండను కొనసాగిస్తూ వస్తున్నారు. కా. పద్మ ఏ మాత్రం చలించకుండా పోలీసులు జరిపిన ఎన్నో దాడుల్ని ధైర్యంగా ఎదుర్కొంది. తన దళానికి సమర్థవంతంగా నాయకత్వం వహించింది. కరీంనగర్ జిల్లా ఉద్యమాన్ని దృఢతరం చేయడంలో కా. పద్మ పాత్ర మర్చిపోలేనిది.

1995లో కా. పద్మను పార్టీ జిల్లా కమిటీ సభ్యురాలిగా ఎన్నుకున్నారు. 2000లో జరిగిన ఉత్తర తెలంగాణా పార్టీ మహాసభ కా. పద్మను స్పెషల్ జోనల్ కమిటీ ప్రత్యామ్నాయ సభ్యురాలిగా ఎన్నుకుంది. ఆ తర్వాత ఆమె పశ్చిమ కరీంనగర్-నిజామాబాద్ సంయుక్త జిల్లా కమిటీ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టింది. ఆమె మరణానికి కొద్ది రోజుల ముందే ముగిసిన ఎస్‌జెడ్‌సి సమావేశంలో ఆమెను ఎస్‌జెడ్‌సిలోకి కో-ఆప్ట్ చేసుకున్నారు. అయితే దురదృష్టవశాత్తు ఆమె ఈ బాధ్యతల్ని స్వీకరించక ముందే, జూలై 2న నేరెళ్ల గ్రామం వద్ద పోలీసులతో పోరాడుతూ నేలరాలింది. ఉత్తర తెలంగాణాలో రాష్ట్ర స్థాయి పార్టీ నాయకత్వంలోకి ఎదిగిన తొలి మహిళ కా. పద్మ.

కా. పద్మ ఎప్పుడూ చిరునవ్వులతో అందరితోనూ ఎంతో కలుపుగోలుగా ఉండేది. సహచర యోధులతోనూ, ప్రజలతోనూ ఎంత సాధారణంగానూ, ఆరోగ్యకరమైన హాస్యంతోనూ మాట్లాడేదో, రాజకీయ విషయాలపై తన అభిప్రాయాల్ని ప్రవేశపెట్టేటప్పుడు అంతే దృఢంగానూ, సీరియస్‌గానూ వ్యవహరించేది. చారిత్రాత్మక 9వ పార్టీ కాంగ్రెస్‌లో ఆమె ఉత్తర తెలంగాణా నుండి ప్రతినిధిగా పాల్గొంది. అందులో పార్టీ రాజకీయ పంథాను పటిష్టం చేసుకోవడంలో భాగంగా జరిగిన చర్చల్లో కా. పద్మ చాలా ఉత్సాహంగా పాల్గొంది. ఆమె ఒక దశాబ్దానికి పైగా కొనసాగిన తన విప్లవ జీవితంలో ఏనాడూ వెనుదిరిగి చూడని పరిణతి చెందిన కమ్యూనిస్టు రాజకీయ నాయకురాలు. ఒకసారి పోలీసులు జరిపిన కాల్పుల్లో చెయ్యికి తూటా తగిలి తీవ్రంగా గాయపడ్డప్పటికీ చివరి క్షణం వరకు చేతిలోంచి తుపాకి వదలకుండా నిలిచిన ఆమె పట్టుదల నుండి ప్రతి ఒక్క కమ్యూనిస్టు నేర్చుకోవాలి. పోలీసులు పెద్ద ఎత్తున చుట్టుముట్టి వెయ్యడంతో ఆమెకు వైద్య సదుపాయం అందడానికి చాలా ఆలస్యమైంది. అప్పటికి ఆమె చెయ్యికి ఇన్‌ఫెక్షన్ సోకింది. ఆ తర్వాత ప్రజల ప్రత్యక్ష సహకారంతో ఆమె వైద్యం చేయించుకోవడానికి వెళ్లింది. చెయ్యిలో ఎముక విరిగి బాగా బలహీనపడ్డప్పటికీ గాయం తగ్గగానే తిరిగి యుద్ధ రంగంలో నిల్చింది – శత్రువును సవాలు చేస్తూ. కా. పద్మను హతమార్చడానికి జిల్లా పోలీసులు చెయ్యని కుట్రంటూ లేదు. అయినా ప్రతిసారీ వాడికి నిరాశే ఎదురయ్యింది. అందుకే ఆమె మరణించినందుకు శత్రువు అంతగా సంబరపడుతున్నాడు.

*(కొరవ 10వ పేజీలో .....)*

# పోలీసుల క్రూరత్వానికి బలైన కామ్రేడ్ జోగ వంజామి అమర్ రహే!

## "జై గుండాధూర్ ఆపరేషన్"లో గుండాధూర్ వారసుడి హత్య

ఉత్తర బస్తర్ డివిజన్‌లో పార్టీ నడిపిన ఎత్తుగడల ఎదురుదాడి క్యాంపెయిన్‌లో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనడం శత్రువుకు నిద్రపట్టకుండా చేసింది. అందుకే పోలీసు బలగాలు తప్పనిసరై ప్రజలకు వ్యతిరేకంగా ఒక భీభత్సకరమైన నిర్బంధ క్యాంపెయిన్ ప్రారంభించాయి. దీనికి "జై గుండాధూర్ ఆపరేషన్" అని నామకరణం చేశాయి, పోలీసులేమో గుండాధూర్ వారసులైనట్టు, ప్రజలేమో గుండాధూర్ శత్రువులైనట్టు. అయితే గుండాధూర్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడి తన ప్రాణాలర్పించాడని పోరాటశీలురైన ప్రజలందరికీ స్పష్టంగానే తెలుసు. ఈ రోజున దండకారణ్యంలో సాగుతున్న పోరాటానికి కూడా లక్ష్యం సామ్రాజ్యవాదాన్నీ, దానితో పాటుగా భూస్వామ్య విధానాన్నీ, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ విధానాన్నీ అంతమొందించడమని పోరాడే ప్రజలకు బాగానే తెలుసు. ఏ ప్రభుత్వమైతే పోలీసులకు వేతనాలిచ్చి వారిని ప్రజలకు వ్యతిరేకంగా మోహరించిందో ఆ ప్రభుత్వం సామ్రాజ్యవాదుల కీలుబొమ్మ అన్న విషయం కూడా ప్రజలకు అర్థమవుతూనే ఉంది. అందుకే పోలీసులకు గుండాధూర్ పేరును ఉచ్చరించే నైతికహక్కు కూడా లేదు.



కామ్రేడ్ జోగ వంజామి భార్య కా. సుఖిడి బాయి, తన భర్త హంతకులను శిక్షించాలని డిమాండ్ చేస్తూ...

ఇక పోలీసులు నడిపిన ఈ హింసాత్మక క్యాంపెయిన్‌లో భాగంగా పోలీసులు ఉత్తర బస్తర్ డివిజన్‌లోని నారాయణపూర్ దగ్గరలో గల ఝూర గ్రామానికి చెందిన జోగ వంజామి అనే రైతును అమానుషంగా చంపారు. కా. జోగ ఒక సామాన్య ఆదివాసీ రైతు, విప్లవాన్ని ప్రేమించే మనసున్న మనిషి. అతను ప్రజా సంఘంలో క్రియాశీల కార్యకర్త. అతనికి భార్య, ఆరుగురు పిల్లలున్నారు. బడ్‌గాం ఘటనలో పోలీసులు జరిపిన కాల్పుల్లో అతని కాలికి తూటా తగలడంతో గాయపడి పోలీసుల చేత చిక్కాడు. పోలీసులు అతన్ని పట్టుకొని విపరీతంగా హింసించి కాల్చి చంపారు. ఆ తర్వాత "నక్సలైట్లతో జరిగిన ఎన్‌కౌంటర్లో నక్సలైట్ కమాండర్ రామధర్ చనిపోయాడ"ని ప్రచారం చేశారు.

గమనించాల్సిన విషయం ఏమిటంటే పోలీసులు తమ "జై గుండాధూర్ ఆపరేషన్"లో భాగంగా ఏ ఝూర గ్రామానికి చెందిన రైతునైతే హత్య చేశారో, సరిగ్గా అదే ఝూర గ్రామం 1910లో అమరుడు గుండాధూర్ నాయకత్వాన బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా సాగిన భూంకాల్ మహా సంగ్రామంలో గొప్ప పాత్రను పోషించింది. ఈ గ్రామానికి చెందిన అనేక మంది రైతులను బ్రిటిష్ వాళ్లు హత్య చేశారు. ఈ గ్రామ ప్రజలు బ్రిటిష్ సైన్యాలను వీరోచితంగా ప్రతిఘటించిన చరిత్ర గలవారు. ఈనాడు అదే గ్రామ ప్రజలు మరో వీరుణ్ని పోరాటానికి అర్పించారు.

ఈ దారుణ హత్యకు వ్యతిరేకంగా ప్రజాగ్రహం కట్టలు తెంచుకుంది. ఈ హత్యకు ముఖ్య కారకుడైన నారాయణపూర్ థానేదార్ అమృత్ కెర్కెట్టకు వ్యతిరేకంగా గొప్ప ప్రజా ఉద్యమం మొదలైంది. అమృత్ కెర్కెట్ట టెర్రర్‌కు మారుపేరుగా నిలిచాడు. వీడు ఝూర, మైమగవాడి, వెడమకోట, దుర్వేడ మొదలైన గ్రామాలలో చాలామందిని అరెస్టు చేశాడు. జోగ వంజామి హత్యకు కూడా వీడే సూత్రధారి. వీడి అత్యాచారాలకు వ్యతిరేకంగా నారాయణపూర్ ప్రాంతంలోని అన్ని వర్గాల ప్రజలు ఐక్యమయ్యారు. జూన్ 17న సంయుక్త కార్యాచరణ కమిటీ నాయకత్వంలో ప్రజలు నారాయణపూర్ పట్టణంలో ఒక పెద్ద ర్యాలీని నిర్వహించి పిఎకూ, కలెక్టర్‌కూ వినతిపత్రాలిచ్చారు. ప్రజలు అమృత్‌ను కఠినంగా శిక్షించాలనీ, జోగ వంజామి హత్యపై న్యాయవిచారణ జరిపించాలనీ డిమాండ్ చేశారు. ఈ ర్యాలీలో వేలాది మంది ప్రజలు ఒక పోలీసు అధికారికి వ్యతిరేకంగా నిర్భయంగా నినాదాలిచ్చుకుంటూ పాల్గొనడం ఒక విశేషం. కొద్ది రోజుల తర్వాత ప్రజాగ్రహానికి భయపడి ప్రభుత్వం కెర్కెట్టను అక్కడి నుండి ట్రాన్స్‌ఫర్ చేసి చేతులు దులుపుకుంది. ప్రభుత్వం ఒక హంతకుడిని శిక్షించకుండా రక్షిస్తూ ట్రాన్స్‌ఫర్ చేసినప్పటికీ, ప్రజలు ఏనాటికైనా ఈ నీచుణ్ని ప్రజాకోర్టులో శిక్షించక మానరు.

గుండాధూర్ వారసుడు కా. జోగ వంజామికి వినమ్రంగా జోహార్లు చెబుదాం. ఈ నేలపై నుండి సామ్రాజ్యవాదాన్ని నామరూపాలు లేకుండా నిర్మూలించి ఈ అమరుడి కలలను నిజం చేద్దాం. ❐




హంతక థానేదార్ అమృత్ కెర్కెట్ట దౌర్జన్యాలకు వ్యతిరేకంగా నారాయణపూర్‌లో ప్రజా ప్రదర్శన

(..... 9వ పేజీ తరువాయి)

కా. పద్మ మరణంతో ఉత్తర తెలంగాణా ఉద్యమం ఒక సమర్థురాలైన నేతను కోల్పోయింది. కా. పద్మ మరణం ప్రత్యేకించి విప్లవ మహిళా ఉద్యమానికి ఎంతో లోటు. ఆమె మరణవార్త వినగానే ఆమె మృతదేహాన్ని చూడడానికీ, చివరి వీడ్కోలు చెప్పడానికి వేలాది మహిళలూ, పురుషులూ అలల వలె కదిలివచ్చారు. నిజానికి శత్రువు కా. పద్మను హతమార్చి కూడా ఓడిపోయాడు. ఎందుకంటే ఆమె అంతిమయాత్రలో పాల్గొనివ్వకుండా లాఠీలతోనూ, తుపాకులతోనూ వాడు ఎంత బెదిరించినా ప్రజలు బెదరలేదు. నిజమైన ప్రజా సేవకులకు మరణం లేదనీ, వాళ్లు ప్రజల హృదయాల్లో ఎప్పటికీ అమరులేనని ప్రజలు మరోసారి చాటిచెప్పారు.

మన ప్రియతమ నేత కా. పద్మకూ, ఆమెతో పాటు అదే ఎన్‌కౌంటర్లో మరణించిన కా. విక్రం, కా. మానస, కా. సాగర్‌లకూ జోహార్లు తెలుపుదాం. వాళ్ల ఆశయాలు సాధించేదాకా విశ్రమించబోమని శపథం చేద్దాం. ❐

జూలై 28

# "త్యాగాల బాటలో నడచి అమరుల ఆశయాలను పరిపూర్తి చేద్దాం!"

## "నూతన ప్రజాస్వామ్య భారతాన్ని నిర్మిద్దాం"

### అమరుల వారంలో దండకారణ్యమంతటా జరిగిన సభలు-ర్యాలీలలో మారుమోగిన నినాదం

చారిత్రాత్మక నక్సల్బరీ, శ్రీకాకుళ పోరాటాలు తాత్కాలికంగా వెనుకంజ వేసిన తర్వాత, విప్లవకర ప్రజాయుద్ధం నేడు మరొక్కసారి దేశ రాజకీయ చిత్రపటంలో శక్తివంతంగా చోటు చేసుకుంది. చారిత్రాత్మక 9వ కాంగ్రెస్ తర్వాత నిర్ణయించుకున్న నూతన కర్తవ్యాల వెలుగులో పార్టీ శ్రేణులూ, ప్రజారాసులూ దృఢంగా ముందడుగు వేసాయి. "దేశవ్యాప్తంగా ప్రజాయుద్ధాన్ని తీవ్రతరం చేద్దాం" అన్న కాంగ్రెస్ నినాదం నేడు సర్వత్రా మారుమోగుతోంది. భారత నూతన ప్రజాస్వామ్య విప్లవాన్ని పూర్తి చేసి మన దేశాన్ని సామ్రాజ్యవాదం, భూస్వామ్య విధానం, దళారీ పెట్టుబడి బంధనాల నుండి విముక్తం చేసే లక్ష్యంతో ఎందరో వీరులు తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించారు. గత సంవత్సరం జూలై 28 తర్వాత నుండి ఈ జూలై 28 వరకు మన పార్టీ నాయకత్వంలో కొనసాగుతున్న విప్లవోద్యమంలో వందలాది మంది కామ్రేడ్స్ అమరులైనారు. వీరిలో పార్టీ రాష్ట్ర కమిటీ నాయకుల నుండి సానుభూతిపరులు, సాధారణ ప్రజల వరకూ ఉన్నారు.

ఈ సంవత్సరం కూడా దండకారణ్యంలో క్రూర శత్రు నిర్బంధం నడుమనే పార్టీ శ్రేణులూ, విప్లవ ప్రజానీకమూ అమరుల వారం సందర్భంగా అనేక సభలూ, ర్యాలీలూ నిర్వహించి అమరులందరికీ ఘనంగా నివాళులర్పించారు. ఆంధ్ర, ఉత్తర తెలంగాణా, ఏఓబి, బీహార్-ఝార్ఖండ్, పశ్చిమ బెంగాల్ మొదలైన రాష్ట్రాల్లో పాశవిక శత్రు బలగాలను వీరోచితంగా ఎదిరిస్తూ ప్రాణాలర్పించిన అమరులందరినీ ప్రజలు పేరుపేరునా స్మరించుకున్నారు. అసంపూర్ణంగా మిగిలిన వారి ఆశయాలను పూర్తి చేస్తామని శపథం చేశారు.

అమరుల వారం సందర్భంగా జరిగిన సభలు-ర్యాలీల రిపోర్టులు, వివిధ డివిజన్ల నుండి మాకు చేరినవి సంక్షిప్తంగా దిగువన ప్రచురిస్తున్నాం. దక్షిణ బస్తర్ డివిజన్ నుండి రిపోర్టులు రానందున ప్రచురించలేక పోతున్నందుకు విచారిస్తున్నాం.

### మాడ్ డివిజన్

గత సంవత్సర కాలంలో దండకారణ్యంలో అమరులైన కా. సుఖ్‌దేవ్ (ఎస్‌జెడ్‌సి సభ్యుడు/ఉత్తర కమాండ్ కమాండ్-ఇన్-చీఫ్), కా. రణదేవ్ (దక్షిణ బస్తర్ డివిసిఎం), కా. విజయ్ (కమాండర్– ఏఓబి), కా. మహేందర్ (మద్దేడ్ ఏసిఎం – పశ్చిమ బస్తర్ డివిజన్), కా. మల్లేష్ (పిఎల్-2 సభ్యుడు) సహా ఇతర రాష్ట్రాలలో అమరులైన కా. కృష్ణ (ఏపిఎస్‌సిఎం), కా. పద్మ (ఎన్‌టిఎస్‌జెడ్‌సిఎం), కా. దధీచి రాయ్ (బీహార్-ఝార్ఖండ్ ఎస్‌సిఎం) మొదలైన కామ్రేడ్స్‌కు శ్రద్ధాంజలి ఘటిస్తూ అమరుల వారం జరుపుకోవాలని మాడ్ డివిసి నిర్ణయించింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని డివిసి తరఫున ఒక కరపత్రం వేసారు. అలాగే పోస్టర్లతోనూ, బ్యానర్లతోనూ విస్తృతంగా ప్రచార క్యాంపెయిన్‌ను నిర్వహించారు. 'భూంకాల్' అమరుల స్మృతిలో ఒక స్తూపాన్ని కట్టాలనీ, పోలీసులు పోయిన సంవత్సరం కూలగొట్టిన స్తూపాలన్నింటినీ తిరిగి కట్టాలనీ, నిర్ణయించుకున్న గ్రామాల్లో కొత్తగా స్తూపాలు నిర్మించాలనీ డివిజన్‌లోని పార్టీ కమిటీలు నిర్ణయించాయి.

కోహ్కమెట్ట ఏరియాలోని మొహంది గ్రామంలో ఒక పెద్ద సభ జరిగింది. ఇక్కడ, పోలీసులు కూలగొట్టిన అమరుడు కా. శ్రీకాంత్ స్మారకస్తూపాన్ని ప్రజలు తిరిగి నిర్మించారు. కోహ్కమెట్ట, పరాల్‌కోట ఏరియాలలోని 60 గ్రామాల నుండి దాదాపు 4,000 మంది స్త్రీపురుషులు ఈ సభలో పాల్గొన్నారు. ఈ సభ నిర్వహణ కోసం ప్రజా సంఘాలకు చెందిన అనేక డజన్ల కార్యకర్తలకు వలంటీర్లుగా పని చేయడానికి ముందుగానే శిక్షణనిచ్చారు. పెద్ద పెట్టున నినాదాలు చేస్తూ ప్రజలంతా ఊరేగింపుగా కా. శ్రీకాంత్ స్తూపం వద్దకు చేరుకోగా కెఎఎంఎస్ నాయకురాలు కా. డాలీ పార్టీ జెండానెగురేసి కార్యక్రమాన్ని ప్రారంభించింది. పిజిఏ పోరాటయోధులు గాలిలోకి తుపాకులు పేల్చి అమరవీరులకు గౌరవవందనం సమర్పించారు. ఆ తర్వాత అమరులను తల్చుకుంటూ రెండు నిమిషాలు మౌనం పాటించారు.

సభనుద్దేశించి ప్రసంగిస్తూ ఏసి కార్యదర్శి కా. రాధ ఈ మధ్యన అమరులైన కామ్రేడ్స్ జీవితచరిత్రలను పరిచయం చేసి అమరుల ఆశయాలను పూర్తి చేయడం మన బాధ్యత అని గుర్తు చేసింది. ఆ తర్వాత సిఎన్ఎం (చేతన నాట్య మంచ్) సభ్యుడు కా. నవీన్ అమరవీరులందరికీ నివాళులర్పిస్తూ 'లాల్ సలాం' పాట పాడాడు. కా. వాణి మాడ్ డివిజన్ అమరులను గుర్తు చేస్తూ వాళ్ల ఆశయాలను పూర్తి చేసేదాకా విశ్రమించబోరాదని ప్రజలకు పిలుపునిచ్చాడు. ఆఖరున పార్టీ డివిజనల్ కమిటీ కార్యదర్శి కా. పాండు ప్రసంగించాడు. ఆయన తన ప్రసంగంలో పార్టీ నిర్మాత కా. చారు మజుందార్ నుండి కా. సుఖ్‌దేవ్, కా. పద్మల దాకా పోరాటంలో ప్రాణాలర్పించిన యోధులందరి త్యాగాలనూ కొనియాడాడు. పీడిత ప్రజల విముక్తి కోసం కమ్యూనిస్టుగా మారి అమరులైన కామ్రేడ్స్ జీవితం ధన్యమని పేర్కొన్నాడు. ఆయన ఇంకా చారిత్రాత్మక భూంకాల్ అమర వీరుడు గుండాధూర్ సహా బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడి అమరులైన గేంద్‌సింగ్, తదితర వీరులందరినీ ఈ సందర్భంగా ప్రజలకు గుర్తు



ఇంద్రావతి ఏరియాలో కా. సుఖ్‌దేవ్ స్మృతిలో నిర్మించిన స్తూపం ఆవిష్కరణ

చేశాడు. మాడ్ డివిజన్ ప్రజలకు సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడిన వీరోచిత వారసత్వసంపద ఉందని గుర్తు చేశాడు. ఇంకా "వేలాది వీరుల త్యాగాల ఫలితంగానే మన పార్టీ ఈ రోజున దాదాపు 12 రాష్ట్రాలకు విస్తరించగల్గింది. ప్రజాయుద్ధాన్ని పురోగమింపజేసే దిశగా గుణాత్మకమైన గెంతు వేస్తూ మన పార్టీ డిసెంబర్ 2, 2000న, మన ప్రియతమ నేతలు కా. శ్యాం, కా. మహేశ్, కా. మురళిల ప్రథమ వర్ధంతి నాడు ప్రజా గెరిల్లా సైన్యాన్ని (పిజిఏ) స్థాపించింది. ఇప్పుడు మనం పిజిఏను దృఢతరం చేసుకోవాల్సి ఉంది. దాన్ని ప్రజా విముక్తి సైన్యం (పిఎల్ఏ)గా అభివృద్ధి పర్చాల్సిన అవసరం ఉంది" అని అన్నాడు.

సభకు అధ్యక్షత వహించిన కా. నీల ఇతర అమరులతో పాటుగా భూంకాల్ సంగ్రామంలో అసువులు బాసిన చోటెడోంగర్ కోర్రాం, వెడమ, దుర్వలను కూడా గుర్తు చేసింది. ఝూర గ్రామస్తుడైన కా. జోగ వంజామి హత్యను పోలీసుల పిరికిపంద చర్య అని కా. నీల అభివర్ణించింది. 'భూంకాల్' వారసత్వాన్ని సమున్నతంగా కొనసాగిస్తూ కా. జోగ వంజామి అమరుడయ్యాడంటూ ఆమె ఆ అమరుడి త్యాగాన్ని కొనియాడింది.

జూలై 30న కోహ్కామెట్ట గ్రామంలో జరిగిన స్మారక సభలో 20 గ్రామాల నుండి దాదాపు 400 మంది స్త్రీపురుషులు పాల్గొన్నారు. ఊరేగింపు సభాస్థలానికి చేరుకోగానే కా. నవీన్ జెండా ఎగరేసాడు. ఆ తర్వాత కా. దినేశ్, కా. కౌసల్యాలు సభలో ప్రసంగించారు. వారు మాడ్ డివిజన్ అమరులనూ, భూంకాల్ అమరులనూ గుర్తు చేశారు. కా. పాండు మన పార్టీ నాయకత్వంలో కొనసాగుతున్న విప్లవోద్యమ అభివృద్ధిక్రమాన్ని గురించి ప్రజలకు వివరించి చెబుతూ, ఇది అమరుల వీరోచిత త్యాగాల ఫలితమేనని పేర్కొన్నాడు.

ఇర్కుబట్టి, కుస్తుర్‌మెట్ట గ్రామాల్లో జరిగిన స్మారకసభల్లో ప్రజలు అమరులకు ఘనంగా నివాళులర్పించారు. పోరాట వారసత్వాన్ని సమున్నతంగా నిలబెడ్తూ పీడిత ప్రజల రాజ్యాన్ని సాధిస్తామని ప్రజలు శపథం చేశారు. ఆగస్టు 3న నేల్‌నార్ గ్రామంలో అమరుల స్మారక సభ జరిగింది. ఇక్కడ 'భూంకాల్' అమరుల స్మృతిలో స్తూపాన్ని కట్టారు. చేతుల్లో ఎర్రజెండాలు పట్టుకొన్న ప్రజల ఊరేగింపు గ్రామంలోని ఒక మర్రిచెట్టు దగ్గరకు చేరగానే అందరి కళ్లూ చెమ్మగిల్లాయి. ఈనాడు ఈ మర్రిచెట్టున్న స్థలంలోనే 1910 భూంకాల్ తిరుగుబాటు సమయంలో బ్రిటిష్ సైన్యాల హత్యాకాండ ఫలితంగా ప్రజల రక్తం ఏరులుగా పారింది. బ్రిటిష్ మూకలు ఇక్కడే అనేక మందిని దారుణంగా హత్య చేశారు. ఆ తర్వాత కా. సుక్కు ఎర్రజెండా ఎగురవేసి సభను ప్రారంభించాడు. అమరవీరులకు నివాళిగా పిజిఏ కమాండర్ గాలిలోకి తుపాకీ పేల్చిన తర్వాత సభ రెండు నిమిషాలు మౌనం పాటించి అమరులకు శ్రద్ధాంజలి ఘటించింది. కా. నీల సభకు అధ్యక్షత వహించింది. కా. వినోద్, కా. పాండులు సభలో ప్రసంగించారు.

జూలై 28కి ముందుగానే కోహ్కామెట్ట ఏరియాలో విస్తృతమైన ప్రచార క్యాంపెయిన్‌ను నిర్వహించారు. ఈ క్యాంపెయిన్‌లో మొత్తం 118 మంది స్త్రీపురుష కార్యకర్తలు పాల్గొన్నారు. స్త్రీలూ, పురుషులూ నాలుగేసి జట్లుగా విడిపోయి ఊరూరా అమరుల త్యాగాల గురించి ప్రచారం చేశారు. సిఎన్ఎం టీం కూడా ప్రచార క్యాంపెయిన్‌లో పాల్గొంది.

ఇంద్రావతి ఏరియాలో అమరుల వారం సందర్భంగా మొత్తం 8 చోట్ల స్మారక సభలు జరిగాయి. వీటిలో మొత్తం 7,000 మంది ప్రజలు పాల్గొని అమరులకు నివాళులర్పించారు. అమరుల వారానికి ముందుగా



ఇంద్రావతి ఏరియాలోని ధర్మ గ్రామంలో అమరుల స్తూపం ఎదుట జరిగిన సభలో ప్రజలు

డివికెఎంఎస్ రేంజ్ కమిటీల నాయకత్వంలో ప్రచారం నిర్వహించారు.

జాట్లూర్ ఎల్జీఎస్ నేతృత్వంలో జాట్లూర్ గ్రామంలో అమరుల స్మారకసభ జరిగింది. 16 గ్రామాల నుండి 650 మంది ప్రజలు పాల్గొనగా కా. కొల్లె జండా ఎగురవేసింది. కా.ఐతు ఎర్రబట్టతో నిర్మించిన స్థూపాన్ని ఆవిష్కరించాడు. జులై 30న బట్‌వేడలో జరిగిన సభలో సుమారు 10 గ్రామాల ప్రజలు 600 మంది పాల్గొని అమరులకు నివాళులు అర్పించారు. ఆగస్టు 1న డుంగ గ్రామంలో జరిగిన సభకు 13 గ్రామాల నుండి 1400 మంది ఊరేగింపుగా రాగా అమరుడు సుఖదేవ్ స్తూపాన్ని (20 అడుగులది) కా.వూరాల్ ఆవిష్కరించాడు. కా.మంగు జండా నెగురవేసింది. ధర్మ గ్రామంలో అమరుడు కా.మహేందర్ సహా మోటు అమరుల స్మృతిలో నిర్మించిన స్మారకస్తూపం ఆవిష్కరణ సందర్భంగా జరిగిన సభలో దాదాపు 2000 మంది ప్రజలు హాజరై అమరులందరికీ జోహార్లర్పించారు. కా.పగ్ని జండా నెగురవేసింది. కా.జాడు స్థూపాన్ని ఆవిష్కరించాడు. సభలన్నిటా 2 నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సభలన్నిటా దళం కామ్రేడ్స్ కూడ పాల్గొనగా, కోడెపార (7 గ్రామాల నుండి 450 మంది), గోండిమెట్ట (6 గ్రామాల నుండి 430 మంది), తాకిలోడ్ (5 గ్రామాల నుండి 750 మంది), పొచ్చవేడ (8 గ్రామాల నుండి 270 మంది) లలో డివికెఎంఎస్ రేంజి కమిటీ నాయకత్వాన ప్రజలు సభలు జరుపుకున్నారు. అమరులకు నివాళులర్పించారు. సిఎన్‌యం కార్యక్రమాలతో సభలు ముగిసాయి.

పరాల్‌కోట దళ ఏరియాలో కుత్తుల్, బాలెవాడ, జటవాయి గ్రామాలలో జరిగిన సభలలో అమరవీరులకు పేరుపేరునా శ్రద్ధాంజలి ఘటించారు. పరాల్‌కోట పోరాట సాంప్రదాయాన్ని, నేడు పీపుల్స్‌వార్ నేతృత్వంలో కొనసాగిస్తున్న ఈ ప్రాంత ప్రజలు అమరుల లక్ష్యాన్ని సాధించడం కోసం తుదకంటా పోరాడతామని శపథం బూనారు.

## ఉత్తర బస్తర్ డివిజన్

డివిజనల్ కమిటీ ఇచ్చిన పిలుపు ననుసరించి ఏరియాలో 'అమరుల వారం' జరుపుకొని దేశంలోన, ప్రధానంగా దండకారణ్యంలోని విప్లవోద్యమాన్ని రక్షించుకుంటూ ముందుకు తీసుకుపోవడంలో అమరుడైన పిజిఏ యోధ, గతంలో తమ డివిజన్ ఉద్యమానికి నాయకత్వం వహించిన కా.సుఖదేవ్ మరియు విప్లవోద్యమానికి సజీవత నిస్తూ ప్రజల్లో ఒకడైన జార గ్రామస్థుడు కా.జోగ వంజామికి ఇతర అమరవీరులకు వినమ్రంగా జోహార్లర్పించారు.

కొండగాం, డౌలా ఎల్‌జియస్ ల ఏరియాల్లో 96 గ్రామాల నుండి 8

వేల మంది స్త్రీలు-పురుషులు పాల్గొనగా 10 చోట్ల సంస్మరణ సభలు జరిగాయి. అలాగే 66 గ్రామాలవారి సహకారంతో 18 చోట్ల 5 నుండి 13 అడుగుల ఎత్తుగల అమరుల స్థూపాలు నిర్మితమయ్యాయి.

కొండగాం ఏరియా 'ఉసిరి'లో జరిగిన సభకు 35గ్రామాల నుండి 3,500 మంది రాగా(విల్లు-బాణాలు, కత్తులు మొ.వి ధరించి)కా.సుఖదేవ్ సంస్మరణ సభ జరిగింది. రెండు ఎల్‌జియస్‌లు, ఒకటవ ప్లాటూన్, స్థానిక సిఎన్‌యం సభ్యులంతా కలసి 46 మంది కూడ పాల్గొన్న ఇక్కడ కా.లలిత జండా ఎగురవేసింది. అమరులందరికీ 2 నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. సభ ప్రారంభమై నినాదాలు మార్మోగుతుండగా కామ్రేడ్ లలిత, ఎసియం, కా.సన్నాయిలు ప్రసంగించారు. ఇన్నర్ గ్రామంలోని సభకు 7 గ్రామాల నుండి 700 మంది ప్రజలు రాగా జండా నెగురవేసి, ప్రజా మిలీషియా 4 బర్మార్‌లతో ఫైర్ చేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఒక నిమిషం మౌనం పాటించారు. తర్వాత మహిళా కామ్రేడ్స్ ఇద్దరు ప్రసంగించారు. చివరగా సాంస్కృతిక కార్యక్రమాలు ఉత్సాహభరితంగా సాగాయి. జులై 28న బేన్నూర్ రేంజి అద్దెంపాడు గ్రామంలో 300 వందల మహిళలతోబాటు 500 మంది ప్రజలు రాగా 8 అడుగుల స్థూపావిష్కరణ తర్వాత సభ జరిగింది. డివికెయంయస్ అధ్యక్షుడు జండా నెగురవేయగా 2 ని.లు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. పిమ్మట ఉపన్యసించాడు. గోట బేనూర్ గ్రామంలో అమరుల దినం పాటించారు. 5 గ్రామాల నుండి 250 మంది రాగా 10 అడుగుల సుఖదేవ్ స్థూపాన్ని ఆవిష్కరించి జండా నెగురవేసిన పిమ్మట డివికెయంయస్ అధ్యక్షుడు ఉపన్యసించాడు. కడియనార్‌లో 5 గ్రామాల నుండి 600మంది హాజరుకాగా జరిగిన సభలో డివికెయంయస్ అధ్యక్షుడు ప్రసంగించాడు. అంతకముందుగా 14 అడుగుల అమరుల స్మారక స్థూపాన్ని ఆవిష్కరించారు. కన్వినార్‌లో జరిగిన సభకు 20 గ్రామాల నుండి 1500 మంది స్త్రీ పురుషులు పాల్గొనగా జండా నెగురవేసి 15 అడుగుల స్థూపాన్ని ఆవిష్కరించి శ్రద్ధాంజలి ఘటించారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు. నినాదాలు, పాటలు, ఎర్రజండాల మధ్య డివికోయంయస్ అధ్యక్షుడు ప్రసంగిస్తూ అసంపూర్తిగా మిగిలిన అమరుల ఆశయాన్ని నెరవేర్చడంలో పోరాటాన్ని ముందుకు తీసుకుపోదామని ప్రసంగించాడు.

డౌలా రేంజి కుయినార్ లోని అమరుల సంస్మరణ సభలో 6 గ్రామాలవారు 150 మంది పాల్గొన్నారు. టేకూర్‌లో జరుపుకున్న సభలో 5 గ్రామాల ప్రజలు శ్రద్ధాంజలి ఘటించారు. కరిమే లో జరిగిన సభకు 5 గ్రామాల నుంజి 100 మంది, మూందిమెట్ట సభకు 3 గ్రామాల నుండి 200 మంది రాగా అమరులకు నివాళులర్పించి పోరాటాన్ని కొనసాగిస్తామని శపథం బూనారు.

కేశ్కల్ ఎల్‌జియస్ ఏరియా అంతాగఢ్ తహసీల్ కిస్‌కోడో రేంజిలో జులై 28 అమరుల దినం సందర్భంగా వారంపాటు సాగిన 7 సభల్లో మొత్తంగా 3,500 మంది ప్రజలు పాలుపంచుకున్నారు. కొన్నిచోట్ల గతంలోని స్మారక స్థూపాలే ఉండగా, కా.సుఖదేవ్ సంస్మరణలో 3 చోట్ల కొత్త స్థూపాలు నిర్మించారు. వీటిలో ఒకటి 30 అడుగులది కాగా రెండు 10 అడుగుల ఎత్తు కల్గినవి. అమరవీరుల్ని స్మరించుకుంటూ, వారు కన్న కలల్ని నిజం చేస్తామని, పీడిత ప్రజల రాజ్యం సాధిస్తామని మరోసారి శపథం బూనారు.

రేంజి కమిటీ వారి నాయకత్వంలో ఆరు చోట్ల సభలు జరిగాయి. ప్రతి సభలో 3 నుండి 10 గ్రామాల ప్రజలు రావడంతో మొత్తం 1500 మంది పాల్గొన్నారు. దళం ఆధ్వర్యంలో సాగిన సంస్మరణ సభకు 40 నుండి 45 గ్రామాల ప్రజలు 2 వేల మంది వచ్చారు. దళ కమాండర్ కా.సుభాష్ జండా ఎగుంవేసిన పిమ్మట 5 తూటాలు ఫైర్ చేసి రెండు ని.లు మౌనంతో అమరులకు నివాళులు అర్పించారు. కా.దసురు అమరుడు సుఖదేవ్ స్థూపాన్ని ఆవిష్కరించి ప్రసంగించాడు. 'అమరుల వారం' ఆఖరి రోజు ఈ రోజు. దోపిడీ వర్గాల నుండి పీడిత ప్రజలను విముక్తిగావించి ప్రజా రాజ్యాన్ని స్థాపించే పోరులో అనేక మంది కామ్రేడ్స్ ప్రాణాలు ధారపోసారు. ఆ అమరుల ఆశయాన్ని కొనసాగించి లక్ష్యాన్ని సాధించడమే వారికి అర్పించే నిజమైన శ్రద్ధాంజలి అన్నాడు. ఆ తర్వాత కా.సంతు సభానిర్వహణ సాగించగా కామ్రేడ్స్ సుభాష్, జయమతి, దసురు, ప్రేమ తదితరులు మాట్లాడారు. చేతనా నాట్య మంచ్ వారి పాటలు, కార్యక్రమాలతో సభ పోరాటేత్తేజాన్ని సంతరించుకొని ముగిసింది.

జులై 28 కార్యక్రమాల ప్రచారాన్ని 10-12 గ్రామాలకు ఓ బ్యాచ్ చొప్పున 10-15 మందితో 4 బ్యాచ్‌లు జోరుగా ప్రచారం సాగించాయి. 400 పోస్టర్లు వివిధచోట్లలో వేసి ప్రజల్లోకి తీసుకువెళ్ళి 'అమరుల వారం'పాటించమని విస్తృత ప్రచారం చేశారు.

## పశ్చిమ బస్తర్ డివిజన్

డివిజనల్ కమిటి పిలుపు ననుసరించి జులై 28-ఆగస్టు 3 మధ్య మద్దేడ్ ఎసి ప్రాంతంలో 'అమరుల వారం' పాటించడం జరిగింది. అమరుల త్యాగాలను ఎత్తిపడుతూ వారి ఆదర్శాలు, లక్ష్యం లను విస్తృత ప్రచారం చేశారు. మొత్తంగా 8 పెద్ద సభలు నిర్వహించగల్గారు. 500 బ్యానర్లతో రెడీమేడ్ స్థూపాల్ని ఎర్రబట్టతో అలంకరించి అమరుల త్యాగాల్ని స్ఫురింపజేసారు. నాలుగు సభలు దళం కామ్రేడ్స్, మరో 4 సభలు కెఎయంయస్-డివికెయంయస్ వారు నిర్వహించగా మొత్తం వాటిలో 2,500 మంది ప్రజలు పాల్గొన్నారు.

భైరంఘడ్ ఏరియా మిర్తూర్ ఎల్‌జియస్ పరిధిలో బాగా ప్రచారం జరిగింది. కెఎయంయస్, డివికెయంయస్ వారు బ్యాచ్‌లుగా ప్రచారం సాగించారు. ప్రతి 4,5 గ్రామాల పరిధిలో 'అమరుల దినం' పాటిస్తూ సభలు జరుపుకున్నారు. మహిళలు, పురుషులు అంతా కదిలారు.

ఫూల్‌గట్టలో జరిగిన సభలో 900మంది పాల్గొన్నారు. కెఎయంయస్ అధ్యక్షురాలు కా.యసోనాతి, డివికెయంయస్ కామ్రేడ్ అమరుల త్యాగాలు, పోరాట అవసరాన్ని వివరించారు. పిట్టెపాడు సభకు 1200 మంది వచ్చి జయప్రదం గావించారు. పాతుడుపార (భైరంఘడ్‌కి 8 కి.మీ.దూరం) కూడలిలో ఎర్రబట్టతో రెడీమేడ్ స్థూపాన్ని, మాట్వాడ నందిలి బజార్‌లో



గంగలూరు రేంజ్‌లోని ఒక గ్రామంలో అమరులకు శ్రద్ధాంజలి

## అమరుల స్తూపాన్ని కూలగొడితే ....

*ఏమవుతుంది? ఏమవుతుందో గడ్చిరోలి పోలీసులకు ఆగస్టు 5న తెలిసివచ్చింది. ఏటపల్లి ఏరియాలో పిజిఏ గెరిల్లాలు పథకం ప్రకారం అమరుల స్తూపాన్నే పోలీసుల పాలిటి యమపాశంగా ప్రయోగించారు. గడ్చిరోలి జిల్లా పోలీసులు అమరుల వారం సందర్భంగా ప్రతి ఏటి లాగానే ఈ ఏడు కూడా నిర్బంధ క్యాంపెయిన్‌ను ఉధృతంగా కొనసాగించారు. ప్రజలను అమరవీరులకు జోహార్లు అర్పించనివ్వకుండా చేయడానికి అన్ని విధాలా ప్రయత్నించారు. అమరుల స్తూపాలను కూలగొట్టి వారి జ్ఞాపకాలను సైతం ప్రజల హృదయాల్లోంచి నిర్మూలించి వారిని విప్లవ లక్ష్యం వైపు పురోగమించకుండా చేయాలని వాళ్లు విఫల ప్రయత్నం చేస్తున్నారు. అయితే ప్రజలు పోలీసుల కళ్లుగప్పి వీలైన చోట్ల, తమ తమ పద్ధతుల్లో సభలు జరుపుకున్నారు. ఇక పిజిఏ బేస్ ఫోర్స్ సైనికులు అమరుల స్తూపాల్ని కూల్చడానికి వచ్చే పోలీసులకు ఎలాగైనా తగిన బుద్ధి చెప్పాలని నిర్ణయించుకున్నారు. ఏటపల్లి తాలూకాలోని జంబియగట్ట పోలీసు చౌకికి కేవలం కిలోమీటరు దూరంలో రోడ్డు పక్కనే కర్రలతో తయారు చేసిన స్తూపాన్ని నిలబెట్టారు. పోలీసులకు ఈ వార్త అందగానే హుటాహుటిన జీపులో బయలు దేరారు. స్తూపాన్ని కూలగొట్టాలనే ఏకైక లక్ష్యంతో వచ్చిన పోలీసులు పొగరుగా జీపుతోనే స్తూపాన్ని కూలగొట్టాలని ప్రయత్నించారు. జీపు స్తూపాన్ని గుద్దుకోగానే స్తూపం పక్కనే అమర్చిన బాంబు భయంకరమైన శబ్దంతో పేలిపోయింది. పేలుడులో పోలీసుల జీపు ధ్వంసం కాగా ఒక పోలీసు తీవ్రంగా గాయపడ్డాడు. అయితే ఈ ఘటనకు సంబంధించి మరిన్ని వివరాలు పత్రికల వాళ్లకు చెప్పడానికి పోలీసు అధికార్లు నిరాకరించారు. దీనితో వాళ్లకు చావు తప్పి కన్ను లొట్టపోయినంత పనైంది. ఈ చర్యతో ప్రజల్లో చాలా ఉత్సాహం నెలకొనగా, పోలీసులు మాత్రం ప్రజావీరుల స్తూపాలను కూలగొట్టే తమ దుశ్చర్యలను తాత్కాలికంగా ఆపుకున్నారు.*

మరో స్థూపాన్ని పెట్టారు. వంద పోస్టర్లు, 15 బ్యానర్లతో ప్రచారం ఉధృతంగా సాగింది. పొమ్రాలు సభకు 827 మంది రాగా, మరో మీటింగ్‌కు 1300 మంది మొత్తంగా 6,287 మంది ప్రజలు 'అమరుల దినం' సభల్లో పాల్గొన్నారు.

గంగలూర్ ఎల్‌జియస్ ప్రాంతంలో మహిళలతో 10 బ్యాచ్‌లు, పురుషులతో 10 బ్యాచ్‌లు కేంపెయిన్ కోసం కదిలాయి. ఏరియాలో 8 చోట్ల పెద్ద మీటింగులు జరిగాయి. 8 వేల మందిప్రజలు పాల్గొన్నారు. గ్రామాల్లో అనేక చోట్ల రాళ్ళతో స్థూపాలు ఏర్పర్చి ఎర్రని బట్ట చుట్టి అమరులకు శ్రద్ధాంజలి ఘటించారు.

కోర్సెలిలో జరిగిన సభలో కా.సుక్కి ఉపన్యసించింది. మార్క్సిస్టు మహోపాధ్యాయులను ఆదర్శంగా తీసుకోవాలంటూ, కా.సియం యొక్క అమరత్వాన్ని పోరాట దీక్షను వివరించింది. మద్దేడ్ ఏరియాలో పనిచేస్తూ అమరులైన కామ్రేడ్స్ అశోక్, భీమన్న, ప్రకాష్, మహేందర్, రామ్మూర్తి, బాబు, కమలక్క.... లను ఆదర్శంగా తీసుకోవాలని, నిర్బంధం పెరిగినా పోరాటం విడవవద్దని చెప్పింది. డివిసియం కా.నిర్మల ఉపన్యసిస్తూ, బేస్ ఏరియాలు, మిలీషియా ప్రాముఖ్యత, గ్రామ రాజ్య కమిటీలు, నిర్బంధం చాటున వచ్చే సంస్కరణల బూటకత్వం అంతిమంగా ఉద్యమాన్ని తుడిచిపెట్టే శత్రు లక్ష్యం..... వీటన్నింటి గురించి వివరంగా ప్రసంగించింది. ఏరియాలో వస్తున్న కరువుకి కారణం ప్రభుత్వమే నని పేర్కొంది. రానున్న నిర్బంధాన్ని ఎదుర్కొనేందుకు పోరాడ్డం తప్ప వేరే మార్గం లేదనీ, అదే అమరుల ఆశయం కొనసాగించడమని పిలుపు నిచ్చింది. సభ కొనసాగుతున్నపుడు మధ్య మధ్య పాడే అమరుల పాటలు ఉత్తేజాన్నిచ్చాయి.

### గడ్చిరోలి డివిజన్

గడ్చిరోలి జిల్లాలో అమరుల వారాన్ని అడ్డుకోవడానికి శత్రువు తీవ్రంగా ప్రయత్నించాడు. చాలా మందిని అరెస్టు చేసి అమరుల వారం జరగకుండా చేశాడు. అయినప్పటికీ ఏటపల్లి ఏరియాలో ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై అమరులకు శ్రద్ధాంజలి ఘటించారు. 62 గ్రామాల నుండి 973 మంది ప్రజలు స్మారక సభల్లో పాల్గొన్నారు. 5 చోట్ల సిమెంట్‌తోనూ, 3 చోట్ల కర్రలతోనూ, మరో చోట స్తూపం చిత్రాన్ని తయారు చేసి, మరో చోట బట్టతో తయారైన స్తూపం వద్ద ప్రజలు హాజరై అమరులకు నివాళులర్పించారు. ఈ సంవత్సరం ఒక్కో చోట 3 నుండి 13 గ్రామాల ప్రజలు హాజరై సభల్ని జరుపుకున్నారు. ఒక సభ గెరిల్లా దళం ఆధ్వర్యంలో జరగ్గా, మిగిలిన సభలన్నీ డిఏకెఎంఎస్, కెఎఎంఎస్‌ల ఆధ్వర్యంలో జరిగాయి. ఈ సభల్ని సఫలం చేయడంలో పిజిఏ బేస్‌ఫోర్స్ ప్రముఖ పాత్ర నిర్వహించింది. బేస్ ఫోర్స్ సైనికులు చాలా చోట్ల కాపలా కాసి, ఆత్మరక్షణా పెట్రోలింగ్ నిర్వహించి, సభలను శత్రు దాడులకు గురి కాకుండా కాపాడారు.

అమరుల వారానికి ముందరే మొత్తం ఏరియా అంతటా ప్రచార కార్యక్రమాలను నిర్వహించారు. 150 పోస్టర్లు వేసారు. 6 చోట్ల బ్యానర్లు కట్టారు. గోడలపై నినాదాలు రాసారు. కోందవాయలో 110 మంది, జురీనాల సమీపంలో 144 మంది, చెవెరిగాటుం వద్ద 170 మంది, కుదిరిఘాటుం వద్ద 200 మంది, రేంగదాండిలో 112 మంది ప్రజలు సభల్లో పాల్గొన్నారు. కొన్ని చోట్ల సభా ప్రారంభంలో ఊరేగింపు కూడా తీసారు. ఈ సభలను జయప్రదంగా నిర్వహించేందుకు గాను ప్రజా మిలిషియాకు చెందిన సైనికులు మొత్తం 85 భర్మార్లతో పహరా కాసారు. సభలలో పాల్గొన్న ప్రతి వ్యక్తి కూడా తన సాంప్రదాయ ఆయుధాన్ని వెంట తీసుకొచ్చాడు. ఈ సభలలో ప్రజలు అమరులకు ఘనంగా నివాళులర్పించి వాళ్లు వదిలి వెళ్లిన కర్తవ్యాలను పరిపూర్తి చేస్తామని శపథం చేశారు. ఈ సభల క్రమంలో ఇర్పనార్ గ్రామానికి పోలీసులు వచ్చి డేరా వేసారని తెలువగానే మిలిషియా సభ్యులు వారిపై దాడి చేసి చికాకు పర్చారు. జురీనాల వద్ద ప్రజలు నిర్మించిన స్తూపాన్ని పోలీసులు కూలగొట్టగా ఇందుకు జవాబుగా ప్రజా మిలిషియా సభ్యులు, గెరిల్లా దళం నాయకత్వంలో కదలి వెళ్లి వాంగెర్ఘురిలోని గ్రామ పంచాయితీ భవనాన్ని కూలగొట్టారు. ❐

**పిజిఏ రెండవ వార్షికోత్సవం సందర్భంగా డిసెంబర్ 2 నుండి 8 వరకు**

**పిజిఏ వారాన్ని విజయవంతం చేయండి !**

## దశాబ్దాలుగా దోపిడీ పాలకుల నిర్లక్షానికి ఫలితమే

# దండకారణ్యంలో విద్యావైద్య సౌకర్యాల దుస్థితి

తాము సాధించిన విజయాల గురించి గొప్పలు చెప్పుకోవడానికి అబద్ధపు ప్రకటనలు చేసి వాస్తవాలను మరుగుపర్చడం దోపిడీ పాలకులకు కొత్తేమీ కాదు. ఇదే తరహాలో గడచిన కొద్ది సంవత్సరాలుగా పాలకులూ, అధికార్లూ దండకారణ్యంలో విద్యావైద్య రంగాల్లో చాలా అభివృద్ధి సాధించినట్లు ప్రకటించుకుంటున్నారు. గత ఇరవయ్యేళ్లుగా దండకారణ్య ప్రజలు నూతన ప్రజాస్వామిక విప్లవ లక్ష్యంతో తమ దైనందిన సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్నారు. ఈ పోరాటాన్ని అణచడానికీ, అట్లాగే తమ దోపిడీ పాలనను కొనసాగించడానికీ పాలకవర్గాలకు ఒకవైపు పాశవిక పోలీసు బలగాల ద్వారా దమనకాండను అమలు చెయ్యడమూ, మరోవైపు సంస్కరణ కార్యక్రమాలు అమలు చేసి ప్రజలను మోసపుచ్చడమూ తప్పనిసరి అయ్యాయి. పథకం ప్రకారం కొనసాగుతున్న ఈ కుట్రలో భాగంగా పాలకులు ముఖ్యంగా గత 10-15 ఏళ్లుగా అనేక చోట్ల స్కూళ్లూ, ఆసుపత్రులూ, అట్లాగే లోతట్టు ప్రాంతాలలో కూడా రోడ్లు నిర్మించారు. తమ ప్రచార సాధనాల ద్వారా ప్రజల అభివృద్ధికీ, ప్రాంతం అభివృద్ధికీ ఎంతో పాటుపడుతున్నామని గొప్పగా ప్రకటించుకుంటున్నారు.

కొద్ది సంవత్సరాలుగా పాలకులు రోజుకో కొత్త పథకాన్ని ప్రకటించే పద్ధతిని చేపట్టారు. 'శిక్షా గారంటీ యోజన', 'రాజీవ్ గాంధీ శిక్షా మిషన్', 'పఢ్‌బో-బఢ్‌బో', 'నోనీ-బాబు జోహార్', 'గాంవ్ కీ ఓర్ చలవ్' ఇలాంటివే ఎన్నో పేర్లతో ఎన్నో పథకాలొచ్చాయి. ఈ పథకాలను ప్రకటించడం ద్వారా ప్రభుత్వాలు నిజంగా ప్రజల్లో విద్యావ్యాప్తి పట్ల శ్రద్ధ వహిస్తున్నాయన్న భ్రమను ప్రజల్లో కలగజేయడం ఒక అవసరం కాగా, ప్రభుత్వాలు ఇలా తలాతోకా లేని పథకాలను ఇష్టం వచ్చినప్పుడల్లా ప్రకటించడం వెనుక ('ప్రభాత్' గత సంచికల్లో వివరించినట్టుగా) సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాల పట్ల వాటి విధేయత మరొక కారణం. ప్రపంచీకరణ విధానాల ప్రకారం సామ్రాజ్యవాదానికి ప్రపంచంలో బాగా వెనుకబడ్డ ప్రాంతాలలో కూడా మార్కెట్‌లో సరకులు కొనగల వినియోగదార్లు కావాలి. దానికి చదవడం రాయడం తెల్సిన వారూ, టీవీ చూసీ పేపర్లు చదివీ అడ్వర్టైజ్‌మెంట్లను అర్థం చేసుకోగల వారూ, కొత్త కొత్త అవసరాలను గుర్తించి సరుకులను కొనేవారూ అయిన వినియోగదార్లు కావాలి.

ఈ కారణం వల్లనే ముఖ్యంగా గడచిన దశాబ్ద కాలంగా ప్రపంచ బ్యాంకు వంటి సామ్రాజ్యవాద ద్రవ్య సంస్థలు వెనుకబడిన దేశాల్లో విద్యా రంగంలోకి చొచ్చుకొస్తున్నాయి. ప్రభుత్వాలచే రోజుకో కొత్త పథకాన్ని అమలు చేయిస్తున్నాయి. పోరాట ప్రాంతాలలో చాలా రోజులుగా 'అభివృద్ధి' నమూనాల విషయంలో చర్చ నడుస్తోంది. ప్రభుత్వాలు ఒకవైపు అభివృద్ధి పట్ల తమకెంతో శ్రద్ధ ఉన్నట్టుగా డబ్బా వాయించుకుంటూ, మరోవైపు విప్లవకారులను 'అభివృద్ధి నిరోధకులు'గా చిత్రించడానికి ప్రతి చిన్న అవకాశాన్నీ వినియోగించుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో, దండకారణ్యంలోని గడ్చిరోలి, బస్తర్, దంతెవాడ, కాంకేర్, రాజనాంద్‌గాం జిల్లాల్లో ప్రభుత్వం అభివృద్ధి విషయంలో చేస్తున్న వాదనలు ఎలా తప్పుడివో పరిశీలించాల్సిన అవసరం ఉంది. మిగతా రంగాలను వదిలేసినప్పటికీ, కనీసం విద్యావైద్య రంగాలలో అభివృద్ధిపై ప్రభుత్వ వాదనలలోని డొల్లతనాన్ని అర్థం చేసుకోవడం అవసరం.

### ప్రతి ఏటా వేలాది మంది అకాల మరణాలు : వైద్య రంగంలో నిర్లక్ష్యానికి భయంకర సాక్ష్యం

దండకారణ్యం మౌలికంగా ఆదివాసీ ప్రాంతం. ఇది దట్టమైన అడవులకు కేంద్రం కూడా. అయితే ఇక్కడి గ్రామాల్లో తాగడానికి స్వచ్ఛమైన నీళ్లు కూడా కరువే. వందల ఏళ్లుగా పాలకుల నిర్లక్ష్యానికి సాక్ష్యంగా ప్రజలు ఇప్పటికీ అతి పురాతన పద్ధతుల్లో వ్యవసాయం చేస్తారు. ఇక్కడి ప్రజలు, ముఖ్యంగా మహిళలూ, పిల్లలూ భయంకరమైన పౌష్టికాహార లేమితో బాధపడుతున్నారు. ఈ కారణాలతో గ్రామాల్లో ప్రతి ఏటా ప్రజలు అకాల మరణానికి గురవుతుంటారు. కలుషితమైన నీటి కారణంగా ప్రతి సీజన్‌లోనూ మహమ్మారులు వ్యాపించి వందలాది మంది ప్రాణాల్ని బలిగొంటాయి. వీటి విషయమై చాలా సార్లు దినపత్రికల్లో వార్తలు ప్రచురితమవుతుంటాయి కానీ అధికారులు నిజాన్ని దాచిపెట్టి వాస్తవాలను వక్రీకరిస్తారు.

బస్తర్ జిల్లాలో 15 ఆసుపత్రులలో ఒక్క డాక్టరు కూడా లేడన్న వాస్తవం చాలు, దండకారణ్యంలో వైద్య రంగంలో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని అర్థం చేసుకోవడానికి. ఈ జిల్లాలో 200 వైద్య ఉద్యోగుల పోస్టులు ఈనాటికీ ఖాళీగా ఉన్నాయి. బస్తర్‌లోని జిల్లా ఆసుపత్రినీ, సివిల్ ఆసుపత్రినీ కలుపుకొని మొత్తం 27 మంది వైద్య అధికారుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అట్లాగే జిల్లాలోని మొత్తం 54 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు గాను 14 కేంద్రాల్లో డాక్టర్లు లేనందున కంపౌండర్ల ద్వారా, ఇతర ఉద్యోగుల ద్వారా నడుస్తున్నాయి. వీటిలో చాలా కేంద్రాల్లో వాటిని స్థాపించిన నాటి నుండీ ఈనాటి దాకా డాక్టరే దిక్కు లేడు. పాలకుల భాషలో 'అబూఝ్‌మాడ్'గా పిలిచే మాడ్ ప్రాంతంలోని కుత్తుల్ గ్రామంలో సర్కారీ రికార్డుల ప్రకారం ఎప్పటి నుండో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉంది. అయితే ఆ బోర్డున్న ఒక భవనం వంటిది గానీ, అందులో పనిచేయాల్సిన డాక్టర్‌ను గానీ ఆ ఊరి ప్రజలు ఇప్పటి దాకా చూడలేదు.

జాతీయ రహదారిపై ఉన్న కొండగాం ఉదాహరణనే తీసుకుందాం. అక్కడి ఆసుపత్రిలో ఒక మహిళా గైనకాలజిస్టు, ఒక కంటి డాక్టర్, ఒక మహిళా మెడికల్ ఆఫీసర్, ఒక పంటి డాక్టర్ పోస్టులు ఇప్పటికీ ఖాళీగా ఉన్నాయి. ప్రభుత్వం మొత్తం దండకారణ్యంలో ఉన్న ఆరోగ్య కేంద్రాలలోనూ, ఆసుపత్రులలోనూ ఖాళీ పోస్టులను నింపేందుకు ఎలాంటి ప్రయత్నమూ చేయడం లేదు.

చాలా మంది డాక్టర్లూ, మలేరియా వర్కర్లూ లోతట్టు గ్రామాల్లో ఉంటూ ప్రజలకు మందులూ మాకులూ ఇవ్వడంలో ఎలాంటి ఉత్సాహమూ చూపడం లేదు. వారిలో ఎంతగా సంవేదనారాహిత్యం నెలకొని ఉందంటే చాలా మంది తమకు పోస్టింగ్ ఇచ్చిన ఊళ్లో ఉండకుండానే, ఎలాంటి పనీ చేయకుండానే ప్రతి నెలా పూర్తి వేతనం తీసుకుంటున్నారు. వాళ్లు తాము పనిచేయాల్సిన గ్రామానికి రావడం కానీ, రోగులకు మందులివ్వడం గానీ ఎన్నడూ చేయరు. ప్రభుత్వ వాదనలకూ, కళ్లకు కనిపించే వాస్తవాలకు పొంతనే లేదు. ఈ రంగంలో

ప్రభుత్వం సాధించానని చెబుతున్న అభివృద్ధి అంతా డొల్లే.

పోరాట ప్రాంతాలలో సాధారణంగా ప్రజలు తమ వైద్య అవసరాలకు పీపుల్స్‌వార్ పార్టీ దళాలపైన్నే ఆధారపడుతుంటారు. గెరిల్లాలు ఒకవైపు దోపిడీ రాజ్యాన్ని కూల్చివెయ్యడానికి ప్రజలను సంఘటితం చేస్తూనే, మరోవైపు సాధారణ రోగాల నుండి వారిని కాపాడడానికి ఎన్నో ఉపాయాలు చెబుతారు, మందులిస్తారు. గత ఐదారేళ్లుగా ప్రజలు ఈ దిశగా మరో ముందడుగేసి తమ కోసమే 'కమ్యూనిటీ ప్రజా ఆరోగ్య కేంద్రాలు' ఏర్పాటు చేసుకుంటున్నారు. తమ అభివృద్ధికి సంబంధించి వాస్తవికంగానూ, అర్థవంతంగానూ ప్రయత్నాలు ప్రారంభించారు. ఏళ్ల తరబడి ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని అనుభవించిన ప్రజలు ఇప్పుడు ప్రజాయుద్ధాన్ని ప్రత్యామ్నాయంగా స్వీకరించారు. అయితే భయంకరమైన పోలీసు నిర్బంధం నడుమనే ఈ ప్రయత్నాలు సాగించాల్సి వస్తున్నది.

ఇక విద్యా రంగంలో అభివృద్ధికి సంబంధించి ప్రభుత్వ వాదనల్లో పసెంత ఉందో పరిశీలిద్దాం.

## సమస్యల కుప్ప : కుళ్లిన విద్యా వ్యవస్థ అసలు రూపం

ప్రభుత్వ స్కూళ్లలో ఉపాధ్యాయులు సంవత్సరంలో రెండే రోజులు కనిపిస్తారని దండకారణ్యంలో ప్రజలు సాధారణంగా భావిస్తుంటారు -- ఆగస్టు 15న, జనవరి 26న. అయితే ఈ సంవత్సరం ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం 'నోనీ బాబూ జోహార్' అనే పండుగను ప్రకటించి విద్యా సంవత్సరం ప్రారంభ దినమైన జూలై 1న ఉపాధ్యాయులు స్కూలుకు రావడాన్ని అనివార్యం చేసింది; అంటే ఇప్పుడు వారికి లాంఛనమైన పని దినాలు రెండుకు బదులు మూడయ్యాయి. పిల్లల్లో చదవాలనే ప్రేరణను కలిగించడానికి అంటూ ఈ పండుగను మొదలుపెట్టారు. అయితే గ్రామాల్లోని స్కూళ్లలో ఉపాధ్యాయులు గైరుహాజరు కావడమే విద్యా వ్యవస్థలోని అతి పెద్ద లోపంగా భావించడం సరైంది కాదు. విద్యా వ్యవస్థలో నెలకొన్న లెక్కలేనన్ని సమస్యల్లో ఇదొకటి మాత్రమే.

## స్కూళ్లకు పక్కా భవనాలు లేవు !

ఆదివాసీల అభివృద్ధి అంటూ డబ్బా వాయించుకునే ప్రభుత్వం అనేక ఆదివాసీ పల్లెలలో స్కూళ్లనయితే తెరచింది గానీ వాటి కోసం పక్కా భవనాలు మాత్రం కట్టించలేదు. ఇక గురూజీలు ఎట్లాగూ రారు. కొన్ని పాత స్కూలు భవనాలు ఎంత బలహీనంగా ఉన్నాయంటే అవి ఏదో ఒకరోజున పిల్లల పాలిటి సమాధులుగా మారతాయన్న భయం కలుగుతుంది వాటిని చూస్తే. ఇంద్రావతి నది ఒడ్డున, దంతెవాడ జిల్లా కిందికి వచ్చే గ్రామమైన తాకిలోడ్‌లోని స్కూలుకు అసలు పైకప్పే లేదు. దానికి సమీపంలోనే ఉన్న మరో గ్రామమైన నీరులో కూడా స్కూలు పేరుతో కేవలం గోడలు మాత్రం ఉన్నాయి. పైకప్పు కూలి చాలా సంవత్సరాలే అయినట్టు ప్రజలు చెబుతున్నారు. ఈ రెండు గ్రామాల్లోనూ ఎలాగోలా వేసిన గడ్డి గుడిసెల్లో బడి నడుస్తున్నది. చాలా స్కూలు భవనాలు కూలిపోవడానికి లేదా అసలు తయారే కాకపోవడానికి కారణం బిడిఓ నుండి కాంట్రాక్టర్, సర్పంచ్, సచివ్‌ల వరకు అందరూ డబ్బు మేయడమే. స్కూలు భవనాలు నిర్మించే పేరిట అధికారులూ, నాయకులే లాభపడుతున్నారు.

## మధ్య దళారీలే తింటున్న మధ్యాహ్న భోజనం

దంతెవాడ జిల్లాలోని ఒక చిన్న మునిసిపాలిటీ అయిన బడేబచేలిలో పోయిన విద్యా సంవత్సరంలో మొత్తం 10 నెలల్లో 3 నెలలు మాత్రమే విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెట్టారు. ఈ సంవత్సరం కూడా ఆగస్టు నెల దాకా ఇంకా మధ్యాహ్న భోజనం జాడే లేదు. పక్కా రోడ్డు సౌకర్యం ఉన్న ఒక మునిసిపాలిటీ పరిస్థితే ఈ విధంగా ఉంటే లోతట్టు గ్రామాల్లో పరిస్థితి ఎలా ఉండి ఉంటుందో ఊహించుకోవడం అంత కష్టమేమీ కాదు. అవినీతి అధికారులూ, సర్పంచులూ, సచివులే అంతా తినేస్తారనడంలో సందేహం లేదు. చాలా స్కూళ్లలో మధ్యాహ్న భోజనం సరిగా నడవనే నడువదు. అయితే ప్రభుత్వం మాత్రం ఈ పథకం ద్వారా విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతున్నట్టుగా నమ్మబలుకుతోంది. ఈ పథకం కింద నియమించే వంటమనిషికి కూలీ కూడా ఇవ్వడం లేదు. ఒక అనిపుణుడైన కార్మికుడికి సైతం కనీస దినసరి వేతనంగా 52 రూపాయల 65 పైసలుగా నిర్ధారించిన ప్రభుత్వం, వంటమనిషికి నెలకు 152 రూపాయలివ్వడం ఏ చట్టం కిందికి వస్తుందో ఎవరికీ తెలియదు! ఇకపోతే, మధ్యాహ్న భోజనం కోసం పిల్లలకు కేటాయించే డబ్బు రోజుకు కేవలం 65 పైసలు మాత్రమే. 65 పైసలతో ఎవరైనా ఒకపూట కడుపు నిండా తిండి తినగలరా?! అంతా మోసం, దగా!

## స్కూళ్లు తెరిచారు కానీ పుస్తకాలేవీ?

జూలై 1న అట్టహాసంగా స్కూళ్లు తెరవనైతే తెరిచారు కానీ విద్యార్థులకు సమయానికి పుస్తకాలు అందేలా చూడడంలో విద్యాశాఖ దారుణంగా విఫలమైంది. ఇది ఇప్పటి కథ కాదు, చాలా పాతది. ప్రతి సంవత్సరమూ విద్యార్థులు దుకాణాల చుట్టూ అనేక మార్లు చక్కర్లు కొట్టాల్సి వస్తుంది. పుస్తకాలను అచ్చువేసే పని ప్రైవేటు కాంట్రాక్టర్లకు ఇవ్వడంతో వాటి రేట్లు కూడా బాగా పెరిగిపోయాయి. పదవ తరగతి చదివే విద్యార్థికి దాదాపు 1,000 రూపాయల వరకు పుస్తకాలపైన్నే ఖర్చు చేయాల్సి వస్తున్నది. ఆదివాసీ, దళిత విద్యార్థినీవిద్యార్థులకిచ్చే స్కాలర్‌షిప్ మొత్తం కనీసం కాపీలు, పుస్తకాలు కొనడానికైనా సరిపోదు. అలాంటప్పుడు స్కాలర్‌షిప్‌తో విద్యార్థులకు ఏం సహాయం అందుతుంది?

## ఆశ్రమశాలలు కాదు, చీకటికొట్లు!

ప్రభుత్వం ఆదివాసుల అభివృద్ధి పేరిట అనేక ప్రాంతాల్లో ఆశ్రమశాలలు తెరిచింది. అయితే వీటిని చూస్తే ఎవరికైనా జైళ్లలోని చీకటికొట్లు గుర్తుకొస్తే అందులో ఆశ్చర్యమేమీ లేదు. అవిభాజిత బస్తర్, గడ్చిరోలి జిల్లాల్లోని అనేక ఆశ్రమ పాఠశాలలకు పక్కా భవనాలే లేవు. గడ్డి గుడిసెల్లోనే నడుస్తాయి. వీటిలో చదివే విద్యార్థులకు పెట్టే భోజనం అంటే నూకలు


ఇంద్రావతి ఒడ్డున తాకిలోడ్ గ్రామంలోని ఈ స్కూలుకు పై కప్పే లేదు



ఇందులోనే నేర్పుతారు చదువులు!

కలిసిన అన్నం, నీళ్ల లాంటి పప్పు మాత్రమే. అధికార్లూ, ఆశ్రమాల వార్డెన్‌లూ విద్యార్థుల డబ్బు కాజేస్తారు. విద్యార్థులకు ఆశ్రమ పాఠశాలల్లో ఎలాంటి సదుపాయాలూ లేవు. ఆటలు, వినోదం, లైబ్రరీ ఏవీ లేవు. ఇక్కడ ఉండే వార్డెన్, చప్రాసీ, వంటమనిషి – ఎవ్వరూ కూడా సరిగా తమ తమ పనులు చేయరు. విద్యార్థులే అడవిలోకి వెళ్లి పొయ్యిలోకి కట్టెలు తెచ్చుకోవల్సి ఉంటుంది. కూరగాయలు సేకరించడం, బియ్యంలో రాళ్లేరడం, వంట చెయ్యడం వంటి పనులన్నీ విద్యార్థులతోనే చేయిస్తారు. ఆశ్రమ పాఠశాలల్లో తాగడానికి నీటి సదుపాయం కూడా సరిగా లేకపోవడంతో చాలా వాటిల్లో విద్యార్థులకు మురికినీళ్లు తాగాల్సి వస్తున్నది. దీనితో వాళ్లు మాటిమాటికీ రోగాల పాలవుతున్నారు. అనారోగ్యం పాలైన విద్యార్థులకు ఆశ్రమశాలల్లో వైద్య సదుపాయం గానీ, మందులు గానీ లేవు. పడుకోవడానికి మంచాలు, కంబళ్లు, కూర్చోవడానికి కుర్చీలు, బెంచీలు ఏవీ కూడా సరిగా లేవు.

## ఉపాధ్యాయుల సమస్యలు కూడా తక్కువేం కాదు

విద్యార్థుల, వారి తల్లిదండ్రుల దృష్టితో చూసినప్పుడు సాధారణంగా వినవచ్చే ఫిర్యాదు "మా వూరికి గురుజీ రాడు, వచ్చినా సరిగా చదువు చెప్పడు" అనేదే. ఈ సమస్యకు మరో పార్శ్వం ఏమిటంటే వాళ్ల సమస్యల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్యం, ఉదాసీనత, నియంతృత్వ వైఖరుల మూలంగా వారిలో సంవేదనారాహిత్యమూ, తమ బాధ్యతల పట్ల నిర్లక్ష్యపూరిత వైఖరీ పెరుగుతున్నాయి. నిజానికి ఇది అటు విద్యా వ్యవస్థకూ, ఇటు విద్యార్థులకూ, ఉపాధ్యాయులకూ మధ్య వైరుధ్యం. కానీ దురదృష్టవశాత్తు ఇది ఒకవైపు ఉపాధ్యాయులకూ మరోవైపు విద్యార్థులకూ వారి తల్లిదండ్రులకూ మధ్య వైరుధ్యంగా రూపు దాల్చింది. 'రాజీవ్ గాంధీ శిక్షా మిషన్'లో భాగంగా అవిభాజిత మధ్యప్రదేశ్ ప్రభుత్వం ప్రారంభించిన 'శిక్షా గారంటీ యోజన' కింద నియమించిన గురుజీలకు నెలకు 1,000 రూ. ల చొప్పున వేతనం లభిస్తోంది. ఒక దినసరి కూలీకన్నా తక్కువ వేతనం

## *పరీక్షలా? విద్యార్థుల శత్రువులా?*

*గత వేసవిలో ఒకవైపు స్కూళ్లలో పరీక్షలు జరుగుతుండగా, వార్తాపత్రికల్లో వచ్చిన పెద్ద పెద్ద శీర్షికలు ఇలా ఉన్నాయి : "ఈరోజు 5గురు నకల్చీలు (పరీక్షల్లో కాపీ కొట్టేవారిని హిందీలో ఇలా అంటారు) పట్టుబడ్డారు", "ఈరోజు 10 మంది నకల్చీలు పట్టుబడ్డారు". ఇంతకు వాళ్లు పట్టుకున్నది ఏ దేశద్రోహులనో, దోపిడీదొంగలనో కాదు, కేవలం పరీక్షల్లో కాపీ కొడుతున్న లేదా కొడుతున్నారని అనుమానించిన విద్యార్థులను మాత్రమే. విద్యార్థులు ఫ్లైయింగ్ స్క్వాడ్‌ల దాడులకు భయపడుతూ బిక్కుబిక్కుమంటూ పరీక్షలు రాయాల్సి వస్తున్నది. నేటి పరీక్షా విధానం అభ్యర్థులను శత్రువులుగా భావించి దాడి చేసే విధానం. విద్యార్థులకు ఆశ్చర్యం గొలిపే విధంగా, వాళ్లు చిత్తైపోయే విధంగా పరీక్షాపత్రాల్ని తయారు చేస్తారు. ఈ విధానం విద్యార్థులలో సృజనాత్మకతను నశింపజేసే విధానం. విద్యా సంవత్సరం అంతా విద్యార్థులతో పాఠాల్ని వల్లె వేయిస్తారు. పరీక్షల్లో వాటిని వాంతి చేయిస్తారు. దీని ద్వారా విద్యార్థుల్లో పెరిగేది వల్లెవేసే సామర్థ్యమూ, జ్ఞాపకం ఉంచుకునే సామర్థ్యమూ తప్ప మరేమీ కాదు. బ్రిటిష్ పాలనలో లార్డ్ మెకాలే ప్రవేశపెట్టిన బానిస విద్యా విధానం, స్వాతంత్ర్యం వచ్చిందని చెప్పి 55 ఏళ్లు కావస్తున్నా ఎలాంటి మౌలికమైన మార్పు లేకుండానే కొనసాగుతోంది. ఈ విద్య విద్యార్థుల సృజనాత్మక సామర్థ్యాన్ని మొద్దుబార్చి బానిసతనాన్నీ, న్యూనతాభావాన్నీ పెంచేటటువంటిది.*

*దండకారణ్యంలోని చాలా స్కూళ్లలో పోయిన ఎండాకాలంలో ఫ్లైయింగ్ స్క్వాడ్లు భయోత్పాతాన్ని సృష్టించాయి. అసలు విద్యార్థులు కాపీ కొడుతున్నారంటే దానికి కారణాల్ని విద్యా విధానంలోనూ, బోధనా పద్ధతుల్లోనూ, సిలబస్ స్థాయిలోనూ, విద్యార్థుల సామాజిక-ఆర్థిక నేపథ్యంలోనూ చూడాల్సి ఉంటుంది. అయితే విద్యాశాఖ వాళ్లు నిర్బంధ పద్ధతుల ద్వారా నకల్‌ను అరికట్టాలని సంకల్పించారు. విద్యార్థుల పట్ల ఈ విధంగా శత్రుపూరిత వైఖరి అవలంబిస్తున్నందుకు నిజానికి విద్యాశాఖ సిగ్గు పడాలి. దంతెవాడ జిల్లాలోని ఇలిమిడి అనే గ్రామంలోని హైస్కూల్లో 10వ తరగతి పరీక్ష రాస్తున్న ఒక విద్యార్థిని బట్టలు విడిపించి చెక్ చేసిన ఫ్లైయింగ్ స్క్వాడ్ దుశ్చర్య మానవీయ విలువలు కలిగిన ప్రతివారినీ కలచివేయక మానదు. మార్చ్ 20, 2002న ఇంగ్లీషు సబ్జెక్టు పరీక్ష జరుగుతుండగా నకల్చీలను పట్టుకోవడం కోసం బీజాపూర్ నుండి వచ్చిన ఫ్లైయింగ్ స్క్వాడ్ దాడి చేసింది. ఈ దళానికి చెందిన మహిళా అధికారి, సుశీల జవ్వా అనే విద్యార్థినిని, కాపీ కొడుతుందన్న అనుమానంతో విద్యార్థినీవిద్యార్థులందరి ముందరే స్కర్టు విప్పించి చెక్ చేసింది. ఈ హఠాత్సంఘటనతో కలిగిన అవమానం వల్ల సుశీల పరీక్షాహాలు నుండి బైటికి వెళ్లిపోయి తన రూంకు చేరి విషం తిన్నది. ఆ తర్వాత గ్రామస్తులూ, ఉపాధ్యాయులూ కలిసి ఆ అమ్మాయిని ఆసుపత్రికి తీసుకుపోయి ఆమె ప్రాణాల్ని కాపాడారు. దీనిపై చాలా గొడవ జరిగింది. అయితే అధికారులు ఉల్టాగా ఉపాధ్యాయులపైన్నే తప్పుడు ఆరోపణలు చేస్తూ వారిని సస్పెండ్ చేశారు. ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారి తాను పరీక్షా హాల్‌లో సుశీల బట్టలు విప్పించలేదని వివరణ ఇచ్చింది. కానీ విద్యార్థులూ, ఉపాధ్యాయులూ మాత్రం అందరి ఎదుటే అధికారి సుశీలను అవమానపర్చిందని గట్టిగా వాదించారు. హాల్‌లో కాకపోతే మూసిన గదిలోనే అయినా సరే, అసలింతకు ఒక విద్యార్థిని బట్టలు విప్పించి చెక్ చేసే అధికారం వాళ్లకు ఏ చట్టం ఇచ్చింది? అది కూడా కేవలం నకల్‌ను నిరోధించడానికి!*

*ఈ రకంగా భయోత్పాతం సృష్టించే, సిగ్గుచేటైన దుశ్చర్యలకు దిగే ఫ్లైయింగ్ స్క్వాడ్‌లకు దండకారణ్యంలోని చైతన్యవంతులైన విద్యార్థినీవిద్యార్థులు తప్పక బుద్ధి చెబుతారు – అది వాళ్ల న్యాయమైన నైతిక హక్కు.* ✦

ఇచ్చి చదువు చెప్పించడం చదువు సిగ్గుచేటైన విషయం. (మొదట్లో వీళ్లకు కేవలం 500 రూ. లు మాత్రమే ఇచ్చేవారు) శిక్షా కర్మీలకు కూడా చాలా తక్కువ వేతనం ఇస్తున్నారు. పోయిన విద్యా సంవత్సరంలో వీరికి ఏడేసి నెలల వరకు అసలు వేతనాలే ఇవ్వలేదు. ఇలాంటి అసురక్షితమైన వాతావరణంలో, ఇంత తక్కువ వేతనానికి వాళ్లెట్లా పనిచేస్తారో, విద్యార్థులకు ఏ విధంగా చదువు చెబుతారో అంచనా వేయడం పెద్ద కష్టమేమీ కాదు.

ఇక్కడ ఆదివాసులు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ప్రజలిలా చెప్పుకుంటారు : "గురూజీ చదువు చెప్పుడు తక్కువ గని మిగతా పనులైతే మంచిగ చేస్తడు." ప్రభుత్వ దివాళాకోరు విధానాల కారణంగా ఉపాధ్యాయులకు చదువు చెప్పడంతో పాటు వోటర్ లిస్టులు తయారు చేయడం, దారిద్రరేఖకు దిగువన ఉండే ప్రజల సర్వే, పోలియో చుక్కలు వేయడం, తునికాకు కళ్ళాల్లో మున్షీగిరీ, ఎన్నికల పనులు, ఇంకా అనేక రకాల ప్రభుత్వ పనులు చేయాల్సి వస్తున్నది. మొత్తంగా చూస్తే, విద్యా సంవత్సరంలో మూడింట రెండు వంతుల సమయం వీరు ఇలాంటి నిరర్థకమైన బోధనేతర పనులే చేయాల్సి వస్తున్నది. ఈ పనులు వీళ్లు అనివార్యంగా చేయాల్సి ఉంటుంది. లేకుంటే అధికారులు వీళ్లపై చర్య తీసుకుంటారు.

లోతట్టు గ్రామాల్లో పనిచేసే ఉపాధ్యాయుల సమస్యలు మరింత తీవ్రంగా ఉంటాయి. అక్కడ వాళ్లు ఉండడానికి సరైన ఏర్పాట్లు ఉండవు. రోగాలొస్తే వైద్య సదుపాయాలుండవు. వీరికి ఒకే చోట ఏండ్లకేండ్లు పనిచేయాల్సి వస్తున్నది. పైసలూ, పలుకుబడీ ఉన్నవారికి కోరుకున్న చోటికి ట్రాన్స్‌ఫర్ అయ్యే అవకాశం ఉంటుంది. మాడ్ వంటి రవాణా సదుపాయాలు అంతగా లేని ప్రాంతాల్లో పనిచేయడానికి 50 ఏళ్లు పైబడిన ఉపాధ్యాయులను నియమించడంలో ప్రభుత్వ దివాళాకోరుతనం స్పష్టంగా అగుపడుతుంది. ఇక్కడ పనిచేసేవారు పదుల కిలోమీటర్ల దూరం కాలినడకనే వెళ్లాల్సి వస్తుంది.

విద్యార్థి, ఉపాధ్యాయ నిష్పత్తిని పరిశీలిస్తే విద్యావ్యవస్థ దుస్థితి మరింత స్పష్టంగా కనిపిస్తుంది. దండకారణ్యంలోని చాలా స్కూళ్లలోని గురూజీలకు ఒక్కొక్కరు ఐదేసి తరగతులకు పాఠాలు చెప్పాల్సి వస్తుంది. అన్ని సబ్జెక్టులూ ఒకే ఉపాధ్యాయుడు బోధించాల్సిన పరిస్థితి నెలకొని ఉంది. చాలా స్కూళ్లల్లో టీచర్ పోస్టులు అనేక ఏళ్లుగా ఖాళీగా ఉన్నాయి. మొత్తం ఛత్తీస్‌గఢ్‌లో 15 వేలకు మించి టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికీ ప్రభుత్వం వీటిని భర్తీ చేసే ప్రయత్నాలేవీ చేయడం లేదు. సామ్రాజ్యవాద అనుకూల విధానాలను అమలు చేస్తూ ప్రభుత్వం రెగ్యులర్ టీచర్లను భర్తీ చేయడం లేదు. 'శిక్షా కర్మీ', 'శిక్షా గారంటీ', 'తాత్కాలిక నియామకం' వంటి కుయుక్తులతో తెలివిగా తన బాధ్యతలను విస్మరిస్తోంది. వీరి జీవితాలను వెట్టి కార్మికులకన్నా హీనంగా దిగజారుస్తున్నది.

*(కొరవ 30వ పేజీలో .....)*

## మహోపాధ్యాయుడు కామ్రేడ్ లెనిన్ జన్మదినం సందర్భంగా ప్రజా పాఠశాలల ప్రారంభోత్సవం

*మాడ్ డివిజన్‌లోని ఇంద్రావతి ఏరియాలోని రెండు గ్రామాల్లో ప్రజలు ప్రభుత్వపు శుష్క వాగ్దానాలను తోసిపుచ్చి తమ భవితవ్యాన్ని తామే నిర్ణయించుకోవడానికి నిశ్చయించుకున్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం మూలంగా దండకారణ్యంలోని అనేక గ్రామాల్లో నేటికీ పాఠశాలలు లేవు. ఉన్నా సరిగా నడవనే నడవవు. అందుకే ఈ రెండు గ్రామాల్లోని ప్రజలు తమ స్వంత శక్తిపై ఆధారపడి స్కూళ్లు ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. ప్రజా సంఘాల చొరవతో ఈ నిర్ణయం కార్యరూపం దాల్చింది. రెండు గ్రామాల్లోనూ ప్రజలు తమ శ్రమదానం ద్వారా స్కూళ్ల కోసం గడ్డితో గుడిసెల్ని కట్టుకున్నారు. చందాలు సేకరించి విద్యార్థులకు పలకలూ, బలపాలూ, పుస్తకాలూ, కాపీలూ కొని ఇచ్చారు. రెండు చోట్లా హైస్కూలు వరకు చదివిన యువకులను టీచర్లుగా నియమించు కున్నారు. వీరికి ప్రతి ఇంటి నుండి నెలకు ఒక గ్లాసెడు బియ్యం ఇచ్చేలా, కొద్ది మొత్తం డబ్బు వేతనంగా ఇచ్చేలా నిర్ణయం జరిగింది. ఆ తర్వాత ఏప్రిల్ 22న మహోపాధ్యాయుడు లెనిన్ పుట్టినరోజు సందర్భంగా ఈ స్కూళ్లను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రెండు గ్రామాల్లోనూ వేర్వేరుగా ఏర్పాటైన కార్యక్రమాల్లో ప్రజా సంఘాల నాయకులూ, పార్టీ కార్యకర్తలూ పాల్గొన్నారు. ఈ సందర్భంగా హాజరయిన ప్రజలనుద్దేశించి సంఘ నాయకులు ప్రసంగించారు. వక్తలు తమ ప్రసంగాల్లో దోపిడీ ప్రభుత్వాలు అమలు చేస్తున్న బూటకపు సంస్కరణలను నిర్ద్వంద్వంగా వ్యతిరేకించారు. వాళ్లు ప్రజలకు తమ స్వంత వనరులపై ఆధారపడి, తమంతట తామే అభివృద్ధి దిశగా ముందడుగు వేయాల్సిందిగా పిలుపునిచ్చారు. ఇంకా వాళ్లు తమ ప్రసంగంలో ప్రజలకు విద్య నేర్చుకోవల్సిన అవసరాన్ని అర్థం చేయించారు. విప్లవ సిద్ధాంతాన్ని అర్థం చేసుకోవడానికీ, ప్రజా రాజ్యాధికారాన్ని నడపడానికీ మనం విద్యనభ్యసించాల్సిన అవసరం ఎంతో ఉందని వాళ్లు వివరంగా చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రజా పాఠశాలలో తొలిసారిగా అడుగుపెట్టనున్న విద్యార్థినీవిద్యార్థులూ, టీచర్లూ పాల్గొన్నారు. విప్లవ గీతాలాపనతో ఈ కార్యక్రమం చాలా ఉత్సాహంగా ముగిసింది.* ✦



# నాయకత్వ పద్ధతులకు సంబంధించి కొన్ని సమస్యలు

**జూన్, 1943**

– మావో సేటుంగ్

**(ఇటీవలే మన పార్టీ దండకారణ్యంలో 'ఎడ్యుకేషన్–రెక్టిఫికేషన్ క్యాంపెయిన్'ను కొనసాగించాలని నిర్ణయించింది. ఈ సందర్భంగా మావో రాసిన ఈ వ్యాసం ఉపయోగకరంగా ఉంటుందని భావించి ఇక్కడ ప్రచురిస్తున్నాం. – సంపాదకవర్గం)**

1) కమ్యూనిస్టులమైన మనం కార్యనిర్వహణలో రెండు పద్ధతులను తప్పనిసరిగా అవలంబించాలి. అందులో ఒకటి, సాధారణత్వాన్ని నిర్దిష్టత్వంతో జోడించడం; ఇంకొకటి, ప్రజా బాహుళ్యంతో నాయకత్వాన్ని జోడించడం.

2) ఏ లక్ష్య సాధనకైనా, సార్వత్రికమైన విస్తృతమైన పిలుపు ఇవ్వకపోతే విశాల ప్రజారాశులను కార్యాచరణకు కదిలించజాలం. నాయకత్వ స్థానాల్లో ఉన్న కామ్రేడ్లు సార్వత్రిక పిలుపుకే పరిమితమైతే, దేనికోసం పిలుపు ఇవ్వబడిందో ఆ లక్ష్య సాధనకై వారు వ్యక్తిగతంగానైనా, నిర్మాణపరంగానైనా పిలుపును ఆచరణలో వాస్తవం చేయడానికి నిర్దిష్టంగా పనిలోకి దిగకపోతే, అనుభవాన్ని గడించి ఆ అనుభవాన్ని ఇతర యూనిట్లకు మార్గదర్శకత్వం వహించడానికి ఉపయోగపెట్టకపోతే, సార్వత్రిక పిలుపు సరైనదో కాదో పరీక్షించడానికి, తన సార్వత్రిక పిలుపులోని సారాంశాన్ని సంపన్నం చేయడానికి వారికి వీలుండదు. దీని వలన ఆ పిలుపుకు ఫలితం రాకపోయే ప్రమాదం కూడా వుంటుంది. ఉదాహరణకు, 1942 దిద్దుబాటు ఉద్యమంలో సార్వత్రిక పిలుపును నిర్దిష్టత్వంతో జోడించే పద్ధతిని అనుసరించిన, నిర్దిష్టమైన మార్గదర్శకత్వాన్ని ఉపయోగించిన ప్రతిచోటా విజయాలు లభించాయి. ఈ పద్ధతిని అనుసరించని చోట విజయాలు లభించలేదు. 1943 దిద్దుబాటు ఉద్యమంలో కేంద్ర కమిటీ యొక్క ప్రతి బ్యూరో, సబ్ బ్యూరో, ప్రతి ప్రాంతం, ఆ ప్రాంతానికి సంబంధించిన పార్టీ కమిటీ సార్వత్రిక పిలుపు (సంవత్సరానికంతటికీ దిద్దుబాటు పథకం)ని ఇవ్వడంతో పాటు, ఈ కింది విషయాలను అమలు జరిపి ఆ క్రమంలో అనుభవం సంపాదించాలి. ఆర్గనైజేషన్‌లో నుండి, ఇతర ఆర్గనైజేషన్ల నుండి, పాఠశాలలు, సైనిక యూనిట్ల నుండి రెండు లేక మూడు (అంతకు మించకుండా) యూనిట్లను ఎంపిక చేసుకోవాలి. ఆ యూనిట్లను క్షుణ్ణంగా అధ్యయనం చేయాలి. వాటిలో దిద్దుబాటు ఉద్యమ అభివృద్ధికి సంబంధించిన సవివరమైన జ్ఞానాన్ని సంపాదించాలి. ఇంకా, ఈ యూనిట్లలో పనిచేసే వారికి ప్రాతినిధ్యం వహించే సభ్యులలో కొంత మంది యొక్క (ఎక్కువ మంది కాకుండా) రాజకీయ చరిత్రకు సైద్ధాంతిక స్వభావానికి అధ్యయనంలో వారి ఉత్సుకతకు వారి పనిలో బలమైన బలహీనమైన అంశాలకు సంబంధించిన సవివరమైన జ్ఞానాన్ని సంపాదించాలి. అంతే గాక, ఆ యూనిట్లను ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో సొంతంగా మార్గదర్శకత్వం ఇవ్వాలి. ప్రతి ఆర్గనైజేషన్, పాఠశాలలు, సైనిక యూనిట్ల నాయకులు కూడా కింది యూనిట్ల విషయంలో ఇలాగే చేయాలి. నాయకులు నాయకత్వాన్ని అధ్యయనాన్ని జోడించే పద్ధతి ఇదే. నిర్దిష్టమైన వ్యక్తుల నుండి నిర్దిష్టమైన కింది యూనిట్లలో జరిగిన సంఘటనల నుండి నిర్దిష్టమైన అనుభవాన్ని పొందితే తప్ప నాయకత్వ స్థానంలోని ఎవరైనా గానీ అన్ని యూనిట్లకు సాధారణ మార్గదర్శకత్వాన్ని ఇవ్వగలిగే స్థితిలో వుండరు. అన్ని స్థాయిలలోని నాయకత్వ కేడర్లు అన్వయించడం నేర్చుకునేందుకు ఈ పద్ధతి ప్రతీ చోటా అనుసరించబడాలి.



3) దిద్దుబాటు ఉద్యమం విజయవంతం కావాలంటే ఉద్యమ క్రమంలో ప్రతీ యూనిట్లోనూ కొద్ది మంది కార్యకర్తలతో, యూనిట్ నాయకులతో ఆ యూనిట్‌కు కేంద్ర బిందువుగా నాయకత్వ గ్రూపునొకదానిని ఏర్పరచాలని, ఉద్యమంలో పాల్గొంటున్న ప్రజాబాహుళ్యంతో ఈ నాయకత్వ గ్రూపు సన్నిహిత సంబంధం కలిగి ఉండాలని 1942 దిద్దుబాటు ఉద్యమం రుజువు చేస్తున్నది. నాయకత్వ గ్రూపు ఎంత చురుకైనదైనప్పటికీ ప్రజా బాహుళ్యం యొక్క కార్యాచరణతో జత కలవకపోతే దాని కృషి నిష్ఫలమైన కృషే అవుతుంది. అదే విధంగా, తమ కార్యాచరణను సరిగా సంఘటితం చేయడానికి దృఢమైన నాయకత్వ గ్రూపు లేకుండా కేవలం ప్రజా బాహుళ్యం కార్యాచరణ సాగిస్తే ఆ కార్యాచరణ ఎక్కువ కాలం కొనసాగడం కానీ, సరైన దిశలో ముందుకు తీసుకువెళ్లటం కానీ, ఉన్నత స్థాయికి అభివృద్ధి చెందటం కానీ, సాధ్యం కాదు. ఏ ప్రాంతంలోనైనా ప్రజలు సాపేక్షికంగా చురుకైన వారు, మధ్య రకం, సాపేక్షికంగా వెనుకబడిన వారు అనే మూడు విధాలుగా ఉంటారు. అందుచేత, కొద్ది సంఖ్యలో ఉండే చురుకైన వారిని నాయకత్వం వెనుక సమీకరించి, వీరిపై ఆధారపడి మధ్య రకం వారిని అభివృద్ధి చేసి, వెనుకబడిన వారిని తమ వైపు తిప్పుకోవడంలో నాయకులు ప్రావీణ్యత కలిగి వుండాలి. ప్రజా పోరాట క్రమంలోనే నెమ్మదిగా, ప్రజా బాహుళ్యంతో సంబంధం కలిగిన సుదృఢమైన నాయకత్వ గ్రూపు ఏర్పడుతుంది. అంతే కానీ, ప్రజా పోరాటంతో సంబంధం లేకుండా ఏకాకిగా మాత్రం కాదు. గొప్ప పోరాట క్రమంలోని ప్రారంభదశలోనూ, మధ్య దశలోనూ, చివరి దశలోనూ, నాయకత్వ గ్రూపు పూర్తిగా మారకుండా అలాగే ఉండడం సాధ్యం కాదు. నాయకత్వ గ్రూపులో తక్కువ రకం సభ్యులు, దిగజారిన వారిని తొలగించి ఆ స్థానాలలో పోరాటక్రమంలో ముందుకు వచ్చిన చురుకైన కార్యకర్తలను ఉంచాలి. చాలా చోట్ల, చాలా ఆర్గనైజేషన్లలో పని ముందుకు సాగకపోవడానికి ఒక మౌలికమైన కారణం, సంఘటితమైన, ప్రజా బాహుళ్యంతో సంబంధం కలిగిన ఎల్లప్పుడూ ఆరోగ్యవంతంగా వుండే నాయకత్వ గ్రూపు లేకపోవడమే. వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా (కృత్రిమంగా తయారైనది కాదు), చురుకైన సూటియైన అప్రమత్తులైన ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది, విద్యార్థులు కొద్ది మందితోనో, ఎక్కువ మందితోనో కూడిన నాయకత్వ గ్రూపు లేకపోయినట్లయితే వంద మంది ఉన్న పాఠశాలను సరిగా నడపడం

*దీనిని కా. మావో చైనా కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ కోసం రాశాడు.*

సాధ్యం కాదు. పెద్దదైన చిన్నదైన ప్రతి ఆర్గనైజేషన్‌లో పాఠశాలలో సైనిక యూనిట్లో ఫ్యాక్టరీలో లేక గ్రామంలోనైనా పార్టీని విప్లవీకరించడానికి (బోల్షివైజ్ చేయడానికి) కామ్రేడ్ స్టాలిన్ పేర్కొన్న పన్నెండు షరతులలో తొమ్మిదవదైన, నాయకత్వ కేంద్రం ఏర్పాటుకు సంబంధించిన షరతును మనం అనుసరించాలి. ఈ నాయకత్వ గ్రూపుకు నాలుగు అంశాలతో కూడిన పద్ధతిని కేడర్ల విధానానికి సంబంధించిన తన చర్చలో కామ్రేడ్ డిమిట్రావ్ పేర్కొన్నాడు. అవి – ఆశయానికి పూర్తిగా నిబద్ధమై ఉండడం, ప్రజా బాహుళ్యంతో సంబంధం కలిగి వుండడం, పరిస్థితులను అన్ని కోణాల నుండి తనకు తానుగా అవగాహన చేసుకోగల నేర్పు, క్రమశిక్షణకు కట్టుబడి ఉండడం, యుద్ధం, ఉత్పత్తి, విద్య (దిద్దుబాటుతో కలిపి) - ఈ కేంద్ర కర్తవ్యాలను నిర్వర్తించడంలోనూ, లేక పనిని తనిఖీ చేయడంలోనూ, కేడర్ల చరిత్ర పరిశీలించడంలోనూ ఇతర కార్యకలాపాలలోనూ సార్వత్రిక పిలుపును నిర్దిష్ట మార్గదర్శకత్వంతో జోడించడంతో పాటు నాయకత్వ గ్రూపును ప్రజా బాహుళ్యంతో జోడించే పద్ధతిని అవలంబించడం చాలా అవసరం.

4) మన పార్టీ కార్యాచరణ అంతటిలోనూ "ప్రజల నుండి ప్రజల వద్దకు" అనే సూత్రంపై ఆధారపడి మాత్రమే సరైన నాయకత్వం అభివృద్ధి చెందుతుంది. దీనర్థం: ప్రజలలో ఉండే భావాలను (విడివిడిగా క్రమం లేకుండా ఉన్నవాటిని) తీసుకోవాలి. వాటిని సమీక్షించాలి. (అధ్యయనం ద్వారా వాటిని సమన్వయపర్చి క్రమమైన భావాలుగా మలచాలి). తిరిగి ప్రజల వద్దకు తీసుకువెళ్లాలి. ప్రజలు వాటిని తమవిగా భావించి స్వీకరించే వరకు, వాటి కోసం నిలబడి కార్యాచరణకు ఉపక్రమించేట్లు చేసేంతవరకు ఆ భావాలను ప్రజలలో ప్రచారం చేస్తూ వివరించాలి. ఈ భావాలు సరైనవో కావో ఆచరణలో పరీక్షించాలి. తర్వాత మరలా ప్రజల నుండి భావాలను గ్రహించి సమీక్షించి, తిరిగి ప్రజల వద్దకు తీసుకువెళ్లి వారు ఆ భావాలను హృదయపూర్వకంగా ఆమోదించేట్లు చేయాలి. ఈ విధంగా మరలా మరలా ఎడతెరిపి లేకుండా చేయటం వలన ప్రతిసారీ భావాలు మరింత సరైనవిగా, మరింత శక్తివంతంగా, మరింత సంపన్నంగా తయారవుతాయి. ఇదే మార్క్సిస్టు జ్ఞానసిద్ధాంతం.

5) ఒక ఆర్గనైజేషన్‌లో గానీ, పోరాటంలో గానీ నాయకత్వ గ్రూపుకు ప్రజా బాహుళ్యానికి మధ్య సరైన సంబంధముండాలనే సూత్రీకరణ, 'ప్రజల నుండి ప్రజల వద్దకు' అనే పద్ధతి ద్వారానే నాయకత్వానికి సరైన భావాలు ఏర్పడతాయనే సూత్రీకరణ, నాయకత్వం యొక్క భావాలు ఆచరణలోకి తీసుకువెళ్లినప్పుడు సార్వత్రిక పిలుపును నిర్దిష్ట మార్గదర్శకత్వంతో జోడించాలనే సూత్రీకరణలను; ఈ సమస్యలపైన మన కేడర్లకు గల తప్పు అభిప్రాయాలను సరిదిద్దేందుకు ఇప్పటి దిద్దుబాటు ఉద్యమ సందర్భంలో ప్రతి చోటా ప్రచారం చేయాలి. నాయకత్వ కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికై చురుకైన కార్యకర్తలను సమీకరించాల్సిన ప్రాముఖ్యతను, ఈ నాయకత్వ కేంద్రాన్ని ప్రజా బాహుళ్యంతో అతి సన్నిహితంగా జోడించాల్సిన ప్రాముఖ్యతను చాలా మంది కామ్రేడ్స్ గుర్తించరు, లేదా సరిగా చేయరు. అందుచేత వారి నాయకత్వం పెత్తందారీగా తయారై ప్రజా బాహుళ్యానికి దూరమవుతుంది. ప్రజా పోరాటాల అనుభవాలను క్రోడీకరించుకోవల్సిన ప్రాముఖ్యతను చాలా మంది కామ్రేడ్స్ గుర్తించరు, లేదా సరిగా చేయరు. పైగా తాము తెలివైన వారమని విర్రవీగుతూ స్వీయమానసిక ధోరణిని ప్రదర్శిస్తారు. తద్వారా వారి భావాలు వట్టివై ఆచరణకు పనికిరానివైతాయి. చాలా మంది కామ్రేడ్స్ ఒక లక్ష్యాన్ని నెరవేర్చడానికై సార్వత్రిక పిలుపునిచ్చి దానితోనే సంతృప్తి పడతారు. వెంటనే దానిని నిర్దిష్టమైన మార్గదర్శకత్వంతో అనుసరించవలసిన ప్రాముఖ్యతను గుర్తించరు, లేదా సరిగా చేయరు. అందుచేత వారి పిలుపు పెదవులపైనా, కాగితం పైన, లేక సమావేశ స్థలంలోనో మిగిలిపోతుంది. వారి నాయకత్వం పెత్తందారీగా తయారవుతుంది. నేటి దిద్దుబాటు కార్యక్రమంలో ఈ తప్పులను మనం సరిదిద్దాలి. మన అధ్యయనంలోనూ, పనిని తనిఖీ చేయడంలోనూ, కేడర్ల చరిత్రను పరీక్షించడంలోనూ, భవిష్యత్తులో మన పని మొత్తంలోనూ నాయకత్వాన్ని ప్రజా బాహుళ్యంతో జోడించే పద్ధతిని, సామాన్యత్వాన్ని నిర్దిష్టత్వంతో జోడించే పద్ధతిని ఉపయోగించడం నేర్చుకోవాలి.

6) నాయకత్వానికి సరైన భావాలు ఏర్పడడానికి ప్రజల నుండి భావాలను తీసుకుని వాటిని సమీక్షించాలి. తర్వాత ప్రజల వద్దకు తీసుకెళ్లి వాటిని వారు తమవిగా భావించి స్వీకరించే వరకు పట్టుదలతో వివరిస్తూ ప్రచారం చేయాలి. వాటిని ఆచరించాలి. ఇదే నాయకత్వానికి ప్రాథమిక పద్ధతి. భావాలను సమీక్షించి వాటిని, తిరిగి ప్రజల వద్దకు తీసుకు వెళ్లటంలో సార్వత్రిక పిలుపును నిర్దిష్ట మార్గదర్శకత్వంతో జోడించే పద్ధతిని ఉపయోగించటం చాలా అవసరం. ప్రాథమిక పద్ధతిలో ఇది ఒక భాగం. అనేక విషయాలలో ఇచ్చిన నిర్దిష్ట మార్గదర్శకత్వం నుండి సాధారణ భావాలను (సార్వత్రిక పిలుపును) రూపొందించాలి. వాటిని వివిధ యూనిట్లలో పరీక్షకు గురిచేయాలి (వ్యక్తిగతంగా చేయటమే గాక అలా చేయమని యితరులకు చెప్పటం ద్వారా కూడా). కొత్త అనుభవాలను క్రోడీకరించాలి. ప్రజలకు మార్గదర్శకత్వం యివ్వటానికి మార్గదర్శకాలను రూపొందించాలి. కామ్రేడ్లు దీనిని దిద్దుబాటు ఉద్యమంలోనే గాక ప్రతి యితర పనిలోనూ అమలు పరచాలి. అలా చేయటం ద్వారా గొప్ప నైపుణ్యంతో కూడిన మెరుగైన నాయకత్వం వస్తుంది.

7) కింది యూనిట్లకు ఏ పనినైనా చెప్పటంలో (విప్లవ యుద్ధానికి సంబంధించినది గానీ, ఉత్పత్తి, లేక విద్యకు సంబంధించినది కానీ, పనిని తనిఖీ చేయటానికి, ఆర్గనైజేషనల్ పనికి, గూఢచారి వ్యతిరేక కార్యకలాపాలకు సంబంధించినది కానీ), పై ఆర్గనైజేషన్, దాని డిపార్టుమెంట్లు కింద ఆర్గనైజేషన్‌కు బాధ్యుడైన నాయకుని ద్వారా చేయాలి. తద్వారా ఆ పనికి అతను బాధ్యత వహిస్తాడు. ఈ పద్ధతి ద్వారా పని విభజనను, సంఘటితమైన కేంద్రీకృత నాయకత్వాన్ని సాధించవచ్చు. పై స్థాయిలో వున్న డిపార్టుమెంటు కింది స్థాయిలో తనకు అనుబంధంగా ఉన్న డిపార్టుమెంటు (ఉదాహరణకు, ఆర్గనైజేషన్‌కు, ప్రచారానికి, గూఢచారి వ్యతిరేక కార్యకలాపాలకు సంబంధించిన పై స్థాయి డిపార్టుమెంటు తనకు అనుబంధంగా కింది స్థాయిలో ఉన్న డిపార్టుమెంటు వద్దకు మాత్రం పోగూడదు) వద్దకు, కింది స్థాయి ఆర్గనైజేషన్ మొత్తానికి బాధ్యుడైన వ్యక్తికి (ఉదాహరణకు కార్యదర్శి, అధ్యక్షుడు, డైరెక్టరు, పాఠశాల ప్రిన్సిపాల్) ఏమీ తెలియజేయకుండా బాధ్యత లేని స్థితిలో ఉంచి వెళ్లగూడదు. కింది ఆర్గనైజేషన్ మొత్తానికి బాధ్యత వహించే వ్యక్తికి, నిర్దిష్టమైన బాధ్యత కలిగిన వ్యక్తికి తెలియజేసి బాధ్యతనివ్వాలి. పని విభజనను సంఘటిత నాయకత్వంతో జోడించే ఈ కేంద్రీకృత పద్ధతి, మొత్తమంతటికి బాధ్యత వహించిన వ్యక్తి ద్వారా నిర్దిష్ట కర్తవ్యాన్ని నెరవేర్చటానికి పెద్ద మొత్తంలోనూ, అవసరమైనప్పుడు ఆర్గనైజేషన్‌లోని మొత్తం కేడర్‌ను కదిలించడానికి వీలు కల్పిస్తుంది, తద్వారా వేరు వేరు డిపార్ట్‌మెంట్లలో వున్న కేడర్లలోని లోపాలను అధిగమించడానికి, ఇప్పుడు చేస్తున్న పనికోసం చాలా మందిని చురుకైన కార్యకర్తలుగా మలచడానికి వీలు కల్పిస్తుంది. ప్రజలతో నాయకత్వాన్ని జోడించడానికి ఇది కూడా పద్ధతే. ఉదాహరణకు, కేడర్ల చరిత్రను పరీక్షించడం తీసుకుందాం. ఈ పనిని ఏకాకిగా చేసినట్లయితే ఆర్గనైజేషన్ డిపార్టుమెంట్‌లో ఆ పనికి బాధ్యులైన ఏ కొద్ది మందో దానిని నిర్వహించినట్లయితే అది ఏ విధంగానూ సరిగా జరగదు. పనిలో భాగం పంచుకోవడానికి తన సిబ్బందిలో చాలా మందిని, లేక తన మొత్తం సిబ్బందిని తన విద్యార్థులలో అధిక

భాగాన్ని లేక మొత్తాన్ని కదిలించగలిగిన నిర్దిష్ట పాఠశాల పాలనాధికారి ద్వారా గానీ, నిర్దిష్ట డిపార్టుమెంటు పాలనాధికారి ద్వారా గానీ యిది జరిగినట్లయితే, అదే సమయంలో నాయకత్వాన్ని ప్రజలతో జోడించే సూత్రాన్ని అన్వయిస్తూ ఆర్గనైజేషన్ డిపార్టుమెంటులోని పై స్థాయి నాయకులు సరైన మార్గదర్శకత్వం యివ్వగలిగినట్లయితే అప్పుడు కేడర్ల చరిత్రను పరీక్షించే పని నిస్సందేహంగా సంతృప్తికరంగా జరుగుతుంది.

8) ఏ నిర్దిష్ట స్థలంలోనైనా ఒకే సమయంలో అనేక కేంద్ర కర్తవ్యాలు ఉండవు. ఏ సమయంలోనైనా ఒకే ఒక కేంద్ర కర్తవ్యం వుంటుంది; దీనికి అనుబంధంగా ద్వితీయ, తృతీయ ప్రాముఖ్యత కలిగిన యితర కర్తవ్యాలు ఉంటాయి. అందుచేత, ఆ ప్రాంతంలో మొత్తానికి బాధ్యత వహించే వ్యక్తి అక్కడి పోరాట పరిస్థితులను, పోరాట చరిత్రను పరిగణనలోకి తీసుకోవాలి. వివిధ కర్తవ్యాలను సరైన క్రమంలో పెట్టాలి. అతను సొంత ప్లాను లేకుండా, పై స్థాయి ఆర్గనైజేషన్ పంపిన ప్రతి సూచననూ అనుసరించకూడదు. అలా అనుసరించి అనేక కేంద్ర కర్తవ్యాలను, అస్తవ్యస్తతను క్రమరాహిత్యాన్ని సృష్టించకూడదు. వాటి సాపేక్షిక ప్రాముఖ్యతను, అత్యవసరాన్ని తెల్పకుండా, లేక ఏది కేంద్ర కర్తవ్యమో సూచించకుండా పై స్థాయి ఆర్గనైజేషన్ కింది స్థాయి ఆర్గనైజేషన్‌కు అనేక కర్తవ్యాలను యివ్వకూడదు. అలా యిచ్చినట్లయితే కింది స్థాయి ఆర్గనైజేషన్లు తమ పనిలో తీసుకోవలిసిన చర్యలలో అస్తవ్యస్తత ఏర్పడుతుంది. తద్వారా కోరుకున్న ఫలితాలు లభించవు. (చారిత్రిక పరిస్థితులు, ఇప్పటి పరిస్థితుల వెలుగులో) ప్రతి ప్రాంతంలోని మొత్తం పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని దానికి అనుగుణంగా ప్లాను వేయటం, పని కేంద్ర బిందువును, ప్రతి దశకు అనుగుణంగా పనిని సరిగా నిర్ణయించటం, ఊగిసలాట లేకుండా నిర్ణయాన్ని అమలు చేయటం, నిర్దిష్ట ఫలితాలను తప్పక సాధించేట్లు చూడడం నాయకత్వ కళలో ఒక భాగం. ఇది నాయకత్వ పద్ధతికి సంబంధించిన సమస్య కూడా. నాయకత్వాన్ని ప్రజలతో జోడించటమనే సూత్రీకరణను, సాధారణత్వాన్ని నిర్దిష్టత్వంతో జోడించటమనే సూత్రీకరణను అమలు జరిపేటప్పుడు యీ సమస్యను పరిష్కరించడానికి శ్రద్ధ వహించాలి.

9) నాయకత్వ పద్ధతులకు సంబంధించిన వివరాలను ఇక్కడ చర్చించలేదు. ఇక్కడ చెప్పబడిన సూత్రాలను ఆధారం చేసుకుని, అన్ని ప్రాంతాలలోని కామ్రేడ్లు వీటి విషయమై లోతుగా ఆలోచిస్తారని తమ సృజనాత్మకతను పూర్తిగా వినియోగిస్తారని ఆశిస్తున్నాం. పోరాటం కష్టతరమయ్యే కొద్దీ స్వీయమానసిక ధోరణులను పెత్తందారీ నాయకత్వ ధోరణులను పూర్తిగా రూపుమాపేందుకు విశాల ప్రజానీకం కోర్కెలతో వారి నాయకత్వాన్ని అతి సన్నిహితంగా జోడించాల్సిన ఆవశ్యకత, సార్వత్రిక పిలుపును నిర్దిష్ట మార్గదర్శకత్వంతో జోడించాల్సిన ఆవశ్యకత చాలా ఎక్కువగా ఉంటుంది. మన పార్టీలోని నాయకత్వ స్థాయిలోని కామ్రేడ్లు అన్ని సమయాలలోనూ స్వీయమానసిక పెత్తందారీ నాయకత్వ పద్ధతులకు వ్యతిరేకంగా శాస్త్రీయమైన, మార్క్సిస్టు నాయకత్వ పద్ధతులను నెలకొల్పి మొదటివాటిని నాశనం చేయటానికి రెండవ వాటిని ఉపయోగించాలి. స్వీయమానసిక ధోరణి పెత్తందారీ ధోరణి కలవారు నాయకత్వాన్ని ప్రజలతోనూ, సాధారణత్వాన్ని నిర్దిష్టత్వంతోనూ జోడించాలనే సూత్రాలను అర్థం చేసుకోరు. వారు పార్టీ పని పురోగమనాన్ని ఆటంకపరుస్తారు. స్వీయమానసిక పెత్తందారీ నాయకత్వ పద్ధతులను ఎదిరించటానికి విస్తృతంగానూ, ప్రగాఢంగానూ శాస్త్రీయమైన మార్క్సిస్టు నాయకత్వ పద్ధతులను వృద్ధి చేయాలి. ❒

*(..... 25వ పేజీ తరువాయి)*

బాగా దెబ్బతింటుందనీ జోస్యం పలికాయి. కానీ విప్లవ పార్టీ అభివృద్ధి యొక్క గతితర్కం వారి అంచనాలన్నింటినీ తలక్రిందులు చేసింది. పార్టీ అంతకు ముందటి కంటే చాలా బలంగా తయారైంది, అన్ని స్థాయిల్లోనూ, ముఖ్యంగా కేంద్ర స్థాయిలో, 1969లో భాకపా (మా-లె) ఏర్పడిన తర్వాత మొట్టమొదటిసారిగా సమిష్టి నాయకత్వం అమలులోకి వచ్చింది, పార్టీ మరింత సంఘటితపడింది, ఎన్‌టి, డికె, ఎఓబి గెరిల్లాజోన్లలోనూ, అలాగే ఏపిలోని ఇతర ప్రాంతాలలోనూ ఉద్యమం బాగా బలపడింది. 70ల తొలినాళ్ళలోని వెనుకంజ తర్వాత మొట్టమొదటిసారిగా అఖిల భారత స్వభావాన్ని సంతరించికుంటూ పలు రాష్ట్రాలకు విస్తరించింది. 1995లో జరిగిన ఆనాటి పీపుల్స్‌వార్ అఖిల భారత ప్రత్యేక మహాసభ పార్టీని మరింతగా సంఘటితపరచింది, 1998 ఆగస్టులో భాకపా (మా-లె) [పార్టీ యూనిటీ]తో విలీనంతో భాకపా(మా-లె) ప్రధాన ప్రవంతికి చెందిన శక్తుల ఏకీకరణ మౌలికంగా పూర్తయింది. పార్టీ కెయస్ సమయంతో కల్గియున్న ప్రాంతీయ స్వభావాన్ని వదిలించుకొని, దేశం లోపలా విదేశాల్లోనూ గల మార్క్సిస్టు-లెనినిస్టు శక్తులతో సౌహార్ద సంబంధాలను నెలకొల్పుకుంది. మొత్తంగా పార్టీ 1992 తర్వాత – నాయకత్వానికి సంబంధించి ఈ కాలంలో వివిధ స్థాయిల్లో తీవ్ర నష్టాలు సంభవించినప్పటికీ – అన్ని రంగాలలోనూ చెప్పుకోదగిన పురోగమనం సాధించింది. 2001 మార్చిలో జరిగిన చారిత్రాత్మక 9వ కాంగ్రెస్, భారతదేశంలో ప్రజాయుద్ధాన్ని పురోగమింపజేసే క్రమంలో ఒక గుణాత్మక గెంతును సూచిస్తుంది.

## కెయస్ ఇతివృత్తాన్ని మార్క్సిస్టు-లెనినిస్టులు ఎలా అర్థం చేసుకోవాలి?

గొప్ప నాయకులకూ ఉద్యమానికీ మధ్య గతితార్కిక సంబంధాన్ని మరోసారి తెలియజేసింది కెయస్ ఇతివృత్తం. ఏ నాయకుడు/నాయకురాలైనా కానీ – అతడు/ఆమె ఎంత ప్రతిభాసంపన్నులైనా కావచ్చు, ఎంతటి సేవలైనా చేసి ఉండొచ్చు – ఒకసారి అతడు/ఆమె ఉద్యమం నుండి వైదొలగితే, ఉద్యమావసరాలకు అనుగుణంగా ఎదగలేకపోతే, సాధించిన విజయాలతో మత్తెక్కి అహంకారిగా మారితే, పార్టీకి అతీతులుగా వ్యవహరిస్తే గనుక, అతడు/ఆమె పార్టీకీ, ఉద్యమానికీ మార్గదర్శకత్వం వహించలేరని కెయస్ ఇతివృత్తం రుజువు చేసింది. విప్లవోద్యమానికి తన స్వంత గతితర్కం ఉంది. నాయకుల విద్రోహాలతో అది ఆగిపోదు, పార్టీ సరైన పంథాకు కట్టుబడి ఉన్నంతకాలమూ, వర్గపోరాటం నుండి వైదొలగనంత కాలమూ నూతన నాయకులు తయారవుతూనే ఉంటారు.

మార్క్సిస్టు-లెనినిస్టులు ఉద్యమాన్నీ, వ్యక్తులనూ చారిత్రకంగా అంచనా వేసే వస్తుగత విశ్లేషణా పద్ధతికి ఎల్లప్పుడూ కట్టుబడి ఉండాలి. కెయస్ పాత్రను అంచనా వేస్తున్నపుడు, 1991 తర్వాత ఆయన దిగజారాడన్న వాస్తవం కారణంగా, ఆయన 1991కి ముందు ఒక సుదీర్ఘకాలం పాటు భారత కమ్యూనిస్టు ఉద్యమానికి అందించిన మహత్తర, సకారాత్మక సేవలను గుర్తించడంలో విప్లవకారులు తప్పుడు నిర్ధారణలకు రాకూడదు. 1991 ముందు, 1991 తర్వాత కాలాల్లోని ఆయన పాత్రను చారిత్రకంగా అంచనా వేయాలి. అది మాత్రమే సరైన పద్ధతి. నిజానికి భారత విప్లవానికి తానందించిన మహత్తర సేవలకు జ్ఞాపకం ఉంచుకోవలసిన ఒక వ్యక్తి మరణం ఇలా అప్రాముఖ్యమైన ఘటనగా గడచిపోవడం విషాదకరం. ❒

అంతర్జాతీయం

# కుప్పకూలిన అర్జెంటైనా ఆర్థికవ్యవస్థ

## సామ్రాజ్యవాద ఆర్థిక సంస్కరణల ప్రమాదకర పరిణామం

అర్జెంటైనా ఆర్థికవ్యవస్థ కుప్పకూలిపోవడమనేది మూడవ ప్రపంచ దేశాలపై అమెరికా బలవంతంగా రుద్దుతున్న 'అభివృద్ధి నమూనా' వైఫల్యానికి సజీవ ఉదాహరణ. గత సంవత్సరం డిసెంబర్‌లో వేలాది ప్రజలు చెప్పనలవికాని తమ ఇక్కట్లకు కారణమైన ఐఎంఎఫ్ అనుకూల ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ మిలిటెంట్ నిరసన ప్రదర్శనలకూ, ర్యాలీలకూ పూనుకోవడంతో చాలా నెలలుగా సుడులు తిరుగుతూ వచ్చిన సంక్షోభం ఒక్కసారిగా బద్దలయింది. కొద్ది వారాల్లోనే అక్కడ ఐదుగురు అధ్యక్షులు మారారు. రెండు ప్రభుత్వాలు పతనమయ్యాయి. పోలీసులు జరిపిన కాల్పుల్లో 28 మంది యువ ప్రదర్శనకారులు ప్రాణాలు కోల్పోయారు.

అర్జెంటైనా రెండవ అతి పెద్ద లాటిన్ అమెరికన్ దేశం. ఇది దక్షిణ అమెరికా ఖండంలో ఉంది. ఇక్కడి జనభా దాదాపు 3½ కోట్లు కాగా వీరిలో 88 శాతం పట్టణాల్లో జీవిస్తారు. అపార ప్రకృతి వనరులకు నిలయమైన ఈ దేశం దాదాపు 300 ఏళ్ల పాటు స్పెయిన్ వలసగా ఉండేది. 19వ శతాబ్దం చివరలో అర్జెంటైనాకు స్వాతంత్రం సిద్ధించింది. 1953లో ఇక్కడ రిపబ్లిక్ స్థాపన జరిగింది. 1930 తర్వాత నుండి చాలా ఏళ్లపాటు ఈ దేశం సైనిక నియంతృత్వ పాలనలోనే ఉంటూ వచ్చింది.

ఇప్పటి దాకా అర్జెంటైనా గురించి మీడియాలో ఐఎంఎఫ్ నుండి తీసుకున్న రుణాలతో అది వేగంగా అభివృద్ధి చెందుతున్నట్టుగా ప్రచారం జరుగుతూ వచ్చింది. ఇంతకు ముందు ఆగ్నేయాసియాలోని చాలా దేశాల గురించి కూడా ఇలాంటి ప్రచారమే జరిగింది. భారతదేశంలో కూడా 1990 దశకం ప్రారంభంలో 'నూతన ఆర్థిక విధానాలను' ప్రవేశపెడుతూ పాలకులు ఈ విధంగానే సెలవిచ్చారు. కానీ సామ్రాజ్యవాద అనుకూల ఆర్థిక విధానాల ఫలితాలు అన్ని దేశాలలోనూ దాదాపు ఒకటే విధంగా ఉన్నాయి – నిరుద్యోగం, అధికధరలు, పేదరికం, రుణభారం, వేతనాల్లో కోతలు, ద్రవ్యోల్బణం వంటి పరిణామాలను దాదాపు అన్ని వెనుకబడిన దేశాల్లోనూ చూడవచ్చు. అర్జెంటైనాలో బద్దలైన తాజా సంక్షోభం ఈ వాస్తవాన్ని మరోసారి నిరూపించింది.

1983 తర్వాత ఐఎంఎఫ్ అర్జెంటైనాకు తొమ్మిది సార్లు అప్పు మంజూరు చేసింది. ప్రతిసారీ దేశ ఆర్థికవ్యవస్థ మరింతగా అప్పుల ఊబిలో దిగబడిపోయింది.1995లో 35 బిలియన్ డాలర్లుగా ఉన్న అర్జెంటైనా అప్పు నేటికి 141 బిలియన్ డాలర్లకు పెరిగింది. ఈ మొత్తం అభివృద్ధి చెందుతున్న దేశాలన్నింటి మొత్తం అప్పులో ఏడవ భాగంగా ఉంటుంది. దేశ స్థూల జాతీయోత్పత్తి (జిడిపి – 280 బిలియన్ డాలర్లు)లో ఈ అప్పు సగభాగం అవుతుంది. డిసెంబర్ 2001లో ఐఎంఎఫ్ మరో విడత అప్పివ్వడానికి నిరాకరించింది.ఐఎంఎఫ్ ఆదేశాలను అమలు చేస్తూ రాష్ట్రపతి ఫెర్నాండో డెలా రువా ప్రభుత్వోద్యోగుల వేతనాల్లోనూ, పెన్షన్లలోనూ 18 నెలల వ్యవధిలో 7 సార్లు కోత విధించాడు. దీంతో అర్జెంటైనాలోని కార్మికులూ, రైతులూ మరింతగా పేదరికం బారిన పడ్డారు. దేశంలోని మూడో వంతు ప్రజలు ముందు నుండే దారిద్ర్యరేఖకు దిగువన జీవిస్తూ ఉన్నారు. నిరుద్యోగం రేటు 20 శాతం వరకు పెరిగింది. అల్పనిరుద్యోగం రేటు కూడా దాదాపు ఇంతే అయ్యింది. రాష్ట్రపతి ఫెర్నాండో, అతడి ఆర్థిక సలహాదారు కావెల్లో డొమినగో ప్రజలకు ఏమైనా ఇచ్చారంటే, కేవలం పరిశ్రమల ప్రైవేటీకరణ, లాకౌట్లు, ఉద్యోగుల సంఖ్యలోనూ, వేతనాల్లోనూ కోత మాత్రమే.

ఐఎంఎఫ్ ద్వారా అమెరికా అమలు చేసే అభివృద్ధి నమూనా సాధారణంగా ఇలా ఉంటుంది – ముందుగా అభివృద్ధి చెందుతున్న దేశాల ఆర్థికవ్యవస్థల తలుపులు విదేశీ పెట్టుబడిదార్లు చొరబడేందుకు వీలుగా బార్లా తెరిపిస్తుంది. ఆ తర్వాత ఆ దేశాల బ్యాంకులను, పబ్లిక్ రంగ కంపెనీలను, ప్రజోపయోగ సంస్థలను అన్నింటినీ విదేశీ పెట్టుబడిదార్లకు అమ్మేలా వత్తిడి తెస్తారు. విదేశీ పెట్టుబడిదార్లు అభివృద్ధి చెందుతున్న దేశాల బడ్జెట్లను నిర్ణయిస్తూ ప్రభుత్వం పాత్రను నియంత్రిస్తారు. ఆ తర్వాత వీరి లక్ష్యం సామాజికాభివృద్ధి కార్యక్రమాలను కుదించివెయ్యడం, వేతనాలను తగ్గించడంగా ఉంటుంది. అభివృద్ధి చెందుతున్న దేశాల పట్ల అమెరికా విధానం ఇది – "నేనెట్లా చెబుతానో అట్లా నడువ్, నేనెట్లా నడుస్తానో అట్లా కాదు."

డిసెంబర్ 2001లో అర్జెంటైనా సాధారణ ప్రజలు బ్యాంకర్ల ద్వారా, యజమానుల ద్వారా నడుస్తున్న బాధామయ వ్యవస్థను స్పష్టంగా నిరాకరించారు. డిసెంబర్ 20 వరకు దేశ రాజధాని బ్యూనోస్ ఎయిర్స్ సహా ప్రతి పట్టణంలోనూ, ప్రతి నగరంలోనూ ప్రజా ప్రదర్శనలు వెల్లువెత్తాయి. రాష్ట్రపతి ఆర్థిక సలహాకారు కావెల్లో డొమినగో తన పదవికి రాజీనామా ఇవ్వక తప్పలేదు. ఆ తర్వాత రాష్ట్రపతి ఫెర్నాండో కూడా అదే దారి పట్టాడు. కొత్త ప్రభుత్వానికి కూడా వారం రోజుల పాటు సాగిన ప్రజా ప్రదర్శనలు స్వాగతం చెప్పాయి.

డిసెంబర్ ఉద్యమానికి ఊపిర్లు పోసిన ఘనత ముఖ్యంగా నిరుద్యోగులకు దక్కుతుంది. వీళ్లు చాలా కాలం నుండే పెద్ద ఎత్తున వరుసగా ఉద్యమాలు నిర్వహిస్తూ వస్తున్నారు. ప్రదర్శనల్లో ప్రజలను పెద్ద ఎత్తున కదిలించడంలో వీరి పాత్రే గణనీయమైంది. నిరుద్యోగ కార్మికుల ఉద్యమాలు గడచిన 5 సంవత్సరాలుగా బాగా ఊపందుకున్నాయి. పోయిన సంవత్సరం అవి దేశవ్యాప్తంగా వ్యాపించడమే కాకుండా ప్రభుత్వాన్ని సవాలు చేయగల స్థాయికి అభివృద్ధి చెందాయి. సరకుల సరఫరాను నిలిపివెయ్యడమూ, రవాణా వ్యవస్థను స్తంభింపజెయ్యడమూ ఈ ఉద్యమపు ముఖ్యమైన ఎత్తుగడల్లో భాగం. వీరు ముఖ్యమైన జాతీయ రహదారులను చక్కాజాం చేసి తమ డిమాండ్లను సాధించే ఎత్తుగడలను అవలంబించేవారు. ఈ ఉద్యమంలో మహిళలు చాలా ముఖ్యమైన పాత్ర నిర్వహించారు.

మధ్య తరగతి ప్రజలు బ్యాంకుల్లో పొదుపు చేసుకున్న కోట్లాది డాలర్ల డబ్బును ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడంతో ఆ వర్గాల ప్రజలు కూడా వందల సంఖ్యలో వీధుల్లోకి వచ్చి నిరసన ప్రదర్శనల్లో పాల్గొన్నారు. వీరిలో చైతన్యవంతమైన మధ్యతరగతి వర్గం సహా విప్లవకర వర్గం కూడా కలిసి ఉంది. ఈ వర్గాల ప్రజలు తాము పొదుపు చేసిన డబ్బంతా పోగొట్టుకున్నారు. కిరాయి చెల్లించడానికైనా, బిల్లులు కట్టడానికైనా వీరి వద్ద డబ్బు లేకుండింది.

ఒకవైపేమో నిరుద్యోగుల వద్ద డబ్బు లేదు. మరోవైపు బ్యాంకులలో యజమానుల ఖాతాలు స్తంభింపజెయ్యడంతో ఉద్యోగులకూ, కార్మికులకూ వేతనాలు లేవు. బ్యాంకర్లు న్యూయార్క్ షేర్ మార్కెట్‌లో షేర్లు కొనుక్కొని డబ్బును దేశం నుండి బయటికి తరలించసాగారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వోద్యోగులతోనూ, దుకాణదార్లతోనూ ఏర్పడిన విశాలమైన ఫ్రంట్ బ్యాంకర్లకు వ్యతిరేకంగా పనిచేసింది.

నిరుద్యోగుల ఉద్యమంలో పాల్గొన్న క్రియాశీల కార్యకర్తలలో మానసిక సంసిద్ధతా, పోరాటానుభవమూ మెండుగా ఉన్నాయి. వాళ్లకు తమ డిమాండ్ల గురించి చాలా బాగా తెలుసు. వాళ్లు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు సృష్టించగల ప్రాజెక్టులు, కనీస వేతనాలు, నిరుద్యోగ భృతి, అప్పుల మాఫీ, ఆర్థికంగా వ్యూహాత్మక రంగాలను తిరిగి పబ్లిక్ రంగం కిందికి తేవడం వంటి డిమాండ్లు ముందుకు తెస్తున్నారు.

అర్జెంటైనాలో పారిశ్రామిక కార్మికుల శాతం 40 నుండి 20కి తగ్గింది. నిరుద్యోగ యువకులు పట్టణాల్లో వీధుల్లో సరుకులమ్మే వ్యాపారులుగా మారిపోయారు. వీరిలో స్టీలు, ఇనుము, మెకానికల్ కార్ఖానాల్లో పనిచేసిన కార్మికులున్నారు. ఉద్యోగాలు కోల్పోయిన కార్మికుల భార్యలు ప్రజా పోరాటాల్లో మిలిటెంట్‌గా పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మాంసం, పప్పు దినుసుల ఉత్పత్తిలో ప్రపంచంలోనే పేరుగాంచిన అర్జెంటైనా కార్మికులు నేడు ఆకలితో అలమటిస్తున్నారు. వాళ్లకు తినడానికి మాంసం దొరకడం లేదు. పిల్లలకు పెట్టడానికి రొట్టె ముక్క కరువైంది. ప్రజలు తాము పొదుపు చేసిన డబ్బంతా కోల్పోయారు. ప్రజల్లో నిరాశానిస్పృహలు పెరిగాయి.

## వర్గ పోరాటాలు

అర్జెంటైనాలో చాలా కాలంగా కార్మిక సంఘాలు పనిచేస్తూ వస్తున్నాయి. ప్రపంచంలోని ఇతర దేశాలతో పోల్చితే అర్జెంటైనాలో సాధారణ సమ్మెలు ఎక్కువగా జరుగుతున్నాయి. పర్మినెంట్ ఉద్యోగం లేని పారిశ్రామిక కార్మికులు ఎక్కువగా ఉన్న దేశం అర్జెంటైనా. అర్జెంటైనాలో నిరుద్యోగ కార్మికుల సంఘటిత కార్యకలాపాలు చాలా ఎక్కువగా సాగుతాయి. గడచిన 5-10 సంవత్సరాల్లో కార్మిక సంఘాలు నిర్వహించిన సాధారణ సమ్మెలకన్నా, నిరసన చర్యలకన్నా పోయిన డిసెంబర్ 20న జరిగిన ప్రజా ప్రదర్శన ఎంతో ముఖ్యమైంది. ప్రజలు బాహాబాహీ పోరాటాలకు దిగి ప్రభుత్వాన్ని తన ఎజెండాలో అనేక ముఖ్యమైన మార్పులు చేసే పరిస్థితికి నెట్టివేశారు.

ఈ ఉద్యమం అనేక సమస్యలను చాలా శక్తివంతంగా ముందుకు తెచ్చింది. విదేశీ రుణాల రద్దు సమస్యను ఒకప్పుడు కమ్యూనిస్టుల ఎజెండాలోని సమస్యగా భావించేవారు. అదిప్పుడు ప్రధాన స్రవంతిలోని సాధారణ సమస్యగా మారిపోయింది. వ్యూహాత్మక పరిశ్రమలను తిరిగి జాతీయీకరించాలన్న డిమాండు ఇప్పుడు కొద్ది మంది చేసే పరిమితమైన డిమాండుగా లేదు, వేలాది ప్రజల డిమాండుగా మారింది. అర్జెంటైనా ప్రజా ఉద్యమం ప్రధానంగా సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలకు విఘాతం కలిగించింది. మొత్తానికి, సామ్రాజ్యవాద ద్రవ్య సంస్థల నుండి అప్పులు తెచ్చి, వాటి ఆదేశాలను అమలు చేయడం వల్ల వెనుకబడిన దేశాల ఆర్థికవ్యవస్థలు ఎట్లా దివాళా తీస్తాయో దీని ద్వారా మరోసారి స్పష్టంగా రుజువయ్యింది.

## ఒక విప్లవకర కమ్యూనిస్టు పార్టీ లేకపోవడం

లెనిన్ చెప్పినట్టుగా, ఒక విప్లవం జరగాలంటే దోపిడీపీడనలకు గురవుతున్న ప్రజారాసులు ఇక పాత పద్ధతుల్లో జీవించడం సాధ్యపడదు అని గ్రహించినంత మాత్రానా, మార్పును కోరుకున్నంత మాత్రానా చాలదు. ఒక విప్లవం జరగాలంటే పాత పద్ధతుల్లో జీవించడమూ, రాజ్యాన్ని చెలాయించడం దోపిడీదార్లకు అసాధ్యం కావాలి. ''నిమ్న వర్గాలు'' పాత పద్ధతులలో జీవించ నిరాకరించినప్పుడూ, ''ఉన్నత వర్గాలు'' పాత పద్ధతుల్లో కొనసాగ వీల్లేనప్పుడూ మాత్రమే విప్లవం విజయవంతం అవుతుంది. (వామపక్ష కమ్యూనిజం - ఒక బాలారిష్టం) విప్లవ పరిస్థితులున్నంత మాత్రాన విప్లవం దానంతట అదే రాదు. విప్లవానికి నాయకత్వం వహించే సామర్థ్యం గల ఒక విప్లవ పార్టీ లేనట్టయితే ఆ అవకాశాన్ని కోల్పోతాము.

అర్జెంటైనా అంతటా డిసెంబర్‌లో ప్రజారాసులు తిరుగుబాట్లు జరిపారు; సమ్మెలు చేశారు; వీధుల్లో బ్యారికేడ్లు నిర్మించారు; ముఖ్యమైన రహదారుల్ని జాం చేశారు; ప్రభుత్వం రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు; తమకు ఏ బూర్జువా రాజకీయ నాయకుడి పైనా నమ్మకం లేదని వాళ్లు ప్రకటించారు. ఈ క్రమంలో అనేక మిలిటెంట్ ట్రేడ్ యూనియన్ల నిర్మాణం జరిగింది. ప్రభుత్వంతో కుమ్మక్కైన సిజిటి వంటి గుర్తింపు పొందిన ట్రేడ్ యూనియన్‌లతో తెగతెంపులు చేసుకొని కార్మికులు కొత్త సంఘాలు నిర్మించుకున్నారు.

అర్జెంటీనాలో 1990లో అనేక మిలిటెంట్ పోరాటాలు జరిగాయి. ఈ పోరాటాల ద్వారా కార్మికులు అనేక విజయాలు సాధించారు. అయితే ప్రజల మిలిటెన్సీకి సరైన దిశనిచ్చి మార్క్సిజం-లెనినిజం-మావోయిజం మార్గదర్శకత్వంలో సోషలిజం స్థాపన లక్ష్యంగా సామ్రాజ్యవాదానికీ, దళారీ పెట్టుబడికీ వ్యతిరేకంగా పోరాడే చొరవ గల ఒక కమ్యూనిస్టు పార్టీ అక్కడ లేదు. ఇలాంటి స్థితిలో ప్రజలు ఎంత వీరోచితమైన పోరాటాలు జరిపినప్పటికీ పరిమితమైన ఫలితాలు మాత్రమే ఉంటాయి. ముఖ్యంగా అర్జెంటైనా కార్మికవర్గానికి అక్కడ తలెత్తుతున్న ప్రతి ఒక్క సమస్యకూ మూలం ప్రస్తుత పెట్టుబడిదారీ విధానంలో ఉందన్న విషయాన్ని అర్థం చేసుకోవాల్సి ఉంటుంది. అది రైతాంగంతోనూ, మధ్య తరగతి వర్గాలతోనూ, ఇతర ప్రజాస్వామిక వర్గాలతోనూ ఐక్యతను సాధించి సోషలిజం స్థాపనను లక్ష్యంగా చేసుకొని, తన శత్రువులను స్పష్టంగా గుర్తించి, విశాల పోరాటానికి సమాయత్తం కానంత వరకు అర్జెంటైనా పీడిత జనావళికి నిజమైన విముక్తి లేదు.

ముఖ్యంగా అమెరికన్ సామ్రాజ్యవాదం తన పెరట్లోనే ఉన్న అర్జెంటైనాలోని ఈ పరిణామాలను చూస్తూ ఊరుకోదు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంతో పనికాదనుకున్న ప్రతిసారీ అది తన గూఢచర్య సంస్థ సిఐఏ ద్వారా సైనిక తిరుగుబాటు పథకాన్ని అమలు జరిపిస్తుంది. ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్షలను సైనిక నియంతల ద్వారా క్రూరంగా అణచివేస్తుంది. అర్జెంటైనా పీడిత ప్రజలు ఈ కుట్రలను అర్థం చేసుకుంటారనీ, తమ పోరాటాలను ఉధృతం చేస్తారనీ ఆశిద్దాం. ❐

### పాఠకులకు విజ్ఞప్తి

- 'ప్రభాత్'కు రెగ్యులర్‌గా, వెంటవెంట రిపోర్టులూ, వ్యాసాలూ రాసి పంపించండి. రిపోర్టులు కాగితానికి ఒకవైపే రాసి పంపితే మంచిది. రిపోర్టులో పేర్కొంటున్న ఘటన/కార్యక్రమం జరిగిన తేదీ, స్థలం, డివిజన్ వంటివి తప్పక రాయండి.
- 'ప్రభాత్'పై మీ విమర్శనాత్మక వ్యాఖ్యలు తప్పకుండా, రెగ్యులర్‌గా పంపండి. 'ప్రభాత్'ను మరింతగా మెరుగు పర్చుకోవడానికి ఇది చాలా అవసరం.
- వివిధ ప్రజా కార్యక్రమాలకు సంబంధించి 'ప్రభాత్'కు పంపించే ప్రతి ఫోటోకు వెనుక అది ఏ డివిజన్‌లో, ఏ ఏరియాలో, ఏ సందర్భంగా, ఏ తేదీన తీసిందో తప్పక రాసి మాకు సహకరించగలరు. చాలా ఫోటోలు కలగలిసిపోయి ఏది ఏ డివిజన్‌దో, ఏ కార్యక్రమానికి సంబంధించినదో తెలువకుండా పోతున్నది.
- 'ప్రభాత్'ను ఈ-మెయిల్ ద్వారా కాంటాక్టు చేయవచ్చు.

మా ఈ-మెయిల్ అడ్రస్ :
**prabhat_dk@yahoo.com**

*– సంపాదకవర్గం*

# కెయస్ మరణం : మాజీ విప్లవకారుడి విషాదాంతం

"ఈనాడు ప్రపంచ విప్లవోద్యమం ఎదుర్కొంటున్న అతి పెద్ద ప్రమాదం రివిజనిజమే. అలాగే భారతదేశంలో కూడా, కమ్యూనిస్టు ఉద్యమం ఎదుర్కొంటున్న అతి పెద్ద ప్రమాదం రివిజనిస్టు సిపిఐ, సిపిఎంల నుండీ, మా-లె-మా ముసుగు వేస్కొని నక్సల్బరీనీ, కా. చారుమజుందార్ విప్లవ పంథానూ వ్యతిరేకించే మితవాద అవకాశవాద గ్రూపుల నుండే. ఈ కుహనా కమ్యూనిస్టులు నిన్నెంతగా ద్వేషిస్తే నువ్వు అంతగా విప్లవకారుడి/విప్లవకారిణివవుతావు. ఈ అవకాశవాదులతో ఎలాంటి రాజీ ఉండరాదు."

రివిజనిస్టులకూ, మా-లె ఉద్యమంలోని మితవాద అవకాశవాదులకూ వ్యతిరేకంగా ఈ తీవ్రమైన వ్యాఖ్యలు చేసినది ఎవరో కాదు, ఒకప్పటి ప్రముఖ విప్లవకారుడు కొండపల్లి సీతారామయ్యే (కెయస్). 1972లో కామ్రేడ్ చారు మజుందార్ (సియం) అమరత్వం తర్వాత, యావత్ దేశంలో ఉద్యమం బాగా వెనుకపట్టు పట్టిన స్థితిలో ఆంధ్రప్రదేశ్‌లో సిపిఐ (ఎం-ఎల్)ని పునర్నిర్మించిన ఒకనాటి అనుభవజ్ఞుడయిన విప్లవకారుడాయన. అయితే హాస్యాస్పదంగా, కెయస్ మరణం అందరికంటే మిన్నగా విచారాన్ని కల్గించింది ఆ అవకాశవాదులకే. రెండు రోజుల తర్వాత జరిగిన ఆయన అంత్యక్రియలలో రివిజనిస్టు కేంపుకు చెందిన ప్రముఖులంతా పాల్గొన్నారు, ఆయన మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి తీరనిలోటంటూ తమ ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. వారిలో సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి బివి రాఘవులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి, యంఎల్ పార్టీలుగా పిలువబడే కొన్ని పార్టీల నాయకులు, ఆఖరుకు ఒకప్పుడు సోషలిస్టులుగా ఉండి ఇప్పుడు సోషల్ ఫాసిస్టులుగా మారిన సమతాపార్టీ రాష్ట్ర నాయకులు కూడా ఉన్నారు. అయితే ఆ అంత్యక్రియల్లో కొందరు విప్లవ శ్రేయోభిలాషులు కూడా, ముఖ్యంగా 1991కి ముందు కెయస్ రెండు దశాబ్దాల పాటు విప్లవోద్యమం నడిపినపుడు ఆయన్ని సన్నిహితంగా ఎరిగినవారు పాల్గొన్నారు.

అయితే ఆ అంత్యక్రియల్లో పాల్గొన్న వెయ్యికి కాస్త ఎక్కువగా ఉన్న జనాలను చూస్తే గనుక ఒకప్పుడు ఆయన నేతృత్వం వహించి విప్లవ కార్యాచరణలోకి ఉత్తేజపరచి కదలించిన విప్లవ ప్రజానీకం ఎవరూ లేకపోవడం (విప్లవ కొద్ది మంది శ్రేయోబిలాషుల్ని మినహాయిస్తే) కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. 22 ఏళ్ల క్రితం 1980 ఏప్రిల్ 22న భాకపా (మా-లె) [పీపుల్స్‌వార్]ని నెలకొల్పిన వాడూ, ఎన్నో ఒడిదుడుకుల మధ్య దానికి సారథ్యం వహించిన వాడూ, 1970ల తొలినాళ్లలో శ్రీకాకుళ పోరాటం వెనుకపట్టు పట్టినపుడు ముక్కలుచెక్కలు కాగా దాదాపు ఏమీ మిగలకుండా పోయిన పార్టీని ఒక ధృఢమైన శక్తిగా మార్చిన వాడూ అయిన వ్యక్తికి ఇది నిజానికి విచారకరం అనేకంటే, విషాద-హాస్యాస్పదమైన ముగింపు అనవచ్చు.

సూటిగా చెప్పాలంటే ఒక స్థానిక పార్టీ ఆర్గనైజర్ లేదా ప్రజాసంఘ కార్యకర్త లేదా పౌరహక్కుల కార్యకర్త మరణిస్తే వారి అంతిమయాత్రలకు వేలాది ప్రజలు కదలివస్తున్నారు. వారి అంతిమయాత్రలకు హాజరుకారాదని పోలీసులు పలు రకాల అడ్డంకులు కలిగించినప్పటికీ, తీవ్రమైన బెదిరింపులు చేసినప్పటికీ వాటిని లెక్కచేయకుండా ప్రజలు వస్తున్నారు.

ఒక సుభాష్, ఒక రమాకాంత్, ఒక డాక్టర్ నారాయణ లేదా ఒక పురుషోత్తం తమ మరణంతో కూడా వేలకు వేల ప్రజల్ని ఉత్తేజపరచి కదిలిస్తుంటే, 1970-80 దశకాల ప్రముఖ విప్లవకారుడు చనిపోతే దాన్ని ప్రజానీకం పెద్దగా పట్టించుకోనే లేదు. ఒక శ్యాం, ఒక మహేష్, ఒక మురళి మరణం లక్షలాది విప్లవ ప్రజానీకాన్ని కన్నీరు పెట్టిస్తే, ఇలాంటి నాయకులను స్వయంగా తర్ఫీదు చేసిన కెయస్ మరణానికి కొద్దిమంది మాత్రమే, అందులోనూ రివిజనిస్టులు సంతాపం తెలిపారెందుకు? '90ల తొలినాళ్ల వరకు పాలకవర్గాలకు నిజమైన ఛాలెంజ్‌గా ఉన్న వ్యక్తి అంత కొద్ది కాలంలో ఆంధ్రప్రదేశ్‌లోని విప్లవ ప్రజానీకానికి ప్రాముఖ్యత లేని వాడెలా అయ్యాడు? దీనికి జవాబు చెప్పాలంటే, కెయస్ ఎదుగుదలా పతనముల గతితర్కంలోకీ, ఒక విప్లవకారుడు విప్లవకారుడు కాకుండా పోయిన పరిణామక్రమంలోకీ, గొప్ప వ్యక్తులకూ ఉద్యమానికీ ఉండే గతితార్కిక సంబంధంలోకీ వెళ్లాల్సి ఉంటుంది.

తన జీవితంలోని అత్యధిక భాగం గొప్ప విప్లవకారుడిగా జీవించగల్గిన ఒక వ్యక్తి, ఎప్పుడైతే నమ్రతగా ఉండలేకపోతాడో, కేడర్ల నుండీ ప్రజానీకం నుండి నేర్చుకోలేకపోతాడో, తన స్వీయ అనుభవంతోనే పరిమితమైన జ్ఞానంతోనే ఆత్మసంతృప్తి చెందుతాడో, అలాగే ఉద్యమావసరాలకు అనుగుణంగా ఎదగలేకపోతాడో, అప్పుడు అతను అందుకు విరుద్ధంగా మారవచ్చుననడానికి కెయస్ జీవితమూ, మరణమూ ఒక సజీవ ఉదాహరణ. కెఎస్ సుదీర్ఘ రాజకీయ జీవితం విప్లవకారులకు పాజిటివ్, నెగెటివ్ గుణపాఠాలు అందిస్తుంది. నేడు దేశ ప్రజలకూ, విప్లవోద్యమానికీ కెయస్ అప్రస్తుతమైనప్పటికీ, ఒక విప్లవకారుడి నిర్మాణానికీ, పతనానికీ సంబంధించిన ముఖ్యమైన గుణపాఠాలు తీసుకోవడానికి గానూ, అతని రాజకీయ జీవితాన్ని అంచనావేయడం విప్లవకారులకు అవసరం.

మావో చెప్పినట్లు, ఒక వ్యక్తి తన జీవితంలో కొంతకాలం పాటు విప్లవ కమ్యూనిస్టుగా ఉండగలగడం సులభమే కానీ జీవితాంతం విప్లవ కమ్యూనిస్టుగా ఉండగలగడం కష్టమైన విషయం. అందువల్ల కమ్యూనిస్టు విప్లవకారుడి/ణి గా నిజమైన పరీక్ష, అతడు/ఆమె తన జీవితంలో అధిక భాగం కమ్యూనిస్టుగా ఎలా జీవిస్తారన్నది కాదు, కమ్యూనిస్టుగా ఎలా జీవిస్తారు, ఎలా మరణిస్తారు అన్నదే. కెయస్ తన జీవితంలో అత్యధిక భాగం కమ్యూనిస్టు విప్లవకారుడిగా జీవించాడు కానీ ఆయన తన సుదీర్ఘ విప్లవ జీవితంలోని చివరిదశలో కమ్యూనిస్టు కాకుండాపోవడంతో ప్రజల్లో ఆయన సాధించిన విజయాలూ, గుర్తింపూ అన్నింటినీ కోల్పోయాడు.

మనం అంతర్జాతీయ కమ్యూనిస్టు విప్లవోద్యమ చరిత్రలో ప్లెఖనోవ్, కారల్ కాట్స్కీలను గురించి విన్నాం. వీరు ప్రారంభ సంవత్సరాల్లో లక్షలాది ప్రజలను ఉత్తేజపరచి, కమ్యూనిస్టు పార్టీలను గైడ్ చేసినవారు. అయితే విప్లవాలు పురోగమించే క్రమంలో రివిజనిస్టులుగా, రెనగేడ్‌లుగా కూడా మారిపోయారు. ఇపుడు మనం మన కళ్లముందే అలాంటి ప్లెఖనోవ్‌ను లేదా కాట్స్కీని చూస్తున్నాం.

## 1991 వరకు గొప్ప విప్లవకారుడు

1905కు ముందు ప్లెఖనోవ్ లాగ, 1912కు ముందు కాట్స్కీ లాగ కెయస్ కూడా 1991 వరకు గొప్ప విప్లవకారుడే. ఆ కాలం వరకు ఆయన ప్రదర్శించిన విప్లవ గుణాలు – నిర్దిష్ట పరిస్థితుల నిర్దిష్ట విశ్లేషణ, విప్లవకర ప్రజాపంథాను అంటిపెట్టుకొని ఉండటం, విప్లవ జాగరూకత, రివిజనిజానికీ మితవాద అవకాశవాదానికీ వ్యతిరేకంగా రాజీలేని పోరాటం, వంటి గుణాలను విప్లవకారులందరూ అలవర్చుకోవాలి. నక్సల్బరీ-శ్రీకాకుళాలు, ఇతర సాయుధ వ్యవసాయ విప్లవోద్యమాల ఓటమితో భారతదేశంలో విప్లవం తీవ్రంగా దెబ్బతిన్నప్పుడు; కామ్రేడ్ చారుమజుందార్ అమరత్వంతో కేంద్ర కమిటీయే

లేకుండా పోయినపుడు; ఎస్ఎన్ సింగ్, కాను సన్యాల్, నాగభూషణం పట్నాయక్ వంటి ముఖ్యమైన నాయకులూ ఇతరులూ కామ్రేడ్ సియంకు వ్యతిరేకంగా విషం గక్కుతూ సిపిఐ(ఎం-ఎల్) సాధించిన విజయాలన్నింటినీ నిరాకరిస్తున్నప్పుడు; మితవాద అవకాశవాదం మొత్తంగా నిండిపోయి ఉద్యమానికి ద్రోహం చేస్తున్నప్పుడు నగ్జల్బరీనీ, పార్టీ విప్లవపంథానూ సమర్థిస్తూ, గతాన్ని సరిగ్గా సమీక్షిస్తూ తగిన గుణపాఠాలు తీసుకొని దాన్ని మరింతగా సుసంపన్నం చేసిన అతి కొద్ది మంది విప్లవకారుల్లో కెయస్ ఒకరు. 'ఆత్మవిమర్శనా రిపోర్టు'గా పిలిచే, గతాన్ని సమీక్షించే ఈ డాక్యుమెంటే ఇప్పటికీ 1960 దశకం చివరా, '70ల తొలినాళ్లలోనూ సాగిన ఉద్యమాన్ని వస్తుగతంగా సమీక్షించిన ఏకైక డాక్యుమెంటు.

ఈ ఆత్మవిమర్శనాత్మక అంచనా నుండి తీసుకున్న గుణపాఠాలపై ఆధారపడి కెయస్ నాయకత్వంలోని ఆం.ప్ర. రాష్ట్ర కమిటీ ఉద్యమాన్ని పునర్ నిర్మించి, 1980లో భాకపా (మా-లె) [పీపుల్స్‌వార్]ని ఏర్పరిచింది. త్వరలోనే పార్టీ, ఉద్యమమూ అఖిల భారత స్వభావాన్ని సంతరించుకుంటూ పలు రాష్ట్రాలకు విస్తరించాయి. కెయస్ 1970-80లలో ఆంధ్రప్రదేశ్‌లోని టిఎన్ రెడ్డి-సిపి రెడ్డి-డివి రావు గ్రూపుతోనూ, ఎస్ఎన్ఎస్ గ్రూపుతోనూ 1980లలో లిబరేషన్ గ్రూపుతోనూ సైద్ధాంతిక-రాజకీయ పోరాటం సాగించాడు. ఉద్యమం వెనుకంజ తర్వాత యం-ఎల్ ఉద్యమంలో మితవాద అవకాశవాదమే ప్రధాన ప్రమాదమని గుర్తిస్తూనే, 1970లలో ఆంధ్రప్రదేశ్ పార్టీలో అతివాద పెడధోరణి ప్రభావం ఇంకా ఉందని గుర్తిస్తూ, పార్టీని విప్లవకర ప్రజాపంథాలోకి తీసుకువచ్చే ప్రయత్నాలు సాగాయి. ఈ పంథాపై ఆధారపడే 70ల చివర్లో రాష్ట్రవ్యాపిత ప్రజా ఉద్యమాన్నీ, అలాగే ఉత్తర తెలంగాణాలోని కొన్ని ప్రాంతాలలో సాయుధ వ్యవసాయ విప్లవోద్యమాన్నీ నిర్మించారు. త్వరలోనే ఇది యావత్ తెలంగాణాకూ, దండకారణ్యానికీ, ఆంధ్రప్రదేశ్‌లోని ఇతర ప్రాంతాలకూ విస్తరించింది. బేస్ ఏరియాలు నెలకొల్పే దీర్ఘకాల పర్‌స్పెక్టివ్‌తో, వ్యూహాత్మక ప్రాంతాలను గెరిల్లా జోన్లుగా అభివృద్ధి చేసే దూరదృష్టితో ఉత్తర తెలంగాణా, దండకారణ్యాలలో ఉద్యమాన్ని నిర్మించిన ఖ్యాతి కెయస్‌కు దక్కుతుంది. కెయస్ మొత్తం ఒక తరం వృత్తి విప్లవకారుల్నీ, పార్టీ ఆర్గనైజర్లనూ తర్ఫీదు చేసాడు. ఆయన తన కుటుంబ సభ్యుల్ని కూడ విప్లవాభిమానులుగా తయారుచేసాడు. ఆయన కొడుకు చంద్రశేఖర్ 1969లో పోలీసు కాల్పుల్లో అమరుడయ్యాడు.

## కెయస్ పరిమితులు, పార్టీ వ్యతిరేక ముఠా ఏర్పాటు

అయినప్పటికీ, 1987 తర్వాత ఆయనలో రాజకీయ-నిర్మాణపరమైన పరిమితులు పొడసూపసాగాయి. అప్పటికే ఆయన పార్కిన్‌సన్ వ్యాధితో బాధపడుతున్నాడు. 1980ల చివరి వరకు ఆయన ఉద్యమపు గతితర్కాన్ని అర్థం చేసుకోవడంలో విఫలమవసాగాడు; విప్లవం యొక్క సంక్లిష్టమైన, వైవిధ్యం గల కర్తవ్యాలను నెరవేర్చడంలో విఫలమై ఉద్యమానికి వెనుకబడిపోయాడు. పెరుగుతున్న ఉద్యమావసరాలకు అనుగుణంగా పార్టీకి రాజకీయ, నిర్మాణ, సైనిక గైడెన్సు ఇవ్వడంలో ఆయన విఫలమౌతున్నప్పటికీ, దాన్ని గుర్తించ నిరాకరించి అంతకంతకూ బ్యూరాక్రటిక్‌గా తయారయ్యాడు. ఫలితంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ, 1990 ఆగస్టులో ఏర్పడిన సిపిసిల సమిష్టి పనికి ఆటంకంగా మారాడు. ప్రసాద్, బండయ్య, వేణు మరికొద్ది మందితో అవకాశవాదుల కలయికతో ఏర్పడిన కెరీరిస్టుల చిన్న గ్రూపు ఒకటి ఆయన చుట్టూ తిరగసాగింది. వీరు లిక్విడేషనిస్టు అరాచక ముఠాగా ఏర్పడి, తమ వ్యక్తిగత ప్రయోజనాలను విప్లవ ప్రయోజనాలకు పైన నిలిపారు. వీరు కెయస్ తేజస్సు వెనుక దాగబడి, ఆంధ్రప్రదేశ్‌లోని పార్టీ నాయకత్వానికి వ్యతిరేకంగా దుష్ప్రచార కేంపెయిన్‌ను ప్రారంభించి, పార్టీ వ్యతిరేక కార్యకలాపాలు సాగించారు. కెయస్ ఈ అరాచకవాద ముఠా నుండి వేరు బడడానికి బదులు, వారిని సమర్థించి 1991 నాటికల్లా స్వయంగా పార్టీ వ్యతిరేక కార్యకలాపాల్లో భాగమయ్యాడు. 1992 మధ్య వరకు కెయస్‌నూ, ఆయన నాయకత్వం వహిస్తున్న అవకాశవాద-విచ్ఛిన్నకర ముఠానూ పార్టీ నుండి బహిష్కరించారు. ఈ దశలో, కెయస్‌లో మితవాద పెడధోరణి కూడా తలెత్తింది.

ఆ విధంగా, 1991 వరకు కెయస్ విప్లవకారుడిగా కొనసాగినా, 1987 తర్వాత ఆయనలో బ్యూరాక్రటిక్ ధోరణి ఆధిపత్యంలోకి వచ్చింది. పార్టీ విజయాలనూ, తాను స్వయంగా గడించిన పేరునూ చూసుకొని ఆయనలో అహంకారం పెరిగిపోయింది. నాయకుడికీ కేడర్లకూ మధ్య సంబంధాన్ని అర్థం చేసుకోవడంలో విఫలమై విప్లవకర ప్రజాపంథాను వదలిపెట్టాడు. ఒక పెటీ బూర్జువా అహంభావి లాగా తన ప్రతిభాపోషాల వల్లనే ఉద్యమం విజయాల్ని సాధించగలిగిందన్న భ్రమలో పడిపోయాడు. ఆయన సమిష్టి పనిని వదలిపెట్టి, తాను కార్యదర్శిగా వున్న కమిటీకే తనను అతీతుణ్ని చేసుకున్నాడు. తోటి కమిటీ సభ్యులూ, ఇతర కేడర్లూ పెట్టిన ఎలాంటి విమర్శకైనా చాలా అసహనాన్ని ప్రదర్శించాడు. అలాగే పూర్తిగా వ్యక్తిగత పని శైలిని చేబట్టాడు. 1991 నాటికి, తనకు తానే వ్యతిరేకిగా మారాడు. ఏ పార్టీ పునర్నిర్మాణంలోనైతే ఆయన ఒక కీలక పాత్ర పోషించాడో, అదే పార్టీ నుండి ఆయనను బహిష్కరించడం మినహా పార్టీ నాయకత్వానికి మరో దారి లేని విధంగా మారాడు.

ఆ విధంగా, పార్టీకి విప్లవ ప్రజానీకానికీ కెయస్ ఎన్నడో, అంటే 1991లోనే రాజకీయంగా చనిపోయాడు. అందువల్ల 2002 ఏప్రిల్ 12న ఆయన భౌతిక మరణం అప్రస్తుతమైన ఘటన అయింది.

పార్టీ నుండి బహిష్కరించిన లేదా రాజకీయ విభేదాల పేరుతో తమంతట తామే పార్టీ నుండి వైదొలిగిన కెయస్, తదితర పిడికెడు మంది అరాచకవాదుల గత దశాబ్ద కాలపు ఆచరణ, వారిని బహిష్కరిస్తూ పీపుల్స్‌వార్ నాయకత్వం చేసిన అంచనా సరైందేనని రుజువు చేసింది. ఆ పార్టీ వ్యతిరేక ముఠాలోని నాయకుల మధ్య ఐక్యతకు పదవీవ్యామోహం (మరి కొందరి విషయంలో కెయస్ పట్ల గుడ్డి భక్తి, భూస్వామ్య విధేయత) తప్ప మరే పునాదీ లేదన్నది వారు తమలో తాము కొట్లాడుకుంటూ చీలిపోయినపుడు రుజువయింది. వీరెవ్వరూ తమకు తాముగా విప్లవకర పనిని కొంచెమైనా చేయలేదు, కొందరు వ్యాపారస్తులుగా మారారు, కొందరు అధికార టిడిపికి బంట్లుగా మారగా, కెయస్ ఒక్కడే ఒంటరి జీవితాన్ని సాగించాడు. ఆయన అత్యధిక కాలం అనారోగ్యంగా వుండి, తన మానసిక సామర్థ్యాన్ని కోల్పోయాడు. పత్రికల్లో పొంతనలేని ప్రకటనలు చేయడం ఆయన తన మానసిక సామర్థ్యాన్ని కోల్పోవడాన్ని తెలుపుతుంది. అయితే జైల్లో గడిపిన రెండేళ్ల కొద్ది సమయాన్ని మినహాయిస్తే, ఆయన తన చివరి రోజుల్ని తన కుటుంబసభ్యులతోనూ, రివిజనిస్టు సిపిఐ నాయకులతోనూ గడిపాడు తప్ప, విప్లవోద్యమంతో ఎలాంటి సంబంధం కల్గియుండ లేదు. ఏమైనప్పటికీ ఒక విషయం చెప్పుకోవాలి, కెయస్ పార్టీకి వ్యతిరేకంగా ఎలాంటి దుష్ప్రచార క్యాంపెయిన్‌లోనూ చేరలేదు. అయితే వామపక్ష పార్టీలుగా పిలువబడే పార్టీలూ, మావోయిస్టు పార్టీలూ ఒకే పార్టీగా ఐక్యం గావాలనే భ్రమతో నిలిచిపోయాడు.

## కెయస్ లేకుండా పురోగమిస్తున్న పీపుల్స్‌వార్

ప్రారంభంలో, కెయస్ బహిష్కరణతో పార్టీ చాలా బలహీనపడిందనీ, దాని ఉనికే ప్రశ్నార్థకంగా మారిందనీ రుజువు పర్చాలని మీడియా (ప్రసార సాధనాలు) ప్రయత్నించాయి. కెయస్ వంటి నాయకుడు లేకపోవడంతో పార్టీ అతి త్వరలోనే విచ్ఛిన్నమవుతుందనీ, ఉద్యమం

*(కొరవ 21వ పేజీలో .....)*

# హర్యానాలో రైతు ఉద్యమం

హర్యానా రైతులు పోరుదారి పట్టారు. ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్, డబ్ల్యుటిఓల ద్వారా సాగుతున్న సామ్రాజ్యవాద దాడి మూలంగా చాలా వెనుకబడ్డ ప్రజా సముదాయాలు పోరులో దిగక తప్పడంలేదు. హర్యానా ప్రజలు మేల్కొంటున్నారు. గడచిన 8 నెలలుగా అక్కడ వివిధ వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున మిలిటెంట్ పోరాటాలు చేస్తున్నారు. ముందుగా, హర్యానాలోని రెండు విశ్వవిద్యాలయాల్లో ప్రభుత్వపు విద్యార్థి వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా విద్యార్థుల పోరాటాలు జరిగాయి. ఆ తర్వాత భివానీ గని కార్మికుల పోరాటం. వేలాది మంది కార్మికులు కాంట్రాక్టర్ల రక్షణకై వచ్చిన పోలీసులకు వ్యతిరేకంగా చాలా మిలిటెంట్‌గా బాహాబాహీ పోరాటాలకు తలపడ్డారు. వేలాది మంది ఉద్యోగులు ప్రైవేటీకరణ, రిట్రెంచ్‌మెంట్, స్వచ్ఛంద పదవీవిరమణ పథకం, వేతనాల స్తంభన వంటి డబ్ల్యుటిఓ నిర్దేశించిన విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించారు. ఇప్పుడు జింద్ జిల్లాలోని కండేలా గ్రామం కేంద్రంగా ఒక మిలిటెంట్ రైతాంగ ఉద్యమం ఎగిసింది. ఇప్పటి దాకా భారత రాజ్యాన్నీ, పాలక వర్గాలనూ రక్షించేందుకు ఎక్కువ మంది సైనికుల్ని పంపించే రాష్ట్రంగా పేరు పొందిన హర్యానా ఇప్పుడు తన గుర్తింపును తిరగరాయడం మొదలుపెట్టింది; ఇప్పుడది భారత రాజ్యానికి వ్యతిరేకంగా పోరాడుతోంది.

హర్యానాలో నట్టనడుమనున్న జింద్ జిల్లాలోని ఒక పెద్ద గ్రామం కండేలా. ఈ పోరాటానికి ముందు దీని గురించి చాలా మందికి తెలియనే తెలువదు. కానీ ఇప్పుడది ఓట్లకు ముందు తియ్యటి వాగ్దానాలు చేసి ఆ తర్వాత వాటి అమలు గురించే పట్టించుకోని బాధ్యతలేని రాజకీయ నాయకులకు వ్యతిరేకంగా రైతాంగ ప్రతిఘటనకు సంకేతంగా ముందుకొచ్చింది. కండేలా గ్రామం రాజ్య నిర్బంధానికి వ్యతిరేకంగా రైతాంగ ప్రతిఘటనకు మారుపేరుగా ముందుకొచ్చింది. అది ప్రజలకు సమైక్యంగా పోరాడే దారి చూపిస్తున్నది.

## బూటకపు వాగ్దానాల ఎడతెగని పరంపర

ఇది నిరంతరాయంగా సాగుతున్న విద్రోహాల చరిత్ర. వాగ్దానాల్ని వమ్ము చేసే నిర్లజ్జ చరిత్ర. 1993లో భజన్‌లాల్ కాంగ్రెస్ ప్రభుత్వం కర్నాల్ జిల్లాలోని నిస్సింగ్ అనే చిన్న పట్టణంలో పోలీసులతో కాల్పులు జరిపించగా నలుగురు రైతులు చనిపోగా, అనేక మంది గాయపడ్డారు. బన్సీలాల్ దీన్ని చక్కగా వాడుకున్నాడు. అధికారం చేజిక్కించుకున్నాడు. కానీ రైతుల సమస్యలు యథావిధంగా ఉండిపోయాయి. చెడిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లను బాగు చేయించాలనే సాధారణ డిమాండ్‌ను కూడా ప్రభుత్వం ఒప్పుకోకపోవడంతో, అది ఉచితంగా కరెంటు సరఫరా చేయాలన్న డిమాండ్‌గా రూపుదిద్దుకుంది. దరిమిలా 1997లో దక్షిణ హర్యానాలో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. రైతుల నిరసన ప్రదర్శనలు 'రైల్ రోకో' పోరాటంగా మార్పు చెందాయి. కడమ, మండియాలి గ్రామాల్లో పోలీసులు కాల్పులు జరపడంతో ఆరుగురు రైతులు అసువులు బాసారు. మేహం నరమేధం సూత్రధారి ఓం ప్రకాశ్ చౌతాలా తన దెబ్బతిన్న ఇమేజ్‌ను బాగుపర్చుకునే ప్రయత్నంలో భాగంగా తనకు తాను 'కర్షక పుత్రుని'గా చెప్పుకొంటూ ముందుకొచ్చాడు. ఎన్నికలకు ముందు పెద్ద పెద్ద వాగ్దానాలు చేసి అధికారం చేజిక్కించుకున్నాడు. అయితే కరెంటు బకాయి బిల్లులు మాఫీ చేస్తానన్న తన వాగ్దానాన్ని నిలబెట్టుకోవల్సిందిగా రైతులు అడిగిన పాపానికి వాళ్లు మరో మేహంను చవి చూడాల్సి వచ్చింది. వరుసగా మూడు ప్రభుత్వాలు కరెంటు బిల్లులు చెల్లించే సమస్యపై రైతుల్ని హత్య చేశాయి. వీరందిరలోనూ చౌతాలా తనకు తాను అతి పెద్ద క్రూరుడుగా రుజువుపర్చుకున్నాడు. ఎన్నికల సమయంలో వీడి ముఖ్యమైన నినాదం "బిజిలీ జావేగా నహీ, బిల్ ఆవేగా నహీ"(కరెంటు పోనే పోదు, బిల్లు రానే రాదు) అని. బన్సీలాల్ పాలించే రోజుల్లో స్వయంగా చౌతాలాయే ప్రజలకు కరెంటు బిల్లులు కట్టవద్దని సలహా ఇచ్చాడు. ఎన్నికల్లో గెల్చి తాను చేసిన వాగ్దానాలనే మర్చిపోయి గాఢనిద్రలో మునిగిపోయాడు, రైతులు వీడికి నిద్రాభంగం చేసేంత వరకు.

ప్రస్తుత సంక్షోభం, దాని ఫలితంగా రైతులలో రాజుకున్న అసంతృప్తి జ్వాలలు సామ్రాజ్యవాదం నిర్దేశిస్తున్న ప్రైవేటీకరణ, సరళీకరణ, ప్రపంచీకరణ వంటి నూతన ఆర్థిక విధానాల పరిణామమే. వ్యవసాయరంగం సహా ప్రతి ఒక్క రంగాన్నీ ప్రైవేటీకరించాలని ప్రపంచబ్యాంకు, ఐఎంఎఫ్, డబ్ల్యుటిఓలు భారత పాలకవర్గాలను ఆదేశించాయి. రైతులపై దీని ప్రభావం ఎట్లా ఉంటుంది? కరెంటు, నీరు, ఎరువులు లేదా మరే యితర వ్యవసాయ కారకానికీ ఏ విధమైన సబ్సిడీ ఉండదు. వ్యవసాయ మార్కెట్‌లో బహుళ జాతి కంపెనీల ప్రవేశానికి మార్గాలన్నీ తెరుస్తారు.



జింద్-చండీగఢ్ రోడ్డుపై కండేలా గ్రామంలో ప్రజలు ఏర్పాటు చేసిన బ్యారికేడ్

భజన్‌లాల్ కాలంలో కరెంటు చార్జీల్ని పెంచినప్పుడు అప్పటికే వ్యవసాయ పనులన్నీ దెబ్బతినిపోయి ఉన్న పరిస్థితిలో రైతులు తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ విధంగా, ఆప్పుడు మొదలైన ఈ ఉద్యమం వేర్వేరు రూపాల్లో ఈనాటి దాకా కొనసాగుతోంది. ఈ క్రమంలో ఇప్పటి దాకా 20 మంది రైతులు తమ ప్రాణాల్ని అర్పించారు. ప్రపంచబ్యాంకు నుండి అప్పులు తెస్తూ, అది విధించే షరతులన్నింటినీ అమలు చేస్తూ వరుసగా వచ్చిన ఏ ప్రభుత్వమూ పెరిగిన చార్జీలను తగ్గించడానికి ససేమిరా ఒప్పుకోలేదు. భూగర్భ జల స్థాయి కూడా తగ్గుతుండడంతో బోర్‌వెల్స్ ద్వారా నీటి పారుదల జరిగే ప్రాంతాలలో కరెంటు ఖర్చు పెరుగుతూ పోతున్నది. దీనితో రైతులపై మిన్ను విరిగిపడ్డంత పనైంది. ఈ కారణంగానే ఉచితంగా కరెంటు ఇస్తామనే నాయకుల నినాదం రైతుల హృదయాలను హత్తుకుంటోంది; వాళ్లకు ఓట్లు వేసి గెలిపిస్తున్నారు. అయితే దళారీ పాలకులు ప్రపంచబ్యాంకు షరతులను ఉల్లంఘించలేరు కాబట్టి తీవ్రమైన నిర్బంధాన్ని ప్రయోగించి, గత దశాబ్దకాలంగా ఏదో ఒక రూపంలో పెల్లుబుకుతున్న రైతుల అసమ్మతిని అణచివెయ్య సిద్ధపడ్డారు.

ఓట్లలో చౌతాలా గెల్చిన తర్వాత, కనీసం ఒక దశాబ్ద కాలంగా బకాయి పడ్డ 800 కోట్ల రూ.ల అప్పులనైనా మాఫీ చేసి తన వాగ్దానం నిలబెట్టుకుంటాడేమోనని రైతులు చాలా ఓపికగా ఎదురుచూశారు. కానీ అలాంటిదేమీ జరక్కపోవడంతో రైతులు బికెయు (భారతీయ కిసాన్ యూనియన్) నేతృత్వంలో ఉద్యమాన్ని ప్రారంభించారు. బికెయు రైతుల బకాయి అప్పులను మాఫీ చేయాలన్న డిమాండుతో డిసెంబర్ 21న కండేలా గ్రామంలో ఒక పెద్ద ర్యాలీ తీయాలని నిర్ణయించింది. ర్యాలీ పెద్ద ఎత్తున విజయవంతమైంది. చౌతాలా ప్రభుత్వం పట్ల రైతుల్లో కోపం కట్టలు తెంచుకుంది. చౌతాలా తను చేసిన వాగ్దానం ప్రకారం అప్పుల్నీ మాఫీ చేయలేదు, ఉచితంగా కరెంటూ సరఫరా చేయలేదు. పైగా ఎవరైనా అప్పు తీసుకోవాలనుకున్నా, ఏదైనా రిజిష్ట్రేషన్ చేయించాలన్నా, ఆఖరుకు తమ పిల్లలకు ఏదైనా విద్యాసంస్థలో అడ్మిషన్ ఇప్పించాలనుకున్నా వారు విద్యుత్ శాఖ నుండి 'ఏ బకాయీ లేదు' (నో డ్యూస్) అన్న సర్టిఫికెట్ తెచ్చి చూపించాల్సి ఉంటుందని నియమం చేశాడు.

ర్యాలీని విఫలం చేయడానికి చౌతాలా చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. కనీసం 20 వేల మంది రైతులు ర్యాలీలో పాల్గొన్నారు. పోలీసులు గందరగోళం సృష్టించాలని ప్రయత్నించగా రైతులు ఎదురుతిరిగారు. పోలీసులు రైతులపై తుపాకులతో గుళ్లవర్షం కురిపించగా రైతులు రాళ్లతోనూ, సాంప్రదాయ ఆయుధాలతోనూ జవాబిచ్చారు. చివరకు పోలీసులు తోకముడవక తప్పలేదు. ప్రభుత్వం ఒక వైపు బికెయు నాయకులకు వ్యతిరేకంగా తీవ్రమైన ఆరోపణలు చేస్తూ వారెంట్లు జారీ చేసినప్పటికీ, మరోవైపు అది వాళ్లతో చర్చలకు సిద్ధపడక తప్పలేదు. డిసెంబర్ 31న బికెయు నాయకత్వంతో ప్రభుత్వం ఒక ఒప్పందానికి వచ్చింది. 'కండేలా ఒప్పందం'గా పేరు పొందిన ఈ ఒప్పందం ప్రకారం కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లను ప్రభుత్వం బాగుచేయించాలి; 'ఏ బకాయీ లేదు' సర్టిఫికెట్లు అనివార్యం అన్న నియమం రద్దవుతుంది; రైతులు బకాయి పడ్డ కరెంటు బిల్లుల విషయమై భవిష్యత్తులో ఒక గౌరవప్రదమైన ఒప్పందానికి రావాలి. అయితే ప్రభుత్వం వీటిని అమలు చేయలేదు సరికదా, ఇలాంటి ఒప్పందమే జరుగలేదని కొట్టివేసింది. జనవరి, మార్చ్‌లలో కూడా చర్చలు జరిగినప్పటికీ ముఖ్యమైన సమస్యలపై ఎలాంటి ఒప్పందమూ లేదు.

ఏప్రిల్ నెల రైతులకు చాలా కీలకమైంది. ఎందుకంటే వాళ్లు పంటల్ని కోసే పనుల్లో తలమునకలుగా ఉంటారు. మరో విడత సంభాషణల నాటకమాడుతూనే ప్రభుత్వం డిసెంబర్ 21 ఘటనలకు సంబంధించిన వారెంట్లను పునరుద్ధరించి నాయకులను అరెస్టు చేయడం మొదలుపెట్టింది. 61 మంది రైతు నాయకులకు వ్యతిరేకంగా వారెంట్లు జారీ చేసింది. బికెయు అధ్యక్షుడు ఘాసీరాం నైన్‌ను ఫరారీగా ప్రకటించి అతని అరెస్టుకు సహాయపడ్డ వారికి 10,000 రూ. ల బహుమతిని ప్రకటించింది. రాష్ట్ర, జిల్లా స్థాయి రైతు నాయకుల ఆస్తుల స్వాధీనం కూడా మొదలుపెట్టింది.

ఈ విధంగా, హర్యానా చరిత్రలో మొట్టమొదటి సారిగా నిర్బంధకాండ ఎన్నడూ లేనంత స్థాయికి చేరుకుంది. ఏఐపిఆర్‌ఎఫ్ అధ్యక్షుడు డాక్టర్ దర్శన్‌పాల్ నాయకత్వంలో బికెయు (ఏకతా), ఫేగ్ (సామ్రాజ్యవాద ప్రపంచీకరణ వ్యతిరేక వేదిక) లకు చెందిన నిజనిర్ధారణ కమిటీ ఒకటి హర్యానా వెళ్లగా అక్కడ అతన్ని పోలీసులు అరెస్టు చేశారు. ఈ నిర్బంధాన్ని ఇట్లాగే కొనసాగిస్తూనే, పాత బకాయి బిల్లులలో 75 శాతం మాఫీ చేసి, మిగతా 25 శాతం చెల్లించాల్సిందిగా రైతుల్ని కోరుతూ చౌతాలా ప్రకటన జారీ చేశాడు.

## నరహంతక చౌతాలా సాగిస్తున్న బహుముఖ నిర్బంధకాండ

ప్రస్తుత ఉద్యమాన్ని నిర్బంధం ద్వారా అణచివెయ్యాలని చౌతాలా పథకం. ప్రభుత్వం కొన్ని అనివార్యతల్ని ఎదుర్కొంటున్నది. ఇందులో ఒకటి విద్యుత్ శాఖ ప్రైవేటీకరణ. ఈ షరతును ప్రపంచబ్యాంకు, కాంగ్రెస్ హయాంలో 5,000 కోట్ల రూ. ల అప్పు మంజూరు చేస్తూ విధించింది. విద్యుత్ పంపిణీ రంగంలో చొరబడాలని ప్రయత్నిస్తున్న పెట్టుబడిదార్లకు తాము ప్రజల నుండి ఎలాంటి ఇబ్బందీ లేకుండా డబ్బు వసూలు చేయగలమన్న నమ్మకం కలిగించేందుకూ, గ్యారంటీ ఇవ్వడానికీ ప్రభుత్వం ఇందుకు పూనుకుంటోంది. రెండవది మరింత ప్రమాదకరమైంది. డబ్ల్యుటిఓ విధించిన షరతులను అమలు చేయడంలో భాగంగా భారత వ్యవసాయ రంగాన్ని విదేశీ పోటీదార్ల కోసం తెరవాల్సి ఉంటుంది. వ్యవసాయోత్పత్తులపై సబ్సిడీని రద్దు చేయాల్సి ఉంటుంది. అందుకే ప్రభుత్వం ఇకపై మద్దతు ధరకు రైతుల నుండి ఏమీ కొనగోలు చేయబోదు. రైతులు మార్కెట్ ఆదేశాల ప్రకారం నడవాల్సి ఉంటుంది. ఒకవేళ ప్రభుత్వం వ్యవసాయోత్పత్తులను, ముఖ్యంగా గోధుమల్ని కొనుగోలు చేయడం నిలిపివేస్తే గనుక పరిస్థితులు ఎంతగా విషమించగలవో చౌతాలాకు బాగా తెలుసు గనుకనే బికెయును అణచివేసి రైతులకు నాయకత్వం లేకుండా చేసేందుకు కంకణం కట్టుకున్నాడు. అధికారంలోకి వచ్చాక అతడు రైతులకు పూవుల్నీ, పళ్లనీ పండించాల్సిందిగా సలహాలివ్వసాగాడు.

## ప్రజల వీరోచిత ప్రతిఘటన

కానీ చౌతాలా కుట్రలన్నీ విఫలమైనాయి. అతను రైతులను ఎంతగా అణచివేసాడో, అంతగా రైతుల్లో సమైక్యతా, పోరాడాలన్నా పట్టుదలా పెరిగాయి. నిర్బంధానికి వ్యతిరేకంగా, అట్లాగే తమ డిమాండ్ల సాధన కోసం బికెయు కండేలాలో ఒక పెద్ద ర్యాలీ నిర్వహించాలని పిలుపునివ్వగా, రైతాంగం పోలీసులు ఏర్పరిచిన అడ్డంకులన్నింటినీ ఎదిరించి భారీ సంఖ్యలో పాల్గొంది. ప్రభుత్వం అనేక అడ్డంకుల్ని

కల్పించడమే కాకుండా ఏదైనా పెద్ద ఘటన జరగవచ్చన్న పుకార్లని కూడా వ్యాపింపజేసింది. వేలాది మంది ప్రజలు సాంప్రదాయ ఆయుధాల్ని చేబూని ర్యాలీలో పాల్గొన్నారు. మొట్టమొదటి సారి మహిళలు పెద్ద ఎత్తున ర్యాలీలో పాల్గొనడమే కాదు, ఆయుధాల్ని కూడా పట్టుకున్నారు. ప్రజలు ఏ పరిణామానికైనా సిద్ధపడ్డారు. కండేలా ర్యాలీలో పాల్గొనడానికి వస్తున్న ప్రదర్శకులను నాగుర వద్ద పోలీసులు అడ్డుకోవడానికి ప్రయత్నించగా ప్రజలు ప్రతిఘటనకు పూనుకున్నారు. ప్రజలపై పోలీసులు కాల్పులకు దిగారు. రాంస్వరూప్ అనే రైతు అక్కడికక్కడే మరణించగా, రెండు రోజుల తర్వాత పక్కనున్న పొలాల్లో బాగా కొట్టిన చిహ్నాలున్న శవం ఒకటి బైటపడింది. డజన్ల సంఖ్యలో ప్రజలు గాయపడ్డారు.

ప్రజలు తీవ్రంగా ప్రతిస్పందించారు. కిలోలి గ్రామంలో ప్రజలు ఒక డిఎస్‌పి సహా నలుగురిని బంధీలుగా పట్టుకున్నారు. మే 21న కండేలా గ్రామంలో ఇద్దరు డిఎస్‌పిలనూ, మరో ఐదుగురు అధికారులనూ బంధీలుగా పట్టుకున్నారు. ప్రజలు గ్రామాన్ని పోరాటరంగంగా మలిచారు. త్వరలోనే రోడ్లను దిగ్బంధించడం మొదలుపెట్టారు. జింద్-హిస్సార్, జింద్-కైథాల్-చండీగఢ్ రోడ్లపై అనేక చోట్ల అడ్డంకుల్ని ఏర్పాటు చేశారు. పోలీసులు అడ్డంకుల్ని తొలగించాలని ప్రయత్నించగా ప్రజలు బాహాబాహీ పోరాటాలకు తలపడ్డారు. దానితో పోలీసులకు తోకముడవాల్సి వచ్చింది. పోలీసు, ప్రభుత్వ అధికార్లకూ, ఎంఎల్యేలకూ, ఎంపీలకూ, ముఖ్యంగా ఐఎన్ఎల్‌డి (ఇండియన్ నేషనల్ లోక్‌దళ్) నాయకులకు గ్రామాల్లో అడుగుపెట్టడానికి గుండెలు చాలలేదు. అరెస్టు వారంట్లు జారీ అయిన బికెయు నాయకులను రక్షించుకోవడానికి ప్రజలు మూడు అంచెలు ఏర్పాటు చేశారు. పగలూరాత్రీ సెంట్రీలను ఏర్పాటు చేశారు. రాళ్లనూ, సాంప్రదాయ ఆయుధాలనూ, ప్రేలుడు ఆయుధాలనూ పోగుచేశారు. పోలీసుల దుశ్చర్యలు కొనసాగాయి. చక్కాజామ్ నిర్వహిస్తున్న 5 స్థలాల్లో పోలీసులు కాల్పుల జరిపి 9 మంది ప్రజల ప్రాణాల్ని బలిగొన్నారు. నరహంతక చౌతాలా ప్రభుత్వం 100కు పైగా మందిని అరెస్టు చేసింది; 2,000కు పైగా మందిపై వివిధ కేసుల్ని నమోదు చేసింది.

ప్రజల మిలిటెంట్ ఎత్తుగడలు ఏ పాలకవర్గ పార్టీకి నచ్చలేదు. కొన్ని పత్రికలు రైతుల మిలిటెంట్ ఎత్తుగడలకు పర్యవసానాలు చాలా తీవ్రంగా ఉండగలవని అనుమానాలు వ్యక్తం చేశాయి. ఈ ఉద్యమానికి మద్దతుగా కాంగ్రెస్ ముందుకు వచ్చినప్పటికీ అందులోని ఒక వర్గం రైతుల డిమాండ్లనూ, మిలిటెంట్ ఎత్తుగడల్నీ బాహాటంగా వ్యతిరేకించింది. రివిజనిస్టులు, ముఖ్యంగా సిపిఎం 'పరిస్థితిని సరిగ్గా డీల్ చేయలేద'ని ప్రకటించి తనను తాను సురక్షితమైన దూరంలో నిలబెట్టుకుంది. విప్లవకర యువజన, విద్యార్థి సంఘాలు తప్పితే మిగతా వాళ్లందరూ దూరంగానే ఉండిపోయారు.

ఒక నెల తర్వాత చౌతాలా ప్రభుత్వం దిగివచ్చింది. అరెస్టయిన వాళ్లందరినీ విడుదల చేసింది. 1992 తర్వాత రైతులకు వ్యతిరేకంగా నమోదైన మొత్తం కేసులన్నింటినీ ఉపసంహరించుకుంది. కానీ కరెంటు బిల్లులలో మిగిలిన 25 శాతాన్ని మాఫీ చేయడానికి మాత్రం ఒప్పుకోలేదు. ఇప్పటికైతే రైతులు ఈ ఉద్యమాన్ని విరమించుకున్నారు. కొన్ని బలహీనతలున్నప్పటికీ ఈ రైతు పోరాటం హర్యానా ఉద్యమ చరిత్రలో మైలురాయిగా నిలుస్తుంది.

ఈ ఉద్యమాన్ని హర్యానా అంతటా వ్యాపింపజేయడానికి మంచి అవకాశాలున్నప్పటికీ దీనిలో స్పాంటేనిటీయే బలంగా పనిచేసింది. ఈ ఉద్యమంలో గ్రామాల్లోని విభిన్న వర్గాలను కలుపుకు వచ్చే ప్రయత్నాలు చేయలేదు. నాయకత్వపు వర్గ పరిమితుల కారణంగా ముఖ్యంగా వ్యవసాయ కూలీలను ఈ ఉద్యమానికి దూరంగానే ఉంచారు. అయినప్పటికీ కొన్ని గ్రామాల్లో గ్రామీణ కార్మికులు రైతు సంఘాలకు సంఘీభావంగా ప్రదర్శనల్ని నిర్వహించారు. మిగతా రాష్ట్రాల్లోని రైతు ఉద్యమాల మద్దతును పొందడానికి క్రియాశీల ప్రయత్నమేదీ జరుగలేదు. పంజాబ్‌కు చెందిన బికెయు (ఏకత) రైతు ఉద్యమానికి మద్దతు తెలుపుతూ, నిర్బంధాన్ని వ్యతిరేకిస్తూ చండీగఢ్‌లో ప్రదర్శన జరిపింది. మొత్తంగా చూస్తే, హర్యానా చారిత్రక పరిస్థితిలో నాయకత్వాన్ని పెద్దగా తప్పు పట్టేదేమీ లేనప్పటికీ, అది ఉద్యమక్రమంలో అనేక బలహీనతల్ని ప్రదర్శించిందని చెప్పక తప్పదు. రోడ్లపై చక్కాజాం కార్యక్రమాన్ని ప్రకటించడానికి దానికి పూర్తిగా మూడు రోజులు పట్టింది. బంధీలుగా పట్టుకున్న వారిని తమ డిమాండ్లు నెరవేరే దాకా వదలవద్దని ప్రజలు పట్టుబట్టినప్పటికీ, ఎక్కువ నిర్బంధం రాగలదన్న భయంతో త్వరగా వదిలిపెట్టింది.

కేంద్ర, రాష్ట్రాల కీలుబొమ్మ ప్రభుత్వాలు వ్యవసాయ రంగంలో అమలు చేస్తున్న డబ్ల్యుటిఒ-ఐఎంఎఫ్-ప్రపంచబ్యాంకుల విధానాలకు వ్యతిరేకంగా దేశమంతటా త్వరలోనే పెద్ద ఎత్తున ప్రభుత్వ వ్యతిరేక, సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమం వెల్లువెత్తే గల అవకాశాలు బాగా కనిపిస్తున్నాయి. హర్యానాలో ప్రస్తుత ఉద్యమాన్ని దీనికి సంకేతంగా భావించవచ్చు. ❐

*(..... 33వ పేజీ తరువాయి)*

నిరాయుధులైన ప్రజాసంఘ కార్యకర్తలనూ కాల్చి చంపిన చరిత్ర కూడా చాలానే ఉంది.

ఈ రోజున ప్రభుత్వం విప్లవోద్యమ కార్యకలాపాలతో సంబంధం ఉందని చెప్పి సామాన్య ప్రజలను పోటా కింద అరెస్టు చేస్తున్నది. కానీ ఇది ఇక్కడికే పరిమితమై ఉండబోదు. విప్లవోద్యమంతో ఎలాంటి సంబంధం లేనప్పటికీ తమ సమస్యలపై సమ్మెలకు దిగే ఉద్యోగులనూ, కార్మికులనూ; ప్రభుత్వ విధానాలను విమర్శిస్తూ రాసే రచయితలనూ, విలేఖరులనూ; ఇంకా మైనారిటీ మతాలకు చెందిన వివిధ సంఘాల వాళ్లనూ ఎవరినైనా పోటా కింద అరెస్టు చేయవచ్చు. గతంలో టాడా కింద కూడా ఇదే జరిగింది. ఎలాంటి 'టెర్రరిస్టు' ఉద్యమాలూ లేని గుజరాత్‌లో మిగతా రాష్ట్రాలకన్నా ఎక్కువ మందిని అరెస్టు చేశారు. పోటా చట్టం మరింత పకడ్బందీగా రూపొందించినది అన్న విషయాన్ని గమనిస్తే దీని చాటున ప్రభుత్వాలు ఎంతటి విచ్చలవిడి అణచివేతకు పాల్పడే అవకాశం ఉందో మనం ఊహించవచ్చు. గడ్చిరోలి జిల్లాలో జరిగిన ఈ అరెస్టులు హెచ్చరిక సంకేతాలుగా భావించవచ్చు.

అయితే చరిత్రలో ఎక్కడా కూడా దోపిడీ పాలకులు నల్ల చట్టాల సహాయంతో ఉద్యమాలను సమూలంగా నాశనం చేసిన దాఖలాలు లేవు. భారత ప్రజలు గతంలో టాడాను ఓడించిన ఘనమైన చరిత్ర గలవారు. ఈనాటి పోటాను కూడా తప్పక చరిత్ర పెంటకుప్పపైకి విసరివేస్తారు. దేశవ్యాప్తంగా పోటా లాంటి నల్ల చట్టాలకు వ్యతిరేకంగా వివిధ సెక్షన్ల ప్రజలు సమైక్యమై పోరాడక తప్పని స్థితి వస్తున్నది. గడ్చిరోలి ప్రజానీకం కూడా తమ పాత అనుభవాలను మదింపు వేసుకొని, తమ తరతరాల పోరాట సాంప్రదాయాల్ని ఉన్నతంగా నిలబెట్టుకుంటూ విప్లవోద్యమాన్ని మరింత బలంగా ముందుకు తీసుకుపోతారని ఆశిద్దాం. పోటా లాంటి నల్ల చట్టాలను పోరాడి ఓడిస్తారనీ, మరిన్ని విజయాలు సాధిస్తూ ప్రజా రాజ్యాధికారాన్ని నెలకొల్పుతారనీ ఆశిద్దాం. ❐

# మే 23న ఉత్తర బస్తర్, మాడ్ డివిజన్లలో బంద్ జయప్రదం

పార్టీ ఉత్తర బస్తర్, మాడ్ డివిజన్ కమిటీలు మే 23న నగర్నార్ స్టీలు ప్లాంటు స్థాపననూ, అక్కడి ప్రజలపై సాగుతున్న నిర్బంధాన్నీ వ్యతిరేకిస్తూ, అట్లాగే గుజరాత్‌లో ముస్లిం ప్రజలపై హిందూ ఫాసిస్టు శక్తులు జరుపుతున్న దాడులనూ, మతవిద్వేష హత్యాకాండనూ వ్యతిరేకిస్తూ బంద్ జరపాలని ప్రజలకు పిలుపునిచ్చాయి.

నగర్నార్ స్టీలు ప్లాంటు నిర్మాణాన్ని ప్రజలు గట్టిగా వ్యతిరేకిస్తున్నప్పటికీ దాని నిర్మాణం పనులు సాగుతూనే ఉన్నాయి. ప్రభుత్వం నిర్బంధాన్ని ప్రయోగించి ప్రజల నిరసనను అణచివేసే కుటిల ఎత్తుగడలకు పాల్పడుతున్నది. పోలీసులు కనీసం 150 మందిని అరెస్టు చేసి వాళ్లపై తప్పుడు కేసులు నమోదు చేసారు. అనేక మంది స్త్రీ-పురుషుల్ని దారుణంగా హింసించారు. వీరిలో కొందరు 60-70 సంవత్సరాలు పైబడిన వృద్ధులు కూడా ఉన్నారు. మహిళలను ఘోరమైన అవమానాలకు గురి చేశారు. దాదాపు వెయ్యి మంది రైతుల్ని తమ భూముల నుండి బేదఖలు చేశారు. దీనితో వాళ్లపై ఆధారపడిన వేలాది మందిని నిరాశ్రయులుగా చేశారు. 1,100 హెక్టార్లకు పైగా భూముల్ని జప్తు చేసుకున్నారు. నగర్నార్ ప్రజల న్యాయమైన పోరాటానికి మద్దతుగా బయటి నుండి వచ్చిన ప్రజాస్వామ్యవాదులందరినీ జగ్దల్‌పూర్ అవతలనే నిలిపివేసి పచ్చి ఫాసిస్టు విధానాలు అమలు చేశారు. వాళ్లను దారుణంగా అవమానించారు. 'బస్తర్ అభివృద్ధి' అంటూ ఊదరగొడుతూ నిర్మిస్తున్న ఈ ప్లాంటు ద్వారా కొందరు అపోహ పడుతున్నట్టుగా బస్తర్ అభివృద్ధీ జరుగదు, నిరుద్యోగ సమస్యా సమసిపోదు. బస్తర్‌లో సామ్రాజ్యవాద దోపిడీకి గేట్లు బార్లా తెరిచే ప్రభుత్వ దివాళాకోరు విధానంలో భాగమే నగర్నార్ స్టీలు ప్లాంటు స్థాపన.

గుజరాత్‌ను సంఘ్ పరివార్ ఒక ప్రయోగశాలగా మల్చుకుంది. అక్కడ ముస్లింలకు వ్యతిరేకంగా ద్వేషాన్నీ, నరమేధాల్నీ ప్రేరేపించడం ద్వారా అధికారాన్ని చేజిక్కించుకునే పథకంపై పరిశోధన సాగుతోంది. చూడడానికైతే ఈ హత్యాకాండకు సూత్రధారిగా నరేంద్ర మోది కనిపిస్తున్నప్పటికీ ఇదే పూర్తి నిజం కాదు. ఎందుకంటే దేశ పాలక వర్గాలు లోతైన ఆర్థిక, రాజకీయ సంక్షోభంలో కూరుకుపోయి ఉన్నాయి. ఈ సంక్షోభం ఒక విశాలమైన సామాజిక విప్లవంగా రూపుదిద్దుకోగలదన్న భయం వాటిని సదా వెంటాడుతోంది. మరో పక్క దేశంలో కొనసాగుతున్న జాతీయ విముక్తి పోరాటాలూ, విప్లవ పోరాటాలు పాలకులకు ఊపిరిసల్పనివ్వడం లేదు. అందుకే దేశంలో ఫాసిజాన్ని రెచ్చగొట్టి ఒకవైపు పోరాడే ప్రజలను అణచివెయ్యవచ్చుననీ, మరోవైపు ప్రజల్లో ముస్లింల పట్లా, పాకిస్తాన్ పట్లా ద్వేషాన్ని నరనరానా నింపి తమ మౌలిక సమస్యల నుండి పక్కదారి పట్టించాలని సంకల్పించారు. పకడ్బందీగా పన్నిన ఈ కుట్ర ప్రకారమే గుజరాత్‌లో గోధ్రా రైలు దహనకాండకు ప్రతిక్రియ అనే ముసుగులో వేలాది ముస్లిం ప్రజల ప్రాణాల్ని బలిగొన్నారు. లక్షలాది మందిని చెట్టుకొకరు పుట్టకొకరుగా చెల్లాచెదురు చేశారు.

ఈ రెండు సమస్యలపైనా ప్రజలు బాగా ప్రతిస్పందిస్తూ బంద్‌ను పూర్తిగా జయప్రదం చేశారు. నారాయణపూర్-కొండగాం, నారాయణపూర్-ఓర్ఛ, నారాయణపూర్-అంతాగఢ్ రోడ్లను పూర్తిగా జాం చేశారు. గ్రామాల్లో ప్రజా సంఘాల కార్యకర్తలు పెద్ద ఎత్తున ప్రచార క్యాంపెయిన్‌ను నిర్వహించారు. రెండు డివిజన్లలోనూ ప్రజలు బంద్ కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున పాల్గొని నగర్నార్ ప్రజల పట్లా, గుజరాత్ ముస్లింల పట్లా తమ సానుభూతిని వ్యక్తం చేశారు.

# మే 1న అంతర్జాతీయ కార్మిక దినాన్ని జరుపుకున్న ఆదివాసీ ప్రజలు

**ఉత్తర బస్తర్ డివిజన్ :** ఇన్నర్ గ్రామంలో జరిగే సంతలో పిజిఏకు చెందిన రెండు వేర్వేరు దళాల నాయకత్వంలో ప్రజలు మేడే జరుపుకున్నారు. సంతకు వచ్చిన దాదాపు 400 మంది ప్రజలు సభలో పాల్గొన్నారు. సభలో పార్టీ ఏరియా కమిటీ సభ్యురాలు కా. అనితతో పాటు కా. జిత్రు ప్రసంగించారు. వారిరువురూ ప్రజలకు మేడే ప్రాముఖ్యతనూ, దాని చరిత్రనూ తెలియజెప్పారు. 100 ఏళ్లకు ముందే కార్మికులు జరిపిన పోరాటాల ఫలితంగా 8 గంటల పనిదినం చట్టం వచ్చినప్పటికీ చాలా కార్ఖానాల్లో కార్మికులు 12 గంటలు పనిచేస్తున్నారనీ, వాళ్లకు కనీస హక్కులు కూడా లభించడం లేదనీ వారు వివరించారు. కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం పోరాడాలనీ, దండకారణ్యంలోని గ్రామీణ ప్రాంతాల్లో నూతన ప్రజాస్వామ్య విప్లవ లక్ష్యంతో సాగుతున్న విప్లవోద్యమంతో మమేకం కావాలనీ వారు పిలుపునిచ్చారు.

కొండగాం ఏరియాలోని నరియ గ్రామంలో జరిగిన మరో సభలో 5 గ్రామాల నుండి 450 మంది ప్రజలు హాజరయ్యారు. డిఎకెఎంఎస్ రేంజ్ కమిటీ నాయకత్వంలో జరిగిన ఈ సభలో కా. మున్న సహా కొందరు ప్రజా సంఘ నాయకులు ప్రసంగించారు. పట్టణాల్లోనూ, నగరాల్లోనూ జరిగే కార్మికుల పోరాటాలకు సంఘీభావంగా రైతులు కూడా పోరాటాల్ని నిర్మించాలని వాళ్లు వివరించారు. మేడే అంటే కేవలం కార్మికుల దైనందిన సమస్యల గురించి చర్చలు-సంప్రదింపులు జరిపే దినం కాదనీ, మొత్తం పీడిత ప్రజలందరి విముక్తి లక్ష్యంగా సాగుతున్న పోరాటంలో కార్మికుల పాత్రను గుర్తించి అందుకై పాటు పడే చైతన్యాన్ని కల్పించే దినమనీ వక్తలు వివరించారు. సభ ఆఖరున "మేడే జిందాబాద్", "చికాగో అమరవీరులకు జోహార్లు" అంటూ నినాదాలు చేశారు.

**గడ్చిరోలి డివిజన్ :** టిప్రాగఢ్ గెరిల్లా దళం ప్రతిఘటనా కార్యక్రమాల్లో ఉన్నప్పటికీ మే 1న అంతర్జాతీయ శ్రామిక దినాన్ని జరుపుకుంది. పొద్దున 9 గంటలకు ఏరియా కమిటీ కార్యదర్శి, కమాండర్ కా. దివాకర్ పార్టీ జెండానెగురవేశాడు. ఆ తర్వాత చికాగో అమర కార్మికుల స్మృతిలో రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ఆ తర్వాత జరిగిన సభలో కా. మనీష, కా. శ్రీకాంత్, కా. అశోక్, కా. దివాకర్, కా. జంగులు ప్రసంగించారు. వక్తలు మేడేను కార్మికుల విజయోత్సవ దినంగా అభివర్ణిస్తూ దాని

ప్రాముఖ్యతకు సంబంధించిన విలువైన వివరాలు తెలియజేశారు. కార్మికులపై రుద్దుతున్న నల్ల చట్టాలనూ, ప్రభుత్వం అమలు జరుపుతున్న నిర్బంధ విధానాలనూ ఖండించారు. వీటికి వ్యతిరేకంగా విశాల ఉద్యమాన్ని నిర్మించాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు. నూతన ప్రజాస్వామిక విప్లవ లక్ష్యాన్ని పరిపూర్తి చేయడానికి కార్మికుల నేతృత్వంలో కార్మిక-కర్షక సమైక్యత గురించి కూడా సభలో మాట్లాడిన కామ్రేడ్స్ నొక్కి చెప్పారు. ఈ సభలో మొత్తం 46 మంది పిజిఏ సైనికులు పాల్గొన్నారు. మొబైల్ అకాడమిక్ స్కూల్‌కు చెందిన కా. జీవన్ కూడా సభలో ప్రసంగించాడు.

మే 1న సాయంత్రం తెరెగాం, ఉచాపూర్ గ్రామాల ప్రజలు పిజిఏ సైనికులతో కలిసి ఉత్సాహంగా మేడే జరుపుకున్నారు. ఈ సభలో 140 మంది స్త్రీపురుషులు పాల్గొన్నారు. మొట్టమొదటి సారిగా మేడేను జరుపుకుంటున్న ఈ గ్రామాల ప్రజలు కా. దివాకర్ ప్రసంగాన్ని చాలా శ్రద్ధగా విన్నారు.

## ఏటపల్లి ఏరియాలో పోటా చట్టానికి వ్యతిరేకంగా ప్రజల ర్యాలీలు

ఏటపల్లి రేంజ్‌లో మార్చ్ 22న పిప్పిలి అనే ఊరిలో పోటా చట్టానికి వ్యతిరేకంగా 250 మంది ప్రజలు ఊరేగింపు జరిపారు. ట్లాగే ఇర్పనార్ గ్రామంలో కూడా 185 మంది ప్రజలు ఊరేగింపు తీశారు. ఇంకా గ్రామగ్రామాన పార్టీ, ప్రజా సంఘాల కార్యకర్తలు పోటా చట్టానికి వ్యతిరేకంగా ప్రచార క్యాంపెయిన్ నిర్వహించారు.

## ఎన్నికల బహిష్కరణ

ఏటపల్లి ఏరియాలోని కసనసూర్ రేంజ్‌లో ప్రజలు పంచాయితి సమితి, జిలా పరిషత్ ఎన్నికల్ని బహిష్కరించారు. ఎన్నికల ప్రచారం కోసం వచ్చిన శివసేన పార్టీ వాళ్ల జీపును ప్రజలు ధ్వంసం చేశారు. 14 గ్రామాలలో ఒక్క ఓటు కూడా పోల్ కాలేదు. ఏటపల్లి రేంజ్‌లో కూడా మొత్తం 13 గ్రామాల్లో ఒక్క ఓటు కూడా పడలేదు. ఈ ప్రాంత ప్రజలు తమ విప్లవ చైతన్యాన్ని చక్కగా ప్రదర్శిస్తూ పోలీసు ఎంత దౌర్జన్యం చేసి వత్తిడి తెచ్చినప్పటికీ బూటకపు ఎన్నికలతో మాకు పనిలేదని నిర్ద్వంద్వంగా బహిష్కరించారు. ప్రజలు తమ భవిష్యత్తును తమ చేతుల్లోకి తీసుకుంటూ ప్రజల రాజ్యాధికారపు అంగాల్ని నిర్మించే దిశగా పురోగమిస్తున్నారు.

## మార్చ్ 22న పోటో చట్టానికి వ్యతిరేకంగా బంద్

మార్చ్ 22, 2002 రోజు మాడ్ డివిజన్‌లో ప్రజా చైతన్యానికి ప్రతీకగా నిలుస్తుంది. నాగరికులమని చెప్పుకునే మనుషులు 'అబూఝ్‌మాడ్' వంటి అవమానకరమైన పేరుతో పిలిచే మాడ్ ప్రాంతంలో ఇప్పుడు చీకట్లు తొలగిపోతున్నాయి. గతంలో ఇక్కడి అమాయక, శ్రమజీవులైన ప్రజలపై జబర్దస్తీగా అనేక చట్టాలనూ, శాసనాలనూ రుద్ది బాగా దోచుకోవడమే కాకుండా దారుణమైన అవమానాలకు కూడా గురి చేసేవారు. బ్రిటిష్ కాలం నుండి నేటి ప్రజాస్వామ్యమని చెప్పుకునే వ్యవస్థ దాకా వీరి అభివృద్ధి పేరిట ఎన్ని కోట్ల రూపాయలు దిగమింగి వీరిని దారుణమైన దోపిడీకి గురిచేశారో లెక్కే లేదు. కానీ ఈ రోజు 'అబూఝ్‌మాడ్' 'సబూఝ్‌మాడ్'గా నిలబడింది. ఇక్కడ దోపిడీ విధానాలూ, జబర్దస్తీ శాసనాలూ ఇక చెల్లవు. మాడ్ ప్రజలు తాము 'సబూఝ్'లమేనన్న సత్యాన్ని ఇప్పటికి చాలా సార్లే లోకానికి తెలియజెప్పారు. ఈసారి కూడా ఒకవైపు పార్లమెంటు బల్లపై పోటో చట్టాన్ని ప్రవేశపెట్టి వివిధ పార్టీలు మల్లాగుల్లాలు పడుతుంటే, సరిగ్గా అదే రోజున మాడ్ ప్రజలు అనేక చోట్ల ర్యాలీలనూ, ఊరేగింపులనూ నిర్వహించి ఈ నల్ల చట్టానికి వ్యతిరేకంగ గొంతెత్తి నినదించారు. చాలా చోట్ల బహిరంగసభలు నిర్వహించారు. ఈ చట్టం గురించి వివరమైన చర్చ జరిగింది. ఈ చట్టాన్ని అమలుపర్చడం ద్వారా ప్రజలకు ఒనగూరగల నష్టాల గురించి ప్రజా సంఘాల ప్రతినిధులు వివరించారు.

మాడ్‌లోని గలగలా పారే మాడిన్ నది ఒడ్డున మార్చ్ 22 మధ్యాహ్నం 12 గంటలకు నావమెట్ట అనే గ్రామంలో ఒక సభ జరిగింది. చుట్టుపక్కల గల దాదాపు 25 గ్రామాల నుండి 1500 ప్రజలు తమ విశిష్టమైన సమైక్యతను చాటుకుంటూ ఈ సభలో పాల్గొన్నారు. ఇందులో స్త్రీలు, పురుషులు, పిల్లలు, వృద్ధులు ఇలా అన్ని వయస్సుల వాళ్లూ ఉన్నారు. చేతుల్లో బ్యానర్లూ, పోస్టర్లూ పట్టుకొని గొంతెత్తి నినాదాలు చేస్తూ గ్రామం గుండా ఊరేగింపు తీశారు. ''నల్ల చట్టం పోటా నశించాలి'', ''బిజెపి నిరంకుశ పాలన నశించాలి'' మొదలైన నినాదాలు చేస్తూ ఊరేగింపు సాగింది. కల్మెట్ట వద్ద ఊరేగింపు ఒక పెద్ద సభగా రూపుదిద్దుకుంది. వివిధ గ్రామాల నుండి వచ్చిన యువకులూ, పెద్దలూ, మహిళా ప్రతినిధులూ పోటాకు వ్యతిరేకందా తమ అభిప్రాయాలు వెలిబుచ్చారు. పోటా చట్టం వల్ల దేశవాసుల నామమాత్రపు ప్రజాస్వామిక హక్కులకు సైతం భంగం వాటిల్లగలదని వక్తలు చెప్పారు. కాబట్టి ఈ చట్టానికి వ్యతిరేకంగా సమైక్యంగా పోరాడి ఓడించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఆ తర్వాత సభ ముగిసింది. ఈ విధంగా అందరూ వెనుకబడిన ప్రాంతంగా భావించే మాడ్‌లో ప్రజలు పోటాకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాన్ని ప్రారంభించి తమ ఉన్నత రాజకీయ చైతన్యాన్ని చాటుకున్నారు. ❐

---

*(..... 18వ పేజీ తరువాయి)*

## ప్రజా ప్రత్యామ్నాయం

పోరాటశీలురైన ప్రజలు విద్యావైద్య సమస్యలపైన చాలా సార్లు ఉద్యమాలు నిర్వహించారు. కానీ ఫలితం పెద్దగా ఏమీ కనిపించలేదు. ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని దాని ప్రజా వ్యతిరేక, సామ్రాజ్యవాద అనుకూల విధానాల నేపథ్యంలో అర్థం చేసుకోవాలి. నేడు దండకారణ్య ప్రజానీకం ప్రస్తుత దోపిడీ రాజ్యాన్ని అంతమొందించి ప్రజల నూతన రాజ్యాధికారానికి పునాదులు వేస్తున్నది. ప్రజలు తమ భవితవ్యాన్ని తామే నిర్ణయించుకోదలిచారు. విద్యావైద్య రంగాలలో అభివృద్ధి సాధించడానికి ప్రజలు తమదైన ప్రజాపరమైన విధానాన్ని రూపొందించుకుంటున్నారు. పీపుల్స్‌వార్ పార్టీ కార్యకర్తలు గ్రామాల్లో చదువుకున్న యువతీయువకుల్ని సమీకరించి వాళ్లకు ప్రాథమిక వైద్య శిక్షణనిచ్చి వాళ్ల ద్వారా ప్రజారోగ్య కేంద్రాలను స్థాపిస్తున్నారు. అదే విధంగా గ్రామాల్లో ప్రజా పాఠశాలలు కూడా ప్రారంభించి పిల్లలకూ, పెద్దలకూ చదువు నేర్పించే కృషి చేస్తున్నారు. దోపిడీ రాజ్యం అమలు చేస్తున్న భయానక నిర్బంధాల మధ్యనే వాళ్లీ పనులు నిర్వహిస్తున్నారు. కొన్ని చోట్ల పోలీసులు దాడి జరిపి ప్రజారోగ్య కేంద్రాల నుండి ప్రజలు చెమటోడ్చి సంపాదించిన డబ్బుతో కొనుక్కున్న మందుల్ని కూడా దోచుకున్నారు. అయినప్పటికీ ప్రజలు ఈ దిశలో దృఢంగా ముందడుగు వేస్తున్నారు. ప్రజల స్వంత సైన్యమైన పిజిఏ ఏర్పాటు తర్వాత ఈ దిశగా గుణాత్మకమైన అభివృద్ధి కానవస్తున్నది. ప్రజల సంఘటిత సాయుధ శక్తితోనే ప్రజలు సాధిస్తున్న ఈ తొలి విజయాలు నిలవగలవనడంలో సందేహం లేదు. ❐

*ఫీల్డు రిపోర్టు*

# పోలీసు నిర్బంధాన్నీ నల్ల చట్టాలనూ గేలిచేస్తూ, ప్రజా రాజ్యాధికార స్థాపన దిశగా దృఢంగా పురోగమిస్తున్న గడ్చిరోలి విప్లవ ప్రజానీకం!

గడ్చిరోలి జిల్లా ఉద్యమాన్నీ, అక్కడ పోలీసులు అమలు జరుపుతున్న పాశవిక నిర్బంధాన్నీ, దాన్ని ప్రజలు ఎలా ఎదుర్కొంటున్నారు అన్న విషయాన్నీ పరిశీలించే ముందర జిల్లాకు సంబంధించిన కొన్ని వివరాలు తెలుసుకోవడం అవసరం. ప్రభుత్వపరంగా చూస్తే గడ్చిరోలి మహారాష్ట్రలోని ఒక జిల్లా, అయితే విప్లవోద్యమ అభివృద్ధి క్రమంలో అది పక్కనే ఉన్న బస్తర్‌ను కలుపుకొని దండకారణ్యంలో భాగం. 1982లో చంద్రపూర్ (చాందా) జిల్లా నుండి విడిపోయి గడ్చిరోలి ఒక ప్రత్యేక జిల్లాగా అవతరించింది. విదర్భలోని 11 జిల్లాల్లో (గడ్చిరోలి, చంద్రపూర్, గోందియా, భండారా, నాగపూర్, వార్ధా, యవత్మాల్, అమరావతి, అకోల, బుల్డాన, వాసిం జిల్లాలు విదర్భ ప్రాంతం కిందికి వస్తాయి.) ఒకటైన గడ్చిరోలి రాష్ట్రంలో ఆగ్నేయ దిశలో ఉంటుంది. ఇక్కడి జనాభా, 2001 లెక్కల ప్రకారం 9,69,960 కాగా ఇందులో దాదాపు సగం అంటే 4,63,000 మంది ఆదివాసులే. అందుకే దీన్ని ప్రధానంగా ఆదివాసీ ప్రజలు నివసించే జిల్లాగా గుర్తిస్తారు. జిల్లా వైశాల్యం 15,435 చ. కిలోమీటర్లు. జిల్లాలోని మొత్తం తాలూకాలు 12 – సిరొంచ, అహిరి, భామ్రాగఢ్, ఏటపల్లి, చాముర్షి, గోట్, ముచ్చెర, గడ్చిరోలి, ఆర్మూరి, వడ్సా, ధనోర, కోడ్గుల్, కోర్చి. వీటిలో గడ్చిరోలి, చాముర్షి, వడ్సా, ఆర్మూరి తాలూకాలను మినహాయించి మిగతా 8 తాలూకాలను ఆదివాసీ తాలూకాలుగా ప్రభుత్వం ప్రకటించింది. జిల్లాలోని మొత్తం అటవీ ప్రాంతంలో 80 శాతం, అట్లాగే జిల్లాలోని మొత్తం 1,671 గ్రామాలకు గాను 1,449 గ్రామాలు ఈ 8 తాలూకాల్లోనే ఉన్నాయి. వీటిలో ఒక్క ఆర్మూరి తాలూకాను మినహాయిస్తే మిగతా అన్ని తాలూకాలతోనూ, అట్లాగే జిల్లాలోని నాల్గింట మూడొంతుల గ్రామాలతోనూ విప్లవోద్యమానికి సంబంధం ఉంది. ఇవీ సంక్షిప్తంగా జిల్లాకు సంబంధించిన వివరాలు.

ఈ జిల్లాలో 1980లో మొదలైన విప్లవోద్యమం 1990 నాటికల్లా పైన పేర్కొన్న తాలూకాలన్నింటికీ విస్తరించింది. ఈ విప్లవోద్యమాన్ని అణచివెయ్యడానికి ప్రభుత్వం తొలిసారిగా 1991లో 'స్పెషల్ యాక్షన్ ప్లాన్'ను చేపట్టింది. ఆ తర్వాత పోలీసులు 1991-94 మధ్య ప్రజలపై దారుణమైన నిర్బంధం-అణచివేతలను పెద్ద ఎత్తున అమలు చేశారు. ఈ కాలంలో ఆదివాసీ రైతాంగంపై పెద్ద ఎత్తున టాడా చట్టాన్ని ప్రయోగించారు. చంద్రపూర్, భండారా, గడ్చిరోలి జిల్లాల్లోనుండి పోలీసులు రికార్డు స్థాయిలో 5 వేలకు పైగా ఆదివాసీ రైతాంగాన్ని టాడా కింద అరెస్టు చేశారు. దేశంలో మరే ప్రాంతంలోనూ ఆదివాసులకు వ్యతిరేకంగా టాడా చట్టాన్ని ఇంత పెద్ద ఎత్తున ప్రయోగించింది లేదు. నేటికీ, ముఖ్యంగా గడ్చిరోలి జిల్లాలోని వందలాది మంది రైతులు టాడా కింద జైళ్లల్లో మగ్గుతూనే ఉన్నారు; కేసుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. టాడా చట్టం పోయినా టాడా కింద నమోదైన కేసులు మాత్రం ఇంకా నడుస్తూనే ఉన్నాయి. మరో వైపు టాడాను తలదన్నే కొత్త నల్ల చట్టం పోటా కింద కూడా గడ్చిరోలి ప్రజానీకాన్ని అరెస్టు చేయడం మొదలైంది.

గడ్చిరోలి జిల్లా ప్రజలకు తరతరాల పోరాట వారసత్వం ఉంది. స్వేచ్ఛాస్వాతంత్ర్యాల కోసం, ప్రజాస్వామ్యం కోసం పోరాడి తమ ప్రాణాలనే తృణప్రాయంగా అర్పించే గొప్ప వారసత్వం వీళ్లది. ఒకప్పుడు బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా దేశభక్తియుత, ప్రజాస్వామ్య సాయుధ పోరాటాల్ని సాగించిన చరిత్ర వీళ్లది. బ్రిటిష్ వాడు 1919లో తెచ్చిన రౌలట్ చట్టం కూడా వీళ్ల తిరుగుబాటును అణచలేకపోయింది. గడ్చిరోలి ప్రజలు అడవిపై హక్కు కోసం అమరుడు సెడ్మెక్ బాబూరావు నాయకత్వంలో బ్రిటిష్ వాడి ఆధునిక సైన్యాలకు వ్యతిరేకంగా పోరాడారు. స్వాతంత్రం వచ్చి 55 ఏళ్లయిందని చెబుతున్నప్పటికీ, ఈనాటికీ అడవిపై దొరకని హక్కు కోసమూ, మిగిలే ఉన్న మౌలిక సమస్యల పరిష్కారం కోసమూ వీళ్లు పోరాడుతూనే ఉన్నారు. అయితే వీళ్ల పోరాట పంథాలో, లక్ష్యంలో గుణాత్మకమైన మార్పు వచ్చింది మాత్రం ఇక్కడ 1980లో విప్లవోద్యమం మొదలైన తర్వాతనే. అప్పటి నుండీ భూమి కోసం, దోపిడీ నుండి విముక్తి కోసం, రాజ్యాధికారం కోసం దీర్ఘకాల ప్రజాయుద్ధ పంథాలో పోరాడుతున్నారు.

## ప్రజల సమస్యలు - ప్రభుత్వాల దోపిడీ విధానాలు

**భూమి సమస్య :** ఆదివాసుల ప్రధాన సమస్య భూమి సమస్యే. అడవిపై ఆధారపడి బతికే ఆదివాసులకు అడవిపై ఎలాంటి హక్కూ లేదు. అటవీ ఉత్పత్తులను సేకరిస్తూ, అర్ధాకలితో అలమటిస్తుంటారు. ఈ రకమైన దుర్భరమైన జీవితం నుండి బైటపడడానికి అడవి నరికి సేద్యం చేసుకోవడానికి పూనుకుంటే సర్కారు వాళ్లు ఊరుకోరు. వారిపై తప్పుడు కేసులు బనాయించి, పెద్ద ఎత్తున దండుగలు వసూలు చేస్తూ, జైలుపాలు కూడా చేస్తుంటారు. అయినా రైతాంగం తప్పనిసరై అడవులను నరికి సేద్యం చేసుకుంటూనే ఉన్నారు. ఇలాంటి భూములను 'జబరన్ జోత్' అని స్థానికంగా పిలుస్తారు.

మహారాష్ట్రలో మొత్తం దాదాపు 50 లక్షల మంది రైతులు జబరన్ జోత్ భూములపై ఆధారపడి జీవిస్తున్నారు. వీరి వద్ద ప్రభుత్వ లెక్కల ప్రకారమే 2 కోట్ల 50 లక్షల ఎకరాల భూమి ఉంది. ఈ 50 లక్షల మందిలో విదర్భలోని భండారా, గోందియా, యవత్మాల్, చంద్రపూర్, గడ్చిరోలి, అమరావతి, బుల్డానలతో పాటు ఠాణే, నందుర్బార్, నాసిక్, ధుళే జిల్లాల వారే ఎక్కువ. ఇవన్నీ ఆదివాసీ జనాభా ఎక్కువగా గల జిల్లాలు. ఈ జిల్లాల్లోని రైతాంగానికి దాదాపుగా 40 ఏళ్లుగా ప్రభుత్వం పట్టాలే ఇవ్వడం లేదు. 1978కి ముందు నుండి జబరన్ జోత్ భూములను కలిగి ఉన్న రైతులకు 5 ఎకరాల భూమికి పట్టా ఇవ్వాలని మహారాష్ట్ర ప్రభుత్వం చట్టం చేసి పాతికేళ్లు దాటుతున్నా దాని అతీగతీ లేదు. అయితే 'ఏక్ సాల్' పట్టా లాంటి తాత్కాలిక సర్దుబాట్ల వ్యవహారాలతో పట్వారీలు రైతుల్నుండి ఎకరానికి 1,000 రూపాయల చొప్పున వసూలు చేస్తున్నారు. జబరన్ జోత్ రైతులు చంద్రపూర్ జిల్లాలో 35 వేలు, గడ్చిరోలి జిల్లాలో 50 వేలుంటారని ఒక అంచనా. భూమి సమస్య ఇంత తీవ్రంగా ఉంది కాబట్టే ప్రజలు ప్రభుత్వ నిర్బంధాన్నీ, టాడా లాంటి నల్ల చట్టాలనూ లెక్క చేయకుండా భూములను సేద్యం చేసుకుంటున్నారు. గడ్చిరోలి జిల్లాలో భూములకు సంబంధించి

పీపుల్స్‌వార్ పార్టీ నిర్వహించిన ఒక సర్వేలో ఒక్క 15 గ్రామాల్లోనే దాదాపు 1,000 ఎకరాల జబరన్ భూమిని సాగు చేసుకుంటున్నారని తేలింది. అటవీ శాఖ అధికారులు ఎన్ని సార్లు దాడులు చేసినా, పంట పొలాలను నష్టపర్చినా, రైతాంగం ధైర్యం కోల్పోకుండా, వాళ్లకు వ్యతిరేకంగా దృఢంగా పోరాడుతున్నారు. పంటలు తీసుకుంటున్నారు. పోరాడే ప్రజలను నల్ల చట్టాలు భయపెట్టలేవని గడ్చిరోలి ప్రజలు మరోసారి రుజువు చేశారు.

**సాగునీటి సమస్య :** 1947కు ముందు 300 డ్యాములు మాత్రమే ఉంటే, ఇప్పుడు వీటి సంఖ్య 4,300కు పెరిగిందని భారత ప్రభుత్వం గొప్పగా చెప్పుకుంటున్నది. కానీ నేటికీ దేశంలోని మెజారిటీ ఆదివాసీ ప్రాంతాలలో వ్యవసాయం వర్షాధారంతోనే నడుస్తుంది. మరో చేదు నిజం ఏమిటంటే, దేశంలోని ఏ ప్రాంతంలోనైనా సరే, ఇప్పటి దాకా నిర్మించిన/ఇప్పుడు నిర్మిస్తున్న అనేక భారీ ప్రాజెక్టుల మూలంగా తమ పంట భూముల్నీ, నివాసాల్నీ, అడవినీ కోల్పోయి నిరాశ్రితులయ్యిందీ /అవుతున్నదీ ప్రధానంగా ఈ ఆదివాసులే. ఇలా దేశంలో గత 50 ఏళ్లలో భారీ ప్రాజెక్టుల మూలంగా నిరాశ్రయులుగా మారి, పునరావాసానికి కూడా నోచుకోని ప్రజల సంఖ్య దాదాపు 5½ కోట్లుంటుందని ఒక అంచనా. అయితే ఈ సంఖ్య ప్రభుత్వ రికార్డులలో మాత్రం ఉండదు. ఇందులో 60 శాతం (3 కోట్ల 36 లక్షలు) మంది ఆదివాసులూ, దళితులే. ఇలా ప్రాజెక్టుల కోసం తమ జీవితాల్నే మూల్యంగా చెల్లిస్తున్న ఆదివాసుల పంట పొలాలకు నీటి పారుదల సౌకర్యాన్ని కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది.

ఇక గడ్చిరోలి జిల్లానే తీసుకుంటే, గడ్చిరోలిలో గత 21 సంవత్సరాలుగా ఒక్క సాగునీటి ప్రాజెక్టు కూడా కట్టలేదు. 16 ప్రాజెక్టుల ప్రతిపాదనలు నేటికీ పెండింగ్‌లోనే ఉన్నాయి. తుల్‌తులి, కార్వప్ప, చెన్నా లాంటి ప్రాజెక్టులకు ప్రభుత్వామోదం ఉన్నా నిధులు లేవని చెప్పి ప్రభుత్వం వాటిని పెండింగ్‌లో పెట్టింది. కానీ పశ్చిమ మహారాష్ట్రలో 1996లో స్థాపించిన కృష్ణ, కావేరి ప్రాజెక్టులతో 7 భారీ, 14 మధ్య తరహా, 288 చిన్న తరహా ప్రాజెక్టులను పూర్తి చేయడానికి మాత్రం ప్రభుత్వానికి 'నిధుల కొరత' అడ్డురాలేదు. ఇలా ప్రభుత్వం ఒకవైపు విదర్భ పట్ల వివక్ష చూపుతూనే, ఆదివాసీల పట్ల మొసలి కన్నీరు కారుస్తున్నది. ఉదాహరణకు ఒక్క భామ్రాగఢ్ తాలూకా వివరాలే చూసినా ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని బాగా అర్థం చేసుకోవచ్చు. భామ్రాగఢ్ తాలూకాలోని 20 గ్రామ పంచాయితీల కింద 126 గ్రామాలున్నాయి. ఈ గ్రామాలలోని రైతాంగం వద్ద ప్రభుత్వ లెక్కల ప్రకారం మొత్తం 19,832 ఎకరాల సాగుభూమి ఉండగా, అందులో కేవలం 982 ఎకరాలకే, అంటే 5 శాతానికి తక్కువ భూములకే సాగునీటి సౌకర్యం ఉంది. బస్తర్‌లో కూడా, స్వాతంత్రం వచ్చిందని చెబుతున్న ఈ 55 సంవత్సరాల పాలనలో సాగునీటి సౌకర్యం గల భూముల శాతం 2కు మించనే లేదు.

పంట పొలాలకు సాగునీటి సౌకర్యం కల్పించే పేరిట దోపిడీ ప్రభుత్వాలు సామ్రాజ్యవాద ద్రవ్య సంస్థల నుండి అప్పులు తెస్తున్న వాస్తవాన్ని కూడా దండకారణ్య ప్రజలు అర్థం చేసుకుంటున్నారు. మహారాష్ట్ర ప్రభుత్వం ప్రపంచ బ్యాంకు నుండి 3,547 కోట్ల రూపాయల అప్పు తీసుకుంటున్నదన్న విషయం తెలుసుకొనే ప్రజలు ఈ 'ముష్టి' పథకాలు వద్దంటున్నారు. రోడ్ల నిర్మాణాన్ని అడ్డుకున్నట్లుగానే ప్రజలు ఈ 'అప్పు' పథకాన్ని కూడా వ్యతిరేకిస్తున్నారు. తమ స్వంత శ్రమశక్తిపై, పరస్పర సహకారంపై ఆధారపడి ప్రజలు తమకవసరమైన సౌకర్యాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. మొత్తం దండకారణ్యంలో ప్రజలు గత 5 సంవత్సరాలలో పైన చెప్పిన పద్ధతిలో 150కి పైగా చెరువులు, కుంటలు నిర్మించుకున్నారు. వీటిలో సగానికి పైగా వ్యవసాయానికి ఉపయోగపడుతుండగా, మిగతావి పశువులు తాగేందుకు నీటి కోసం, చేపల పెంపకం కోసం ఉపయోగపడుతున్నాయి. అయితే ప్రజలు ఇవన్నీ ప్రభుత్వం కల్పించే అడ్డంకులన్నింటినీ ఎదిరిస్తూనే, పోలీసులతో పోరాడుతూనే సాధించుకోగలిగారు.

**రోడ్లు, కరెంటు, బడులు-ఆసుపత్రులు:** గడ్చిరోలి జిల్లాలో రోడ్ల నిర్మాణం చాలా వేగంగా సాగుతున్నది. జిల్లాలోని అత్యధిక గ్రామాలకు రోడ్డు సౌకర్యం ఉంది. ప్రజలకుపయోగపడే మిగతా పనులకన్నా ఈ రోడ్ల నిర్మాణానికే ప్రభుత్వం కోట్లాది రూపాయల్ని ఖర్చు చేస్తున్నది. మహారాష్ట్రలోని మొత్తం 35 జిల్లాలలో మిగతా ఏ జిల్లాకు ఇవ్వని విధంగా ఒక్క గడ్చిరోలి జిల్లాకే అత్యధిక ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వం రోడ్ల నిర్మాణానికి ఎందుకు పూనుకుంది? ప్రజలు అనేక దైనందిన సమస్యలతో సతమవుతుంటే ప్రభుత్వం ఒక్క రోడ్ల నిర్మాణంపైన్నే అంత శ్రద్ధ ఎందుకు పెడ్తున్నది? ప్రజలు దీన్ని వ్యతిరేకిస్తుంటే సాయుధ బలగాలను ఎందుకు మోహరిస్తున్నది? దీనికి రెండు కారణాలున్నాయి – ఒకటి, తక్షణంగా జిల్లాలో బలపడుతున్న విప్లవోద్యమాన్ని అణచివెయ్యడానికి పోలీసు బలగాలను వేగంగా తరలించడానికి. రెండోది, ఈ విధంగా విప్లవోద్యమాన్ని అణచివేసి ఇక్కడి అపార ఖనిజ సంపదలనూ, అటవీ సంపదలనూ కొల్లగొట్టాలన్న దీర్ఘకాలిక పథకం.

రోడ్లు ప్రజలందరికీ అవసరమే అయినప్పటికీ గడ్చిరోలి ప్రజలు రోడ్లనెందుకు వ్యతిరేకిస్తున్నారు? ఎందుకంటే గడ్చిరోలి జిల్లాలో నిక్షిప్తమై ఉన్న 80 వేల కోట్ల ఖనిజ సంపత్తిపై సామ్రాజ్యవాదులూ, దళారీ పెట్టుబడిదార్లూ కన్నేశారు. ఇక్కడ విప్లవోద్యమం బలపడితే ఈ సంపదలను దోచుకోవాలన్న వాళ్ల కలలు ఫలించవు. అందుకే ఈ జిల్లాలో సాగుతున్న విప్లవోద్యమాన్ని సమూలంగా నిర్మూలించే పథకంలో భాగంగా వందలాది పోలీసుల్ని ప్రభుత్వం ఈ జిల్లాలో మోహరించింది. వీరిని జిల్లాలో ఒక మూల నుండి మరో మూలకు చాలా వేగంగా, సౌకర్యవంతంగా కదలించడానికి వీలుగా చాలా శ్రద్ధతో పక్కా రోడ్లు నిర్మిస్తున్నది. ఈ రోడ్లే భవిష్యత్తులో ఇక్కడి సంపదల్ని తరలించడానికి కూడా ఉపయోగపడతాయని ప్రభుత్వం భావిస్తున్నది.

ఈ రోడ్లనెవరు నిర్మిస్తున్నారన్న విషయాన్ని పరిశీలిస్తే చాలు, దీని వెనుకున్న కుట్ర ఏమిటో తెలిసిపోతుంది. దేశంలో గల్లీ రోడ్ల నుండి మొదలు, ఎక్స్‌ప్రెస్ హైవేల దాకా దళారీ ప్రభుత్వం ఖర్చు చేస్తున్న ప్రతి పైసా ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్ వంటి సామ్రాజ్యవాద ద్రవ్య సంస్థల నుండే అందుతున్నది. ఇప్పటికే 11,20,050 కోట్లకు పైగా స్వదేశీ-విదేశీ అప్పులు పేరుకుపోయి, ప్రతి పౌరునిపై 11 వేల రూపాయల దాకా రుణభారం పెరిగి ఉండగా, మరిన్ని అప్పులు తెచ్చి రోడ్లు వెయ్యడమంటే అది నిజానికి ప్రజలను ఉద్ధరించడానికి ఎంత మాత్రం కాదు. మహారాష్ట్ర ప్రభుత్వం కూడా రోడ్ల అభివృద్ధి కోసం 6,551 కోట్ల రూపాయలు ప్రపంచ బ్యాంకు నుండి అప్పుగా తెచ్చింది. బహుళ జాతి కంపెనీలు తమకవసరమైన మౌలిక సదుపాయాల కల్పన కోసం భారత ప్రభుత్వంపై వత్తిడి తెస్తున్న ఫలితంగానే రకరకాల పేర్లతో 'సడక్ యోజన'లు రూపొందుతున్నాయన్నది అసలు సంగతి.

దేశంలో నిర్మించిన 695 పెద్ద డ్యాంల మూలంగా ఇప్పటికే లక్షలాది ఆదివాసీ ప్రజలు నిరాశ్రయులయ్యారు. ఇకపై ప్రపంచీకరణలో భాగంగా నిర్మించ తలపెట్టే భారీ పరిశ్రమలన్నీ ఆదివాసులకు వినాశనాన్ని కొనితెచ్చేవే. రకరకాల గనులు, ఖనిజాలు, విస్తారమైన అడవులతో విలసిల్లే ఈ ఆదివాసీ ప్రాంతాలు తప్ప మరే ప్రాంతంలోనూ సామ్రాజ్యవాదులకూ, వాళ్ల దళారులకూ 'ప్రకృతి వరప్రసాదాలు' ఇంత పెచ్చు స్థాయిలో దొరకవు. ఇదే జరిగితే దేశంలోని మెజారిటీ ఆదివాసుల జీవితాలు ఛిన్నాభిన్నం అవడం ఖాయం. ఈ వాస్తవాన్ని గుర్తించే గడ్చిరోలి ప్రజలు రోడ్ల నిర్మాణాన్ని వ్యతిరేకిస్తున్నారు. ఈ న్యాయమైన పోరాటంలో సహజంగానే విప్లవకారులు వారి పక్షాన దృఢంగా నిలబడ్డారు. వాస్తవం ఇదైతే ప్రభుత్వం దీన్ని మసిబూసి మారేడు కాయ చేసి రకరకాల కుతర్కాలతో దుష్ప్రచారం చేస్తున్నది.

పోయినేడు దివాళా తీసిన వివాదాస్పదమైన బహుళజాతి కంపెనీ ఎన్రాన్‌కు చెందిన దాభోల్ విద్యుత్ ప్రాజెక్టు మహారాష్ట్రలోనే ఉంది. మిగతా సరఫరాదార్లకన్నా ఎక్కువ రేటు చెల్లించడానికి మహారాష్ట్ర ప్రభుత్వం ఈ కంపెనీతో చేసుకున్న అవమానకరమైన ఒప్పందం ఫలితంగా ప్రభుత్వానికి 2,000 కోట్ల రూ.ల నష్టం వాటిల్లింది. ఇది దానికి చెల్లించిన ప్రత్యక్ష రాయితీ కాగా, ప్రభుత్వంపై పడిన మొత్తం ఈ ఒప్పందభారం 60 వేల కోట్లుంటుందని కొందరు అధికారులు అంచనా వేస్తున్నారు. ఇలాంటి నష్టాలను పూడ్చుకోవడానికి ప్రజల గోళ్లూడగొట్టి డబ్బు వసూలు చేస్తున్నారు. గత ఐదేళ్లలో మహారాష్ట్రలో కరెంటు చార్జీలు మూడింతలయ్యాయి. ఇప్పటికే రాష్ట్రంలో 1,300 కోట్ల కరెంటు బిల్లు బకాయిలు చెల్లించలేక రైతాంగం ముప్పుతిప్పలు పడుతున్నారు. దీనితో కొన్ని రైతు సంస్థలు ప్రజా వ్యతిరేక ప్రభుత్వానికి పన్నులు, అప్పులు, కరెంటు బిల్లులు చెల్లించవద్దని పిలుపునిచ్చాయి. గడ్చిరోలిలో కూడా విప్లవకర ప్రజా సంఘాలూ, విప్లవ ప్రజా సమితులూ ప్రభుత్వానికి ఎలాంటి పన్నులూ, అప్పులూ, కరెంటు బిల్లులూ కట్టవద్దని ప్రజలకు పిలుపునిచ్చాయి.

**ప్రజా సంక్షేమ పథకాలు :** మహారాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక స్థితి మిగతా అన్ని ప్రభుత్వాల లాగానే తీవ్రమైన సంక్షోభంలో ఉంది. 70,528 కోట్ల రూపాయల అప్పులో నిండా మునిగి ఉంది. రాష్ట్ర అభివృద్ధి రేటుకన్నా అప్పుల నిష్పత్తి గత ఆరేళ్లలో 11.6 శాతం నుండి 18.93 శాతానికి పెరిగిపోయింది. ప్రజావైద్యంపై ప్రభుత్వం తన ఆదాయంలో కేవలం ఒక శాతం మాత్రమే వెచ్చిస్తూ జనాలను ప్రైవేటు ఆసుపత్రులపైన్నే ఆధారపడేలాగ చేస్తున్నది. ఇదంతా 'వ్యవస్థాగత సర్దుబాట్ల కార్యక్రమం'లో భాగమే. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంపై కేవలం 2.8 శాతం మాత్రమే వెచ్చిస్తోంది. ఇది కూడా ఎక్కువేనని భావించిన అంబానీ, బిర్లాల రిపోర్టు దీనిని 1.8 శాతానికి తగ్గించాలని సిఫార్సు చేసింది. గడ్చిరోలిలో కూడా అధికారులు నిధులు లేవని చెబుతూ నామమాత్రపు అభివృద్ధి కార్యక్రమాలకు కూడా ఎగనామం పెడుతున్నారు.

గడ్చిరోలి జిల్లా ప్లానింగ్ మరియు అభివృద్ధి సంస్థ ఈ జిల్లా అభివృద్ధి కోసం 2001-2002 ఆర్థిక సంవత్సరానికై 66 కోట్ల 40 లక్షలు కావాలన్నది. నక్సల్ బాధిత జిల్లా పేరున మరో 100 కోట్లు కావాలని కూడా అడిగింది. కానీ ఉద్యోగులకు జీతాలివ్వడానికే తంటాలు పడుతున్న ప్రభుత్వం ఇంత డబ్బు ఇవ్వలేనని చెబుతూ 37 కోట్లు మాత్రం మంజూరు చేసింది. ఇదిలా ఉంటే, ఆదివాసీ సబ్ ప్లాన్‌లో భాగంగా మహారాష్ట్రలో ఇప్పటి వరకు దాదాపు 435 రకాల వివిధ పథకాలు కాగితాల మీదనైనా కానవస్తుండేవి. కానీ, రాష్ట్ర ప్రభుత్వం ఖజానా ఖాళీ అయిందని చెప్పి 296 పథకాలను వెనక్కి తీసుకుంది. మిగిలిన 139 పథకాలకు కేటాయింపులు మూడింట రెండొంతులు తగ్గించారు. ఇవన్నీ ఆదివాసీ ప్రజలనూ, విద్యార్థి-ఉద్యోగస్తులనూ, నిరుద్యోగ యువకులనూ ఆలోచింపజేస్తున్నాయి. ఇలా తగ్గించడాన్ని జిల్లాలోని రాజకీయ పార్టీలన్నిటితో పాటు, పలు స్వచ్ఛంద సంస్థలు కూడా సవాలు చేస్తున్నాయి. అప్పుల భారం, పంటల దిగుబడి సరిగా లేకపోవడం, నీటి శిస్తు రెట్టింపు కావడం, కరెంటు చార్జీలు మూడు రెట్లవడం లాంటి సమస్యలతో గత ఏడాది కాలంలో 36 మంది రైతులు ఆత్మహత్యలకు పూనుకున్నారు. నిజానికి ఈ ఆత్మహత్యలన్నీ ప్రభుత్వ హత్యలే.

## టాడాను తలదన్నే రీతిలో మొదలైన పోటా అమలు

దేశవ్యాప్తంగా అన్ని సెక్షన్ల ప్రజలూ, ప్రజాస్వామికవాదులూ, వివిధ రాజకీయ పార్టీలూ వ్యతిరేకించినప్పటికీ 24 పార్టీల ఎన్‌డిఏ ప్రభుత్వం పోటా చట్టాన్ని తెచ్చింది. దీని కింద దేశంలోని ఇతర అనేక పార్టీలూ, గ్రూపులతో పాటుగా సిపిఐ (ఎం-ఎల్) [పీపుల్స్‌వార్]ను కూడా కేంద్ర ప్రభుత్వం నిషేధించింది. ఈ చట్టం కింద కాశ్మీర్ తర్వాత, ఎక్కువ మందిని అరెస్ట్ చేస్తున్నది పీపుల్స్‌వార్ పార్టీ నాయకత్వంలో విప్లవోద్యమం కొనసాగుతున్న రాష్ట్రాల్లోనే. వీటిలో మహారాష్ట్ర కూడా ఒకటి. ఈ చట్టం కింద ఉగ్రవాదులుగా భావించేవాళ్లనే కాకుండా, సామాన్య పౌరులనూ, భిన్న రాజకీయ విశ్వాసాలు గల వాళ్లనూ, ప్రభుత్వనికి వ్యతిరేకంగా ఉన్నారని భావించే ఎవరినైనా అరెస్టు చేసే అవకాశం ఉందని ఈ చట్టం తెస్తున్న సమయంలోనే ప్రజాస్వామిక వాదులు చాలా మంది స్పష్టంగానే విమర్శించారు. జూన్ 2002లో గడ్చిరోలి పోలీసులు తునికాకు వ్యాపారులనూ, మరి కొందరినీ అరెస్టు చేసి జిల్లాలో పోటా దుర్వినియోగానికి శ్రీకారం చుట్టారు. శేక్ ఖలీం బందేరిలి, కమలాకర్ బల్లల్‌వార్, ఖ్వాజా మొయినొద్దీన్, ఎ.ఎ. నయీం, మహ్మద్ అలీమొద్దీన్ అనే తునికాకు వ్యాపారులను నక్సలైట్లకు డబ్బిస్తున్నారని ఆరోపిస్తూ, మరి కొందరిని నక్సలైట్లకు సహకరిస్తున్నారని ఆరోపిస్తూ పోటా కింద అరెస్టు చేశారు.

పోటా వచ్చినప్పటి నుండే పోలీసులు ప్రజలను భయపెట్టడం, బ్లాక్ మెయిల్ చెయ్యడం మొదలు పెట్టారు. గడ్చిరోలి ఎస్‌పి వినీత్ అగ్రవాల్ మూడేళ్లలోగా, అంటే 2005 నాటికల్లా నక్సలైట్ ఉద్యమం దానంతటదే అంతమవుతుందని జోస్యం పలికాడు. రాష్ట్ర పోలీసు శాఖ మంత్రి మాణిక్ రావ్ ఠాకరే మాత్రం నక్సల్ ప్రాంతాల అభివృద్ధి కోసం ప్రభుత్వం కేంద్రాన్ని 850 కోట్ల రూపాయలు అడిగిందనీ, అయితే ఈ ప్రతిపాదన రెండున్నర ఏళ్లుగా పెండింగ్‌లో ఉందనీ అన్నాడు. ప్రత్యేకించి విదర్భలోని ఈ ప్రాంతాల అభివృద్ధి కోసం ప్రభాకర్ రావ్ మామూల్‌కర్ నాయకత్వంలో ఒక ప్రత్యేక యాక్షన్ కమిటీని కూడా ఏర్పాటు చేశారు. అంటే ప్రభుత్వం ఒక వైపు పాశవిక పోలీసు బలగాలతో అణచివేత చర్యలు అమలు జరుపుతూనే మరోవైపు నల్ల చట్టాలను విచ్చలవిడిగా ప్రయోగించి ప్రజలను అణచడానికి ప్రయత్నిస్తోంది. పోయిన ఏడాది గడ్చిరోలి జిల్లాలో పోలీసులు అక్రమంగా దాదాపు 20 వేల మంది సామాన్య రైతుల ఫోటోలు తీసుకున్నారు. ఎప్పుడైనా, ఎవరినైనా కాల్చి చంపి ఎన్‌కౌంటర్‌గా ప్రకటించి, లేదా అక్రమంగా అరెస్టు చేసి పోటా కింద జైళ్లలో నిర్బంధించి పోలీసు ఫైళ్లలో ఉండే ఈ ఫోటోలను సాక్ష్యంగా చూపవచ్చని ప్రభుత్వం పథకం అయి ఉంటుంది. గడ్చిరోలి పోలీసులకు బూటకపు ఎన్‌కౌంటర్లలో సామాన్య ప్రజలనూ,

*(కొరవ 28వ పేజీలో .....)*

# ఆంధ్రప్రదేశ్‌లో 'శాంతి చర్చల'కు విఘాతం కల్గించింది నాయుడు ప్రభుత్వమే!

ఆంధ్రప్రదేశ్‌లో టిడిపి ప్రభుత్వం, పీపుల్స్‌వార్ పార్టీల మధ్య జూన్‌లో ప్రారంభమైన 'శాంతి చర్చలు' ఒక కొలిక్కి రాకుండానే జూలై నాటికి అర్థాంతరంగా ముగిసాయి. భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు) [పీపుల్స్‌వార్] పార్టీ తరపున ప్రతినిధులుగా కామ్రేడ్స్ వరవరరావు (విరసం), గద్దర్ (జెఎన్‌యం)లు జూన్ నెలలో జరిగిన మూడు సమావేశాలకు హాజరయ్యారు. ఎడతెగని ఎన్‌కౌంటర్‌ల మధ్య తమ వంతు కర్తవ్యాన్ని నిర్వర్తించారు. పౌరహక్కుల నేతలు ఆజం అలీ, పురుషోత్తంలను దారుణంగా హత్య చేసిన తర్వాత ప్రభుత్వ హత్యల పరంపర ఆగకుండా సాగుతూనే ఉంది. సాధారణ ప్రజల్ని సైతం భయభ్రాంతులను చేసేందుకు సామ్రాజ్యవాదుల బంటు చంద్రబాబు నాయుడు, కరడుగట్టిన భూస్వామ్యపు ముద్దుబిడ్డ డిజిపి పేర్వారం రాములు దూకుడుగా కొత్త కొత్త ఎత్తులు వేయసాగారు. ఈ విఫల చర్చల కాలంలోనే ఆఖరుకు మామూలు గూండాలను, దొంగలను సైతం 'ఎన్‌కౌంటర్ల'లో కాల్చి చంపి రాష్ట్రంలో ప్రజాస్వామనేదే లేని పరిస్థితిని నెలకొల్పారు. అనేక బూటకపు ఎన్‌కౌంటర్లు చేసి ఎందరో విప్లవకారులను హత్యకావించి చర్చల పట్ల చిత్తశుద్ధి లేనితనాన్ని ప్రభుత్వం స్పష్టంగా బైటపెట్టుకుంది. జులై 20న నేరుగా పీపుల్స్‌వార్ పార్టీ నాయకులే చర్చలలో పాల్గొనాల్సి ఉండగా, టిడిపి ప్రభుత్వం జూలై 2న నేరెళ్ళ ఎన్‌కౌంటర్లో కా. పద్మ సహా నలుగురు విప్లవకారుల్ని కాల్చి చంపి పార్టీ తప్పనిసరై చర్చల నుండి వైదొలగే వాతావరణాన్ని సృష్టించింది.

## 'శాంతి చర్చల' పట్ల పార్టీ వైఖరి:

ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే కాదు, మిగతా దేశంలోనూ, మొత్తం ప్రపంచంలోనూ దోపిడీ పాలకవర్గాలూ, వాళ్ల ప్రభువులైన సామ్రాజ్యవాదులూ పోరాటకారులతో చర్చలు చేయడమనే ఎత్తుగడను వాళ్లను నిర్వీర్యం చేయడానికీ, వాళ్లలో చీలికలు తేవడానికీ ఉపయోగించుకుంటున్నారు. అదే సమయంలో ప్రజలను మోసం చేయడానికి కూడా ఈ ఎత్తుగడను వాడుకుంటున్నారు. దినదినం పెరుగుతున్న సామ్రాజ్యవాద సంక్షోభమూ, విప్లవానుకూల పరిస్థితినీ దృష్టిలో ఉంచుకొని, తాత్కాలికంగానైనా ఈ పరిస్థితిని ఎదుర్కొనేందుకు వీలుగా వాళ్లు ఈ చర్చల ఎత్తుగడను ఉపయోగించుకుంటున్నారు. సాయుధ పోరాటాలను అణచివెయ్యడానికి సామ్రాజ్యవాదం ప్రపంచవ్యాప్తంగా అనుసరిస్తున్న ఎల్‌ఐసి వ్యూహంలో భాగమే ఇది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 86 కోట్ల రూ. ల బడ్జెట్ లోటుతో, ప్రపంచ బ్యాంకు నుండి తెచ్చిన దాదాపు 45 వేల కోట్ల రూ. ల అప్పుతో ప్రజల జీవితాలను దుర్భరం చేస్తున్నది. ప్రపంచ బ్యాంకు ఆదేశాలను తు.చ. తప్పక పాటిస్తున్న చంద్రబాబు అనేక ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తున్నాడు. దీనితో ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని సెక్షన్ల ప్రజల్లోనూ తీవ్రమైన అసంతృప్తి రాజుకుంటోంది. మరోవైపు, దాదాపు మూడు దశాబ్దాలుగా ఏపిలో విప్లవకర ప్రజాయుద్ధం అనేక నష్టాలను తట్టుకుంటూ పురోగమిస్తున్నది. ఈ ప్రజాయుద్ధాన్ని అణచివెయ్యడానికి పాలక వర్గాలు అమానుష నిర్బంధకాండను ప్రయోగించి ఇప్పటి దాకా వేలాది మందిని హత్య చేశాయి; లక్షలాది ప్రజల్ని అరెస్టు చేసి జైళ్లల్లో నిర్బంధించాయి. ఒకవైపు నిర్బంధాన్ని అమలు చేస్తూనే, ''పీపుల్స్‌వార్ పార్టీకి ప్రజా మద్దతు లేదు'', ''పీపుల్స్‌వార్ మతిలేని హింసకు పాల్పడుతోంది'', ''పార్టీకి సిద్ధాంతాలూ, ఆదర్శాలూ ఏవీ లేవు'' వంటి ప్రకటనలు చేస్తూ ఘోరమైన దుష్ప్రచారానికి దిగాయి. ఇందుకు వార్తాపత్రికలనూ, రేడియో-టీవీలనూ విస్తృతంగా వాడుకుంటున్నాయి. అయితే ఈ నిర్బంధ చర్యలతో గానీ, విషపూరిత దుష్ప్రచారంతో గానీ ప్రజాయుద్ధం ఆగలేదు, అది ఓటమి-గెలుపు-ఓటమి అనే గతితార్కిక అభివృద్ధి క్రమం గుండా ప్రయాణిస్తూ అంతిమ విజయం వైపు పురోగమిస్తూనే ఉన్నది. సామ్రాజ్యవాదులు నిర్దేశించిన విధానాలన్నింటినీ నిరాటంకంగా అమలు చేస్తూ, తన అరాచక పాలనను కొనసాగించి రాష్ట్రాన్ని పూర్తిగా ప్రపంచ బ్యాంకుకు తాకట్టు పెట్టడానికి చంద్రబాబుకు ఈ ప్రజాయుద్ధం ప్రధాన అడ్డంకిగా ఉంది. దీన్ని ఎదుర్కోవడానికి చంద్రబాబు సైనికచర్యనే ప్రధానమైందిగా భావిస్తూ ఉన్నప్పటికీ, తనకు తాను ప్రజాస్వామికవాదిలా కనిపించడం కోసమూ, అట్లాగే సైనికచర్యతో అనుకున్న ఫలితాలు సాధించలేక పోతున్నందువల్లా కూడా 'శాంతి చర్చల' పేరుతో నిజంగా ఒక డ్రామా ఆడాడని చెప్పొచ్చు.

మరోవైపు, రాష్ట్రంలో సాగుతున్న భయంకరమైన రాజ్య హింస, దానికి ప్రతిగా ప్రజల ప్రతిఘటనల మూలంగా ఏర్పడ్డ హింసాత్మక వాతావరణాన్ని అంతం చెయ్యాలనే పేరుతో కొందరు ప్రజాస్వామ్య ప్రియులు శాంతి చర్చలకు చొరవ తీసుకున్నారు. సాధారణ ప్రజలు కూడా ప్రభుత్వానికీ పీపుల్స్‌వార్ పార్టీకీ మధ్యన శాంతి చర్చలు జరగాలనీ, సమస్యలను శాంతియుతంగా పరిష్కరించుకోవాలనీ కోరుకున్నారు. ప్రజలల్లో పెరుగుతున్న ఈ ఆకాంక్షను గౌరవిస్తూ పార్టీ నిర్ణీత వ్యవధి వరకు కాల్పుల విరమణను ప్రకటించి శాంతి చర్చల దిశగా చొరవగా ముందడుగేసింది. ఈ శాంతి చర్చలను విప్లవోద్యమ పురోగమనానికి అనుగుణంగా ఉపయోగించుకుంటూ ప్రజల ప్రజాస్వామిక చైతన్యాన్ని పెంచడానికి ప్రయత్నించాలని కూడా పార్టీ నిర్ణయించింది.

ప్రభుత్వంతో చర్చల సందర్భంగా ఈ కింది డిమాండ్లు లేవనెత్తాలని పార్టీ నిర్ణయించింది. ఒకవేళ చర్చలు జరగకున్నా ఈ డిమాండ్లను ప్రజల్లోకి తీసుకుపోయి ప్రచారం చెయ్యాలి, ఈ డిమాండ్లకు ప్రజల మద్దతును కూడగట్టాలి అని కూడా నిర్ణయించింది. :

1) సిపిఐ (ఎం-ఎల్) [పీపుల్స్‌వార్] పైనా, ఇతర ప్రజా సంఘాల పైనా నిషేధాన్ని ఎత్తివేయాలి. ఈ సంఘాలు ప్రజల్లో స్వేచ్ఛగా పని చేసేందుకు ప్రజాస్వామిక వాతావరణాన్ని నెలకొల్పాలి. తద్వారా తమ డిమాండ్లపై ఉద్యమించే ప్రజల హక్కును కాపాడాలి.

2. ప్రత్యేకించి విప్లవోద్యమాన్ని అణచివెయ్యడానికి ఏర్పాటు చేసిన ఎస్‌ఎస్‌ఎఫ్ బలగాలను రద్దు చేయాలి. సిఆర్‌పిఎఫ్ బలగాలనూ, ఇతర అన్ని పారా మిలిటరీ బలగాలనూ వెనక్కి పంపించాలి. అన్ని బూటకపు ఎన్‌కౌంటర్ల పైన న్యాయవిచారణ జరిపించాలి. దోషులుగా తేలిన వారిని శిక్షించాలి.

3. (i) ఏపిలో ప్రజాస్వామ్యవాదులతో కూడిన భూమి కమిషన్‌ను ఏర్పాటు చేసి భూసంస్కరణలను అమలు చేయాలి. భూస్వాముల నుండి ప్రజలు స్వాధీనం చేసుకున్న భూమినీ, రైతాంగం దున్నుకుంటున్న ప్రభుత్వ భూమినీ, అటవీ భూమినీ చట్టబద్ధం చేయాలి.

(ii) ఏపిలోని వనరులను కొల్లగొట్టే లక్ష్యం గల సామ్రాజ్యవాద-ప్రపంచబ్యాంకు-ప్రాయోజిత పథకాలనూ, ప్రాజెక్టులనూ ఉపసంహరించుకోవాలి.

(iii) ప్రభుత్వ రంగ పరిశ్రమల ప్రైవేటీకరణను నిలిపివెయ్యాలి. కార్మికులను ఉద్యోగాల్లోంచి తొలగించడాన్ని నిలిపివెయ్యాలి. కార్పొరేట్ వ్యవసాయాన్ని రద్దు చేయాలి.

4. గ్రామాల్లోంచి పోలీసు క్యాంపులన్నింటినీ ఎత్తివేయాలి. ప్రజలు తమ స్వంత సంఘాలను స్థాపించుకోవడాన్నీ, తమ వ్యవహారాలను తామే చక్కబెట్టుకోవడాన్నీ పోలీసులు అడ్డుకోగూడదు.

5. (i) ప్రత్యేక తెలంగాణా కోసం ఉద్యమించే ప్రజల హక్కును గుర్తించాలి.

(ii) ఆదివాసులకు స్వయంప్రతిపత్తిని ప్రకటించాలి. 1/70 చట్టాన్ని అమలు చేయాలి. ఆదివాసీ ప్రాంతాలలోకి భూస్వాముల, పెట్టుబడిదార్ల, ఆదివాసీయేతరుల వలసను నిరోధించాలి.

6. ప్రైవేటు రంగంలో కూడా దళితులకు, ఆదివాసులకు, బిసిలకు, మహిళలకు ఉద్యోగాల్లో రిజర్వేషన్ కల్పించాలి.

7. రాష్ట్రంలో గతంలో మహిళలు పోరాడి గెల్చుకున్న మద్యపాన నిషేధాన్ని అమలు చేయాలి.

## 'శాంతి చర్చల'కు విఘాతం కల్గించిందెవరు?

మిగతా కారణాలున్నప్పటికీ, ముఖ్యంగా ప్రజల వత్తిడి, 'పీస్ ఇనిషియేటివ్ కమిటీ', 'పౌరస్పందన కమిటీ' వంటి ప్రజాస్వామ్య సంఘాల తీవ్ర ప్రయత్నాల కారణంగానే ప్రభుత్వం చర్చలకు సిద్ధపడ్డది. అయితే చర్చలకు విఘాతం కల్గించడానికి అది చెయ్యని ప్రయత్నమంటూ లేదు. మొదటిసారి కాల్పుల విరమణ అమలులో ఉన్న సమయంలో అది తుపాకులగూడెంలో ఒక పెద్ద దాడి చేసి 8 మంది విప్లవకారులను హత్య చేసింది. ఆ తర్వాత, ఒకదాని తర్వాత మరొకటిగా వరుసగా ఎన్‌కౌంటర్లలో విప్లవకారులను హత్య చేయసాగింది. ఆఖరుకు జూలై 2న నేరెళ్లలో జరిపిన ఎన్‌కౌంటర్లో ఉత్తర తెలంగాణా పార్టీ నేత కా. పద్మ సహా నలుగురు విప్లవకారుల్ని హత్య చేసి, పార్టీకి ఈ బూటకపు చర్చల్లోంచి ఉపసంహరించుకోవడం తప్ప మరో మార్గమే లేకుండా చేసింది. అయితే ముందుగా పార్టీయే చొరవ చేసి నిర్ణీత వ్యవధి దాకా కాల్పుల విరమణను ప్రకటిస్తూ, షరతుల్లేకుండా చర్చలకు సిద్ధమని ప్రకటించింది. అయితే ముందుగా ప్రభుత్వం ఎన్‌కౌంటర్ హత్యలను ఆపి, కూంబింగ్ ఆపరేషన్స్‌ను నిలిపివేసి చర్చలకు అనువైన వాతావరణాన్ని నెలకొల్పాల్సి ఉంటుందని పార్టీ స్పష్టం చేసింది. అయితే ప్రభుత్వం మాత్రం ఏ దశలో కూడా చర్చల పట్ల తనకు చిత్తశుద్ధి ఉన్నట్లుగా రుజువు చేసుకోలేదు.

అయినప్పటికీ పార్టీ తరఫున మధ్యవర్తిత్వం వహిస్తూ కామ్రేడ్స్ వరవరరావు, గద్దర్‌లు మూడు విడతలుగా జరిగిన సంభాషణల సందర్భంగా రాష్ట్రంలో సాగుతున్న పోలీసు నిర్బంధం మూలంగా ప్రజల్లో భీభత్స వాతావరణం నెలకొని ఉందని స్పష్టంగా చెప్పారు. తాగునీటి సమస్య, కరెంటు రేట్ల పెంపుదల, కరువు పరిస్థితి వంటి దైనందిన సమస్యలపైన ఉద్యమించే ప్రజల్ని పోలీసులు అణచివేతకు గురి చేస్తున్నారని వారు విమర్శించారు. అయితే పార్టీ తరఫున ఈ ప్రతినిధులు లేవనెత్తిన ఏ విషయాన్నీ కూడా ప్రభుత్వం శ్రద్ధగా వినిందీ లేదు, అమలు చేసిందీ లేదు. ఆఖరుకు చర్చల్లో పాల్గొనబోయే పార్టీ నాయకుల తలలపై ప్రకటించిన నగదు బహుమతుల్ని వెనక్కి తీసుకోవాలన్న ప్రతిపాదనను కూడా ప్రభుత్వం కొట్టిపారేసింది. ఈ బూటకపు చర్చల ప్రక్రియ సాగుతుండగానే ప్రభుత్వం 6 'ఎన్‌కౌంటర్లు' చేయించి 12 మందిని హత్య చేసింది.

మరోవైపు, పోలీసులు పార్టీకి వ్యతిరేకంగా దాడులతో పాటుగా వరుసగా రెచ్చగొట్టే ప్రకటనలు చేసి తమ వంతు పనిని పూర్తి చేయసాగారు. ఒక వంక ప్రభుత్వం 'శాంతి చర్చల' పట్ల తనకు లేని చిత్తశుద్ధిని ఉన్నట్లు చూపడం కోసం తీవ్రమైన ప్రయత్నాలు చేస్తుండగా, మరో వంక పోలీసు అధికార్లు మాత్రం "మేం ఎన్‌కౌంటర్లు తప్పకుండా చేస్తం, నక్సలైట్లను చంపుతం. ఎందుకంటే వాళ్లు కూడా తుపాకులు పట్టుకొని తిరుగుతున్నరు కదా!" వంటి ప్రకటనలు చేసారు. డిజిపి రాములు పార్టీకి వ్యతిరేకంగా విషం గక్కుతూ అనేక ప్రకటనలు చేశాడు. తలాతోక లేని మొండి వాదనలను ముందుకు తెస్తూ ముందుగా పీపుల్స్‌వార్ ఆయుధాలను వదిలిపెట్టి అప్పుడు చర్చలు జరపాలని విర్రవీగుతూ మాట్లాడాడు. వీటిని కేవలం పోలీసుల రెచ్చగొట్టే చర్యలని భావించాల్సిన పని లేదు. ప్రభుత్వం పథకం ప్రకారం తయారు చేసిన వ్యూహంలో భాగంగానే, ఒకవైపు అది పోలీసులకు విశృంఖలమైన అధికారాల్ని ప్రదానం చేసి మరోవైపు 'శాంతి చర్చల' ప్రహసనాన్ని నడిపింది.

ఈ మొత్తం పరిస్థితుల కారణంగా పార్టీకి తప్పనిసరై చర్చల ప్రక్రియ నుండి పక్కకు తొలగాల్సి వచ్చింది. చివరకు జూలై 20 పార్టీ ఆంధ్ర రాష్ట్ర కమిటీ కార్యదర్శి కామ్రేడ్ రామకృష్ణ ఒక ప్రకటన చేస్తూ కాల్పుల విరమణను ఉపసంహరించుకుంటున్నట్టుగా, తమ ఆత్మరక్షణా యుద్ధాన్ని తిరిగి ప్రారంభిస్తున్నట్టుగా ప్రజలకు తెలియజేశాడు.

## ప్రజాయుద్ధం ఆగదు!

ఈ 'శాంతి చర్చల' ప్రహసనంతో ప్రభుత్వం అసలు రంగును ప్రజలు బాగా తెలుసుకున్నారు. 'పార్టీకి ఎలాంటి ప్రజా కార్యక్రమం లేదు' అని ఇంత కాలం పాలక వర్గాలు చేసిన ప్రచారమంతా తప్పని ప్రజలకు అర్థమయ్యింది. పార్టీ చేస్తున్న డిమాండ్లనూ, పార్టీ ప్రజా కార్యక్రమాలనూ ప్రజలు బాగా తెలుసుకోగలిగారు. ఎవరు నిజమైన శాంతి కాముకులో, ఎవరు శాంతిని భంగం చేసేవారో కూడా ప్రజలకు తెలిసిపోయింది. ప్రజలు భయంకర నిర్బంధం మధ్య కూడా అమరురాలు కా. పద్మ అంతిమయాత్రలో వేలాది సంఖ్యలో పాల్గొని "పీపుల్స్‌వార్ పార్టీకి ప్రజాపునాది లేదు", "పీపుల్స్‌వార్ జనజీవన స్రవంతిలో లేదు" అంటూ గగ్గోలు పెట్టేవాళ్ల నోళ్లు మూతలు పడేలా చేశారు.

పీడిత ప్రజలు విప్లవయుద్ధం ద్వారానే రాజ్యాధికారాన్ని సాధించగలరు. ఇందుకు వేరే మార్గం ఏదీ లేదు. అయినప్పటికీ, ప్రతి యుద్ధం లాగానే విప్లవ యుద్ధ క్రమంలో కూడా ఇరు పక్షాల మధ్యా చర్చలకు అవకాశం ఉంటుంది. తమ తమ ప్రయోజనాల కోసమే అయినప్పటికీ, యుద్ధంలోని కొన్ని మలుపుల్లో ఇరు పక్షాలకూ ఇలాంటి పరిస్థితి వస్తుంది. అయితే అసలు వాస్తవం ఏమిటంటే ఈ భూమండలం మీద నుంచి మనిషిని మరో మనిషి దోచుకునే వీలున్న వ్యవస్థ పూర్తిగా అంతరించిపోయే దాకా, ఉత్పత్తి సాధనాలపై మానవుల సమిష్టి యాజమాన్యం ఏర్పడే దాకా శాశ్వత శాంతి సాధ్యం కాదు. ఇది విప్లవ యుద్ధం ద్వారా సామ్రాజ్యవాదాన్నీ, భూస్వామ్య విధానాన్నీ, దళారీ పెట్టుబడినీ కూకటేళ్లతో పాటు పెకిలించివేసి నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయడం ద్వారానే, ఆ తర్వాత ప్రపంచ సోషలిస్టు విప్లవాన్ని విజయవంతం చేసి కమ్యూనిజానికి బాటలు వేయడం ద్వారానే సాధ్యమని నిస్సందేహంగా చెప్పవచ్చు.

ఆఖరుగా, ఈ 'శాంతి చర్చల'లో పార్టీ తరఫున పాల్గొన్న కామ్రేడ్ వరవరరావు పత్రికల వాళ్లతో మాట్లాడుతూ చెప్పిన మాటల్ని ఓసారి మననం చేసుకుందాం, **"సాయుధ పోరాట అంశం ఒక రాజకీయ దృక్పథానికి సంబంధించినది. ప్రస్తుతం ప్రభుత్వంతో జరిపే చర్చలతో అది పరిష్కారం కాదు. రెండు నమూనాలపై రెండు శిబిరాల మధ్య జరుగుతున్న పోరాటం ఇది. ఇందులో ఒకటి ప్రపంచ బ్యాంకు నమూనా కాగా రెండోది విప్లవ పార్టీగా పీపుల్స్‌వార్ చూపిస్తున్న స్వావలంబన నమూనా. చర్చల ద్వారా ఈ సమస్య పరిష్కారం ఎలా సాధ్యం?"** ❐

పత్రికా ప్రకటన

## చర్చల విషయంలో ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వపు రెండు నాల్కల ధోరణిని నిరసించండి !

మా పార్టీతో చర్చల విషయంలో ప్రభుత్వం చేసిన ప్రతిపాదనకు జవాబుగా ఇటీవలే దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ ఒక ప్రకటన జారీ చేసింది. చర్చలకు అనువైన వాతావరణాన్ని ఏర్పాటు చేస్తే గనక మా పార్టీ షరతులతో కూడిన చర్చలకు సిద్ధమని ఆ ప్రకటనలో మా ఎస్‌జెడ్‌సి స్పష్టం చేసింది. మా పార్టీనీ, ప్రజా ఉద్యమాలనూ అణచడానికై కేంద్ర ప్రభుత్వం నేతృత్వంలో ఏర్పాటైన జెటిసి నుండి ప్రభుత్వం వైదొలగాల్సి ఉంటుంది. అట్లాగే పోరాట ప్రాంతాలలో మోహరించిన అదనపు బలగాలను వెనక్కి తీసుకొని, కూంబింగ్ ఆపరేషన్స్‌ను నిలిపివేసి, ప్రజల ప్రజాస్వామ్య అధికారాలను (సభలు, సమావేశాలు, ఊరేగింపులు, ధర్నాలు వంటివి) గుర్తించి, జైళ్లలో ఖైదు చేసిన ఆదివాసులందరినీ విడుదల చేసి చర్చలకు అనువైన ఒక శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పి అది చర్చల పట్ల తన చిత్తశుద్ధిని రుజువు పర్చుకోవల్సి ఉంటుంది.

మా ప్రకటనకు జవాబుగా ప్రభుత్వం తరపున పరస్పర విరుద్ధమైన ప్రకటనలు వెలువడ్డాయి. హోంమంత్రి నందకుమార్ పటేల్ షరతులతో కూడిన చర్చలను వ్యతిరేకించగా, ముఖ్యమంత్రి అజీత్ జోగి షరతులతో చర్చలకు సంసిద్ధతను తెలిపాడు. కానీ మేం పెట్టిన షరతుల విషయమై ఏమీ మాట్లాడలేదు. ఈ పరస్పర విరుద్ధమైన ప్రకటనల ద్వారా మా పార్టీతో చర్చల విషయంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని మరోమారు రుజువైంది. ఎందుకంటే చర్చలకు అనువైన వాతావరణం నెలకొల్పితే గనుక మేం చర్చలకు సిద్ధమేనని మా పార్టీ ఇప్పటికే చాలాసార్లే స్పష్టం చేసింది. కానీ ప్రభుత్వం వైపు నుండి పత్రికల్లో సారంలేని ప్రకటనల పరంపర తప్ప ఈ దిశగా సరైన చర్య ఏదీ చేపట్టలేదు.

మొత్తంగా చెప్పాలంటే 'నక్సలైట్లతో చర్చల' విషయం ఒక ప్రహసనంగా మారిపోయింది. అవిభాజిత మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి దిగ్విజయ్ సింగ్ నుండి ఇప్పటి జోగి వరకు 'శాంతి చర్చల'ంటూ పాచిపాటే పాడుతున్నారు తప్ప మా షరతులపై పెదవి విప్పడం లేదు. మరోవైపు ప్రభుత్వం తన సాయుధ బలగాలను పటిష్టం చేసుకుంటోంది. కొత్త కొత్త బెటాలియన్లలోకి భర్తీ మొదలుపెట్టింది. ప్రత్యేక శిక్షణనిప్పిస్తున్నది. 'ఇన్సాస్' వంటి అత్యాధునిక రైఫిళ్లు, శాటిలైట్ ఫోన్లు, మైన్‌ప్రూఫ్ వాహనాలు మొదలైనవి కొనుగోలు చేస్తోంది. 1700 కోట్ల రూపాయల నక్సలైటు నిర్మూలనా పథకాన్ని సిద్ధం చేసి కేంద్రం అనుమతి కోసం పంపించింది. బూటకపు సంస్కరణ కార్యక్రమాలను అమలు చేస్తోంది. రోజురోజుకూ కొత్త కొత్త పథకాలు వేస్తూ మమ్మల్ని అణచివెయ్యడానికి ప్రయత్నిస్తోంది. వీటన్నింటి ద్వారా ప్రభుత్వానికి చర్చల విషయంలో ఏ మాత్రం చిత్తశుద్ధి లేదని రుజువవుతున్నది. అది కేవలం పోరాట ప్రజలను పక్కదారి పట్టించడానికే ఇలా ప్రయత్నిస్తోంది. చర్చల ముసుగులో మాపై మరో పెద్ద దాడికి ప్రభుత్వం ఏర్పాట్లు చేసుకుంటున్నది. ప్రజల్లో మమ్మల్ని 'శాంతి విరోధులు'గానూ, 'హింసావాదులు'గానూ నిలబెట్టాలని ఉవ్విళ్లూరుతున్నది.

మా పార్టీ మొదటి నుండీ చర్చల విషయంలో వైఖరిని స్పష్టంగా ప్రకటిస్తూ వస్తున్నది. ముందుగా ప్రభుత్వం చర్చలకు అనుకూల వాతావరణాన్ని నెలకొల్పి తన నిజాయితీని నిరూపించుకుంటే గనుక, ప్రజల సమస్యలపై మేం ప్రభుత్వంతో చర్చలు జరపడానికి ఇప్పటికీ సిద్ధమేనని మేం మరోసారి స్పష్టం చేస్తున్నాం. ఈ విషయంలో మేం చేసిన డిమాండ్లపై ముందుగా ప్రభుత్వం తన వైఖరిని స్పష్టంగా ప్రకటించాలి. మమ్మల్ని అణచివెయ్యడానికి అన్ని ప్రయత్నాలూ చేస్తూనే 'నక్సలైట్లతో చర్చలకు మేం సిద్ధం' అంటూ పాడిందే పాడడం ప్రభుత్వ రెండు నాల్కల ధోరణికే, మోసానికే నిదర్శమవుతుంది తప్ప మరేం కాదు. మాతో చర్చల విషయంలో ప్రభుత్వ ద్వంద్వ వైఖరిని వ్యతిరేకించాల్సిందిగానూ, ప్రజా సమస్యలపై మేం చేపడుతున్న న్యాయమైన పోరాటాలకు మద్దతునివ్వవలసిందిగానూ మేం ఛత్తీస్‌గఢ్, దండకారణ్యంలలోని ప్రజాస్వామ్య ప్రియులైన, శాంతిప్రియులైన ప్రజలందరికీ విజ్ఞప్తి చేస్తున్నాం.

కోస
కార్యదర్శి
దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ
సిపిఐ (ఎం-ఎల్) [పీపుల్స్‌వార్]

సెప్టెంబర్ **10, 2002**

## *గంగలూర్ ఠానేదార్ కౌశలేంద్ర సింగ్‌ను హతమార్చిన ప్రజా మిలిషియా!*

*సెప్టెంబర్ 7న ప్రజా మిలిషియాకు చెందిన ఒక యాక్షన్ టీం పశ్చిమ బస్తర్ డివిజన్‌లోని గంగలూర్ పోలీసు ఎస్.ఐ. కౌశలేంద్ర సింగ్‌ను సాహసోపేతంగా హతమార్చింది. వీడు గంగలూర్ ప్రాంతంలో దౌష్ట్యానికి మారుపేరుగా నిలిచిన వాడు. సంతల్లోకి వచ్చే ప్రజలను వేధించడం, కొట్టడం వంటి వాటిలో వీడు మొనగాడు. గ్రామాల్లో ప్రజా సంఘ కార్యకర్తలను అరెస్టు చేయడానికి అనేక సార్లు దాడులకు నాయకత్వం వహించాడు. ఈ ప్రాంతంలో వీడు విప్లవోద్యమానికి కంటకప్రాయంగా నిలిచాడు. దానితో పార్టీ వీడిని ఖతం చేయాలని నిర్ణయించి పిజిఏ బేస్ ఫోర్స్‌కు చెందిన ఒక యాక్షన్ టీంకు ఈ బాధ్యతను అప్పగించింది. వీడు తన మోటార్ సైకిల్‌పై రోడ్డు మీద వస్తుండగా పిజిఏ యాక్షన్ టీం ఒక వాగు వద్ద మాటు వేసింది. అదే సమయంలో అక్కడ దిగబడ్డ ఒక సివిలియన్ జీపును బయటకు తీయడానికి కొంతమంది ప్రయత్నం చేస్తుండగా యాక్షన్ టీం సభ్యులు కూడా వారితో పాటు చేరిపోయి ఠానేదార్ కోసం ఎదురుచూడ సాగారు. సాదా బట్టల్లో, ఏ మాత్రం అనుమానం రాకుండా ఉన్న ఈ గెరిల్లాలు అక్కడికి ఠానేదార్ మోటార్‌సైకిల్‌పై చేరుకోగానే వాడి వెనక్కి చేరుకున్నారు. వాడు తన మోటార్‌సైకిల్‌ను వాగు దాటించే ప్రయత్నంలో ఉండగా గెరిల్లాలు వెనుక నుండి గొడ్డలితో దాడికి దిగారు. వాడు తేరుకునే లోగానే మిగతా పని పూర్తి కానిచ్చారు. వీడి వద్ద నుండి రెండు చేతి గ్రెనేడ్లనూ, కొంత నగదునూ స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన పోలీసు అధికార్లను హడలెత్తించగా, ప్రజలు హాయిగా ఊపిరి పీల్చుకున్నారు.* ❒

*(..... చివరి పేజీ తరువాయి)*

థాయ్‌లాండ్, సింగపూర్, హాంగ్‌కాంగ్, ఫిలిప్పైన్స్ వంటి ఆగ్నేయాసియా దేశాల చేదు అనుభవం చెప్పేదిదే. టూరిజం వల్ల ఆ దేశాల ప్రభుత్వ ఖజానాలు డాలర్లతో గలగలలాడిన మాట నిజమే కానీ వాస్తవం ఏమిటంటే ఈనాడు ఆ దేశాలు వేశ్యావృత్తి, మాదకపదార్థాల దొంగవ్యాపారం, భిక్షాటనం, ఎయిడ్స్ వంటి సమస్యలతో తీవ్రంగా సతమతమవుతున్నాయి. మన దేశంలోని ఈశాన్య రాష్ట్రాలనూ, గోవానూ కూడా ఇందుకు ఉదాహరణలుగా చెప్పుకోవచ్చు. ఈనాడు ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం బస్తర్‌ను మరో థాయ్‌లాండ్‌గా మార్చాలని తహతహలాడుతుంది. తను స్వయంగా ఆదివాసీనని చెప్పుకునే ముఖ్యమంత్రి అజీత్ జోగి ఇక్కడి ఆదివాసుల ఉన్నతమైన ప్రజా సంస్కృతిని కలుషితం గావించడానికి కుట్ర చేస్తున్నాడు. అయితే ప్రజలకు ఈ కుట్ర అర్థం కాకుండా ఉండడానికి దీన్నంతటినీ 'బస్తర్ అభివృద్ధి' పేరుతో సాగిస్తున్నాడు.

సాంప్రదాయంగా బస్తర్‌లో ప్రతి ఏడూ దసరా పండుగ జరుగుతూ వస్తున్నది. అయితే దీన్ని వ్యాపారీకరించడానికి ప్రభుత్వం దీనికి 'బస్తర్ లోకోత్సవ్' పేరు పెట్టి దీని పరిధిని బాగా పెంచింది. పోయిన సంవత్సరం 'బస్తర్ లోకోత్సవ్' జయప్రదమయ్యిందని చెబుతూ ఈసారి దీన్ని రాష్ట్ర పండుగగా ప్రకటించి కోట్లాది డబ్బును దుర్వినియోగం చేస్తున్నది. ఇక్కడికి వచ్చే పర్యాటకులకు అత్యాధునిక సౌకర్యాలన్నీ కల్పించడానికి యుద్ధ ప్రాతిపదికన ఏర్పాట్లు మొదలయ్యాయి. పిడికెడు మంది సంపన్న పర్యాటకుల విషయంలో ప్రభుత్వం ఇప్పుడు చూపుతున్న శ్రద్ధలో వందో వంతైనా బస్తర్‌లోని పీడిత ప్రజల కనీస సౌకర్యాలను మెరుగుపర్చడంలో చూపి ఉంటే ఈనాడు బస్తర్ పరిస్థితి ఇట్లా ఉండేదే కాదని నిర్ద్వంద్వంగా చెప్పవచ్చు. ఇది అర్థం కావాలంటే ప్రభుత్వ వర్గస్వభావాన్ని అర్థం చేసుకోవాల్సి ఉంటుంది - అంటే ప్రభుత్వం చెప్పుకుంటున్నట్టుగా ఇది ప్రజల ప్రభుత్వం కాదు, దళారీ పెట్టుబడిదారీ వర్గాల, భూస్వామ్య వర్గాల ప్రభుత్వం ఇది. అందుకే అది తన వర్గాల ప్రయోజనాల కోసం ఎంతటి వ్యయప్రయాసలను భరించైనా పాటు పడుతుంది. అయితే ఈ వాస్తవాన్ని తెరమరుగు చేయడానికే అది 'బస్తర్ అభివృద్ధి' అంటూ పాచిపాటే పాడుతోంది.

మేం సాంప్రదాయంగా ప్రజలు జరుపుకునే పండుగల్ని వ్యతిరేకించడం లేదు, వాటిని వ్యాపారీకరించే ప్రభుత్వ ప్రయత్నాలను వ్యతిరేకిస్తున్నాం. బస్తర్ ప్రకృతి అందాలను చూసి ఆనందపరవశులవడానికి మాత్రమే అయితే ఇక్కడికి రావద్దని మేం దేశవిదేశీ పర్యాటకులందరికీ విజ్ఞప్తి చేస్తున్నాం. ఎందుకంటే ఇక్కడ జీవిస్తున్న ప్రతి వ్యక్తికి కడుపు నిండా అన్నం, గౌరవంగా బతకగల ఆర్థిక స్తోమత లేనపుడు ఇక్కడి ప్రకృతి 'సౌందర్యాన్ని' గొప్పగా చిత్రించడం అర్థం లేనిదనే మేం భావిస్తున్నాం. పైగా మీరు ఇక్కడికి రావడం ద్వారా మునుపటి నుండే ఇక్కడున్న సమస్యలకు తోడుగా వేశ్యావృత్తి, అడుక్కుతినడం, మాదకపదార్థాల వాడకం, ఎయిడ్స్ వంటివి పెచ్చరిల్లి పోవడానికి అవకాశాలు బాగా పెరుగుతాయి. చరిత్రే ఇందుకు సాక్ష్యం. నిజానికి బస్తర్ ప్రజల ప్రయోజనాల పట్ల ఒక్క క్షణమైనా దృష్టి సారించని వారికి ఇక్కడి ప్రకృతి అందాలను చూసి ఆనందించే నైతిక హక్కే లేదని మేం భావిస్తున్నాం. ఎందుకంటే ఇక్కడి నిరుపేద ఆదివాసీ ప్రజలే ఈ అందమైన ప్రకృతికి యజమానులు. ఒకవేళ ఎవరైనా ఇక్కడి ప్రజల మేలుకోరి ఏదైనా పరిశోధించాలనుకుంటే లేదా ఇక్కడి ప్రజల సంస్కృతినీ చరిత్రనూ నిజాయితీగా, సీరియస్‌గా అధ్యయనం చేయాలనుకుంటే, సూటిగా చెప్పాలంటే ఇక్కడి ప్రజలనూ, అపార ఖనిజ సంపదలనూ, ప్రకృతి సంపదలనూ దోచుకునే ఉద్దేశ్యంతో కాకుండా ఇక్కడి ప్రజల ప్రయోజనం కోసం పాటు పడాలనే చిత్తశుద్ధితో ఇక్కడికి రావాలనుకున్నవారిని మేం ఆహ్వానిస్తాం. ఈ విజ్ఞప్తిని లెక్కచేయకుండా ఇక్కడి వచ్చే పర్యాటకులు ప్రజల ప్రతిఘటనను ఎదుర్కోవల్సి ఉంటుందని మేం ఇక్కడ పర్యటించాలనుకుంటున్న వారందరినీ మరోసారి హెచ్చరిస్తున్నాం.

ఆదివాసీ ప్రజల సంస్కృతిపై 'బస్తర్ లోకోత్సవ్' పేరిటా, 'పర్యాటకరంగానికి ప్రోత్సాహం' పేరిటా జరుగుతున్న సామ్రాజ్యవాద సాంస్కృతిక దాడిని అర్థం చేసుకోవాలని, ఈ సందర్భంగా మేం బస్తర్‌లోని ఆదివాసీ మేధావులకూ, విలేఖరులకూ, అధ్యాపకులకూ, కళాకారులకూ, ఆదివాసీ సాంప్రదాయ పెద్దలకూ విజ్ఞప్తి చేస్తున్నాం. అశ్లీలమైన, అసభ్యమైన, లాభాలార్జించడమే ధ్యేయంగా గల సామ్రాజ్యవాద కుసంస్కృతి ఇక్కడి నిరాబండరమైన, గౌరవప్రదమైన, విలక్షణమైన, గొప్పదైన ప్రజల సంస్కృతిని కబళించే ప్రక్రియ చాలా ముందుగానే మొదలైంది. బస్తర్‌లోని అపార సంపదల్ని దోచుకునే సామ్రాజ్యవాదుల కుట్రలో భాగంగానే ఈ విధంగా బస్తర్‌లో పర్యాటకరంగానికి బాగా ప్రోత్సాహాన్నిచ్చి పథకం ప్రకారం సామ్రాజ్యవాద విష సంస్కృతిని వ్యాపింపజేస్తున్నారు. అందుకే బస్తర్‌లో సామ్రాజ్యవాదులూ, వారి స్వదేశీ దళారులూ చేస్తున్న దోపిడీని ఎదిరించడమే కాకుండా ఈ రూపంలో సాగుతున్న సాంస్కృతిక దాడిని కూడా ఎదిరించవల్సి ఉంది. లేకుంటే బస్తర్ భవిష్యత్తు అంధకారమయమే అవుతుంది. అందుకే బస్తర్ ప్రజల సంస్కృతినీ, బస్తర్ ప్రజల భాషలనూ, బస్తర్ ప్రజల గౌరవప్రదమైన పోరాట వారసత్వాన్నీ కాపాడుకోవడానికై కల్సిరావల్సిందిగా మేం మరోసారి విజ్ఞప్తి చేస్తున్నాం.

బస్తర్ ప్రజలు బ్రిటిష్ సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా అనేక సందర్భాల్లో లెక్కలేనన్ని తిరుగుబాట్లు చేసిన సంగతి మనందరకూ తెలిసిందే. బస్తర్ మొట్టమొదటి అమరవీరుడూ, 1825 పరాల్‌కోట తిరుగుబాటు నాయకుడూ అయిన గేంద్‌సింగ్, 1910 భూంకాల్ మహాసంగ్రామం నాయకుడు గుండాధూర్ తదితరులు బస్తర్ నేలపై విదేశీ పాలనను అంతం చేసి ప్రజల రాజ్యాన్ని స్థాపించాలని కలలు గన్నారు. కానీ వాళ్ల కలలు ఇప్పటికీ పూర్తిగా ఫలించలేదు. బ్రిటిష్ ప్రత్యక్ష పాలన ముగిసినప్పటికీ, ఈనాటికీ బస్తర్‌లో సామ్రాజ్యవాద దోపిడీపీడనలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇక్కడి వనరులను అనేక సామ్రాజ్యవాద బహుళజాతి కంపెనీలు చౌకగా దోచుకుంటున్నాయి. ఈ బహుళజాతి కంపెనీల దోపిడీని మరింతగా పెంచడం కోసమే ఇప్పుడు మన ఆదివాసీ ప్రజల సంస్కృతిపై తీవ్రమైన దాడి జరుగుతోంది. మహేంద్ర కర్మ వంటి బస్తర్ దళారీలు ఆదివాసుల ప్రయోజనాలకు వ్యతిరేకంగా నిలబడ్డారు. మహేంద్ర కర్మ తండ్రి బొడ్డ మాంజీ కూడా ఒకప్పుడు బ్రిటిష్‌వాళ్లతో కుమ్మక్కైనవాడు అన్న విషయం గుర్తుంచుకుంటే వాడి కొడుకు నుండి ఇందుకు భిన్నంగా ఏదీ ఆశించలేం. మనం ఇప్పుడు బస్తర్ ప్రజల సంస్కృతిని నాశనం కానివ్వడమా? బస్తర్‌ను మరో థాయ్‌లాండ్‌గా మారనివ్వడమా? లేదా బస్తర్ ప్రజల సంస్కృతిని కాపాడుకోవడానికి దృఢంగా నిలబడడమా? అన్న విషయాలు నిర్ణయించుకోవాలి. బస్తర్‌లో సాంప్రదాయంగా జరిగే పండుగల వ్యాపారీకరణను వ్యతిరేకిస్తూ 'బస్తర్ లోకోత్సవ్'ను బహిష్కరించాల్సిందిగా మేం ప్రజలందరికీ మరోసారి విజ్ఞప్తి చేస్తున్నాం. బస్తర్‌లో పర్యాటకరంగానికి ప్రోత్సాహాన్నివ్వడం ద్వారా జరుగబోయే అనర్థాలనూ, నష్టాలనూ అర్థం చేసుకొని వీటికి వ్యతిరేకంగా విశాలమైన ఫ్రంట్ నిర్మాణానికి పూనుకోవాలనీ, ప్రభుత్వ దివాళాకోరు విధానాలకు వ్యతిరేకంగా ప్రజాపోరాటాన్ని తీవ్రతరం చేయాలనీ మేం విజ్ఞప్తి చేస్తున్నాం.

*సెప్టెంబర్, 2002*

పత్రికా ప్రకటన

# ఇరాక్‌పై అమెరికన్ - బ్రిటిష్ సామ్రాజ్యవాదుల సైనిక చర్యను వ్యతిరేకించండి!

సెప్టెంబర్ 11 ఘటనల తర్వాత అఫ్ఘనిస్తాన్‌లో తాలిబాన్‌ను గద్దె దించడంలో సామ్రాజ్యవాద సర్దార్ అమెరికాకు లభించిన విజయగర్వంతో అది ఇప్పుడు ఇరాక్‌పై కన్నేసింది. అప్రకటిత ప్రపంచ పోలీసు అయిన అమెరికా ప్రతిరోజూ తన చిత్తం వచ్చినట్టుగా ఇరాక్‌ను బెదిరిస్తున్నది. ఇరాక్ వద్ద అణుబాంబులూ, రసాయనిక బాంబులూ, క్రిమిబాంబులూ ఉన్నాయంటూ ఆరోపణలు చేస్తూ దానిపై పెద్ద ఎత్తున సైనిక దురాక్రమణ జరపడానికి ఏర్పాట్లు చేస్తున్నది. ఐక్యరాజ్య సమితి ఆయుధాల తనిఖీ బృందాన్ని అడ్డుకున్నందుకు మండిపడుతూ ఇరాక్‌పై దాడికి కాలుదువ్వుతోంది. అమెరికా చేస్తున్న ఈ కుట్రలో బ్రిటిష్ సామ్రాజ్యవాదులు కూడా ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఇంకా అనేక సామ్రాజ్యవాద దేశాలు కూడా తమ తమ బలహీనతల కారణంగా అమెరికా పన్నాగాలను చాలా హీనస్వరంతో వ్యతిరేకిస్తున్నాయి లేదా మౌనంగా సమర్థిస్తున్నాయి. అయితే ప్రపంచంలోని ఇతర వెనుకబడ్డ దేశాలు – అరబ్ దేశాలు సహా – ఇరాక్‌పై దాడిని మామూలుగా వ్యతిరేకిస్తున్నాయి తప్ప ప్రపంచం మీద అమెరికా పెత్తనాన్ని కచ్చితంగానూ, బాహాటంగానూ వ్యతిరేకించడం లేదు.

'టెర్రరిజంపై పోరు' పేరిట అమెరికా తన ప్రయోజనాలకు వ్యతిరేకంగా నిలిచిన ప్రతి దేశంపైనా దురాక్రమణకు కాలుదువ్వుతోంది. 1991లో ప్రస్తుత రాష్ట్రపతి జార్జ్ డబ్ల్యు. బుష్ తండ్రి సీనియర్ బుష్ అమెరికా రాష్ట్రపతిగా ఉన్నప్పుడు అది ఇరాక్‌పై 42 రోజుల పాటు బాంబులవర్షం కురిపించింది. దీనిలో ఇరాక్‌లోని విమానాశ్రయాలు, కమ్యూనికేషన్ వ్యవస్థ, పాలనా విభాగపు భవనాలు మొదలైనవి భూమట్టమైనాయి. వేలాది ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. ఆఖరుకు నీటి సరఫరా వ్యవస్థ, విద్యుత్ కేంద్రాలు, స్కూళ్లు వంటి వాటిని కూడా అమెరికా వదిలిపెట్టలేదు. ఆ తర్వాత ఇరాక్ పునర్నిర్మాణంపై కూడా అమెరికా ఆంక్షలు విధించింది. ఈ కారణంగా వేలాది ప్రజలు అనేక రోగాల పాలైనారు; అకాలమరణాల పాలైనారు. యుద్ధం మూలంగానూ, ఆ దరిమిలా విధించిన ఆంక్షల మూలంగానూ 7,50,000 పసిపిల్లలు సహా మొత్తం 12లక్షల ఇరాకీయులు మరణించారని 1997లో ఐక్యరాజ్య సమితియే స్వయంగా ప్రకటించింది. అమెరికా విధించిన ఆంక్షల కారణంగా ఇప్పటికీ ప్రతి నెలా 4 నుండి 6 వేల పసిపిల్లలు అసువులు బాస్తున్నారు. అనేక రోగాలు వ్యాపిస్తున్నాయి.

'గల్ఫ్ యుద్ధం'గా పిలిచే నాటి యుద్ధంతో అమెరికా దురాశలు నెరవేరలేదు. సద్దాం హుస్సేన్‌ను గద్దె దించాలని అది పన్నిన పన్నాగాలన్నీ బెడిసికొట్టాయి. దానికి భిన్నంగా ఇరుగుపొరుగు దేశాలతో ఇరాక్ సంబంధాలు మెరుగుపడ్డాయి. పొరుగు దేశాలు అమెరికా ఆంక్షలను లెక్కచేయకుండా ఇరాక్‌తో వ్యాపార లావాదేవీలు ప్రారంభించాయి. జోర్డాన్, సిరియా, టర్కీ, ఈజిప్టు మొదలైన పొరుగు దేశాల నుండి, చైనా సహా రష్యా, ఫ్రాన్స్, జర్మనీ వంటి సామ్రాజ్యవాద దేశాల నుండి ఇరాక్ దిగుమతులు అనేక రెట్లు పెరిగాయి. అనేక దేశాలు బాగ్దాద్‌లో తమ రాయబార కార్యాలయాలు తెరిచాయి. 1998లో ఇరాకీ అధికారులు అరబ్ లీగ్ మహాసభలో పాల్గొన్నారు.

సౌదీ అరేబియా ఆర్థికంగా దిగజారిపోయింది. అక్కడ నిరసనజ్వాలలు పెల్లుబుకసాగాయి. పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో ఇరాన్ ప్రాభవం పెరగసాగింది. ఈ ప్రాంతంలో పరస్పర ఆర్థిక, రాజకీయ సంబంధాలు గట్టిపడ్డాయి. ఈ నేపథ్యంలో ఇరాక్‌పై అమెరికా వేధింపులు అధికమయ్యాయి. అది ఇరాక్, ఇరాన్, ఉత్తర కొరియాలను బాహాటంగానే 'దుష్ట త్రయం' అని కూడా అభివర్ణించింది.

పర్షియన్ గల్ఫ్ అపారమైన చమురు నిల్వలు గల ప్రాంతం. ఇక్కడ ప్రపంచ చమురు నిల్వల్లో 65 శాతం, ప్రపంచ సహజ వాయు నిల్వల్లో 34 శాతం ఉన్నాయి. చమురు యుద్ధంలో చాలా ప్రాముఖ్యత గలిగిన సరకు. పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ ఉనికికి చమురే ప్రముఖమైన ఆధారం. చమురు వనరులపైనా, సరఫరా మార్గాలపైనా ఆధిక్యతను సంపాదించడమంటే చమురుపై ఆధారపడిన దేశాలపైన ఆధిక్యతను సాధించడమే. అందుకే అమెరికన్ పాలకవర్గాలు పర్షియన్ గల్ఫ్ ప్రాంతాన్ని గుప్పెట్లో బంధించి తమకు పోటీగా నిలిచిన సామ్రాజ్యవాదులందరినీ పక్కకు నెట్టెయ్యాలని ప్రయత్నిస్తున్నాయి.

పర్షియన్ గల్ఫ్ ప్రాంతంపై తమ పెత్తనాన్ని నెలకొల్పడానికి అమెరికన్ గూఢచార సంస్థ సిఐఏ గడచిన 60 సంవత్సరాలుగా చేయని కుట్రంటూ లేదు. ఇప్పుడు 'టెర్రరిజానికి వ్యతిరేకంగా పోరాటం' అంటూ మభ్యపెడుతూ అమెరికా ఇరాక్‌పై తలాతోకా లేని ఆరోపణలు చేస్తున్నది. స్వయంగా అమెరికా వద్ద ఉన్న ఆయుధాలతో అది మొత్తం మానవజాతిని 12 సార్లు నామరూపాలు లేకుండా నాశనం చేయగలదు. దాని వద్ద వేలాది హైడ్రోజన్ బాంబులూ, వార్‌హెడ్‌లూ, క్షిపణులూ ఉన్నాయి. దాని తొత్తులైన ఇజ్రాయిల్, భారత్ వంటి దేశాల వద్ద కూడా వినాశకరమైన ఆయుధాలు కుప్పలుగా ఉన్నాయి. మరైతే అమెరికా ఏదైనా తనిఖీ బృందాన్ని తన వద్దనున్న ఆయుధాలను తనిఖీ చేయనిస్తుందా? అలాంటప్పుడు ఈ ద్వంద్వ విధానం ఎందుకు? ముందు ఇరాక్‌పైనా, ఆ తర్వాత యుగోస్లావియాపైనా, నిన్న మొన్నటి దాకా అఫ్ఘనిస్తాన్‌పైనా భయంకరంగా బాంబులు కురిపించి విధ్వంసాన్ని సృష్టించిన అమెరికాకు, డైజీకట్టర్ లాంటి వినాశకరమైమ బాంబుల్ని ప్రయోగించి లెక్కలేనంత మంది నిరపరాధుల ప్రాణాలు బలిగొన్న అమెరికాకు అసలు వేరే దేశాల ఆయుధాలను తనిఖీ చేసే నైతికహక్కే లేదు. ఇరాక్ ఐక్యరాజ్య సమితి ఆదేశాలను లెక్కచేయడం లేదన్న ఆరోపణలు చేస్తూ అది తన దురాక్రమణ దాడికి 'చట్టబద్ధత'ను పొందాలని సిగ్గూఎగ్గూ విడిచి ప్రయత్నిస్తున్నది. దాని రెండు నాల్కల ధోరణికి ఇంతకంటే పెద్ద ఉదాహరణ అక్కరలేదు. ఐక్యరాజ్య సమితి ఆదేశాలను అమెరికా తొత్తైన ఇజ్రాయిల్ ఉల్లంఘించినంతగా మరే దేశమూ ఉల్లంఘించలేదన్న విషయం అందరికీ తెలుసు. మరి దానిపై అమెరికా సైనికచర్యకు దిగదెందుకు? తన స్నేహితుల పట్ల ఒక పాలసీ, తన ప్రయోజనాలకు అడ్డంకిగా నిలిచిన వారి పాట్ల వేరొక పాలసీ – దశాబ్దాలుగా అమెరికా అమలు చేస్తున్నదిదే. నిజానికి ఐక్యరాజ్య సమితి తీర్మానాలు అమలు జరగనందుకు అమెరికా విచారించడం లేదు, గల్ఫ్ ప్రాంతంపై తన పెత్తనాన్ని నెలకొల్పి చమురు నిల్వలపై నియంత్రణను సాధించడమే దాని ఆలోచనంతా.

ఇరాక్‌పై విధించిన ఆంక్షల్ని ఎత్తివేయాలని ప్రపంచ సముదాయం అనేక సార్లు చేసిన విజ్ఞప్తులన్నింటినీ అమెరికా తోసిపుచ్చుతూ వస్తున్నది. కానీ భారత్, పాకిస్తాన్‌లు అణు పరీక్షలు నిర్వహించిన తర్వాత విధించిన ఆంక్షల్ని ఎత్తివేయడంలోనూ, పాకిస్తాన్ *(కొరవ 39వ పేజీలో .....)*

*(..... 38వ పేజీ తరువాయి)*

అప్పుల్ని మాఫీ చేయడంలోనూ అమెరికా ఎంతో చురుకుదనాన్ని ప్రదర్శించింది. ఎందుకంటే ఆఫ్ఘనిస్తాన్‌పై దాడి చేయడానికి ఈ రెండు దేశాల సహకారం దానికవసరమైంది కాబట్టి. అమెరికా ద్వంద్వ ప్రమాణాల్ని అర్థం చేసుకోవడానికి ఇది కూడా ఒక చక్కని ఉదాహరణే. అమెరికా, బ్రిటన్‌లు రెండూ కూడా ప్రపంచ ప్రజాభిప్రాయాన్నీ, ఆఖరుకు ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి కోఫీ అన్నాన్ తక్కువ గొంతులోనే అయినా వెలిబుచ్చిన నిరసననూ ఏ మాత్రం లెక్క చేయకుండా కన్నూమిన్నూ గానని కండకావరంతో ప్రతిరోజూ రెచ్చగొట్టే ప్రకటనలు చేస్తున్నాయి. సెప్టెంబర్ రెండో వారంలో ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీని ఉద్దేశించి చేసిన ప్రసంగంలో అమెరికా అధ్యక్షుడు జార్జ్ బుష్ ఇరాక్‌ను బెదిరిస్తూ వాడిన రెచ్చగొట్టే భాష ఎంతో గర్హనీయం.

క్లింటన్ పాలనాకాలంలో ఆయుధాల తనిఖీ తర్వాత ఇరాక్ తన అణు, రసాయనిక, క్రిమి ఆయుధాలలో 95 శాతం నాశనం చేసింది. అయితే ఆయుధాల తనిఖీ చాటున అమెరికా గూఢచర్యానికి పాల్పడడంతో 1999లో సద్దాం హుస్సేన్ తనిఖీని ఆపు చేయించాడు. ఇంతకంటే సిగ్గుచేటైన విషయం ఏమిటంటే, అమెరికా ఎన్ని ఆరోపణలు చేసినప్పటికీ రసాయన ఆయుధాలు ఇరాక్ ప్రభుత్వ ఆధీనంలో ఉన్న ప్రాంతానికి బదులుగా కుర్దుల నియంత్రణలో ఉన్న ఉత్తర ఇరాక్‌లో బైటపడుతున్నాయి. ఈ ప్రాంతాన్ని ఇరాకీ సైన్యానికి నిషిద్ధ ప్రాంతంగా అమెరికన్-బ్రిటిష్ వాయుసైన్యం ప్రకటించింది. వాస్తవం ఇది కాగా అమెరికా ఇరాక్‌పై వరుసగా ఆరోపణలు చేస్తూనే ఉంది.

మేం ఇరాక్‌కు వ్యతిరేకంగా అమెరికా, బ్రిటన్‌ల యుద్ధ సన్నాహాలను ఖండిస్తున్నాం. మేం కార్మికకర్షకులకూ, మేధావులకూ, రచయితలకూ, విలేఖరులకూ, ఇతర ప్రజాస్వామ్య సంఘాలన్నింటికీ అమెరికా పాల్పడుతున్న టెర్రరిస్టు చర్యలను తీవ్రంగా నిరసించాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం.

ప్రపంచంలోని అతి పెద్ద టెర్రరిస్టు అమెరికానే. ప్రపంచ ప్రజల నెంబర్ 1 శత్రువు అమెరికానే. అమెరికా, దాని తొత్తు బ్రిటన్ యుద్ధోన్మాద చర్యలకు వ్యతిరేకంగా సభలూ-సమావేశాలూ, ప్రదర్శనలూ నిర్వహించాలని మేం ప్రజలందరినీ కోరుతున్నాం. అట్లాగే, అమెరికా ముందు సాగిలపడే లొంగుబాటు విధానాన్నీ బానిస బుద్ధినీ విడనాడి దేశ సార్వభౌమత్వం పరువు నిల్పేలా, ఇరాక్‌పై అమెరికా-బ్రిటన్‌ల అన్యాయమైన యుద్ధాన్ని దృఢంగా వ్యతిరేకించేలా భారత ప్రభుత్వంపై వత్తిడి తేవాలని కూడా మేం ప్రజలందరికీ విజ్ఞప్తి చేస్తున్నాం.

**కోస**
**కార్యదర్శి**
**దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ**
*సెప్టెంబర్ 16, 2002* **సిపిఐ (ఎం-ఎల్) [పీపుల్స్‌వార్]**

## అనకాపల్లి, చోడవరం పోలీసుస్టేషన్లపై పిజిఏ దాడులు

## ఫాసిస్టు చంద్రబాబు అవాక్కు

*ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో చర్చల ప్రహసనం ముగిసిన తర్వాత ఫాసిస్టు చంద్రబాబు ప్రభుత్వ కిరాయి పోలీసు బలగాలకు వ్యతిరేకంగా పిజిఏ తన ఆత్మరక్షణా యుద్ధాన్ని మరోసారి తీవ్రతరం చేసింది. చర్చల సందర్భంగానూ, ఆ తర్వాత కూడా పాలకవర్గాలూ, వాళ్ల పెంపుడు కుక్కలైన పోలీసు అధికారులూ పీపుల్స్‌వార్ బలహీనపడిందనీ, దాని ప్రజాదరణ తగ్గిపోయిందనీ అవాకులూ చవాకులూ పేలారు. అయితే జాతీయ రహదారిపైనున్న అనకాపల్లి, చోడవరం పోలీసు స్టేషన్లపై ఒకేసారి మెరుపుదాడి జరిపిన ఆంధ్ర-ఒరిస్సా బార్డర్ స్పెషల్ జోన్‌కు చెందిన పిజిఏ యోధులు తమ బలమేమిటో పాలకవర్గాలకు చవిచూపించారు. ఈ దాడితో ఆంధ్ర రాష్ట్ర పీడిత ప్రజల్లో ఉత్సాహం వెల్లివెరిసింది.*

*పత్రికల్లో వచ్చిన కథనం ప్రకారం మూడు వాహనాల్లో బయలుదేరిన పిజిఏ ఎర్రసైనికులు విశాఖపట్నం జిల్లాలోని ఈ రెండు పోలీసుస్టేషన్లపైకి ఒకేసారి దాడికి కదిలారు. అనకాపల్లిలో చేతులెత్తిన నలుగురు పోలీసులను బందీలుగా పట్టుకొని మొత్తం ఆయుధాలన్నింటినీ స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత స్టేషన్‌ను బాంబులతో పేల్చివేసారు. అనకాపల్లి సబ్‌జైలుపై కూడా దాడి చేసినట్టు సమాచారం వచ్చింది కానీ వివరాలు తెలియరాలేదు. చోడవరంలో ఠానాపైన్నే కాకుండా ఒక సబ్‌ట్రెజరీపై కూడా పిజిఏ యోధులు దాడి చేసారు. పోలీసుల ఆయుధాలన్నింటినీ స్వాధీనం చేసుకొని ఠానాను పేల్చివేశారు. సబ్‌ట్రెజరీ తాళాలు బద్దలు కొట్టి అందులోని బంగారం, నగదు అంతా జప్తు చేసుకున్నారు. ఈ రెండు స్టేషన్లలో కూడా పోలీసులు పెద్దగా ప్రతిఘటించకుండానే చేతులెత్తెయ్యడం ఒక విశేషం. ఈ దాడుల గురించిన సమాచారం రాత్రే జిల్లా హెడ్‌క్వార్టర్స్‌కు తెలిసినప్పటికీ పిరికిపందలైన పోలీసు అధికారులు తమ ప్రాణాలకు ముప్పు రాకుండా జాగ్రత్తపడి తెల్లవారిన తర్వాతనే అక్కడికి చేరుకున్నారు. చొరవ మన చేతిలో ఉంటే శత్రు సైనిక బలగాలు అన్నీ కూడా కాగితపు పులులేనన్న విషయం మరోసారి రుజువయ్యింది.*

*ఈ దాడిలో బందీలుగా పట్టుబడ్డ పోలీసు ఉద్యోగులలో ముగ్గురిని రెండు రోజుల తర్వాత పిజిఏ వదిలిపెట్టింది. కానీ చిట్టిబాబు అనే ఒక కానిస్టేబుల్‌ను మాత్రం చంపేసింది. వాడికి ప్రజలపైనా, దళాలపైనా అనేక దాడుల జరిపిన చరిత్ర ఉందని పిజిఏ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ దాడులతో ముఖ్యంగా ఫాసిస్టు చంద్రబాబు, వాడి పెంపుడు కుక్కైన డిజిపి రాములులకు దిమ్మదిరిగిపోయింది. వందలాది గ్రేహౌండ్స్ బలగాలను దించి హెలికాప్టర్లను రప్పించి పెద్ద ఎత్తున కూంబింగ్ ఆపరేషన్స్ నిర్వహించినప్పటికీ వాళ్లకు ఏ ఫలితమూ దక్కలేదు. ఒక రకంగా చెప్పాలంటే ఈ దాడులు ఆంధ్రలోని ఫాసిస్టు పాలకుల, వాళ్ల తొత్తు అధికారుల అహంపై తిరుగులేని దెబ్బతీసాయి. ప్రజల అజేయమైన శక్తిపై ఆధారపడిన పిజిఏ శత్రువు గుండెలపై నేరుగా కూడా దాడిచేసి దెబ్బతీయగలదని మరోసారి రుజువైంది.* ❐

పిలుపు

# 'బస్తర్ లోకోత్సవ్' పేరుతో బస్తర్ ప్రజా సంస్కృతిని వ్యాపారీకరించడాన్ని వ్యతిరేకించండి!

## దండకారణ్యంలో పర్యాటక కేంద్రాలను అభివృద్ధికి సోపానాలుగా నమ్మబలుకుతున్న ప్రభుత్వ దివాళాకోరు విధానాలను ప్రతిఘటించండి!!

అవిభాజిత బస్తర్ రాజధాని జగ్దల్‌పూర్‌లో సాంప్రదాయంగా జరుపుకునే దసరా పండుగను ప్రభుత్వం 'బస్తర్ లోకోత్సవ్'గా మార్చి, అక్టోబర్ 7 నుండి 17 వరకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు మొదలు పెట్టింది. ప్రభుత్వ-పాలనా యంత్రాంగమూ, పోలీసు, ఫారెస్టు, పర్యాటక, తదితర శాఖలన్నీ బస్తర్‌లోకి పెద్ద ఎత్తున దేశవిదేశీ పర్యాటకులను ఆకర్షించే ప్రయత్నాలు మొదలుపెట్టాయి. చిత్రకోట్, తీర్థగఢ్, కేశ్కాల్ ఘాటీ, కాంగేర్ ఘాటీ లాంటి ప్రదేశాలనూ కొండగాం, నారాయణపూర్, జగ్దల్‌పూర్ వంటి పట్టణాలను అధికారులు అందంగా ముస్తాబు చేస్తున్నారు. ఈ సందర్భంగా చిత్రకోట్ వంటి 'పర్యటన స్థలాల్లో' విలాసవంతమైన ఫైవ్‌స్టార్ టెంట్లు, ఇంటర్నెట్, టెలిఫోన్ తదితర సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నారు. బస్తర్‌లో ఇకో-ఎథ్నిక్ టూరిజాన్ని అభివృద్ధి చేస్తామంటూ గొప్పగా చెప్పుకుంటున్నారు. బస్తర్‌లోని అందమైన అడవులతో, మనోహరమైన జలపాతాలతో, గలగలా పారే జీవనదులతో, సెలయేళ్లతో, నాట్యకళలు-శిల్పకళలతో పర్యాటకుల్ని ఆకర్షించి తద్వారా లభించే డబ్బుతో బస్తర్‌ను అభివృద్ధి చేస్తామంటూ నమ్మబలుకుతున్నారు.

అయితే సరిగ్గా ఇదే సమయంలో, బస్తర్‌లోని అనేక గ్రామాల్లో ఆదివాసీ ప్రజలు భయంకరమైన కరువు రక్కసికోరల్లో చిక్కుకొని ఉన్నారు. రుతుపవనాల రాకలో ఆలస్యం వల్లా, అల్పవృష్టి వల్లా చాలా పొలాల్లో అసలు వరినాట్లే పడలేదు. నాటిన పొలాలు కూడా ఎండిపోవడానికి సిద్ధంగా ఉన్నాయి. కరువూ, ఆకలిచావుల బాధామయ గాథ ఈ ఒక్క ఏటిదే కాదు, అనేక ఏళ్లుగా ఇది ఇట్లాగే సాగుతూ వస్తున్నది. భయంకరమైన ఆకలిని ఎదుర్కోవడానికి ఆదివాసులకు విషపూరితమైన దుంపలను ఉడకపెట్టుకొని తినాల్సి వస్తున్నది. జీలుగుచెట్లను నరికి లోపలి దుంపను ఎండబెట్టి దంచి దానితో కాచిన అంబలితో కడుపు నింపుకోవల్సి వస్తున్నది. మలేరియా, కక్కుడేరుగుడు వంటి రోగాలు ప్రతి ఏటిలాగానే ఈ ఏడు కూడా వందలాది అమాయకుల ప్రాణాలు తీసుకున్నాయి. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగం ఎప్పటిలాగానే విలయతాండవం చేస్తున్నది. ఒక్క మాటలో చెప్పాలంటే నేడు బస్తర్ ప్రజలు భయంకరమైన కరువు, పేదరికం, పౌష్టికాహార లోపం, ఆకలిచావులు, రోగాలురొప్పులు, నిరక్షరాస్యత, నిరుద్యోగం వంటి సమస్యలతో సతమతమవుతున్నారు. ప్రభుత్వం ఈ వాస్తవాన్ని గమనించి కూడా, ఈ వాస్తవ చిత్రాన్ని మరుగుపరుస్తూ పర్యాటకరంగాన్ని ప్రోత్సహించడం ద్వారా బస్తర్‌లో తిరుగులేని అభివృద్ధి సాధించగలమని ప్రకటిస్తున్నది.

'బస్తర్ అభివృద్ధి' విషయంలో ఇప్పటికే చాలా సార్లు ఎన్నో వాదప్రతివాదాలు జరిగాయి. ప్రభుత్వం చెప్పే నిర్వచనం ప్రకారం'అభివృద్ధి' అంటే సామ్రాజ్యవాదులకూ, దళారీ పెట్టుబడిదారులకూ, పిడికెడు పట్టణ వ్యాపారులకూ లాభాలు చేకూరడం. కానీ మేం మొదటి నుండీ 'బస్తర్ అభివృద్ధి' అంటే 'బస్తర్ ప్రజల అభివృద్దే'నని స్పష్టంగా చెబుతూ వస్తున్నాం. బస్తర్‌లోని అత్యధిక ప్రజానీకం వ్యవసాయంపైనా, అటవీ ఉత్పత్తులను సేకరించి అమ్ముకోవడంపైనా ఆధారపడి జీవనం సాగిస్తుంది. అయితే స్వాతంత్రం వచ్చిందని చెబుతున్న ఈ 55 ఏళ్లలో కూడా అవిభాజిత బస్తర్‌లోని ఒక్క శాతం భూములకు కూడా శాశ్వత నీటిపారుదల సౌకర్యం కల్పించలేదు. ఈనాటికీ ఇక్కడి వ్యవసాయం ముఖ్యంగా వర్షంపై ఆధారపడే నడుస్తుంది. చాలా మంది ప్రజలు 'పేంద' (పోడు) వ్యవసాయం వంటి పాత పద్ధతుల్లోనే సేద్యం చేస్తారు. బస్తర్‌లో ప్రవహించే లెక్కలేనన్ని నదులపైనా, సెలయేళ్లపైనా చెక్‌డ్యాములూ, చెరువులూ కట్టి నీటిపారుదల సౌకర్యాన్ని పెంపొందించడానికి ప్రభుత్వం చేసిన గణనీయమైన కృషి ఏమీ లేదు. ప్రధానంగా ఇక్కడి అటవీ ఉత్పత్తులపై ఆధారపడినవీ, ఇక్కడి నిరక్షర లేదా తక్కువ విద్యార్హతలు గల యువతరానికి ఎక్కువగా ఉపాధి లభించగలవీ, ఇక్కడి పర్యావరణానికి నష్టం కలిగించనివీ, ప్రజలకు ఎక్కువ నష్టదాయకంగా పరిణమించకుండా ఎక్కువ లాభదాయకంగా ఉండేవీ అయిన పరిశ్రమల్ని స్థాపించడానికి ప్రభుత్వం ఎలాంటి ఉత్సాహం చూపడం లేదు. విద్యావైద్య రంగాలను ఘోరంగా నిర్లక్ష్యం చేస్తున్న ఫలితంగా నేటికీ ఈ రంగాల్లో బస్తర్ ప్రజలు పెద్దగా అభివృద్ధిని సాధించలేదు. మరోవైపు వెదురు, తునికాకు కూలీల శ్రమను దారుణంగా దోచుకోవడం సాగుతూనే ఉన్నది. ఇక్కడి ప్రజలు తునికాకు కూలీ రేటును పెంచాలని ఎంతగా డిమాండ్ చేసినప్పటికీ పెడచెవిన పెట్టిన ప్రభుత్వం గత సీజన్‌లో కట్టకు 45 పైసలే ఇచ్చి కూలీలను నిలువునా దోచుకుంది. వీటన్నింటి ద్వారా ప్రభుత్వానికి ప్రజల నిజమైన అభివృద్ధి పట్ల ఎలాంటి శ్రద్ధా లేదనీ, పైగా ప్రజలను మరింతగా దోచుకోవడమే దాని నైజమనీ తేలిగ్గానే అర్థం చేసుకోవచ్చు.

ఇకపోతే, ప్రభుత్వం గత కొద్ది ఏళ్లుగా బస్తర్‌లో పర్యాటకరంగం అభివృద్ధికి చాలా అవకాశాలున్నాయని ప్రచారం మొదలుపెట్టింది. దీని ద్వారా బస్తర్ అభివృద్ధి సాధ్యమని కూడా అది చెబుతున్నది. పర్యాటక రంగానికి ప్రోత్సాహాన్నిస్తే, అంటే బస్తర్‌లోని ప్రకృతి సౌందర్యాన్ని సంపన్నులైన దేశవిదేశీ పర్యాటకుల ముందు ప్రదర్శిస్తే బస్తర్ అభివృద్ధి జరుగుతుందనడంలో నిజమేమైనా ఉందా? బస్తర్ ప్రజ ఎదుర్కొంటున్న లెక్కలేనన్ని సమస్యల్ని కప్పిపెట్టి, వాళ్ల పేదరికాన్నీ, ఆకలిచావులనూ మరుగుపర్చి ఇక్కడి సౌందర్యాలను ప్రదర్శించడంలో ఏమైనా నిజాయితీ ఉందా? నిజానికి పర్యాటకుల రాకతో ఇక్కడ జరిగేది అభివృద్ధి కాదు, ఇక్కడి మహిళలను పడుపువృత్తిలోకి ఈడ్చడం జరుగుతుంది; ఇక్కడి యువతరం మాదకద్రవ్యాలకు బానిసగా మారుతుంది. పర్యాటక రంగానికి ప్రోత్సాహాన్నివ్వడం ద్వారా ఇక్కడ ఖరీదైన రిసార్ట్‌లూ, హోటళ్లూ వెలుస్తాయి. వీటితో పాటుగానే వేశ్యావ్యాపారం, భిక్షాటనం, వంటివి మొదలవడం ఖాయం. కొద్దినాళ్ల క్రితం జగ్దల్‌పూర్‌లోని కొందరు డాక్టర్లు బస్తర్‌లో సుఖవ్యాధులు పెరిగిపోవడం పట్ల విచారాన్ని ప్రకటించారు. బస్తర్ ప్రజా సంస్కృతిని మింగేస్తూ చొరబడుతున్న సామ్రాజ్యవాద సంస్కృతి ఫలితంగానే ఇప్పటికే ఇక్కడ సుఖవ్యాధులు పెరిగిపోయాయి, కానీ అదృష్టవశాత్తు ఇంకా ఎయిడ్స్ కేసులు పెద్దగా నమోదు కాలేదు. టూరిజానికి ప్రోత్సాహాన్నివ్వడం అంటే ఎయిడ్స్‌ను ఆహ్వానించడమే అవుతుంది.

*(కొరవ 37వ పేజీలో .....)*